పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న

సాహిత్యంలో విభిన్న కోణాలు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)



సంపాదకులు

ప్రొఫెసర్ కె.కృష్ణమూర్తి

తెలుగు శాఖాధ్యక్షులు

ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)

సదా స్మరామి



సాహితీ సుగంధాల సుహాస విహంగమై బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో శిఖరాయమానమైన బోయి భీమన్న గారి జీవితాన్ని వారి సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో అనితర సాధ్యమైన తోడ్పాటును అందించిన సరస్వతీ స్వరూపినీ, బోయి భీమన్న ఆశయాలు ఆదర్శాలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా సాగుతూ, భీమన్న ఆలోచనాలోచన వ్యాప్తికై అనన్యసామాన్యమైన కార్యదీక్షతో కదులుతున్న నిష్కామయోగి, వయస్సు వాకిళ్లను వదిలి మనస్సు కోవెలలో నవ నవోన్మేష గీతాలాపన లీలలతో దర్శనమే దైవికతకు నిదర్శనంగా నడయాడే ఆదర్శమూర్తి స్ఫూర్తి అజరామరం.

Smt. A. SRIDEVASENA, IAS
COMMISSIONER

Prof. Jayashankar Vidyabhavan
Nampally, Hyderabad-500 001
Off. +91-040-2474 5021
+91-040-2474 5669
commissioner.cete.ts@gmail.com

Department of Collegiate Education & Technical Education

అభినందనలు



తెలంగాణలో ఉన్నత విద్యాభివృద్ధికి కాలేజియేట్ ఎడ్యుకేషన్ చేస్తున్న సేవ ఎంతో విశిష్టమైనది. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించేందుకు వారి సర్వతోముఖాభివృద్ధికై ఎన్నో కార్యక్రమాలను రూపొందించి అమలుపరుస్తున్నది. అంతేకాకుండా విద్యార్థులకు అవసరమయ్యే కార్యక్రమాల నిర్వహణకు కళాశాలలకు అనుమతినిస్తూ ప్రోత్సహిస్తున్నది. ఎం.వి.ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న **పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు** రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆ కోవలోకి చెందినదే.

ఈ సదస్సులో ఇరుతెలుగు రాష్ట్రాల ప్రాతినిధ్యంతో పాటు దేశ, విదేశాల నుండి వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పండితులు, పరిశోధకులు పాలుపంచుకోవడం ఆహ్వానించదగ్గ విషయం. అంతే కాకుండా ఇతర దేశాల్లో ఉన్న తెలుగు కవి పండితులు, పరిశోధక మిత్రులు ఈ సదస్సులో తమ పరిశోధన పత్రాలు సమర్పిస్తుండటం ముదావహం.

డాక్టర్ బోయి భీమన్న గారు దూరదృష్టి కలిగిన కవితామూర్తి. సమాజాన్ని చైతన్య పరిచేందుకు తన కలాన్నే గళంగా మార్చుకున్న ఆదర్శమూర్తి. అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసిన పుంభావసరస్వతి. మానవతావాదం, జాతీయవాదాలకు నిలువెత్తు దర్పణాలు వీరి రచనలు. కవిగా సంఘసంస్కర్తగా తాను ఆశించిన సమాజాన్ని నిర్మించడానికి భీమన్న చేసిన రచనలు ప్రతి తరానికి అవసరం. అంతటి మహానుభావుని అమూల్య సాహితీ సంపదను అంతర్జాతీయ స్థాయిలో విభిన్న కోణాల్లో చర్చించడం ఎంతో ఆవశ్యకం. ఇంతటి బృహత్కార్యానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదిక కావడం మరింత గొప్ప విషయం. ఆఫ్‌లైన్ & ఆన్‌లైన్ మాధ్యమంగా జరుగుతున్న ఈ సదస్సు యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారమవడం శుభపరిణామం. సాహిత్యాన్ని సాంకేతికతతో జోడించి నాలుగు కాలాల పాటు ఈ సదస్సు నిలిచిపోయేలా నిర్వహిస్తున్నందుకు సదస్సు సంచాలకులు డా. కె. కృష్ణమూర్తి గారికి, వారికి వెన్నుదన్నుగా నిలిచిన కళాశాల తెలుగు విభాగానికి అభినందనలు. ఇలాంటి చక్కని కార్యక్రమాల్ని ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. పద్మావతి గారికి ప్రత్యేక అభినందనలు.


ఈ అంతర్జాతీయ సదస్సు పరిశోధనా పత్రాలను పుస్తక రూపంలో తీసుకురావడం మరింత ఆనందదాయకం. ఇలాంటి సదస్సుల నిర్వహణకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఎప్పుడూ ముందుండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ....

(శ్రీమతి ఎ. శ్రీదేవసేన)

Telangana Council of Higher Education
(A Statutory Body of the Government of Telangana)
Opp: Mahavir Hospital, Mahavir Marg, Masabtank, Hyderabad- 500 028.
Ph. 040-23311879
Website: www.tgche.ac.in , E-mail: chairman@tgche.ac.in, chairmantgche@gmail.com

PROF. V. BALAKISTA REDDY
LL.M; M.Phil; Ph.D.(JNU)
CHAIRMAN

సందేశం



పాలమూరు ప్రాంతంలోని ఎం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆలోచనా పరిధిని విస్తరింపజేసేలా, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం హర్షణీయమైన విషయం. అందులో భాగంగానే కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 మరియు 4 తేదీలలో **"పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు"** అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం.

ఇలాంటి సదస్సులు విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి ఎంతగానో తోడ్పడటమే కాక, వారిలో పరిశోధనా పటిమను పెంపొందిస్తాయని గట్టిగా నమ్మవచ్చు. ఈ కార్యక్రమాలు విద్యార్థులకే కాకుండా అధ్యాపకులు, సాహితీ పరిశోధకులు మరియు సాహిత్యాభిలాషులకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయి.

బోయి భీమన్న గారు పాలేరు నుంచి పద్మభూషణ్ స్థాయికి ఎదిగిన మహాకవి. సామాజిక స్పృహతో రచనలు చేసి, సంఘ సంస్కరణ లక్ష్యంతో సాహిత్యాన్ని సృష్టించిన కవి. మానవతావాదాన్ని అందలమెక్కించి, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పులను తీసుకురావచ్చని నిరూపించిన మహానుభావుడు. సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి అండగా నిలిచిన ఆదర్శవంతుడు. ఆయన వ్యక్తిత్వం మరియు కవిత్వం రెండూ మనిషిని మానవత్వం వైపు నడిపించేలా ఉన్నాయి.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు శాఖ అధ్యక్షులు, అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన అధ్యాపకులు, ఉపన్యాసకులు, నిర్వాహకులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

చైర్మన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి (TGCHE)

Prof. G.N. SRINIVAS
M.E., Ph.D.
VICE-CHANCELLOR

PALAMURU UNIVERSITY
(Accredited by NAAC with 'B' Grade)
Government of Telangana
Mahabubnagar – 509 001,
Telangana, India.
Phone: +91 94404 32277

E-mail: vicechancellor@palamuruuniversity.ac.in :: Website : www.palamuruuniversity.ac.in

అభినందనీయం



కవిగా, రచయితగా, అధ్యాపకుడిగా, చారిత్రక పరిశోధకుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, లాక్షణికుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి నొందిన వారు డా. బోయి భీమన్న గారు. అలాంటి మహోన్నతమూర్తి సాహిత్యాన్ని, విశిష్ట వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తూ M.V.S ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ **"పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో వివిన్న కోణాలు"** అనే అంశంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఈ అంతర్జాతీయ సదస్సుకు కవి పండితుల నుండే కాక పరిశోధక విద్యార్థుల నుండి దేశవిదేశాలలో ఉన్న సాహితీ మూర్తుల నుండి గొప్ప స్పందన రావడం సంతోషం. ఇలాంటి సాహిత్య సదస్సులు విద్యార్థుల జ్ఞానాభివృద్ధికే కాక వారిలో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందిస్తాయి. తద్వారా వారి ఉన్నతికి ఎంతగానో తోడ్పడుతాయి. వారిలో ఆలోచన పరిధిని పెంపొందిస్తాయి. పరిశోధకులకు, సాహిత్యాభిలాషులకు ఒక ప్రేరణను కలిగిస్తాయి.

"పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో వివిన్న కోణాలు" అనే అంశంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ఒక బృహత్తరకార్యంగా భావిస్తున్నాను. ఈ సదస్సుకు వచ్చిన పరిశోధనా పత్రాలను ఎంతో ఓర్పుతో పరిశీలించి, పరిష్కరించి పుస్తక రూపంలో తీసుకురావటం మిక్కిలి ప్రశంసనీయం. ఇంతటి కార్య భారాన్ని వహిస్తున్న తెలుగుశాఖ అధ్యక్షులు, సదస్సు సంచాలకులు డా. కె.కృష్ణమూర్తి గారిని తెలుగువిభాగ అధ్యాపకులను, కళాశాల ప్రిన్సిపల్ గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇలాంటి సదస్సులు మరెన్నో నిర్వహించాలని కోరుకుంటున్నాను.

(జి.యన్. శ్రీనివాస్)

ఆశీస్సులు



పద్మభూషణ్ డాక్టర్ బోయిభీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంశంతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్‌నగర్ తెలుగుశాఖ వారికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాక దేశంలో ఇతర అనేక సాహిత్య సంస్థలలో, విశ్వవిద్యాలయాలలో, కళాశాలలలో బోయి భీమన్న గారి జీవితం, సాహిత్యం గురించిన సదస్సులు నిర్వహించడం ఆయన సాహిత్య మూర్తిమత్వానికి నిదర్శనం. భీమన్న గారు కులాలకు, మతాలకు, వర్ణాలకు, వర్గాలకు అతీతంగా ఆలోచన చేశారు. సర్వజనహితమే తన హితంగా భావించి రచనలు చేసిన జాతీయకవి. సమసమాజ స్థాపన వారి అభిమతం. వసుధైక కుటుంబం వారి ఆశయం. ఏది ఆలోచించారో అదే చెప్పారు, ఏది చెప్పారో అదే ఆచరించిన నిష్కామయోగి భీమన్నగారు. నియమ నిబద్ధతతో నిజాలను నిర్భయంగా తన రచనలలో వ్యక్తీకరించారు. పాలేరు నుంచి పద్మభూషణ్ వరకు సాహితీ ప్రస్థానాన్ని కొనసాగించిన మహాకవి కళాప్రపూర్ణ పద్మభూషణ్ బోయిభీమన్న. వారి సాహిత్యం, జీవితం, వ్యక్తిత్వం ప్రధానాంశాలుగా M.V.S కళాశాల రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేయడం అత్యంత ప్రశంసనీయం.

ఈ అంతర్జాతీయ సదస్సులో బోయిభీమన్న సాహిత్యంలోని విభిన్న అంశాలతో పత్ర సమర్పకులు పాల్గొంటున్నందుకు చాలా సంతోషం. దాదాపుగా 80 పరిశోధన పత్రాలు రావడం ఆనందదాయకం. పత్రాలన్నింటినీ పరిశీలించి, పరిష్కరించి వాటిని సంపుటిగా తీసుకురావడానికి కృష్ణమూర్తి గారు పడిన ఆరాటం మిక్కిలి అభినందనీయం. సదస్సు రోజే పుస్తకంగా తీసుకురావాలనే వారి సంకల్పం చాలా గొప్పది. ఈ సదస్సు నిర్వహిస్తున్న M.V.S డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు కృష్ణమూర్తి గారికి, ఇతర అధ్యాపక బృందానికి ఆశీస్సులు. కళాశాల ప్రాచార్యులకు అభినందనలు.

హైమవతీ భీమన్న

బోయి భీమన్న సాహితీ నిధి చైర్‌పర్సన్

M.V.S GOVT.Arts & Science College (A)
(Affiliated to Palamuru University, Mahabubnagar)
Christianpally, MahabubnagarTelangana State
Email id: mahaboobnagar.jkc@gmail.com

మనసులో మాట



ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల పాలమూరు జిల్లాలో విద్యాభివృద్ధికై ఏర్పాటు చేసిన తొలితరం కళాశాలల్లో ఒకటి. 1965 లో ఏర్పాటు చేయబడిన ఈ కళాశాల ఎందరో మేధావుల్ని సమాజానికి అందిస్తూ విద్యాసుగంధాలను నిరంతరం వెదజల్లుతూ ఉంది. 18 విభాగాల అధ్యాపకులు డిగ్రీ విద్యార్థులకు బోధన అందిస్తుండగా, ఏడు విభాగాల్లో స్నాతకోత్తర విద్యను అందిస్తున్నాము.

విద్యార్థుల జ్ఞానతృష్ణను తీర్చడంలో కళాశాల తెలుగువిభాగం చేస్తున్న కృషి అద్వితీయం. పాఠ్యాంశాలతో పాటుగా కార్యశాలలు, విస్తృతోపన్యాసాలు, సదస్సులు నిర్వహిస్తూ చురుకైన పాత్రను పోషిస్తుంది. అందులో భాగంగా నిర్వహిస్తున్నదే **పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు** రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు.

సాహిత్యంతో సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసిన కవి భీమన్న. పాలేరు, 'గుడిసెలు కాలిపోతున్నాయి', 'కూలిరాజు' మొదలైన రచనలు అందుకు ఉదాహరణ. వీరి సాహితీ సేవకు గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం, పద్మభూషణ్‌తో పాటు లెక్కకు మించిన సన్మానాలు అందుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఆయన మార్గం. కులమతాల కంటే మానవత్వానికే పెద్దపీట వేసిన మానవతావాది. మనిషికి జీవితంలో ఆత్మగౌరవమే అలంబనమని నమ్మిన మహనీయుడు.

పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్న సంచాలకులు డా. కృష్ణమూర్తి గారికి మరియు కళాశాల తెలుగు విభాగానికి అభినందనలు. ఇలాంటి సదస్సులు ఇంకెన్నో కళాశాల తెలుగు విభాగం నిర్వహించాలని మనసారా ఆకాంక్షిస్తూ.....

ప్రిన్సిపాల్
(డాక్టర్ కె.పద్మావతి)

సంపాదకీయం



పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు" అనే అంశంతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం సాహిత్య అధ్యయన కేంద్రంగా మా తెలుగుశాఖ బాధ్యత. ఈ సదస్సులో అశేష సాహితీమూర్తుల సమక్షంలో భీమన్న గారి సమగ్రసాహిత్య చర్చ జరగాలన్నదే మా ఉద్దేశ్యం. అందుకు దేశ విదేశాల నుండి ఇతర రాష్ట్రాల నుండి దాదాపు 88 కి పైగా పరిశోధన పత్రాలు రావడమే నిదర్శనం. తెలుగుసాహిత్యంలో సాహితీ మూర్తుల సాహిత్యానుశీలనం చారిత్రక అవసరం. విద్యార్థులలో సృజనాత్మక శక్తిని, పరిశీలనాత్మక దృక్పథాన్ని, పరిశోధనాత్మక ఆలోచనలు కలిగించడంలో ఇలాంటి సదస్సులు ఉపయోగకరంగా ఉంటాయని ప్రగాఢంగా నమ్ముతున్నాం.

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన చరితార్థులు బోయి భీమన్న. తన సాహిత్యం సర్వలోకహితంగా నిబద్ధతకు కచ్చితత్వానికి ప్రతీకగా దర్శనమిస్తాయి. సామాజిక స్పృహతో పాలేరు నుండి పద్మభూషణ్ వరకు ఎదిగిన కవి బోయి భీమన్న సాహిత్యం ద్వారా సమాజంలో మార్పును, చైతన్యాన్ని తీసుకురావచ్చని నిరూపించారు. భీమన్న సాహిత్యాన్ని అధ్యయనం చేయడమంటే సమకాలీన సమాజాన్ని చదవడమే. అలాంటి పుంభావసరస్వతి సాహిత్యానుశీలనం గురించి రెండు రోజులపాటు ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నాం.

కృతయుగంబున ధర్మవ్యాధులు బోయ
త్రేతాయుగంబున వాల్మీకి బోయ
ద్వాపరయుగమున వ్యాసుడు బోయ
కలియుగమున భీమన్న బోయ అంటూ సాహితీరంగంలో తనదైన ముద్రను వేసుకున్న కవి డాక్టర్ బోయి భీమన్న. సమాజంలో ఒకడు తింటూ మరొకడు పస్తులుండటం ధర్మం కాదు. ప్రతి ఒక్కరికి కూడు గూడు గుడ్డ కనీస అవసరాలు తీరాలన్న వీరి సామాజిక స్పృహ గొప్పది. ధనికులు పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజాన్ని నిర్మించి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అభ్యుదయభావంతో విశ్వమానవతను చాటిన గొప్ప కవి. పట్టుదలతో విద్యను అభ్యసించారు. దానికి తోడు వినయాన్ని సమకూర్చుకున్నారు. డబ్బు, చదువు, ధైర్యం ఉంటే సమాజంలో కులంతో పని ఉండదని గౌరవమర్యాదలు వాటంతటవే లభిస్తాయని నమ్మినవారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే గాక భారతజాతి మొత్తం గర్వించదగిన బోయి భీమన్న నిరంతర సాహిత్య సమారాధకులు. వారి ప్రజ్ఞాపాటవాలు బహుముఖంగా దర్శనమిస్తాయి. తెలుగులోనూ ఆంగ్ల భాషలోనూ అపారమైన పాండిత్యం సంపాదించారు భీమన్న. సాహిత్యం పట్ల అభినివేశంతో పాటు లోతైన అధ్యయన పద్ధతులను అవలంబించారు. పురాణాలను, ఇతిహాసాలను,కావ్యాలను, పూలే అంబేద్కర్ భావాలను

ఆమూలాగ్రం ఔపోసన పట్టారు. పద్య కావ్యాల నుండి కథల వరకు వారి సాహిత్యాన్ని మొత్తం పరిశీలిస్తే వారు స్పృశించని తెలుగు సాహిత్య ప్రక్రియ లేదు విస్మరించిన వస్తువు లేదు. వారి ప్రతి వాక్యం సమాజ హితం, ప్రతి కావ్యం మనిషి మనోగతాల ప్రతిబింబం. బోయి భీమన్నగారు గొప్ప సాహితీ పిపాసి. వారిని ఏ ఒక్క విషయంతో పరిమితం చేయలేని సాహితీ మహర్షి. అటువంటి ప్రతిభాసంపన్నులైన భీమన్న గారి సాహిత్యాన్ని గురించి అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అవకాశం రావడం మా తెలుగు శాఖకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాం.

ప్రాచీన సాహిత్యంతో పాటు ఆధునిక సాహిత్యంలో అభిరుచి, అభినివేశం మెండుగా ఉండడం చేత వారి రచనల్లో గొప్ప పరిపూర్ణత, పరిపక్వత దర్శనమిస్తుంది. బహుముఖ కోణాలలో దర్శనమిచ్చే వారి ప్రతిభ ఏ ఒక్క విషయానికి పరిమితం కాలేదు. వారి జీవితమంతా సాహిత్యానికే అంకితం చేసిన అసలు సిసలైన సాహితీమూర్తి భీమన్న. తన జీవితాంతం జాతీయవాదిగానే ఉన్నారు. తాను పుట్టి పెరిగిన దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూనే ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు. డాక్టర్ బోయి భీమన్న గారి బహుముఖీనమైన ప్రజ్ఞాతత్వాన్ని విశ్లేషించి తెలుగు సాహిత్యానికీ నేటి యువతరానికీ అందించే ఉద్దేశంతో ఈ సదస్సుకు పూనుకున్నాము. కళాశాల విద్యార్థులకు, నేటి యువతరానికి బోయి భీమన్న జీవితము, సాహిత్యము మార్గదర్శకంగా ఉంటుందని భావిస్తూ, వారి నిరాడంబరత్వం ప్రతి తరానికి ఆదర్శంగా ఉండాలనే ఆశయంతో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాం.

ఈ సదస్సులో భీమన్న గారి సాహిత్యంలో వివిధ అంశాలను, అనేక కోణాల్లో చర్చ జరిపి వివేచించి విశ్లేషించడం ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ అంతర్జాతీయ సదస్సులో ఆస్ట్రేలియా, జర్మనీ, అమెరికా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాలతో పాటు మనదేశంలోని కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ మొదలైన రాష్ట్రాల నుండి ప్రాతినిధ్యం లభించడం ఆనందంగా ఉంది. పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంతర్జాతీయ సదస్సుకు చాలామంది పరిశోధకులు వ్యాసాలు పంపించారు. ప్రామాణికత ఆధారంగా ముద్రణ కొరకు వ్యాసాలను ఎంపిక చేయడం కమిటీకి సంక్లిష్టంగా మారింది. కొన్ని వ్యాసాలలో వాసి తగ్గినప్పటికీ శ్రమపడి రాసిన పరిశోధకులను నిరుత్సాహపరచకూడదని చాలా వ్యాసాలు ముద్రణకు తీసుకోవడం జరిగింది. భీమన్న గారి సాహిత్య కృషిని పూర్తిగా ఆవిష్కరించే ఈ వ్యాస సంపుటిని పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఆశీస్సులు అందించిన ఎందరో మహానుభావులు, వారందరికీ వందనాలు.

(డా. కె. కృష్ణమూర్తి)
సదస్సు సంచాలకులు

కృతజ్ఞతలు

పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంశంతో ఫిబ్రవరి మూడు నాలుగు తేదీల్లో మా తెలుగు శాఖ ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు పూనుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా భావిస్తూ, అందుకు గర్విస్తున్నాం. ఈ సదస్సు నిర్వహణకు కారకులైన ఎందరో మహానుభావులు వారి సుసంపన్నమైన సహృదయానికి కృతజ్ఞతాభివందనాలు. ఈ సదస్సు నిర్వహణకు అనుమతించిన కళాశాల విద్యా కమిషనరేట్‌కు, తమ ఆర్థిక సౌజన్యాన్ని అందించిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి వారికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారికి, PM - USHA వారికి, కావలసిన సహాయ, సహకారాలు అందించి మమ్మల్ని ముందుకు నడిపించిన మా ప్రాచార్యులు ప్రొఫెసర్ డాక్టర్ కె. పద్మావతి గారికి ధన్యవాదాలు.

సదస్సు ప్రారంభం నుండి తమ హార్థిక, ఆర్థిక సూచనలు, సలహాలు ఇస్తూ ఎప్పటికప్పుడు సదస్సు నిర్వహణను పర్యవేక్షిస్తూ పరిశోధనా పత్రాలను సంపుటంగా అచ్చు వేసే వరకు మా వెంటే ఉన్న నిరాడంబరమూర్తి బోయి భీమన్న గారి ధర్మపత్ని శ్రీమతి హైమవతీ భీమన్న గారికి శత సహస్ర కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

ఈ పరిశోధనా పత్రాల సంకలనాన్ని చూసి అభినందన సందేశాన్ని పంపిన శ్రీమతి శ్రీదేవసేన కమిషనర్ కాలేజియెట్ ఎడ్యుకేషన్ వారికి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్. వి.బాలకిష్టారెడ్డి గారికి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి గారికి, పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి బహుముఖ ప్రజ్ఞావంతులు ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ గారికి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి వెల్దండ నిత్యానందరావు గారికి, బోయి భీమన్న సాహితి నిధి చైర్ పర్సన్ శ్రీమతి హైమవతీ భీమన్న గారికి, కళాశాల ప్రాచార్యులు ప్రొఫెసర్ కె.పద్మావతి గారికి కృతజ్ఞతలు. ఈ సదస్సు నిర్వహణకు ఆర్థిక హార్థిక ఆశీస్సులు అందించిన వారందరికీ కృతజ్ఞతలు.

(డా. కె. కృష్ణమూర్తి)

విషయసూచిక

1. శ్రీమతి హైమవతీ భీమన్న గారిని కలిసిన సందర్భంగా
   వారు పంచుకున్న కొన్ని అనుభవాలు, జ్ఞాపకాలు
   – డా. కె. కృష్ణమూర్తి.....1
2. బోయి భీమన్న సాహిత్యం – సమసమాజ స్థాపన
   – డా. కె. కృష్ణమూర్తి.....6
3. అభినవవ్యాసుడు మహాకవి బోయి భీమన్న
   – డా. కోయికోటేశ్వరరావు 12
4. రాగవాసిష్ఠం – నాటక వైశిష్ట్యం: జాతీయ సమైక్య దృక్పథం
   – ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు.....18
5. బోయి భీమన్న పాలేరు నాటక విశిష్ట లక్షణ విశ్లేషణ
   – ఆచార్య సంగి రమేశ్.....34
6. బోయిభీమన్న అద్భుతసృష్టి – అశోకవనిలో రాముడు
   – డా. సి. నర్సింహులు.....37
7. బోయి భీమన్న "పిల్లీ శతకం" – తాత్విక దృక్పథం
   – డా. జి. అనిత 42
8. కళా ప్రపూర్ణ డా. బోయిభీమన్న పిల్లీ శతకం – సామాజికాంశాలు
   – డా. అంబటి భానుప్రకాశ్.....48
9. 'గుడిసెలు కాలిపోతున్నై'– సామాజిక తాత్వికత
   – డా. వెల్దండి శ్రీధర్.....55
10. బోయి భీమన్న గారి పీఠికల పరిశీలన
    – పోరెడ్డి మృదుల.....61
11. బోయి భీమన్న ప్రగతిశీల మానవీయ ఆలోచనల ధార – అవలోకనం
    (పాలేరు నుండి పద్మశ్రీ వరకు)
    – డా. లక్ష్మయ్య 66
12. కొండ అద్దమందు...
    – డా. రాఘవేంద్ర రావు.....74
13. డా.బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై – మానవతావాదం
    – డా. బి.లచ్చయ్య.....81

14. బోయి భీమన్న అఖండ తాండవం – మానవ సంబంధాలు
– డా. జంపుల తిరుపతయ్య 85
15. పాలేరు నాటకం – సామాజిక విప్లవ పరిశీలన
– డా. ఎన్. సుభాషిణి.....89
16. బోయి భీమన్న సాహిత్యం – వైజ్ఞానిక దృష్టికోణం
– డా. కొనకొండ్ల సుభాషిణి.....93
17. "బోయి భీమన్న సాహిత్యం:
దళిత చైతన్యం నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వం"
– బొడ్డు భరద్వాజ 97
18. డా. బోయిభీమన్న గారి "పిల్లీ శతకం–ఒక పరిశీలన"
– ఎమ్.ఎచ్.నాగభూషణం 111
19. శ్రమజీవుల ప్రేమతత్వం భీమన్న 'పైరు పాట'
– డా. సి. అనిత కుమారి 117
20. బాలయోగీయం రచనలో భీమన్న ఆధ్యాత్మిక, సామాజిక దృక్పథం
– డా. ఆతుకూరి వేంకటేశ్వర్లు (యోగి).....122
21. బోయి భీమన్న రచనలు – జాతీయ సమైక్యత
– పులి జమున.....128
22. బోయి భీమన్న సాహిత్యం – మానవతావాదం
– డా. చీర్ల శ్రీనివాసులు 133
23. గుడిసెలు కాలిపోతున్నై– సామాజిక చిత్రణ
– ఆరె రాజు.....137
24. బోయి భీమన్న 'పిల్లీ శతకం' – ఒక సామాజిక విమర్శనాత్మక అధ్యయనం
– పోలపల్లి అశోక్.....142
25. బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై కవితాతత్త్వ విచారణ
– సోమనాథ్.....148
26. బోయి భీమన్న జీవితం – సాహిత్యం
– దేపవత్ శిల్ప 154

27. బోయి భీమన్నగారి సాంఘిక నాటకాలు –
సామాజిక దృక్పథం మరియు మానవతవాదం
– *గనుముల తిరుమల రాజు*.....158
28. రాగవాసిష్టం – ప్రణయ రాగ చిత్రణ
– *కాపర్తి స్వరాజ్యం*.....165
29. సాహిత్యం మరియు సమాజం: బోయి భీమన్న గారి కృషి
– *డా. జి. కిరణ్ కుమార్ రెడ్డి, డా. చి. పాల్ కృపాకర్*.....171
30. బోయి భీమన్నగారి పైరు పాట – ఒక పరిశీలన
– *డా. గండవరపు విద్యాధరి*.....177
31. "శక్తియే శాంతి" – బోయి భీమన్న 'విశ్వశాంతి' లో
ప్రతిపాదించిన జీవన తత్త్వం
– *డా. యడవల్లి సైదులు* 185
32. బోయి భీమన్న 'పంచమస్వరం' – దళిత చైతన్యం
– *డా. మేడికొండ ప్రసాదరావు* 191
33. బోయి భీమన్న రచనలు – భిన్న దృక్పథాలు
– *డా. సంగుల సునీల్ కుమార్* 197
34. గుడిసెలు కాలిపోతున్నాయి కవిత్వం–సామాజిక దృక్పథం
– *డా. బత్తుల రవీందర్ గౌడ్*.....204
35. డాక్టర్ బోయి భీమన్న కవిత్వం సామాజిక దృక్పథం
– *వెంకటేశ్వర్లు* 213
36. డాక్టర్ బోయి భీమన్న సాహిత్యం – దళిత చైతన్యం
– *డి. రాములు*.....216
37. బోయి భీమన్న పిల్లీ శతకం: సామాజిక స్పృహ
– *గూడపాటి అనిల్*.....220

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

శ్రీమతి హైమవతీ భీమన్న గారిని కలిసిన సందర్భంగా వారు పంచుకున్న కొన్ని అనుభవాలు, జ్ఞాపకాలు

– ఆచార్య కె. కృష్ణమూర్తి
తెలుగుశాఖ అధ్యక్షులు
ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్ నగర్

భీమన్న, 1978వ సంవత్సరంలో రాష్ట్ర గవర్నర్ చేత శాసన మండలికి నామినేట్ చేయబడ్డాడు. 1978 నుంచి 1984 వరకు ఒక ఆరు సంవత్సరాల కాలం పాటు తన ప్రసంగాలతో అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసేవాడన్నమాట. శాసన మండలిలో ఉన్న సభ్యులే కాకుండా పాత్రికేయులందరూ కూడా ఆయన మీద ప్రశంసల జల్లు కురిపించేవారు. శాసనమండలిలో అంత అద్భుతమైనటువంటి ప్రసంగాలు చేశారు.

ఆ తర్వాత 1983 లో ఎన్.టి. రామారావు ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కూడా ఒక సంవత్సర కాలం పాటు ఈయన ఆ శాసనమండలిలో ఉన్నాడు. రామారావు గారి ప్రభుత్వం చేపడుతున్నటువంటి కార్యక్రమాలన్నిటిపై ఈయన స్పందించని రోజంటూ ఉండేది కాదు. పత్రికలేమో చాలా చమత్కారంగా పతాక శీర్షికల్లో అన్నకు భీమన్న చిట్కాలు, అన్నకు భీమన్న సలహాలు అంటూ రకరకాల వ్యాఖ్యలతో వార్తా కథనాలన్నీ ప్రచురిస్తూ ఉండేవారు.

అలాగ ఆరు సంవత్సరాల పాటు చాలా అద్భుతంగా ఆయన శాసన మండలి సభ్యుడుగా కొనసాగాడు. ఆ తర్వాత 1985లో ఆల్ ఇండియా దళిత రైటర్స్ ఆయనని చైర్మన్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈయన ఆధ్వర్యంలోనే దళిత మహాసభలు జరిగాయి.

అంతకుముందు 1983లోనూ అనంతపూర్‌లో ఉన్నటువంటి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సిండికేట్ మెంబర్‌గా కూడా ఈయన సెలెక్ట్ అయ్యాడు. ఈయన అనంతపూర్ వెళ్ళినప్పుడు ఆయన వెంట నేను వెళ్ళేదాన్ని, లేకపోతే మా అమ్మాయి పల్లవి వెళుతూ ఉండేది.

ఆ సమయంలో అనంతపూర్‌లో అక్కడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఏబుల్ గారు ఉండేవారు. నిజంగా ఎంతో సౌమ్యుడు, చాలా మంచివాడు. ఆయన్ను మహోన్నత వ్యక్తి అని చెప్పాలి. అలాంటి ఏబుల్ గారు, తర్వాత కొలకలూరి ఇనాక్ వంటి వాళ్లు అక్కడ ఉండేవారు. వీరే కాకుండా ఇంకా చాలామంది పరిశోధక విద్యార్థులు మేము వెళ్ళినప్పుడల్లా మాతో కలిసి సరదాగా గడుపుతూ ఉండేవాళ్లు. అనంతపూర్ విశ్వవిద్యాలయంలో మా జ్ఞాపకాలు గొప్పవి, మరిచిపోలేనివి.

ఆ తర్వాత 1988లో విజయవాడలో కనకాభిషేకం జరిగింది. అంటే, పాలేరు నాటకానికి స్వర్ణోత్సవం చేశాం అన్నమాట. భీమన్నకి అత్యంత ఆప్తుడు, స్నేహితుడు అయిన కోనాడు సూర్యప్రకాశరావు గారికి ఈ పాలేరు నాటకాన్ని అంకితం ఇవ్వడం జరిగింది. ఆ రోజున పాలేరు స్వర్ణోత్సవం జరిగినప్పుడు పోలవరపు వెంకట సుబ్బారావు దంపతులు భీమన్నకు కూడా కనకాభిషేకం చేశారు. చాలా అద్భుతంగా జరిగింది ఆ కార్యక్రమం.

మేము సకుటుంబంగా విజయవాడ వెళ్ళాము. ఆ స్వర్ణోత్సవ సంబరాల్లో పాల్గొన్నాము. ఆ పోలవరపు దంపతులు మా ఇద్దరిని చాలా చక్కగా సన్మానించారు. అలాగే కోనాడు సూర్యప్రకాశ రావు గారికి పాలేరు నాటకం అంకితం ఇవ్వడం జరిగింది. కోనాడు సూర్యప్రకాశ రావు గారి అబ్బాయి కోనాడు అశోక్ మంచి గాయకుడు. ఆ రోజున విజయవాడలో ఆ పాలేరు నాటక ప్రదర్శన కూడా జరిగింది.

చాలా అంటే చాలా అద్భుతంగా నటించారు నటీనటులంతా కూడాను. అసలు నభూతో నభవిష్యతి అన్నంత గొప్పగా ఆ నాటకం ప్రదర్శించబడింది. అసలు ఎక్కడా మనిషి నిలబడడానికి స్థలం లేదన్నమాట. ఆ హాలంతా కిటకిటలాడిపోయింది. అంత జనసమ్మర్ధం అన్నమాట. అంత గొప్ప నాటకం అది.

ఈనాటికీ ఆనాటికి పాలేరు నాటకం రిలవెంట్ అని చెప్పుకోవాలి మనం. ఎందుకంటే సామాజిక చైతన్యాన్ని ఆశించి రాసినటువంటి నాటకం ఇది. ఇంకా సామాజిక చైతన్యం ఆశించిన మేరకు జరగలేదు. అందుకనే నిజంగా జనంలో చైతన్యం వచ్చేవరకు కూడా ఈ నాటకం ఇలా చిరస్థాయిగానే ఉంటుంది. అంత గొప్ప నాటకం అన్నమాట పాలేరు నాటకం.

ఇంకొక విషయం ఏంటంటే బోయి భీమన్న అని ఎవరైనా అనగానే ఓ! పాలేరు నాటకం రాశారు కదా అని అంటుంటారు. ఆయన జీవించి ఉండగా 70 గ్రంథాలు రాసారు. అనువాదాలు కానీ అనుకరణలు గానీ ఏమీ లేవు. అన్నీ స్వీయ రచనలే. అన్ని సాహిత్య ప్రక్రియలలో కూడా రాసినటువంటివాడు భీమన్న. అలాంటిది ఈ పాలేరు నాటకాన్నే ఎక్కువగా అందరూ కూడా ప్రస్తావిస్తూ ఉంటారు. ఎందుకంటే ఆ నాటకం అంత బహుళ జనాదరణ పొందినటువంటి నాటకం అన్నమాట. అంత గొప్ప నాటకం. భీమన్న గారికి మంచి పేరు తెచ్చి పెట్టింది.

కనకాభిషేకం తర్వాత 1989లో ఇక్కడ ఆంధ్ర సారస్వత పరిషత్తులో కొంతమంది మిత్రులందరూ కలిసి ఈయనకి పుష్పాభిషేకం చేశారు. ఆ పుష్పాభిషేక సభ ప్రత్యేకంగా నిర్వహించినవారు జొన్నకూటి నాగేశ్వరరావు. ఆయన ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా

ఉండేవాడు. స్నేహితులందర్నీ కూడగట్టుకుని ఈయనకి ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఈ పుష్పాభిషేకం జరిపించారు.

అలాగే వరసగా ఈ పుష్పాభిషేకం తర్వాత 1990లో విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి ఆచార్య ఆపదరావు గారు కనక పుష్పాభిషేకం చేస్తాం మీకు విశాఖపట్నంలో మీరు రావాలి అని చెప్పేసి భీమన్న గారికి ఫోన్ చేశాడు. సరే వెళ్దామంటే వెళ్దామనుకున్నాం. ఎందుకంటే మాకు విశాఖపట్నం అంటే అదొక ప్రత్యేక అభిమానం, ఏమిటో తెలియదు.

మా పిల్లలు విశాఖపట్నం అంటే వెంటనే తయారైపోతారు. వాళ్ళని ఆకర్షించింది అక్కడి సముద్రం. ఆ సముద్రపు ఒడ్డుకు వెళ్ళి కాసేపు అక్కడ ఆడుకుని సరదాగా ఎంజాయ్ చేసి రావడం వాళ్ళకి చాలా ఇష్టం. కానీ కనక పుష్పాభిషేకానికి వెళ్ళినప్పుడు పిల్లలతో వెళ్ళలేదు. మేము ఇద్దరమే వెళ్ళాము. నేను, భీమన్న గారు ఇద్దరం వెళ్ళాము.

ఇంతకీ ఆ కనక పుష్పాభిషేకం ఏమిటి అంటే సింహాచలం నుంచి గంపలు గంపలు, తట్టలు తట్టలు నిండా సంపంగి పూలు తీసుకొచ్చారు అన్నమాట. అప్పటి పార్లమెంట్ సభ్యుడు ఏ.వి.ఎస్ మూర్తి గారు, ఆపద రావు గారితో పాటు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నటువంటి అధ్యాపకులు, అక్కడ ప్రముఖ న్యాయవాదిగా ఉండే గణపతిరాజు అచ్యుతరామరాజు గారు, అలాగే మన శంకరాభరణం సోమయాజులు గారు మొదలగు ప్రముఖులందరూ పాల్గొన్నారు. చాలా అద్భుతమైనటువంటి సత్కార కార్యక్రమం ఆ కనక పుష్పాభిషేకం. ఆ కనక పుష్పాలు అంటే సంపంగి పూలు అన్నమాట. ఆ సంపంగి పూలు తట్టలతో తెచ్చి పోసేశారు మాకు. చాలా చక్కటి అనుభూతి నాకు అది ఇప్పటికీ కూడాను.

తర్వాత 1991లో తిక్కవరపు రామిరెడ్డి శత జయంతి ఉత్సవాల సందర్భంగా డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు భీమన్న గారికి తిక్కవరపు రామిరెడ్డి పేరు మీద పురస్కారం అందించారు. అప్పుడు నేను కూడా వెళ్ళాను. జిల్లా కలెక్టర్‌గా కొప్పుల రాజు గారు ఉండేవారు.

మమ్మల్ని చాలా చక్కగా ఆదరించారు ఆయన. మేము వస్తున్నామని తెలిసి మమ్మల్ని రిసీవ్ చేసుకుని, మాకు కావలసినటువంటి సౌకర్యాలు, సదుపాయాలు అన్నీ కూడా చాలా చక్కగా సమకూర్చారు. మాకు అక్కడ ఉండడానికి కూడా ఆయన వసతి కూడా ఏర్పాటు చేస్తానంటే, బెజవాడ గోపాలరెడ్డి గారు "నో నో, వాళ్ళు ఎక్కడా ఉండడానికి వీల్లేదు, మా ఇంట్లోనే ఉండాలి, మా ఆతిథ్యమే స్వీకరించాలి" అని చెప్పి పట్టు పట్టారు. కాదనలేక బెజవాడ గోపాలరెడ్డి గారి ఇంట్లో ఉండడం జరిగింది.

ఆ సాయంత్రం నెల్లూరు టౌన్ హాల్‌లో అశేష ప్రజావాహిని మధ్యన ఈ తిక్కవరపు రామిరెడ్డి శత జయంతి ఉత్సవాల సందర్భంగా భీమన్న గారికి సన్మానం జరిగింది.

అలాగే అదే సంవత్సరం మళ్ళీ దళిత ఓపెన్ యూనివర్సిటీ గుంటూరుకు వెళ్ళాం. అక్కడ వాళ్ళంతా కూడా చాలా చక్కగా అక్కడ మాకు సత్కారం అందించారు. అది దళిత ఓపెన్ యూనివర్సిటీ గుంటూరు అన్నమాట.

అదే సంవత్సరమే రమణయ్య రాజు గారు ఏర్పాటు చేసినటువంటి అతి ప్రతిష్ఠాత్మకమైన రాజాలక్ష్మి అవార్డు కూడా భీమన్న గారికి ఇవ్వడం జరిగింది. ఆ సభలన్నింటికీ మేమెవరో ఒకరం కుటుంబ సభ్యులు తప్పనిసరిగా పాల్గొనడం ఆనవాయితీ.

తర్వాతేమో 1992 ఆ ప్రాంతంలో అంబేద్కర్ సెంటెనరీ సెలెబ్రేషన్స్‌కి కూడా రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా వేశారు భీమన్న గారిని.

1992లో యన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సి. నారాయణ రెడ్డి గారు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. అప్పుడు ఈ యూనివర్సిటీ వారు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'విశిష్ట పురస్కారం' ప్రప్రథమంగా బోయి భీమన్న గారినే వరించింది.

అప్పుడు. అది ఎన్.టి. రామారావు గారి సమయం, ఆ టైమ్‌లో ఈయనకు ప్రధానం. నారాయణ రెడ్డి గారి టైమ్‌లో అది ఇవ్వడం జరిగింది.

అలాగే 1993లో మళ్ళా గుంటూరు వెళ్ళాం. ఎందుకంటే నాగార్జున యూనివర్సిటీ వాళ్ళు ఈయనకి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు.

తర్వాతేమో సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, నాగ్‌పూర్ వాళ్ళు భీమన్నగారిని 1995లో మెంబర్‌గా వేసుకున్నారు.

1996లో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ఆత్మగౌరవ పురస్కారం ప్రకటించారు. అది మొట్టమొదటి ఆత్మగౌరవ పురస్కారం. 50 వేల నగదు, పారితోషికం చాలా గొప్ప సన్మానం అది.

అలాగే చాలా వాటిల్లో ఈయన ఉండేవాడు. కల్చరల్ కౌన్సిల్‌లో మెంబర్‌గా ఉండేవాడు. తర్వాత గోల్డెన్ జూబ్లీ, భారత స్వాతంత్ర్య 50 సంవత్సరాల ఉత్సవాలలో కూడా కమిటీ మెంబర్‌గా ఉండేవాడు భీమన్న.

తర్వాత అసలు బాగా విశేషంగా, ప్రత్యేకంగా చెప్పుకోవలసినది ఏమిటి అంటే శ్రీకాకుళంలో జరిగిన సమావేశం. అప్పుడు దానం గారు కలెక్టర్‌గా ఉండేవాడు. అక్కడ ఎస్పీ ఇంకొకాయన. వీళ్ళ సమక్షంలో 2000 మంది స్టాండింగ్ ఒవేషన్ (అందరు నిలబడి) ఇచ్చారు. అంటే అత్యంత గౌరవప్రదమైనది అన్నమాట అది.

అటువంటి సభలో ఈయనకి 'నవయుగ కవిసార్వభౌమ' బిరుదు ప్రధానం చేశారు. నిజంగా ఆ రకమైనటువంటి సభ నభూతో నభవిష్యతి. ఎందుకంటే 2000 మంది స్టాండింగ్ ఒవేషన్. ఆ విధమైన సభలో మేమిద్దరం కూడా పాల్గొన్నాము. విజయభావన సంస్థ వాళ్ళు 2000 సంవత్సరం ఉగాది రోజు ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆ తర్వాత 2001లో భారత ప్రభుత్వం ఈయనని పద్మభూషణ్‌తో (అంతకు ముందు 1973లో పద్మశ్రీ ఇచ్చింది) సత్కరించారు. అప్పుడు మా అమ్మాయి పల్లవి, నేను, భీమన్న ముగ్గురం కలిసి ఢిల్లీ వెళ్ళాము. భీమన్నతో పాటు బాలసుబ్రహ్మణ్యానికి అప్పుడు పద్మశ్రీ ఇచ్చారు. అలాగే భానుమతి రామకృష్ణ గారు కూడా ఉన్నారు. వీళ్ళంతా కూడా అక్కడ కలిశారు అదొక చక్కటి అనుభూతి అన్నమాట.

ఆ తర్వాత 2002లో మహాత్మా గాంధీ వాళ్ళ హార్మొనీ అవార్డు జై భారత్ సంస్థ వాళ్ళు ఇచ్చారు. జై భారత్ అనేది ఒక పెద్ద సంస్థ. వాళ్ళు చాలా చక్కటి కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. రమణమూర్తి దాని అధ్యక్షుడు. పి.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో జై భారత్ చాలా బ్రహ్మాండమైన కార్యక్రమం నిర్వహించాడు.

ఆ తర్వాత 2003లో గుర్రం జాషువా గారి పేరు మీద కూడా భీమన్న గారికి ఒక పురస్కారం లభించింది.

అలాగే 2004లో ఎన్.టి. రామారావు జీవిత సాఫల్య పురస్కారాన్ని ఇచ్చారు.

2005... ఆయన 2005 డిసెంబర్‌లో చనిపోయారు. చనిపోక ముందు కూడా అదే సంవత్సరంలో రామినేని ఫౌండేషన్ వాళ్ళ సత్కారం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారి సిటిజన్ అవార్డు కూడా భీమన్నను వరించాయి. ఇవన్నీ భీమన్న స్వయంగా హాజరై స్వహస్తాలతో తనే స్వీకరించాడు.

అదే సమయంలో డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఏర్పాటు చేసినటువంటి లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డు కూడా అనౌన్స్‌మెంట్ జరిగింది. కానీ, ఈయన అందుకునే స్థితిలో లేడు. ఎందుకంటే 2005 డిసెంబర్‌లో ఆయన చనిపోయాడు. 2006 జనవరిలో ఈ అవార్డు ఇవ్వడం జరిగింది.

ఇంక ఈ అవార్డుకి నేను 2006 జనవరిలో పిల్లల్ని తీసుకుని వైజాగ్ వెళ్లి ఆ అవార్డు స్వీకరించాను. అక్కడి నుంచి పిల్లలతో సరదాగా రెండు మూడు రోజులు విశాఖపట్నంలోనే పిల్లలకన్నీ చూపించి మళ్ళా తిరిగి హైదరాబాద్ రావడం జరిగింది.



అమ్మకు కృతజ్ఞతలతో..

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్యం సమసమాజ స్థాపన

– ఆచార్య కె. కృష్ణమూర్తి
తెలుగుశాఖ అధ్యక్షులు
ఎం.వి.ఎస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్ నగర్

ఉపోద్ఘాతం

"ఒక చేతితో సంపాదిస్తూ, రెండో చేతితో విద్యలకోసం ఖర్చు పెట్టేవాడే నిజమయిన ధనవంతుడు" అంటూ ధర్మం కోసం పోరాటంలో నిలబడ్డ భీమన్న సామాజిక ఆర్తిని, అశాంతిని జీవద్భాషలో వెలువరించిన మహానుభావుడు. జీవితపు వాస్తవ లోతుల్ని తరిచి చూసినవాడు. స్వీయ అనుభవాలతో మానవ అంతర్వేదనలను ఛేదించుకోగల శక్తి గలవాడు. ఒకడు తింటూ మరొకడు పస్తు ఉండడం ధర్మం కాదనీ, ప్రతి ఒక్కరికి కూడు, గుడ్డ, నీడ కనీస అవసరాలనీ ధనికులు, పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజాన్ని నిర్మించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలనే అభ్యుదయంతో విశ్వమానవతను చాటినవాడు బోయి భీమన్న.

కీలకమైన పదాలు

భారతజాతి, మనిషి జన్మహక్కు, ఆత్మజ్ఞానం, సమసమాజం, వేదజ్ఞానం, కులమతాలు, సంప్రదాయం.

పరిశోధన ప్రారంభం

భీమన్నగారు సమాజం పట్ల గౌరవం, అసమానతల పట్ల తిరస్కార భావాలు కలవాడు. కవిగా ఊహించి, భావకుడిగా భావించి, సర్వమానవ సమానత్వాన్ని అభిలషించాడు. డబ్బు, చదువు, ధైర్యం ఉంటే కులంతో పని ఉండదని, గౌరవ మర్యాదలు వాటంతకవే లభిస్తాయని నమ్మినాడు. అందరూ అభ్యుదయం వైపు నడవాలని ఆశించాడు.

కవి అనేవాడు సమాజాన్ని జాగృతపరచాలి, అందుకే "కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు" అంటారు. తెలుగు సాహిత్యం అంబరమైతే భీమన్న విహరించని ఎత్తులు లేవు, సంద్రమైతే ఆయన మధించని లోతులు లేవని చెప్పొచ్చు.

సామాజిక అసమానతలు, కుల, మత, లింగ, వర్గ, వివక్షతలు, సామాన్యుల అణిచివేతలాంటి అంశాలతో కూడిన ఇతివృత్తాలుగా తన రచనల్లో దృశ్యమానమయ్యాయి. భీమన్న రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా భారతజాతి ఏకత్వం కనిపిస్తుంది. కుల మతాల కంటే మానవత్వాన్ని ఆశించిన జాతీయవాది భీమన్న. జాతీయతతో పుట్టి పెరిగి, దేశీయ వాస్తవికతకు అనుగుణంగా ఉంటూ, ఆత్మ గౌరవంతో జీవించాలనే ఆకాంక్షతో ఉండాలని బోధించాడు.

"జన్మానాం జాయతే కర్మణేని బ్రాహ్మణఃు" బ్రాహ్మణత్వం విద్యవల్ల, తపస్సు వల్ల వస్తుందనేది భీమన్న విశ్వాసం. సమాజంలో కొంతమంది స్వార్థపరులు సృష్టించిన నమ్మకాన్ని వమ్ము చేయాలని, అర్థంలేని ఆచారాల్ని కూకటి వేళ్ళతో పెకలించాలని, అందరూ ఆత్మగౌరవంతో బ్రతకాలని ప్రబోధించాడు.

భారత జాతికి కవులు ముగ్గురు వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు. త్రేతా యుగానికి వాల్మీకి, ద్వాపర యుగానికి వ్యాసుడు, కలియుగానికి కాళిదాసు. ఈ ముగ్గురు గిరిజన, హరిజన, బహుజన కులాలకు చెందినవారే. అటువంటప్పుడు వారి వారసులు వారసత్వం కాపాడుకోవాలంటాడు. అందుకే మతమార్పిడి వద్దన్నారు. మతం మారాల్సిన అవసరమేముంది, మత మార్పిడులపై కూడా ఆయన చాలా దృఢంగా, బలంగా స్పందించారు.

బలము కలవాడు పులి
తెలివిగలవాడు నక్క
ఈ ఇరువర్గాలకు ఆహారంగా
బ్రతుకుతున్న మూర్ఖులు గొర్రెలు
కర్మ సూత్రం పై విశ్వాసం
చచ్చిన అవతారాల పట్ల భక్తి
పులికి పాద సేవ, నక్కకు దాసోహం
గొర్రెలకు మోక్షమార్గాలు

అట్లాగే బోయి భీమన్న ఆత్మగౌరవ ప్రతీకగా కింది మాటలనే ఉదహరించవచ్చు.

నాకు తిండి దొరక్కపోతే
నేను పస్తులు ఉండను
ఉపవాసాలు చేస్తాను.
నాకు పేదరికం లేదు
నాకు బట్టలు దొరక్కపోతే
నేను చింకి పాత బట్టలు కట్టను

దిగంబరోద్యమం చేస్తాను
నాకు పేదరికం లేదు

అంటూ భీమన్న తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి జీవించాడు. ప్రతి వ్యక్తి ఆత్మగౌరవంతో జీవించడం నేర్చుకోవాలంటాడు. భీమన్న ఆచరించినవే చెప్పాడు.

నాకు రాజకీయాలు లేవు
ఏ ఇజంతోనూ నాకు పొత్తు లేదు
నేను పదవులు ఇచ్చే నాయకున్నో
మార్కులు ఇచ్చే ఆచార్యున్నో కాదు
నేనొక మామూలు తోటమాలిని
నీకు నచ్చిన పూలుంటే కోసుకుంటూ ఉండు
ఇష్టమైతే ఇక్కడే ఉండు

గ్రామ దేవతల నుండి బాబాల దాకా, చిత్తం పూజల మీద, ప్రజల మీద కాదు, టీచర్ల నుంచి ప్రొఫెసర్ల దాకా, దృష్టి జీతం మీదే, చేత మీద కాదు అంటాడు.

1980లో వెలువడిన 'జన్మాంతర వైరం' గ్రంథంలో సమసమాజ స్థాపనార్థం అనేక విషయాలు చర్చించాడు. అందులో మత మార్పిడిపై వారి అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. వారి మాటల్లో "నేను హిందువుగా పుట్టాను మతం మార్చవలసిన అవసరం లేదు. పెనంలో నుండి పొయ్యిలోకి దూకటం దేనికి. ఈ హిందూ మత మూలపురుషులు ఈ భారత సంస్కృతి మూలపురుషులు నా వాళ్ళు, నా హరిజనులు అని నేను విశ్వసిస్తున్నప్పుడు నా వారసత్వ హక్కుల్ని ఏదో విధంగా తిరిగి సంపాదిస్తానే కానీ పారిపోవడం అనేది ఎందుకుంటుంది? మెజార్టీ జనం వాన్ని మైనార్టీగా ఎందుకు మారుతాను? కాగా నేను హిందువుని, ఈ జాతి, ఈ దేశము నావి. పోనీ నేనొక్కడినే మరో మతంలోకి పారిపోతాను అనుకోండి, నాతో కొంతమందిని తీసుకుపోతాను అనుకోండి. ఎంతమందిని తీసుకుపోగలను లక్షా, రెండులక్షలా? వాళ్ళైనా నామీద గౌరవంతో వస్తారు. అవతలి మతంలో విశ్వాసంతో కాదు" అన్న అభిప్రాయాన్ని జన్మాంతర వైరం కావ్యంలో వివరించాడు.

అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన వేద విద్యాభిలాషి భీమన్న. వీరు వేదాల ప్రామాణికతను అంగీకరించారు. గో బ్యాక్ టూ వేదాస్ 'వేదాలవైపు మళ్ళండి' అనే వీరు వేద సంస్కృతిలోని సత్యాన్ని గ్రహించారు. దాన్ని గౌరవించారు. కానీ అందులోని మూఢాచారాలను ఖండించారు. అందులో భాగంగా వైదిక సంప్రదాయంలో ఉన్న గురు పరంపరను అంగీకరించలేదు. మనిషి తరించడానికి, మోక్ష సిద్ధికి, గురుముఖతః దీక్ష, సాధన చేయాలనే సంప్రదాయాన్ని ఒప్పుకోలేదు.

"గురువులేని విద్య గుడ్డి విద్యను మాట
పరమవిద్య పట్ల పనికిరాదు,

ఎవని పరము వాని ఇష్టార్థసిద్ధియే
ముక్తి ఎవనికేని వ్యక్తిగతము"

అంటూ సంకుచిత మనసుతో ఉండే గురువుల ప్రమేయం అనవసరం అంటాడు.

విద్య ప్రతి మనిషికి జన్మహక్కు. భౌతిక జీవితంలో నిద్రాహారాలు ఎంత వాస్తవమో అంతరంగ జీవితానికి ఆత్మజ్ఞానం కూడా అంతే. బుద్ధి చేతనే మానవ సమస్యలను పరిష్కరించుకోగలం. అది వ్యక్తిగతమే కానీ సమాజ గతం కాదు. వ్యక్తి పరంగా సమాజాన్ని సంస్కరించగలం మలుచుకోగలం కానీ సామాజిక సూత్రాల ద్వారా అనుకూల సమాజం, సమసమాజం ఏర్పడదనేది భీమన్న ఆలోచన విధానం.

భౌతిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డ లేని దుర్దశకు మనిషి చేరడం ఆక్షేపమన్నారు. ప్రతి విషయంలో తీవ్రతతో కూడిన ఒక ఆదర్శం, అంతరార్థం ఉండాలంటూ... భీమన్న వేదాంత ధోరణి, ఆయన మాటలనే ఉదహరించటం సమంజసం.

"పరమాత్మకు పదార్థ రూపం మెదడే అని నా ఉద్దేశం. మెదడు మానవుడిలో బాగా వికసించింది. ఇంకా అనేక రెట్లు వికసించవలసి ఉంది. దాని వికాసం ఏ స్థాయి అందుకోవాలంటే దాని మూలమైన పరబ్రహ్మ స్థాయిని అందుకోవాలి. అంటే మెదడు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ పరబ్రహ్మ అయిపోవాలి" అంటూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

భీమన్న సంప్రదాయ, ఆధునిక, అభ్యుదయ మార్గాల సమన్వయకర్తగా దర్శనమిస్తాడు. ప్రతి జాతికి, దేశానికి ఒక జీవన శైలి ఉంటుంది. భారతదేశం ఆధ్యాత్మిక దేశం. భారతదేశంలో సామాజిక సమతను సాధించడానికి ఆధ్యాత్మిక సామ్యవాదాన్ని సాధించే ప్రయత్నం చేయాలంటాడు.

మనిషికి మనిషికి నడుమ ఉండే అంతరాన్ని తొలగించడానికి, శ్రమ ఫలాన్ని దోచుకునే తత్వాన్ని పోగొట్టుకోవడానికి, పేదవాని మెదడులో వేద జ్ఞానం నిండాలని కోరుకున్నారు. కులమతాలు రూపుమాపి, ఏకైక భారతజాతిని తయారుచేసి, రాజకీయ ఆర్థిక సమానత్వం సాధించడమే తన ఆశయంగా ఎన్నో కవితలు రాశారు.

ఈ దేశంలో మతం మారినంత మాత్రాన వెతలు తీరిపోవు అంటారు.

గుడిని మార్చినంతనే దే
వుడు మారిపోవునా
దొరకు పేరు మారినా
భక్తునికి భజన తప్పునా

అంటూ మతమేదైనా, గతమేదైనా మనోబలం లేక మనిషి తరించలేడని, సర్వ మతాల సారము ఒక్కటేనని, ప్రేమతత్వమే దాని పరమావధి అన్నది భీమన్న అభిమతం.

"ఏది హిందూ? ఏది ముస్లిం? ఏది క్రైస్తవము? ఎల్ల మతముల సారమొకటే, కృష్ణుడు, క్రీస్తు, మొహమదో– గీత, బైబిల్, ఖురాను ప్రేమనే బోధించలేదా ద్వేషమును నిరసించె కదా! అంటాడు

భీమన్న.

"తూర్పు పడమర భేదమేల? తోటకెల్ల వసంతుడొక్కడే కరములె వారెటు మోడ్చి పిలిచిన ఖంగుమను గుడి గంట ఒకటే". ఏ మతమైనా, ఏ దేవుడైనా, ఏ విధంగా ఆరాధించినా అవన్నీ ప్రేమనే బోధిస్తున్నాయి, ద్వేషాన్ని నిరసిస్తున్నాయంటూ సర్వమత సౌభ్రాతృత్వాన్ని ప్రేమించాడు ఆశించాడు భీమన్న.

భారతదేశ వాసులు వారసత్వపరంగా ఏకోదరులే, ఏకజాతీయులే, ఏకమతస్తులే. దేశంలో ఇతర మతాల వారి ఆగమనానికి పూర్వం అందరం హిందువులమే అన్నది భీమన్న భావన. జాతి రీత్యా మనమందరము ఒక్కటే. మతాలు మార్చుకోగలిగినవి. జాతి శాశ్వతమైనది.

మనమంతా మౌలికంగా ఒకే జాతికి చెందిన వాళ్ళం. విదేశీయులు మన దేశానికి రాకముందువరకు భారతీయులంతా ఏదోఒక కులానికి చెందిన హిందువులే. కనుక మతానికి కాక మానవత్వానికి ప్రాధాన్యం ఇవ్వండి. విదేశీ సంప్రదాయాలను తగ్గించుకొని స్వదేశీ ప్రజా జీవనసరళిలో కలిసి నడవండంటూ సర్వజనహితాన్ని ప్రకటించాడు భీమన్న.

విశ్వాసం ఊహాభయజనితం
విజ్ఞానం వాస్తవా అభ్యుదయం
మతాచారములకు మంత్రాంగం స్వార్థం
స్వార్థాలకు మూలం అవిశ్వాసం
సైతానుకు దాసోహం
దైవం పై విశ్వాసం గలవాడు
ధనములనెందుకు దోచుకుంటాడు?
అంటూ మతపెద్దల మనస్తత్వం బహిరంగపరిచాడు.

మతమౌఢ్యం తొలగించుకోకపోతే జాతీయ సమైక్యత సాధ్యం కాదంటారు బోయిభీమన్న.

అందులో భాగంగానే భీమన్న గారు ఇదే 'జన్మాంతర వైరం' పుస్తకంలో సగటు మనిషిలోని సామాజికపరమైన సందేహాలకు సరైన సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ప్రధానంగా బ్రాహ్మణులు, అగ్రవర్ణాల వారు, దళితుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుని ఖండించారు. వివక్ష ఏవిధంగా సమంజసమో ఆలోచించుకునేలా చేశారు. కులం తాలూకు కుళ్లును, మనుషుల్లో నాటుకున్న మూఢనమ్మకాన్ని వమ్ము చేసే ప్రయత్నం చేశారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా తీసుకొని, కొన్ని అగ్రవర్ణాల సంకుచిత అభిప్రాయాలను తూర్పారబట్టారు. దళితులను శ్రమించేవారుగా, ఉత్పత్తి కులాలకు చెందినవారుగా అభివర్ణించారు.

ముగింపు

సమాజంలోని వాళ్లంతా చెడ్డవాళ్లే కాదని, మంచివాళ్లు ఉంటారనే ఒక విశిష్ట ఆశావాద దృక్పథం భీమన్నది. ఒక వ్యక్తి జీవితంలోని అనేక ఘట్టాలను, జ్ఞాపకాలను నిక్షిప్తం చేస్తూ జీవిత చరిత్ర

రాయటం ఒకటి. అదే వ్యక్తి జీవితంలోని లిఖితపూర్వక మౌఖిక విషయాల్ని వ్యాఖ్యానంచేస్తూ మరొకరు ఆ వ్యక్తి జీవిత చరిత్రను రాయడం మరొకటి. భీమన్న తన ఆత్మకథను తాను రాసుకోలేదు. తన ప్రతి రచన తన ఆత్మకథ గానే చెప్పుకున్నారు. శ్రీమతి హైమవతీ భీమన్న గారు పాలేరు నుండి పద్మశ్రీ వరకు అన్న రచనలో భీమన్న గారి జీవిత చరిత్రను అక్షరబద్ధం చేశారు.

ఆధార గ్రంథ సూచిక :

1. భీమన్న, బోయి. గుడిసెలు కాలిపోతున్నై, ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, 1977.
2. భీమన్న, బోయి. పాలేరు (నాటకం), దేశికవితామండలి, 1946.
3. వెంకటేశ్వరరావు, దార్ల. జాతీయ కవి బోయి భీమన్న, సూర్య దినపత్రిక సాహిత్య అనుబంధం, 2011.
4. హైమవతీ. పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, జీవిత చరిత్ర.
5. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు, హైదరాబాద్, 2010.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

అభినవ వ్యాసుడు మహాకవి బోయి భీమన్న

– డా. కోయికోటేశ్వరరావు
కీలకోపన్యాసం,
సెల్ : 9440480274

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని నవనవోన్మేషంగా తేజోవంతం చేసిన సృజన భాస్కరుడు డాక్టర్ బోయి భీమన్న. అనునిత్యం "స్వతంత్ర విప్లవజ్వాల"గా ప్రభాసించిన మహాకవి భీమన్న. ప్రగాఢమైన, వైవిధ్యభరితమైన తన రచనలతో సామాజిక పునర్నిర్మాణానికి వినూతనతాత్త్విక చైతన్యాన్ని అందించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్, కుమరన్ ఆశన్, ముల్క్ రాజ్ ఆనంద్ తదితర కవుల్లాగా భీమన్న కూడా జాతీయ కవి. ఆంధ్ర మహాసభ నుండి దళిత మహాసభ వరకు సాగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉద్యమాల ఎరుకతో ఆయన తనదైన విలక్షణ సాహిత్య దర్శనాన్ని ఆవిష్కరించాడు.

శ్రీ బోయి భీమన్న నవ్యాంధ్ర కవులలో గణనీయమైన స్థాయిని సంపాదించుకున్నారు. 'ప్రగతీ సముద్దీపనాటకకర్తగా' 'రసాద్వైత తత్త్వ నిర్మాతగా' సాహిత్యంలో ప్రఖ్యాతిగాంచాడు. మాధుర్యము వీరి రచనల ప్రత్యేక విశిష్టత. శ్రీ భీమన్న ఉచ్చశ్రేణికి చెందిన యశస్కాములగు మధురకవి" (పాలేరు నుండి పద్మశ్రీవరకు) బూర్గుల రామకృష్ణారావు అన్న మాటల్లో భీమన్న అసమాన కర్తృత్వ గరిమ అవగతమవుతుంది.

"కుల, మత, వర్గ విభేద రహితమైన భారతజాతి ఆవిర్భవించాలనేదే నా ధ్యేయం" అంటూ ప్రకటించి, ఈ మహోన్నత ధ్యేయ సాధన కోసం ఏడున్నర దశాబ్దాల తన సాహిత్యాన్ని అంకితం చేసిన భీమన్న పద్మశ్రీగా, కళాప్రపూర్ణగా, పద్మభూషణుడిగా కవి పండితుల మన్ననలు అందుకున్నాడు. ఒక మహావృక్షం పరిసరాల చుట్టూ తన మూలాలను విస్తరింపజేసినట్లు భీమన్న నాటకం, నాటిక, పద్యకవిత్వం, వచన కవిత్వం, గేయకవిత్వం, విమర్శ, పరిశోధన, లేఖా రచన, అనువాదం తదితర ప్రక్రియల్లో ప్రామాణికమైన రచనలు చేసి ఆధునిక తెలుగు సాహిత్యంపై చెరగని ముద్ర వేశాడు.

"సరస వాక్యమ్మె కావ్యమై వరలు నేని
కవిత నా దొక్క టొక మహా కావ్యమగును
వేల కవితల తోటమాలి నేను"

అని సగర్వంగా ప్రకటించిన భీమన్న తెలుగు సాహిత్య నందనోద్యాన వనంలో పరిమళభరితమైన కావ్యసుమాలు పూయించాడు. ప్రారంభ దశలో మంగిపూడి వెంకటశర్మ, కుసుమ ధర్మన్న, గుర్రం జాషువ కవుల సృజన స్ఫూర్తితో ముందుకు నడిచాడు.

తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో పుల్లయ్య, నాగమ్మ దంపతులకు 1911 సం. సెప్టెంబర్ 19న డాక్టర్ బోయి భీమన్న జన్మించాడు. పేద దళిత కుటుంబానికి చెందిన భీమన్న, అంటరానితనం రగిలించిన పెనుమంటల్లో, పేదరికం రాజేసిన ఆకలి మంటల్లో కరిగి ఒక తాత్త్విక ఆయుధంగా పదునెక్కి, సామాజిక దుర్నీతిని ఖండించాడు. పంట పొలాల్లో తండ్రి పాడే వేదాంత తత్త్వగీతాలను ఆలకిస్తూ, తల్లి మధుర గాత్రంలో నుండి జాలువారే ఏలపాటల్లో, తుమ్మెద పాటల్లో మునిగి తేలుతూ, "కోమలారామ సీమ కోనసీమ" పచ్చని మైదానాల్లో విహరిస్తూ, ప్రకృతి అందచందాలకు పరవశిస్తూ తదనుగుణమైన శైశవానుభూతులతో భీమన్న మౌలిక వేదాంత చింతనాపరుడిగా, సౌందర్యోపాసకుడిగా, ప్రేమతత్వారాధకుడిగా రూపుదిద్దుకున్నాడు.

జాతీయోద్యమ నేపథ్యం, కాకినాడ పి.ఆర్. కళాశాల వాతావరణం, వృక్షశాస్త్ర అధ్యాపకుడు గోరా భావజాల స్ఫూర్తి, బ్రహ్మసమాజ ఆశయాల ప్రేరణ, దివ్యజ్ఞాన సమాజ నాయకులు తాడిమేటి కుటుంబ శాస్త్రి, హరిజన నాయకులు ఈలివాడవల్లి, పాములరామమూర్తి, భాగ్యరెడ్డి వర్మ, తాపీ ధర్మారావు మొదలగు వారి పరిచయంతో భీమన్న ప్రాపంచిక జ్ఞానాన్ని, సామాజిక చైతన్యాన్ని సమకూర్చుకున్నాడు. కొంతకాలం పాత్రికేయుడిగా, ఉపాధ్యాయుడిగా, ప్రభుత్వ అనువాద శాఖ సంచాలకులుగా, శాసన మండలి సభ్యులుగా భీమన్న వివిధ హోదాల్లో విశేషమైన సేవలందించాడు. మద్రాస్‌లో జనవాణి, ప్రజామిత్ర వంటి పత్రికల్లో ఉపసంపాదకుడిగా బాధ్యతలు నిర్వర్తించాడు. కుసుమ ధర్మన్న స్థాపించిన జయభేరి, బి.యస్. మూర్తి ప్రారంభించిన నవజీవన్ పత్రికలకు సంపాదకుడిగా వాటి రూపకల్పనలో, నిర్వహణలో కీలకంగా వ్యవహరించాడు. సుప్రసిద్ధ దినపత్రిక ఆంధ్రప్రభకు ఉపసంపాదకుడిగా ఐదు సంవత్సరాల పాటు విధులు నిర్వహించాడు.

భీమన్న స్వతంత్రమైన సృజనశీలి. స్థిరపడిన సాహిత్య మార్గంలో నడిచిపోవడం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదు. బారెడు దూరమైనా బాటలో నడిచే నైజం కాదు భీమన్నది. క్రోసెడు దూరమైనా కొత్త బాట వేయాలనేది ఆయన తత్త్వం. అందుకే వస్తు రూపాల్లో, దృక్పథంలో ఎంతో సాహసోపేతంగా స్వతంత్ర విప్లవ నైజాన్ని ప్రదర్శించి ప్రయోగవాదిగా, సిద్ధాంతకర్తగా భీమన్న విమర్శకుల ప్రశంసలందుకున్నాడు. అద్వైతం, విశిష్టాద్వైతాలకు భిన్నంగా రసాద్వైతాన్ని సోషలిజానికి ప్రతిగా, "శివ సోషలిజాన్ని" వర్ణ, వర్గ వ్యవస్థలకు బదులుగా "వన్య వ్యవస్థ"లను ప్రతిపాదించి, సూక్ష్మ వివేచనతో నిర్వచించి తన రచనల ద్వారా వాటిని సమర్థవంతంగా ప్రచారం చేశాడు భీమన్న.

మినీ కవితకు ప్రత్యామ్నాయంగా టుమ్రీలు, త్రిపదులు, మాట వెలదులు, భీమన్న చాటువులు వంటి లఘు కవితా రూపాలను సృజించి అపరిమితమైన ప్రణయ తత్వాన్ని అక్షరబద్ధం చేశాడు. ఆరు

ఋతువుల కాల పరిమితులను దాటి "దిసెవెంత్ సీజన్" అనే ప్రేమాన్వితమైన ఏడో ఋతువును రచనల్లో సృష్టించాడు. 'జానపదుని జాబులు' అనే రచనతో భీమన్న తన సాహిత్య ప్రస్థానాన్ని ప్రారంభించాడు. తెలుగులో లేఖా రచనా శైలిలో ఉత్తమ కావ్యాలు రచించిన భీమన్న సంకీర్ణ ప్రక్రియాత్మకమైన ఫణితిలో సృజన సాగించాడు. 'శివాలకులు' అనే కవితా సంపుటి ద్వారా ప్రేయసీ ప్రియుల మధ్య నడిచే ప్రేమలేఖల తీరుతెన్నులను విలక్షణంగా కవిత్వీకరించాడు. "రాగ వైశాఖి" అనే శృంగార లేఖా కావ్యంతో తెలుగు కవిత్వానికి గొప్ప వైవిధ్యాన్ని సమకూర్చాడు. భారత దేశంలో ప్రగతికి పెను అవరోధంగా మారిన మూఢాచారాల ముళ్లను నరికి వేస్తూ, భావ విప్లవానికి బాటలు వేస్తూ నవ సమాజ నిర్మాణానికి నాంది పలికిన రమణీయ కావ్యం 'రాగ వైశాఖి'. కొంత మంది ఈ రచన చుట్టూ ఒక పెద్ద వివాదాల తుఫాన్ సృష్టించారు. అందుకే నాటి శాసన సభలో కూడా ఈ కావ్యానికి సంబంధించిన సాహిత్య చర్చలు జరిగాయి.

బ్రిటీష్ వలసవాద పాలనలో జాతీయోద్యమ కాల ధర్మంతో ఆనాటి ప్రఖ్యాత కవులందరూ భారతదేశ పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రాభవాలను కీర్తిస్తుంటే, అందుకు విభిన్నంగా భీమన్న భారతదేశ ఆధ్యాత్మిక, పౌరాణిక, సాంస్కృతిక వారసత్వానికి పునాదులు నిర్మించింది దళితులేనని తన కృతుల ద్వారా సాధికారికంగా నిరూపించడంలో విశేషమైన కృషి చేశాడు. సామాజిక దృష్టితో పౌరాణిక గాథలను ఆధునీకరించాడు. ఈ రకమైన ఎరుకతో 'ఆదికవి వాల్మీకి', 'ధర్మవ్యాధుడు', 'వేదవ్యాసుడు', 'రాగ వాసిష్ఠం', 'జగత్ సత్యం బ్రహ్మమిథ్య' వంటి పౌరాణిక నాటకాలు రచించాడు. బౌద్ధ కథ నేపథ్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్లంలో రాసిన చాండాలిక నాటకాన్ని స్వతంత్రంగా తెలుగులో అనువదించి బుద్ధుని సమతా సందేశాన్ని, సాంఘిక సమానత్వాన్ని ప్రబోధించాడు. జాతీయోద్యమ ఆశయాలను, హరిజనోద్యమ భావధారను తన రచనల్లో అద్భుతంగా ఆవిష్కరించాడు.

నవ్య సంప్రదాయ కవులకు అసలు సిసలైన భారతీయ వారసత్వాన్ని, ఆదిభారతీయుల, మూలవాసుల విశిష్టతను తేటతెల్లం చేశాడు. అరుంధతీ, వశిష్ఠుల కళ్యాణ చరిత్రను భీమన్న పునర్వ్యాఖ్యానించాడు. ఆర్య, ద్రావిడ జాతుల ఆవిర్భావ వికాసాన్ని పునర్మూల్యాంకనం చేశాడు. పాలేరు, కూలిరాజు నాటకాల ద్వారా దళితుల్లో విద్యా చైతన్యాన్ని, రాజ్యాధికార భావనను పెంపొందింప జేయటంలో భీమన్న చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. ఆంధ్రదేశంలో కొన్ని వేల సార్లు ప్రదర్శింపబడిన పాలేరు నాటకాన్ని దర్శించి వ్యవసాయ కూలీలుగా బతుకులీడుస్తున్న వందలాది మంది దళితులు చదువుకొని కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఎదిగిన ఉదాహరణలెన్నో ఉన్నాయి. కాకి మాధవరావు వంటివారు "నేను రిటైర్డ్ చీఫ్ సెక్రటరీని మాత్రమే కాదు, నేను పాలేరు వెంకన్నను" అని గర్వంగా చెప్పుకుంటాను అంటూ ఒక సభలో పేర్కొనటం పాలేరు నాటకం గొప్పతనానికి నిదర్శనం. సామాజిక ప్రభావం కొలమానంగా భావించి విలువ కట్టినపుడు కన్యాశుల్కం నాటకం కంటే పాలేరు ఉన్నతమైన, ప్రయోజనవంతమైన నాటకమని ఖచ్చితంగా విశ్లేషించవచ్చు.

సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో భీమన్న రచనలు చేసినప్పటికీ పద్య కావ్యాలు అంటే మక్కువ ఎక్కువ. భీమన్న పద్యకావ్యాలు తెలుగు సాహిత్యంలో విశిష్టమైనవి. మధుబాల, మధుగీత,

కావ్యసుమాలు, మణిమానసం, భీమన్న శంఖారావం, పంచమస్వరం, బాలయోగీయం వంటి అపురూపమైన కావ్యాలు రచించి, పద్యకవిత్వానికి వస్తు, రూప వైవిధ్యాన్ని చేకూర్చాడు. భీమన్న కృతుల్లో దీపసభ ఒక గొప్ప ప్రయోగాత్మకమైన మహాకావ్యం.

"ఏ పరం జ్యోతినో వెలిగి
విధులు నెరవేర్చు చిన్న దివ్వెలము మనము
దీపికా నిన్ను నన్నొక వాపి ముంచు
అంధకారము పై దండయాత్ర నాది (దీపసభ)"

అంటూ అక్షర దీపాలతో ఆధునిక తెలుగు కావ్య జగతిని వెలిగించాడు.

మంజరీ ద్విపదలో 'ప్రకృతిలో మానవ ప్రకృతి' అనే ప్రణయ కావ్యాన్ని అమలిన ప్రేమ తత్వాన్ని రచనలో చిత్రించాడు. "ఏక పద్యోపాఖ్యానం" పేరుతో తాను రాసిన ఒక్క పద్యానికి విస్తృతమైన వ్యాఖ్యానం రాశాడు. ఇలాంటి రచన తెలుగు సాహిత్యంలో మృగ్యం. హాస్య, వ్యంగ్య శైలిలో ఆయన రచించిన పిల్లి శతకం ఆధునిక శతక సాహిత్యంలో ప్రత్యేకమైనది. పద్యకవిత్వంతో పాటు వచన కవిత్వంలో కూడా భీమన్న సముచితంగా తన ప్రతిభను చాటుకున్నాడు. గుడిసెలు కాలిపోతున్నై, గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, అనాది కొస నుండి అనంతత్వంలోకి, మోక్షం నా జన్మ హక్కు, కుక్క మొరుగుతూనే ఉంది వంటి విలక్షణమైన సామాజిక చేతనతో కూడిన వచన కవితా సంపుటాలను వెలువరించాడు.

మానవుని మరొక మజిలీ, అకాండ తాండవం వంటి రచనలతో గేయ కవిత్వానికి భీమన్న కొత్త నడకలు నేర్పాడు. పైరు పాట, బొమ్మ తదితర గేయకావ్యాలను రాశాడు. సందేశాత్మకమైన, ప్రణయ భావ విలసితమైన, జీవన తాత్విక భరితమైన ఎన్నో లలితా గీతాలు రచించి ఆకాశవాణి శ్రోతల మనసులకు విందు చేశాడు. దేశభక్తి, జాతీయ సమైక్యత, మత సామరస్యాన్ని వంటి ప్రగతిదాయకమైన అనేక అంశాలను కళా తత్వ స్ఫోరకంగా అక్షరబద్ధం చేశాడు.

తల్లి రక్తం బిడ్డలో ప్రవహించినంత సహజంగా బతుకు తత్వం రచనల్లో అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. దళిత స్పృహ ప్రారంభం నుండి భీమన్న కావ్యాల్లో స్పష్టంగా దర్శనమిస్తుంది. 1968 డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ "ఎన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్" అనే గ్రంథాన్ని కుల నిర్మూలన పేరుతో అనువదించాడు. ఈ గ్రంథ అనువాదం తరువాత భీమన్న సాహిత్య ప్రస్థానంలో ఒక గుణాత్మకమైన మార్పు కనిపిస్తుంది. గాంధీ భావజాల పరిమితులను దాటి భీమన్న అంబేద్కర్ తాత్విక దృక్పథం వైపు పయనించాడు. 'ధర్మం కోసం పోరాటం' వచన గ్రంథం అంబేద్కర్ సిద్ధాంతాలకు అక్షర దర్పణంగా, దళిత మేనిఫెస్టోలాగా కనబడుతుంది. దళితుల ఐక్యత, దళిత సంక్షేమం, దళిత హక్కులు, కుల నిర్మూలన గురించి సర్వత్రా చర్చలు జరుగుతున్న ఈనాటి సందర్భంలో ఈ అంశాల పూర్వాపరాలను యాభై సంవత్సరాల క్రితమే ధర్మం కోసం పోరాటం గ్రంథంలో భీమన్న విస్తృతంగా చర్చించాడు.

కుల సమస్య తీవ్రత, దళితుల స్వీయ ఉద్ధరణ, వర్గ కుల పోరాటాల వైఖరి, సాంస్కృతిక చైతన్యం, సంస్కరణ ఉద్యమాల వైఫల్యం, ప్రభుత్వ మార్కు సంక్షేమం, ప్రజాస్వామిక సోషలిజం వంటి

అంశాలను ఈ గ్రంథంలో భీమన్న శాస్త్రీయంగా విశ్లేషించాడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లక్ష్యాలను, ఆ మహనీయుడు ప్రతిపాదించిన రాజకీయ, సాంస్కృతిక విలువలను సామాన్య ప్రజలకు తేటతెల్లంగా చెప్పవలసి ఉంది అని భీమన్న బలంగా విశ్వసించాడు. అందుకే ఆయన బాబాసాహెబ్ బహుముఖీన ఔన్నత్యాన్ని తన రచనల ద్వారా ప్రామాణికంగా ప్రపంచానికి చాటి చెప్పాడు.

'గొంతెత్తి నీ పాట పలికింతునా / గంతేసి నీ బాట నడిపింతునా' అంటూ తన రచనల ద్వారా అంబేద్కర్‌కి నీరాజనాలు పలికాడు. అంబేద్కర్ విశ్వరూపం భీమన్న కవిత్వంలో సాక్షాత్కరిస్తుంది. అంబేద్కర్ ఆంధ్రదేశ పర్యటన సందర్భంగా (1944లో జరిగిన సభలో) డా. బోయి భీమన్న అంబేద్కర్ గురించి ఆంగ్లంలో కవిత చదివి ఆ మహనీయుని ప్రశంసలు అందుకున్నాడు. కలకత్తా నుండి వెలువడే పీపుల్స్ హెరాల్డ్ పత్రిక భీమన్న కవితను సంపాదకీయంగా ప్రచురించింది. సంప్రదాయ వాదులు పదే పదే చెప్పే ధర్మం అనే మాటకు ఆయన సరికొత్త నిర్వచనం చెప్పాడు. ధర్మం అంటే సర్వమానవ సమానత్వమే. అంబేద్కర్ అభిలషించిన సమతా మార్గాన్ని అనుసరించటమే ఈనాటి ఏకైక సాంఘిక ధర్మమని భీమన్న ప్రతిపాదించాడు.

"లంచం పుచ్చుకున్న లక్ష రూపాయిల కంటే ఒక్క తుపాకి బలమైనది. తుపాకులు పుచ్చుకున్న లక్ష మంది సైన్యం కంటే ఒక్క ఆటంబాంబు బలమైనది. లక్ష ఆటంబాంబుల కంటే కార్మికుని చెమట బొట్టు బలమైనది. లక్ష మంది కార్మికుల చెమట బొట్ల కంటే ఒక మార్క్స్ సిద్ధాంతం బలమైనది" (ధర్మం కోసం పోరాటం) అని విశ్లేషించి, మార్క్స్ కంటే మహాత్ముడి రాజనీతి, మహాత్ముడి రాజనీతి కంటే అంబేద్కర్ సమతా ధర్మం ఉన్నతమైనదని భీమన్న వాదించాడు. అంబేద్కర్ తాత్త్విక చైతన్యానికి జేజేలు పలికాడు. అంబేద్కర్ జీవిత ప్రస్థానాన్ని, ఆయన పోరాట నైజాన్ని, ఉద్యమ స్వభావాన్ని 'అంబేద్కర్ సుప్రభాతం' అనే పద్య కావ్యంలో ప్రభాశీలంగా ఆవిష్కరించాడు. అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని, ఆయన ప్రబోధాలను, ఆలోచనల సారాంశాన్ని వివేచిస్తూ వందకు పైగా పాటలు రచించి (పాటల్లో అంబేద్కర్) ప్రజల్లో భీమ చైతన్యాన్ని రగిలించాడు.

"జయ జయ అంబేద్కర / జయ దళిత జనస్వరా / జయ భారత భాస్కరా" అనే భీమన్న పాట ఆరు దశాబ్దాలుగా తెలుగు ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తుంది. "అడుక్కుంటే దొరికేది ఎంగిలి / అదిలిస్తే లభించేది అధికారం" అంటూ భీమన్న అంబేద్కర్ నిర్దేశించిన 'మాస్టర్ కీ' విశిష్టతను జాతి జనులకు చాటిచెప్పాడు. 'అంబేద్కరిజం', 'అంబేద్కర్ మతం' వంటి వచన రచనల్లో ఆ మహానాయకుడిని అనుసరించవలసిన ఆవశ్యకతను, ఆయన ఆశించిన సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్య దృష్టిని భీమన్న నిశితంగా విశదపరిచాడు.

'అంబేద్కర్ శరణం గచ్ఛామి' అంటూ భీమన్న ఈ యుగానికి ఒక నినాదాన్ని అందించాడు. అంబేద్కరిజానికి బద్ధ వ్యతిరేకమైన "గో బ్యాక్ టు వేదాస్" అంటూ భీమన్న సంచలనాత్మకమైన పిలుపునిచ్చాడు. వేద కాలంలో కులం లేదని, వృత్తి గతంగా మాత్రమే మనిషికి గుర్తింపు ఉండేదని భీమన్న నమ్మకం. ఇలాంటి వైరుధ్యాలు కూడా భీమన్న సాహిత్యంలో కనబడతాయి.

భీమన్న అత్యాధునిక సాహిత్య భీష్ముడు. కౌరవుల సార్వభౌమాధికారాన్ని అంగీకరిస్తూనే భీష్ముడు పాండవుల విజయాన్ని అభిలషించినట్లుగా భీమన్న కూడా వైదిక సమాజ వైభవాన్ని కొంతవరకు

ఆమోదిస్తూనే అంబేద్కర్ తాత్త్విక చైతన్యం భారతదేశంలో విస్తరించాలని ఆకాంక్షించాడు. కేవలం దళిత చైతన్యం దగ్గరే భీమన్న ఆగిపోకుండా మానవతా వాదం, ప్రేమ తత్వం, జాతీయ దృష్టి, ప్రగతిశీల దృష్టి వంటి విశ్వజనీన ఆలోచనలను కూడా భీమన్న అద్భుతంగా కవిత్వీకరించాడు. సామాజిక శాస్త్రవేత్తలా అనేక అంశాలను తన సాహిత్యంలో ప్రస్తావించాడు.

జాషువ, శ్రీశ్రీల సాహిత్య వ్యక్తిత్వాన్ని వివేచిస్తూ ఆయన వెలువరించిన గ్రంథాల్లోను, తన కావ్యాలకు రాసుకున్న సుదీర్ఘమైన విశ్లేషణాత్మకమైన స్వీయ పీఠికల్లో భీమన్న పరిణత విమర్శకునిగా కనిపిస్తాడు. శైవ వైష్ణవుల మధ్య రగులుతున్న మత వైషమ్యాలను నివారించడంకోసం తిక్కన హరిహరాద్వైతాన్ని సృష్టించినట్లుగా, మాల, మాదిగ అనే ఉపకుల నామాలకు ప్రత్యామ్నాయంగా భీమన్న 'మామాలు' అనే పదాన్ని ప్రతిపాదించి 'నేను మా మాల ఋషిని' అనే ఎంతో ఉదాత్తంగా తెలియజెప్పాడు.

లక్ష ఎకరాల పొలాన్ని దోసెడు నీళ్ళతో సాగు చేయటానికి ప్రయత్నించడం ఎలాంటిదో దళితుల ప్రగతికి నేడు జరుగుతున్న కృషి అలాంటిదని ఆయన విమర్శించాడు. భూమిని, వ్యవసాయాన్ని, పరిశ్రమలను జాతీయం చేస్తేనే భారతదేశంలో ప్రజాస్వామ్య సోషలిజం ఆవిర్భవిస్తుందని భీమన్న పిలుపునిచ్చాడు. **"విశ్వ పరిణామున జరిగే / విప్లవమ్ముల నేది ముందుకు పోవునో / అదే నాకు నిలయము"** అని చెప్పిన భీమన్న సంస్కృతిక విప్లవ ఋషి. జాషువ అన్నట్లు 'తళుకుల్ బెళ్కులు గలుగు మేలైలుగు శబ్దశ్రేణితో ఆధునిక సాహిత్యానికి ప్రాణ చైతన్యాన్ని అందించాడు. ఆధునిక సాహిత్యంలో భీమన్న సాహిత్యం 'దీపసభ'లాగా కాలాన్ని కాంతిమంతం చేస్తుంది. అత్యంత స్ఫూర్తిదాయకమైన ఆయన సృజన కవిపండిత లోకానికి 'దారిదీపం'లా నిలుస్తుంది.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

రాగవాసిష్ఠం – నాటక వైశిష్ట్యం: జాతీయ సమైక్య దృక్పథం

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
పూర్వ శాఖ అధ్యక్షులు, తెలుగు శాఖ,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
సెల్ : 9989628049

పరిశోధన పత్రం సారాంశం (Abstract)

ఈ పరిశోధన పత్రం పద్మభూషణ్ బోయి భీమన్న గారు రచించిన 'రాగవాసిష్ఠం' (1959) నాటకంలోని సామాజిక, చారిత్రక, జాతీయ సమైక్యతా కోణాలను విశ్లేషిస్తుంది. పురాణ ప్రసిద్ధమైన అరుంధతీ–వసిష్ఠుల ప్రణయ గాథను ఇతివృత్తంగా తీసుకున్నప్పటికీ, దీని వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం భారతదేశంలోని కుల వివక్షను రూపుమాపడం, ఆర్య–అనార్య సిద్ధాంతాలలోని అపోహలను తొలగించడం. డా. బి.ఆర్. అంబేద్కర్ గారి సామాజిక సిద్ధాంతాల ప్రభావంతో భారతీయులందరూ ఒకే మూలార్య జాతికి చెందిన వారని, కుల భేదాలు కేవలం వృత్తిరీత్యా, స్వార్థపూరిత రాజకీయాల వల్ల ఏర్పడినవేనని ఈ నాటకం నిరూపిస్తుంది. నాటకంలోని పాత్రల విశ్లేషణ, పౌరాణిక ఇతివృత్తానికి జోడించిన అభ్యుదయ భావజాలం, రచయిత ప్రతిపాదించిన విశ్వజనీన మానవతావాదాన్ని ఈ వ్యాసం సవివరంగా చర్చిస్తుంది. కుల రహిత సమాజమే దేశ సమైక్యతకు పునాది అనే సత్యాన్ని ఈ నాటకం ఎలా చాటిచెప్పిందో ఈ పత్రం వివరిస్తుంది.

కీలకాంశాలు (Keywords)

రాగవాసిష్ఠం, ఆర్య–అనార్య సిద్ధాంతం, జాతీయ సమైక్యత, సామాజిక విప్లవం, అరుంధతీదేవి, వసిష్ఠుడు, మతంగ మహర్షి వంశం, బోయి భీమన్న.

పరిశోధన పద్ధతి: సామాజిక–సైద్ధాంతిక విశ్లేషణ

ఈ పరిశోధన పత్రం ప్రధానంగా వివరణాత్మక (Descriptive) మరియు విశ్లేషణాత్మక (Analytical) పరిశోధన పద్ధతుల కలయికగా సాగింది. ఇందులో పాటించిన ముఖ్యమైన అంశాలు ఇవే:

- ★ **తులనాత్మక అధ్యయనం (Comparative Study):** పురాణాల్లోని అరుంధతీ వసిష్ఠుల మూల కథకు, బోయి భీమన్న గారు నాటకంలో చేసిన మార్పులకు మధ్య గల తులనాత్మకతను ఇందులో చర్చించారు. పాత కథకు సామాజిక అవసరాల రీత్యా ఇచ్చిన కొత్త ముగింపును విశ్లేషించారు.
- ★ **సైద్ధాంతిక అన్వయం (Theoretical Application):** డా.బి.ఆర్. అంబేద్కర్ గారు ప్రతిపాదించిన 'ఆర్య–అనార్య' సిద్ధాంతాన్ని, వర్ణ వ్యవస్థ పుట్టుకకు సంబంధించిన చారిత్రక అంశాలను ఈ నాటక పాత్రలకు, సన్నివేశాలకు అన్వయించి పరిశోధించారు.
- ★ **అంతర్విద్యా దృక్పథం (Inter-disciplinary Approach):** సాహిత్యాన్ని కేవలం ఒక కళాఖండంగానే కాకుండా.. చరిత్ర, సామాజిక శాస్త్రం, మానవ శాస్త్రాల వెలుగులో విశ్లేషించారు. వేదాలు, మనుస్మృతి వంటి గ్రంథాలలోని శ్లోకాలను ఉదహరిస్తూ సాహిత్యానికి ఉన్న సామాజిక బాధ్యతను నిరూపించారు.
- ★ **శిల్ప మరియు వస్తు విశ్లేషణ (Textual Analysis):** నాటకంలోని 12 రంగాలు, పాత్రల ప్రతీకాత్మకత (ఉదాహరణకు కులగిరి, సంధ్య పాత్రలు), నాటక శిల్పంలో రచయిత పాటించిన ప్రత్యేకతలను నిశితంగా పరిశీలించారు.
- ★ **గుణాత్మక పరిశోధన (Qualitative Research):** నాటకం ద్వారా సమాజానికి అందే సందేశం ఏమిటి? అది 'జాతీయ సమైక్యత'కు ఎలా తోడ్పడుతుంది? అనే అంశాలపై గుణాత్మకమైన చర్చను ఈ పత్రం చేపట్టింది.

ఉపోద్ఘాతం:

పురాణ ప్రసిద్ధమైన అరుంధతీ – వసిష్ఠుల ప్రణయగాథను ఆధారంగా చేసుకొని వచ్చిన నాటకమే రాగవాసిష్ఠం దీన్ని బోయి భీమన్న గారు 1959లో రాశారు. 12 రంగాలు గల ఈ నాటకం రావడం వెనుక కుల సమస్యను, దళితుల సంస్కృతీ పరమైన విషయాలను చర్చించాలనే లక్ష్యం కనిపిస్తుంది. భారతదేశంలో ఆర్య– ద్రావిడ జాతుల పుట్టుకకు సంబంధించిన చారిత్రక లోతులెన్నో ఈ నాటకంలో ఉన్నాయి. పౌరాణిక ఇతివృత్తాన్ని తీసుకొని సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యను లోతుగా చర్చించి, "భారతీయులంతా ఒక్కటే" అనే జాతీయతా వాదాన్ని స్థాపించే నాటకంగా దీన్ని అభివర్ణించవచ్చు.

రాగవాసిష్ఠం నాటకం – రచనా నేపథ్యం

నెల్లూరులో1957లో రాష్ట్ర హరిజన సేవా సంఘం మహాసభలు జరిగాయి. ఆ సంఘం ఆధ్వర్యంలోనే హరిజన కవులకు సన్మానాలు కూడా చేయాలనుకున్నారు. ఆ సన్మాన సభలో బోయి

భీమన్న గారు పాల్గొన్నప్పుడు, ఆ సభలో అధ్యక్షుడు మాట్లాడిన మాటలకు సమాధానంగా ఈ నాటకం రూపొందిందని హైమవతీ గారు పేర్కొన్నారు (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు,బోయి భీమన్న, 1982: 324) అయితే, రచయిత జీవితం, సాహిత్య విషయాల గురించి కథనాత్మక శైలిలో సాగిన హైమవతీ గారి రచన పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్నలో ఈ నాటకానికి భీమన్నగారు రాసిన ముందుమాట గురించిన ప్రస్తావన గురించి కూడా కనిపిస్తుంది "హరిజనులు ఆదిమ వాసులైనా, ఆర్యులు వారిని జయించిన తర్వాత బానిసలుగా మారారనీ, అలాగే చచ్చిన గొడ్లను తినడం వల్ల వెలికి గురికాబడ్డారనే" ప్రచారం జరుగుతుండటాన్ని భీమన్నగారు అంగీకరించలేదు ఖిపాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982: 327ర. దానికి తనదైన వాదాన్ని వినిపించాలనుకున్నారు.

దాని కోసం వేదాలు, మనుస్మృతి, అమరకోశం, రామాయణ మహాభారతాలు, ప్రాచీన సాహిత్యం లోతుగా అధ్యయనం చేశానని కవి చెప్పుకున్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ రచనలను చదివారు. మంగిపూడి వేంకటశర్మగారు రాసిన నిరుద్ధ భారతం భీమన్న గారి "హరిజనులు ఆర్యులే" అనే సిద్ధాంతానికి గొప్ప ప్రేరణనిచ్చిందని రచయితే చెప్పుకున్నారు. నిరుద్ధ భారతం "భారత జాతి సమైక్యాన్ని నిజంగా కాంక్షించే ప్రతి వ్యక్తికీ పారాయణ గ్రంథం"గా కూడా భీమన్న గారు ఆ కావ్యాన్ని వ్యాఖ్యానించారు. ఆ కావ్యాన్ని భీమన్నగారు విద్యార్థి దశలోనే చదువుకున్నారు. ఆ కావ్యమే ఈ నాటకాన్ని రాయడానికి పురికొల్పిందని నాటక రచనా నేపథ్యాన్ని దాని ముందుమాటలో చెప్పుకున్నారు.

పై అంశాలను బట్టి ఈ నాటకం ఒక సామాజిక సమస్యకు పరిష్కారాన్ని లేదా ఒక సమన్వయాన్ని అందించే గురుతర బాధ్యతతో రాయబడిందని తెలుస్తుంది.

వస్తు వైవిధ్యం

అరుంధతీదేవి కథ పురాణ ప్రసిద్ధమైనదని ముందే చెప్పుకున్నాం. అయితే, పురాణాల్లో ముఖ్యంగా శ్రీదేవీ భాగవతం, శివపురాణం, భాగవతం, భారతం తదితర పురాణేతిహాసాల్లో వసిష్ఠుని గురించి చెప్పే కథా సందర్భంలో ఆయన ధర్మపత్నిగా అరుంధతీదేవి ప్రస్తావన వస్తుంది.అరుంధతీదేవి గురించి ప్రచారంలో ఉన్న కథల్లో పాఠకులకు రకరకాల అనుమానాలు కూడా వ్యక్తమవుతుంటాయి. ఆ పద్ధతిలోనే అరుంధతీదేవికి సంబంధించిన కథలు పుస్తక రూపంలో కనిపిస్తున్నాయి. ఆమె పుట్టు పూర్వోత్తరాల గురించి స్పష్టంగా వివరించకపోయినా, ఆమె ఒక చండాల వంశానికి చెందిన స్త్రీగానూ, గొప్ప సత్యవంతురాలు, పతివ్రతా ధర్మం గల స్త్రీ అని ఎంతో మంది వర్ణించారు. అరుంధతీదేవి చరిత్రము పేరుతో నములకంటి జగన్నాథం గారు 1968లో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. అలాగే 1992లో డా.బి.వి.ఎస్.మూర్తి దళిత కథామంజరి పేరుతో రాసిన అస్పృశ్య జాతుల్లో పురాణ పురుషుల కథల్లో 'అరుంధతీదేవి' కథ ఒకటి ఉంది. ఎండ్లూరి సుధాకర్ గారు ఆరంజ్యోతి పేరుతో ఒక కథ రాశారు. ఇంకా మరికొన్ని పుస్తకాల్లో ఆల్వాల్ మల్లేష్ రాసిన అరుంధతీయ చరిత్రము కూడా పేర్కొనదగినదే! అయితే, వీటన్నింటిలోనూ అరుంధతీదేవి – వసిష్ఠుల కథను పవిత్రంగా వర్ణించడమే తప్ప, ఆ కథను ఒక ప్రత్యేకమైన సైద్ధాంతిక భూమికతో రాసినట్లు కనబడదు.

బోయి భీమన్న గారు మాత్రం అరుంధతీదేవి కథను ఆర్య – అనార్య భేదాలను చర్చించి, శూద్రులు, చండాలురు, మాల, మాదిగల వంటి పేర్లతో పిలిచే వారంతా ఈ దేశ మూల వాసులే

కాకుండా, అసలైన ఆర్య జాతీయులవుతారని వాదించే దిశగా ఈ నాటకాన్ని పౌరాణిక – సాంఘిక నాటకంగా తీర్చిదిద్దారు. ఆ విధంగా రచయిత నాటకేతివృత్తంలో వస్తు వైవిధ్యాన్ని సాధించారు.

ఈ రాగవాసిష్ఠం నాటకంలో మరో ప్రత్యేకత ఏమిటంటే పాత్రల పేర్లను కూడా ఎంతో ఔచిత్యంతో పెట్టారు. అరుంధతీదేవి – వసిష్ఠులు పౌరాణిక పాత్రలు. పరమ శివుడు దైవీయమైన పాత్ర.. ఇక, ప్రాచీనుడు, కులగిరి, సంధ్య, శివోహం, కుంభోదరం, గోష్పాదం వంటి పాత్రలన్నీ ప్రతీకాత్మకాలు. అవి ప్రకృతికీ, మానవుని స్థితిగతులకూ, వర్ణాహంకారానికి ప్రతీకలుగా రచయిత అభివర్ణించారు. కనుక, పౌరాణిక – సాంఘిక ఇతివృత్తంతో నాటకాన్ని వస్తు వైవిధ్యం దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

నాటక కథా సారాంశం

అరుంధతీదేవి ఒక అనార్య యువతి. వసిష్ఠుడు ఆర్య జాతీయుడు. వేదవనంలో తపస్సు చేసుకొంటున్న వసిష్ఠుడికి ఒకనాడు మధురమైన గీతం వినిపిస్తుంది. ఆ గీతం అతని మనసుని ఆకర్షిస్తుంది. పాడిందెవరని చుట్టూ పరికించి చూస్తాడు. సంధ్య అనే అమ్మాయి పాడిందా పాట. ఆమె అరుంధతీదేవికి సోదరి. ఆ పాట ద్వారా సంధ్యని, ఆమె ద్వారా అరుంధతీదేవినీ వసిష్ఠుడు కలుసుకొని, అప్రయత్నంగా సరస్సులో పడిపోయిన అరుంధతీదేవిని రక్షించడం ద్వారా అరుంధతీదేవి నివాసం ఉండే ఆశ్రమానికి చేరతాడు. ఇద్దరి మనసులు ఏకమవుతాయి.

అరుంధతీదేవి – వసిష్ఠుల ప్రణయం విషయం వసిష్ఠుడిని చిన్ననాటి నుండీ పెంచి పోషించిన ప్రాచీనుడికి తెలుస్తుంది. మొదట ప్రాచీనుడు ఆ ఇద్దరినీ చూసి పార్వతీ పరమేశ్వరులేమో అని భావిస్తాడు. తాము వసిష్ఠుడు – అరుంధతులమని వసిష్ఠుడు ప్రాచీనుడికి వివరిస్తాడు. అరుంధతీదేవి గురించి చెప్తాడు. ఆమె ఒక తాపస కన్య అనీ, ఈ పరిసర ఆశ్రమంలోనే ఉంటుందనీ వసిష్ఠుడు చెప్తాడు. ఆమె పేరు "అరుంధతీదేవి" అని చెప్పగానే, ప్రాచీనుడు "హరి హరీ! అంటరాని, చూడరాని, చెప్పరాని చండాల కన్య!" అనుకొంటూ తిరిగి వెళ్ళిపోతాడు.

ఆమె చండాల కన్యా? అని వసిష్ఠుడు ఆశ్చర్యపోతాడు. ఆ మాట వినగానే సాలభంజికలా కదలకుండా అయిపోతుంది అరుంధతీదేవి.

అక్కా! అక్కా! అంటూ సంధ్య పరుగెత్తుకొంటూవచ్చిఆ దృశ్యాన్ని చూసి సజల నేత్రాలతో నిలబడి పోతుంది.

ఆమెను అలాగే వదిలేసి వసిష్ఠుడు తన ఆశ్రమానికి వెళ్ళిపోతాడు. తనలో తాను తర్కించుకుంటాడు. అరుంధతీదేవి చండాలకన్యేనా? ఎంతటి దివ్య సౌందర్యమది? ఆమె ఉన్న ప్రతిచోటూ ఎంత ఆనందదాయకంగా ఉంది! ఎంత పవిత్రంగా ఉంది? ఎంత ప్రశాతంగా ఉందో కదా... అనుకొంటూ మళ్ళీ అరుంధతీదేవి ఆశ్రమానికి వెళ్ళాలని బయలుదేరతాడు.

వసిష్ఠుడికి ఎదురుగా కులగిరి అడ్డు నిలబడతాడు. వసిష్ఠుడిని ఆశ్రమాన్ని విడిచి వెళ్ళనివ్వవద్దని ప్రాచీనుడు తనతో చెప్పాడని అంటాడు.

అంతలో ప్రాచీనుడు వస్తాడు.
వసిష్ఠ– ప్రాచీనుల వాదనలు

మాల మాదిగలను వారి జన్మను చులకనగా మాట్లాడతాడు ప్రాచీనుడు. నత్తితో మాట్లాడే కులగిరి "బ్రహ్మజ్ఞానం" గురించి మాట్లాడుతుంటాడు. నత్తి నత్తిగా ఉచ్చారణా దోషాలతో మాట్లాడుతుంటాడు. యజ్ఞోపవీత ధారణ చేసినంత మాత్రం చేత అందరూ బ్రాహ్మణులవ్వరనీ, నిజానికి అటువంటి వాళ్ళు బ్రహ్మజ్ఞానం అనే మాటను ఉచ్చరించడానికే అర్హులు కారనీ వాదిస్తాడు వసిష్ఠుడు.

ఇరువురూ జాతి భేదాల గురించి వాదించుకుంటారు.

ఆర్యజాతి సంరక్షులమైన మనం, సమిష్ఠి క్షేమం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను తృణప్రాయంగా త్యజించాలని, అందువల్ల నీచ జాతితో పవిత్రమైన ఆర్యజాతిని సంకరం చేసి సర్వ నాశనం చెయ్యవద్దని ప్రాచీనుడు వసిష్ఠుడికి బోధిస్తాడు.

దీనితోవసిష్ఠుడు సంఘర్షణకు లోనవుతాడు.

ఈలోగా సంధ్య వసిష్ఠుడిని వెతుక్కొంటూ కులగిరి దగ్గరకు వస్తుంది. వసిష్ఠుడు ఆ ప్రాంతాన్ని వదిలి వచ్చేసినప్పటి నుండీ అరుంధతీదేవికి స్మృతి రాలేదని ఆమెను అతడొక్కడే రక్షించగలడని అనుకొంటుంది. వసిష్ఠుని గురించి వివరాలు అడుగుతుంది. అప్పటికే ఆ ఆశ్రమం వదిలి అరుంధతీదేవి ఆశ్రమం వైపుకే వసిష్ఠుడు వెళ్ళిపోయాడని కులగిరి చెప్తాడు.

తనకు వర్ణభేదంలేదనీ తన హృదయపు తలపులు మూసుకోలేదనీ అరుంధతీదేవి తన హృదయంలో ఉండి సర్వత్రా ఆమె ప్రతిబింబమే కనిపిస్తుందని తనలో తాను సమాధానం చెప్పుకుంటాడు వసిష్ఠుడు. అంతలో వసిష్ఠుని దగ్గర కొచ్చిన సంధ్యతో తాను క్షణంలో వచ్చేస్తాననీ, ఆమెను అరుంధతీదేవి దగ్గరకు వెళ్ళమని చెప్తాడు. "ఆర్య, అనార్య భేద భావాల్ని తునాతునకలు చేసి, ప్రాచీనుడి నోరు మూయించి, ఈ పారతంత్ర్య వాతావరణం నుంచి బైటికి దూకి వచ్చేస్తానని, తాను పొరపాటు చేసి, ఆమెను వదిలి వచ్చేశాననీ" పశ్చాత్తాప పడుతుంటాడు.

అంతలో మళ్ళీ ప్రాచీనుడు వస్తాడు.
అతడు వసిష్ఠుడిది స్త్రీ వాంఛ అని నిందిస్తాడు.

తనది స్త్రీ వాంఛ కాదనీ, తన జీవితం ప్రేమ యజ్ఞంలో బలయిపోయిందంటాడు.

ఇక, తపస్సు మానేసి గృహస్థాశ్రమానికి చేరమనీ, అప్పుడు గానీ కామం చల్లారదంటాడు ప్రాచీనుడు.

తనది కామం కాదంటాడు వసిష్ఠుడు. తపస్సు మానవలసిన పనిలేదనీ అంటాడు.

అయినా ఇప్పటికే మహా తపస్వివి. యౌవనస్థుడవు. కనుక ఇప్పటికైనా గృహస్థుడివి కమ్మంటాడు ప్రాచీనుడు. తగిన తేజోవతిని వివాహమాడి రాజయోగినిగా మారమని చెప్తాడు ప్రాచీనుడు.

అరుంధతీదేవి కంటే ప్రపంచంలో తేజోవతి లేదంటాడు వసిష్ఠుడు.

మసి బొగ్గుకి రత్నకాంతులు ఉంటాయా? అలాగే చండాల కన్యకు తేజస్సెక్కడిదని, ఆమెను తారామాత్రంగా చేయగల ప్రచండ రవి తేజస్విను లెందరో ఉన్నారంటాడు. అలా అనేసిగుప్పిటతో కొంత ఇసుకను పైకి తీసి "దీన్ని అన్నంగా వండి పెట్టగల కన్య నీకు అర్థాంగి కాగలదు. ఇక నీవు స్వేచ్ఛగా పోవచ్చని" వసిష్ఠుణ్ణి వదిలేసి ప్రాచీనుడు వెళ్ళిపోతాడు.

వసిష్ఠుడి ప్రణయవేదన – శివుని దర్శనం

ప్రాచీన ధర్మం కంటే ఇసుకే కొంత మెత్తగా కనిపిస్తుందనుకొంటూ, ఇసుకను అరుంధతీదేవి వండక పోతే తాను మరో స్త్రీని పెండ్లాడడం జరుగుతుందా? అయినా ప్రేమకు పరీక్ష పెట్టడమేమిటని తనకి కావాలసింది అరుంధతీదేవి. అంతే తప్ప ఓ స్త్రీ మాత్రమే కాదనీ అనుకుంటాడు. ఇసుకను పారబోసేస్తాడు.

అక్కడ అరుంధతీదేవి తపస్సులో నిమగ్నమై పోతుంది.

వసిష్ఠుడు అరుంధతీదేవినే తలచుకొంటూ, మానసిక సంఘర్షణకు గురవుతుంటాడు.

ఆనాటి నుండి అరుంధతీదేవి ఉండే వేదవనంలోని ఆశ్రమం తప్ప, మిగిలిన ఆశ్రమాలన్నీ కరువు కాటకాల పాలవుతాయి. ప్రజలు ఆకలికి తట్టుకోలేక మునులు కుక్కలను కూడా వదలరు. వాటితోనే తమ ఆకలి తీర్చుకుంటుంటారు.

ఈ పరిస్థితిని గమనించిన ప్రాచీనుడు తన శిష్యుడు కులగిరిని పంపి త్రిమూర్తుల దగ్గరకెళ్ళి సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోమంటాడు. బ్రహ్మ, విష్ణువు తమ చేతుల్లో లేదనీ పరమేశ్వరుడి దగ్గరకెళ్ళమంటారు. అప్పటికే ఈశ్వరుడు అరుంధతీదేవి ఆశ్రమానికి బయలుదేరతాడు.

అరుంధతీదేవినే తలచుకుంటూ వసిష్ఠుడు తాను తప్పు చేశాననీ, ఇక శాశ్వతంగా అరుంధతీదేవికి దూరమవ్వాలని అనుకుంటుంటాడు. తన తపస్సు వ్యర్థమనుకుంటాడు. అది ఇసుక తుఫానులో చేసిన తపస్సులాంటిదని అనుకుంటాడు. తనకి మరణమే శరణ్యమనుకుంటాడు.

ఆ సమయంలోనే సాధారణ మానవుడిలాగే ఈశ్వరుడు అతడికి ప్రత్యక్షమవుతాడు.

ఆ స్థితిలో వసిష్ఠుడు ఈశ్వరుడిని గుర్తించలేదు. తన ప్రేమ సఫలం కానందుకు మరణించాలనుకుంటున్న వసిష్ఠుడిని శివుడే పలకరిస్తాడు. చైతన్యంతో జీవించడంలోనే నిజమైన పురోగతి దాగి ఉందని ఎంత చెప్పినా వినిపించుకోకుండా వెళ్ళిపోవాలనుకున్న వసిష్ఠుణ్ణి తన చేతితో స్పర్శిస్తాడు శివుడు. ఆ స్పర్శతో అతడు నూతన చైతన్యం పొందుతాడు. అయినా తన దారిని తనని పోనిమ్మంటాడు. అయితే అతనిదేదో భగ్న హృదయంలా ఉందనుకుంటాడు శివుడు. ఆ పూర్వాపరాలను అడగకుండానే, అతణ్ణి అంత కఠినంగా హింసించిన ఆ ప్రియురాలెవరని మాత్రం అడుగుతాడు. ఆమె మృదుస్వభావురాలేననీ, తానే కఠినాత్ముడిననీ వసిష్ఠుడు వివరిస్తాడు. తనది ఆర్యజాతి అనీ అనార్య జాతి కన్యను ప్రేమించాననీ చెప్తాడు వసిష్ఠుడు.

దానితో శివుడు అసలు భారతదేశంలో అలాంటి భేద భావమే లేదనీ ద్రావిడులు ఆర్యులు ఒకే జాతివారనీ స్పష్టం చేస్తాడు. భారతీయులదంతా దితి, అదితుల సంతానమే కదా అనీ చెప్తాడు. వెంటనే

మళ్ళీ అది కూడా కేవలం "పెరుగుదలలో పరిసరాల ప్రాబల్యం మినహాయిస్తే, మానవ జాతి అంతా ఒక్కటే కదా?" అంటాడు.

దీనితో తన అజ్ఞానం క్షమార్హం కాదని తపిస్తుంటాడు వసిష్ఠుడు. పొరపాటు చెయ్యడం మానవ లక్షణమనీ దాన్ని సరిదిద్దుకోవడానికి పశ్చాత్తాపమే సరైన మార్గమని వివరిస్తాడు శివుడు. తన తప్పుని సరిదిద్దుకుంటానని వసిష్ఠుడు శివుడికి చెప్పి వెంటనే శివుణ్ణి వదిలేసి అరుంధతీదేవి దగ్గరకు వెళ్ళిపోతాడు. ధన్యుడవయ్యావంటూ శివుడు వసిష్ఠుణ్ణి దీవిస్తూ నిలబడతాడు.

ఇంతలో సంధ్య శివుడి దగ్గరకొచ్చి లోకాలన్నీ తమరినే వెతుకుతున్నాయని అంటుంది. శివుడిని సంధ్య తన అక్క అరుంధతీదేవి తపస్సు చేసుకుంటున్న ఆశ్రమానికి తీసుకొని వెళుతుంది.

మార్గ మధ్యలో ప్రజలు, గోష్పాదం, కుంభోదరం, మునులు కనిపిస్తారు. తాము ఆకలితో అల్లాడుతున్నామనీ కరువుని తీర్చమనీ అంటారు. శివుడితో వస్తున్న సంధ్యను వాళ్ళు మొదట పార్వతీదేవి అనుకుంటారు. తర్వాత కులగిరి గుర్తిస్తాడు. మాదిగ పిల్లను శివుడు ముట్టుకుంటున్నాడంటాడు. శివుడు మైల పడిపోతున్నాడని గోష్పాదం, కుంభోదరం అతని మాటకు జత కలుపుతారు. చావనైనా చస్తాం గానీ మైలపడిన చేత్తో తమకేమిచ్చినా తీసుకోమంటారు.

మరొక వైపు ప్రజలు ఆకలీ... ఆకలీ అని అరుస్తుంటారు.

"ప్రజలారా! మీరెంతకాలం కుల మత వర్గ విభేదాలతో అజ్ఞానులై ప్రవర్తిస్తారో అంతకాలం మీకీ అరిష్టాలు తప్పవు. ఇక ప్రస్తుతానికి మిమ్మల్ని ఈ విపత్తునుంచి రక్షించగలవారు ఒక్క పతివ్రతలు మాత్రమే. మీరు పోయి పతివ్రతలను ఆశ్రయించండి. మీకింత భిక్ష పెట్టగలర"ని అంటాడు శివుడు.

అక్కడే దూరంగా ఉన్న ప్రాచీనుడు వర్ణాధిక్యతతో ఈశ్వరుడిని కూడా గుర్తించలేని స్థితిలో ఉంటాడు. "మాదిగ పిల్ల తపస్సు చేయడం! ఉత్పాతాలు సంభవించడం! ఎంత విపరీతంగా వుంది. ఇక ఆర్య జాతి అడుక్కు తిన్నట్టే!" అనుకుంటుంటాడు.

కొంచెం దూరం వెళ్ళిన తరువాత సంధ్యా పరమశివులను చూస్తాడు. కానీ వాళ్ళిద్దరినీ అరుంధతీదేవి వసిష్ఠులనుకుంటాడు. తన మాట వినకుండా వశిష్ఠుడు మాదిగ పిల్లనే చేరాడనుకుంటాడు. అందువల్లనే ధర్మగ్లాని ఏర్పడిందనుకుంటాడు. ఈ ఘోరకలిని చూడలేననుకుని ముఖం తిప్పుకుంటాడు. ఈ స్థితిలో వస్తున్న పరమశివుడే ప్రాచీనుడికి అభివాదం చేస్తాడు. ప్రాచీనుడు పరీక్షగా చూసి తమర్ని గుర్తుపట్టలేదంటాడు. తనని పరిచయం చేసుకుంటాడు. ప్రాచీనుడు అప్పుడు పరమ శివుడికి నమస్కరించి ఆ పక్కనున్న సంధ్యను పార్వతీదేవేనా అని అడుగుతాడు. తాను పార్వతీదేవిని కాదనీ, అరుంధతీదేవి తన అక్క అనీ శివుడు తనకు తాత అవుతాడని సంధ్య ప్రాచీనుడికి వివరిస్తుంది.

ఆ సంభాషణకీ, సంబంధానికీ ఆశ్చర్యపోయి వాటి పూర్వాపరాలను అడుగుతాడు ప్రాచీనుడు.

తమది ఆద్యార్య సంబంధమనీ, అరుంధతీదేవి మాతంగ కన్య అయినట్లే, కాటికాపరి అయిన పరమేశ్వరుడు కూడ మాతంగుడేననీ చెబుతుంది.

తమతో వేళాకోళంగామాడుతున్నారేమోననే సందేహాన్ని వ్యక్తం చేస్తాడు ప్రాచీనుడు.

ఇది వేళాకోళం కాదనీసత్యమేననీచెప్తాడు శివుడు. "అధికారం కోసం ఆర్య ద్రావిడుల మధ్య జరిగిన అనేక యుద్ధాల పర్యవసానంగా సమాజంలో హెచ్చు తగ్గు లేర్పడ్డాయి. గుణాలను అనుసరించి వృత్తులు పుట్టాయి. వృత్తులను అనుసరించి వర్ణాలేర్పడ్డాయి. అవే కులాలైనాయి. మతంగ మహర్షి సంతానం మాల మాదిగలు. మతంగుడు ఆర్య ద్రావిడ సమైక్యతా మూర్తి. ఆర్య ద్రావిడులు మూలార్య జాతి శాఖలు. అన్నదమ్ములు. ఈ భేదాలు తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ సముద్రంలో పుడుతూ పోతూ వుండే అలల వంటివని తెలిసికూడా, మీ వంటి పెద్దలు వీటిని పాటించబూనడం కడుంగడు శోచనీయం" అని స్పష్టంగా వివరిస్తాడు.

ఈ భేద భావాలు స్వార్థం కోసం మానవులు సృష్టించుకున్నవనే కనీస జ్ఞానం తనకు కలగనందుకు సిగ్గుపడుతూ మౌనంగా ఉండిపోతాడు ప్రాచీనుడు.

ఆకాశం తెల్లని మేఘాలతో పొగలు వ్యాపించి ఉంటుంది. అదంతా అరుంధతీదేవి తపస్సు వల్ల కలిగిన పొగలుగానే ప్రజలు భావిస్తుంటారు.

అరుంధతీదేవి – వసిష్ఠులపునఃసంయోగం

అరుంధతీదేవి తపస్సు తీవ్రమై, ఆ తపోవహ్నిలో భగ్నమవుతుందేమోనని, ఆమె తమ్ముడు శివోహం ఒక పాత్రతో నీళ్ళు పట్టుకొని ఆమె చుట్టూ తిరుగుతుంటాడు.

వసిష్ఠుడు ఆకాశంలో కనిపిస్తున్న దివ్యజ్యోతిని చూసి ఆశ్చర్యపోతూ ఆందోళన పడుతుంటాడు. "తపోవహ్నిలో భస్మమైపోతున్నావా అరుంధతీదేవీ" అంటూ విలపిస్తూ తానూ యోగవహ్నిలో చితాభస్మమైపోతానని అతడు యోగ ముద్ర ధరిస్తాడు. శరీరంలో నుండి మంటలు బయలుదేరతాయి. భస్మం వాసన గుప్పుమంటుంది.

పరమశివుడు ప్రవేశించి ఈ మహా చరిత్ర విషాదాంతం కారాదని, తన దగ్గరున్న కమండలంలోని తీర్థం తీసి ఇద్దరి మీదా చల్లుతాడు.

తపోవహ్నిచల్లారిపోతుంది.
కన్నులు తెరచిన అరుంధతీదేవి, పక్కనే ఉన్న వసిష్ఠుణ్ణి చూసి పాదాభివందనం చేస్తుంది.

ఆ తరువాత పరమశివుణ్ణి చూసి భక్తి భావంతో నమస్కరిస్తుంది. తానెంత అదృష్టవంతుణ్ణో కదా అని వసిష్ఠుడు మురిసిపోతాడు.

"కల్యాణ మస్తు" అని ఇరువురినీ పరమశివుడు దీవిస్తాడు. అరుంధతీదేవి తన పక్కనే ఉన్న ప్రాచీనుడికి నమస్కరించి, ఆశీర్వాదాలు కోరుతుంది.

అతడూ ఆమెను దీవిస్తాడు.

నమస్కరించిన వసిష్ఠుడినీ ప్రాచీనుడు దీవిస్తాడు.

పరమశివుని అనుగ్రహంతో జ్ఞానినైయ్యానని చెప్పి వెళ్ళిపోతాడు.

అప్పుడు వసిష్ఠుడు పరమశివుని పాదాలపై పడతాడు. ఏదైనా వరం కోరుకోమన్న శివుడితో తనకు అరుంధతీదేవిని అగ్ని సాక్షిగా వివాహం చేయమంటాడు వసిష్ఠుడు.

ఇద్దరినీ దగ్గరకు చేరదీసి ఒకటి చేస్తాడు శివుడు.

ఇంతలో ప్రజలు, మునులు, ముని శిష్యులు కొన ఊపిరితో వస్తారు. "ఆకలి తీర్చే వాళ్ళే దొరకలేదా" అని పరమశివుడు అడుగుతాడు. దానితో వాళ్ళు ఆకలి తీర్చేవాళ్ళే దొరకలేదని, ఈ పాపాత్ములకు అన్నపూర్ణ ఎక్కడ కనపడుతుందని పశ్చాత్తాప్పడతారు.

అరుంధతీదేవి "ఈ ప్రజలింత దీనావస్థలో ఉండటానికి కారణం ఏమిట" ని పరమశివుణ్ణి అడుగుతుంది.

అదంతా అరుంధతీదేవికి జరిగిన పరాభవ ఫలితమేననీ, ప్రజల్ని రక్షించమని పరమశివుడు అరుంధతీదేవికి చెప్తాడు.

ప్రజలంతా మాదిగల అన్నం తింటారా? అని సంధ్య అడిగితే, "తింటాం తింటాం" అంటారు.

"దేవీ! నీవే ఈ ప్రజల్ని రక్షించగలవ"నివసిష్ఠుడు కూడా చెప్తాడు.

అప్పుడు వసిష్ఠుడి పాదధూళిని తీసుకొని తాను పతిభక్తి గలదాన్నయితే, అన్నపూర్ణమ్మకు నా పట్ల దయ ఉంటే కొండ రాళ్ళన్నీ పిండి వంటలుగా మారాలనీ, చెట్లన్నీ ఫలించాలనీ, చెరువులన్నీ మంచినీళ్ళతో నిండాలని కోరుకుంటుంది.

అలాగే జరుగుతుంది. ప్రజలంతా ఆనందిస్తారు.

"ఇంత గొప్ప మహాత్కార్యాన్ని సాధించినందుకుగానూ ద్యోమండలంలో నీ నాథుని దగ్గరే ఒక శాశ్వత స్థానం లభించేటట్లు వరం ప్రసాదిస్తున్నాను. లోకంలోని ప్రతి నూతన దంపతులు ముందుగా నీకే నమస్కరించి, నీ ఆశీస్సులు పొందుతారు, వైదిక భారతీయులకూ, భారత వంశానికీ మాతవుకాగలవనీ" అరుంధతీదేవిని దీవిస్తాడు శివుడు.

ఆ విధంగా నాటకం సుఖాంతమవుతుంది.

ప్రజలందరికీ శ్రేయస్సుని కలిగించి సుఖాంతమూ అవుతుంది. భగవంతుడే ప్రత్యక్షమైనా, భర్తనే ముందుగా పూజించడం, తర్వాత భగవంతుణ్ణి, ఆ తర్వాత పెద్దల్ని గౌరవించడంలో అరుంధతీదేవి సనాతన సంప్రదాయాన్ని చక్కగా పాటించినట్లు రచయిత వర్ణించారు.

నాటక రచనా విధానం

నాందీ, ప్రస్తావనల కంటే, నాటకాన్ని 12 రంగాలుగా విభజించి, మొదటి రంగంలోనే జరగబోయే కథను చక్కగా సూచించగలిగారు. నాటక ప్రదర్శనలో పంచసంధులను ఉపయోగించుకున్నారు..

"మేలుకో మేలుకో" పాటతో వసిష్ఠుడు తపస్సు నుండి మేల్కొనడం, మూఢత్వాన్ని వదిలి జ్ఞానం వైపు పయనించడం జరిగింది. సంధ్య ద్వారా పరిచయమై, అరుంధతీదేవిని చేరి, జలగండం నుండి

రక్షించినట్లు మొదటి రంగాన్ని బట్టి తెలుస్తుంది. జలగండాలేమైనా సంభవించినప్పుడు వాటి నుండి రక్షించుకోవడానికి యోగ ముద్రను దాల్చవచ్చనీ అలా అరుంధతీదేవి చేసిందన్నట్లు రంగాన్ని వర్ణించారు.

తరువాత కథలో కూడా ఇదే రకంగా జరుగుతుంది. వసిష్ఠుడిని ప్రేమించడం, ఆ విషయం ప్రాచీనుడికి తెలియడం. ఆమె చండాల కన్య అని వసిష్ఠుడికి, ప్రాచీనుడికీ తెలిసినా, ఆమెకు ఆ విషయం తెలియకుండానే సాలభంజికగా మారిపోవడం, మళ్ళీ సమస్య పరిష్కరింపబడిన తర్వాత ఆమె యోగ ముద్రను దాల్చడం, దాన్ని వీడటం వంటివన్నీ ఒక దాని తర్వాత మరొకటి జరిగిపోతాయి.

ఇది గొప్ప సంవిధానం. గొప్ప నాటక శిల్పం. నాందీ, ప్రస్తావనలు లేకుండానే పంచసంధులు, కార్యావస్థలతో కథా కథనాన్ని ముందుకి నడిపించడంలో ఉన్న శిల్పం ప్రత్యేకత. ఈ పరిశోధన పత్రంలో శిల్పానుశీలన కంటే విషయానుశీలనకే ప్రాధాన్యతనిస్తున్నాను.

గేయాలు – పద్యాలు

ప్రతి రంగంలోనూ సందర్భానుగుణంగా చక్కని భావాలతో గేయాలు, పద్యాలు వర్ణించారు. ఆ గేయాలు, పద్యాలు గొప్ప భావుకతతో పాటు, చైతన్యవంతమైన సందేశాలతో కూడి ఉన్నాయి. వీటన్నింటితో దీన్ని దృశ్య నాటకంగా ప్రదర్శిస్తే ఆధునిక సినిమాకి ఏ మాత్రమూ తీసిపోనట్లే ఉంది. సినిమా స్క్రిప్టులో ఉండే ఎన్నో రకాల పద్ధతులు దీనిలోనూ ఉన్నాయి.

పాత్రలు – సంఘర్షణ

ఈ నాటకంలో అరుంధతీదేవి, వసిష్ఠుడు, ప్రాచీనుడు, సంధ్య పాత్రలు ప్రధానమైనవి. వసిష్ఠుడు – ప్రాచీనుడు సంఘర్షణాత్మక పాత్రలు. సంప్రదాయాన్ని చెక్కు చెదరనీయకుండా కాపాడేందుకు ప్రాచీన ధర్మాలన్నింటినీ పాటించమని వాదించేవాడు ప్రాచీనుడు. స్నేహం, పరస్పర అవగాహన, మానవీయతా గుణాలే ప్రధానమని నమ్మి, వాటి ముందు జాతి భేదాలు నిలబడవని వాదించే స్వభావం వసిష్ఠుడిది. ఆర్ష సంప్రదాయానికీ, మార్పుని కోరుకొనే అభ్యుదయ వర్గానికీ మధ్య పాత్రోచితంగా గొప్ప సంఘర్షణ జరిగేటట్లు ఈ పాత్రలను తీర్చిదిద్దారు రచయిత.

కులగిరి ప్రాచీనుడి శిష్యుడు. సదాచారాన్నే నమ్ముకునేవాడు. నత్తి నత్తిగా మాట్లాడుతూ, వచ్చీ రాని శ్లోకాలతో పురాణేతిహాసాలను ప్రామాణిక వాక్యాలుగా చెప్తుంటాడు. అయినా, సందర్భాన్ని బట్టి గురువు దగ్గర కూడా అబద్దమాడడానికి వెనుకాడడు. మాదిగ లేదా కింది వర్ణాల వారిని వ్యతిరేకిస్తూనే, అందగత్తె అయితే, ఆమె మాదిగమ్మాయి అయినా, ఆమె వల్ల ఆనందం కలుగుతుందంటే దాన్ని పొందడానికి వెనుకాడని వాడు. అగ్రవర్ణమని చెప్పుకుంటూనే, కింది వర్ణాలనబడేవారిని అవసరానికి అనుగుణంగా ఎలా వాడుకుంటూ ఉంటారో కులగిరి పాత్ర ద్వారా రచయిత సూచించే ప్రయత్నం చేశారు.

సంధ్య పాత్ర ప్రకృతి చైతన్యానికి ప్రతీకాత్మకంగా ఎన్నుకున్నారు రచయిత. అలాగే కుంభోదరం, గోష్పాధం పాత్రలు కూడా సనాతన సంప్రదాయంలో కొనసాగే అవకాశవాద పెద్ద మనుషులకు ప్రతీకగానే తీర్చిదిద్దారు. అరుంధతీదేవి పాత్ర ఒక స్వచ్ఛమైన ప్రేమ మూర్తిగా,

ఆదర్శనారిగా, వర్ణభేదాలేమీ తెలియని నిష్కల్మషమూర్తిగా, అందరి సుఖసంతోషాలను కాంక్షించే వరప్రదాయినిగా ఈ పాత్రను గొప్ప ఔచిత్యంతో తీర్చిదిద్దారు.

నాటకతత్వం

నిష్కల్మషమైన జీవనానికి మానవుల మధ్య వర్ణ భేదాలు అవసరం లేదు. అవన్నీ కొంతమంది స్వార్థంకోసం, తమ ఆధిక్యం కోసం సృష్టించుకొన్నవి, వాటిని ఎంత త్వరగా విస్మరించి నిర్మూలించగలిగితే, అంత త్వరగా భారతీయత సమైక్యంగా బలపడుతుందనేది ఈ నాటకం ఇచ్చే సందేశం.

నాటకంలో వసిష్ఠుడు, ప్రాచీనుడు, శివుడు పాత్రలగతంగా పలికించిన సంభాషణల్లో ఆర్య – అనార్య భేదాలు భారతదేశంలో నెలకొన్నాయనీ, అవి మానవ జీవనాన్ని హెచ్చు తగ్గుల సమాజంగా విభజించి, మానసిక, భౌతిక సంఘర్షణలకు కారణమవుతున్నాయనీ, వాటిలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని చెప్పించగలిగారు.

పరమశివుడు పాత్ర ద్వారా మానవులంతా ఒకే జాతి వారనీ, స్థల, కుల భేదాలను బట్టి, తాత్కాలిక అవసరాలను బట్టి అలా రూపొందించుకున్నారు తప్ప, భేదాలేమీ లేవని చెప్పడం ద్వారా ఈ నాటకం ద్వారా రచయిత విశ్వజనీన మానవుడి లక్షణాలను ప్రతిపాదించినట్లయ్యింది. దీనికి డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన 'ఆర్య జాతి సిద్ధాంతాన్ని' చాలా వరకు ఈ నాటకంలో అనువర్తించిన విధానం ప్రశంసనీయం.

సిద్ధాంతం కోసం నాటకం రాసినట్లుగా కాకుండా, నాటకంలోనే అప్రయత్నంగా ఆ సిద్ధాంతం వచ్చి చేరినట్లుగా రచన కొనసాగింది.

అయితే ఈ సిద్ధాంతం పట్ల ఇప్పటికీ వాదవివాదాలు జరుగుతునేఉన్నాయి. చరిత్రకారుల్లో ఈ సిద్ధాంతం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతునే ఉన్నాయి. అయినప్పటికీ ఒక నాటకంలో ఏదైనా ఒక సిద్ధాంతం ఎలా సమన్వయించే ప్రయత్నం జరుగుతుందో విశ్లేషిస్తూ, ఆ నాటకాన్ని పరిచయం చేయాలనే లక్ష్యమే ఈ వ్యాసాన్ని రాయించింది.

ఆర్య – అనార్య సిద్ధాంతం

శూద్రులు, ఆ తర్వాత 'పంచములు' పుట్టుక గురించి రకరకాలుగా ప్రచారాలు జరుగుతున్నాయి. ఆర్యులు ఇతర దేశాల నుండి వచ్చి, ఈ దేశవాసులైన వారిని జయించి, వీరిని దాసులుగా చేసుకొని, దస్యులు, బానిసలుగా పిలిచారని చరిత్ర కారులు చెప్తున్నారు. దీన్ని డా.బి.ఆర్. అంబేద్కర్ రచనలు – ప్రసంగాలు 7వ సంపుటిలో సోదాహరణంగా విశ్లేషించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకారం..

1. శూద్రులు సూర్యవంశానికి చెందిన ఆర్య కులాల్లో ఒకరు;
2. ఆర్యుల సమాజం మూడే వర్ణాలను అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల్ని మాత్రమే గుర్తించిన కాలం ఒకటే ఉంది;

3. శూద్రులు ఒక ప్రత్యేక వర్ణంగా ఏర్పడలేదు. ఇండో ఆర్యన్ సమాజంలో శూద్రులు క్షత్రియ వర్ణంలో ఒక భాగం;
4. శూద్ర రాజులకు బ్రాహ్మణులకు మధ్య ఎడతెగకుండా సాగుతూ వచ్చిన పోరాటంలో బ్రాహ్మణులు అనేక అవమానాలకు హింసలకు గురయ్యారు;
5. ఆ హింసా ఫలితంగా బ్రాహ్మణులకు శూద్రులంటే ఏర్పడిన ద్వేషం కారణంగా బ్రాహ్మణులు శూద్రులకు ఉపనయనం చేయడానికి నిరాకరించారు;
6. ఉపనయన కర్మకు తిరస్కృతులైన కారణంగా ఆత్మీయులైన శూద్రులు సాంఘికంగా అధఃపతనమై వైశ్యులకన్నా తక్కువ స్థాయికి దిగజారి నాలుగో వర్ణం అయ్యారు.

అరుంధతీదేవి చండాలకన్యా? అనార్య జాతి స్త్రీయా?

అరుంధతీదేవిని 'ఆరంజ్యోతి' అని కూడా వ్యవహరిస్తుంటారు. మహా పతివ్రత. కర్ధమ ప్రజాపతి కుమార్తె. వసిష్ఠుని భార్య. కర్ధముడు బ్రహ్మచ్ఛాయలో పుట్టినవాడు. ఆతని భార్య దేవహూతి. కపిలుడు కూడా కర్ధముని కుమారుడే మన పురాణాలు తెలుపుతున్నాయి.

బ్రహ్మ పుత్రిక అయిన సంధ్యా దేవి మేధాతిథి యజ్ఞంలో ప్రాతస్సంధ్య, అరుంధతీదేవి, సాయం సంధ్య అనే ముగ్గురు మూర్తులుగా పుట్టినట్లు ఒక కథ ఉంది. కర్ధమ ప్రజాపతి తొమ్మండుగురు కుమార్తెలు. అందులో అరుంధతీదేవి ఒకరు. అనే ఒక కథ కూడా ఉంది.

కర్ధముడు ప్రజాపతి అయితే, సృష్టికి కారకులైన ఆది పురుషులలో అతడొకడవుతాడు. ప్రజాపతుల కాలంలో వర్ణభేదమే లేదు. అలా కాకుండా కర్ధముడు ఆ తరువాత వాడైతే అతడు మతంగుడే కావచ్చు. అప్పుడు అరుంధతీదేవి అక్క చెల్లెండ్రు అనసూయ మొదలైన వాళ్ళంతా మతంగ వంశీయులే కావచ్చు. అరుంధతీదేవి తమ్ముడు కపిలమహర్షి కూడా మతంగుడే అవుతాడు కదా! (రాగవాసిష్ఠం ముందుమాట 10–11) అనేది రచయిత వాదన.

పురాణాల్లో కూడా అరుంధతీదేవి పుట్టుక గురించి స్పష్టమైన వివరణలు కనిపించడం లేదు. అయినా, పురాణనామ చంద్రిక వంటి ఆధారాలను అనుసరించి దొరికినంత వరకు ఇలా వివరించుకొనేవీలుంది.

అరుంధతీదేవి, వసిష్ఠులకు పుట్టినవాడు శక్తిమహర్షి. శక్తిమహర్షికీ మాతంగ కన్యకు పుట్టినవాడు పరాశరుడు. పరాశరుడికీ, సత్యవతికి పుట్టినవాడు వ్యాసుడు. ఇలా ఈ పుట్టుక పరిణామాన్ని పరిశీలిస్తే వ్యాసుడు ఆర్యుడా? అనార్యుడా? మహాభారతంలో అంతర్గతమైన భగవద్గీతలో ఇలాంటి భావాలు కొన్ని కనిపిస్తున్నాయి. 'భగవద్గీత' నాల్గవ అధ్యాయం 13వ శ్లోకంలో చాతుర్వర్ణాలను గుణ కర్మలను బట్టి సృష్టించినట్లు ఒక శ్లోకం కనిపిస్తుంది.

"చాతుర్వర్ణ్యం మయా సృష్టంగుణకర్మవిభాగశ:
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమం." (భగవద్గీత,4–13)

ఆర్యోక్తి గా ప్రచారంలో ఉన్న ఒక శ్లోకాన్ని నాటకం ముందుమాటలో బోయి భీమన్న గారు ఉదహరించారు.

"జన్మనాజాయతే శూద్రః
కర్మణాజాయతే ద్విజః
వేద పాఠంతువిప్రాణాం
బ్రహ్మజ్ఞానే బ్రాహ్మణః"

దీని భావజాలమే సమాజంలో స్థిరపడిందనేది రచయిత బోయి భీమన్న గారి అభిప్రాయం. ఒకే వ్యక్తి జన్మతో శూద్రుడైతే, కర్మతో ద్విజుడుగా మారితే, ద్విజులంతా ఆర్యులైతే, శూద్రుడు అనార్యుడెలా అవుతాడు? అంతా ఆర్యులే కదా! ఆ విధంగా "అరుంధతీదేవి" కూడా ఆర్యురాలే అవుతుందనేది బోయి భీమన్న గారి ఆభిప్రాయం.

ఈ శ్లోకం ఎక్కడుందని భగవద్గీత, మనుస్మృతులను పరిశీలించాను.నేను చూసిన ప్రతుల్లో కనిపించలేదు. బహుశా అదేమైనా స్మృతులలో గాని ఉండే అవకాశం ఉందేమో. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కులం–అస్పృశ్యత గురించి చర్చిస్తూ ఈ శ్లోకాన్ని పాదసూచికలో కొంత భాగాన్ని ఇచ్చారు. అయినా వర్ణ వ్యవస్థ భారతదేశంలో ఉందనీ, అది గుణ కర్మలను అనుసరించి ఏర్పడిందని చెప్పేవాదనలు ప్రసిద్ధమే. కనుక అది ఎందులో ఉందనేది అవసరమే అయినా, అది దొరకకపోతే ఈ వ్యాసంలో ప్రతిపాదించే సిద్ధాంత సమన్వయానికి భంగం వాటిల్లుతుందనిభావించనవసరం లేదనుకుంటాను.

చాతుర్వర్ణాలు గుణ, కర్మలను బట్టి ఏర్పడ్డాయనేది భగవద్గీత, మనుస్మృతులు మాత్రం చాటి చెప్తున్నాయి.

మనుస్మృతి ద్వాదశ అధ్యాయంలో చాతుర్వర్ణాల వారు ఆచరించవలసిన ధర్మాలను ఇలా వివరించడం కనిపిస్తుంది.

"చాతుర్వర్ణ్యస్యకృత్స్నో?యముక్తోధర్మస్త్వయానఘ,
కర్మణాంఫలనిర్వృత్తింశంసనస్తత్త్వతఃపరామ్
స తాను వాచ ధర్మాత్మా మహర్షీన్మానవోభృగుః
అస్యసర్వస్యశృణుత కర్మ యోగస్యనిర్ణయమ్?" (మనుస్మృతి, 12-1,2)

మహానుభావా! మాకింత వరకు బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులనుష్ఠించాల్సిన ధర్మాలన్ననీ చెప్పినారు. ఇక ఇప్పుడు ఈ జన్మలో చేసిన కర్మలకు తరువాతి జన్మలలో కలుగు ఫలం ఏవిధంగా ఉంటుందో దానినంతా వివరించండి అని మహర్షులు భృగుమహర్షిని అడిగినారు. అప్పుడా మహర్షులతో మనుపుత్రుడైనభృగుమహర్షి సమస్త కర్మల యొక్క ఫలితాన్ని ఇట్లు చెప్పసాగెను.

"శుభాశుభఫలం కర్మ మనోవాగ్దేహసంభవమ్,
కర్మజాగతయోన?ణాముత్తమాధమమధ్యమాః
"తస్యేహత్రివిధస్యాపిత్ర్యధిష్ఠానస్యదేహినః,
దశ లక్షణ యుక్తస్యమనోవిద్యాత్ప్రవర్తకమ్." (మనుస్మృతి, 12-3,4)

మనస్సు, వాక్కు దేహం ఇవి చేసే కర్మ శుభాశుభ ఫలములను కలిగిస్తున్నది. ఈ కర్మవల్లనే జీవులకు ఉత్తమ, మధ్యమ అధమగతులేర్పడుతున్నాయి. ఈ విధంగా జీవికి మనోవాక్కాయములచే ఉత్తమాది త్రివిధ గతులేర్పడుతున్నా దశవిధ లక్షణాలుగల కర్మకు కారణమని చెప్పాల్సి ఉంది. అని మనుస్మృతి కర్మలను అనుసరించి జన్మ ఏర్పడుతుందనే వివరణను ఇస్తుంది. (చూడు: మనుస్మృతి, తెలుగు తాత్పర్య సహితం, డా. యన్. యల్. నరసింహాచార్య 2000: 334)

బ్రాహ్మణ స్త్రీకి – శూద్ర పురుషునికి పుట్టినవాడు 'చండాలుడు' అని మనుస్మృతి చెప్తుంది. శూద్రుని వలన వైశ్య స్త్రీకి పుట్టిన వాడు అయోగుడు. క్షత్రియ స్త్రీకి పుట్టిన వాడు క్షత. వీరంతా వర్ణ సంకరులు. వీరే అవర్ణులు. అంటే, ఏ వర్ణానికీ చెందనివారు. వారే 'పంచమ వర్ణం' వాళ్ళు!

వర్ణానికీ, జాతికీ కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.

"జాతి అంటే కొన్ని ఆనువంశిక ప్రత్యేక లక్షణాలు కలిగిన ఒక జన సమూహం అని నిర్వచించవచ్చు."(శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,1992 : 59.) అని డా.బి.ఆర్.అంబేద్కర్ నిర్వచించారు.

జాతిని రూపొందించేటప్పుడు చూడవలసిన కొన్నిలక్షణాలను పేర్కొన్నారు. అవి: 1.శిరస్సు ఆకృతి, 2. ముట్టు, 3. శరీరచ్ఛాయ, 4. మనుషుల పొడవు.

దీనిలో రంగు, పొడవు అనేవి శీతోష్ణ స్థితిని బట్టి ఆవాసాన్ని బట్టి మారుతూ ఉండే లక్షణాలు.కనుక, వాటిని జాతి నిర్ణయ లక్షణాలుగా పేర్కొనవలసిన అవసరం లేదనే అభిప్రాయం నేడు ప్రబలి ఉంది." (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి,1992 : 59.) అని డా.బి.ఆర్. అంబేద్కర్ వివరించారు.

కేవలం శరీర వర్ణమే ప్రధానమైతే యూరోపియన్ జాతులలో అన్ని వర్ణాల వారూ ఉన్నారని, అయినా వారి మధ్య వర్ణ భేదాలు లేవని డా.బి.ఆర్. అంబేద్కర్ విశ్లేషించారు.

"ఆర్యజాతి వారు, అనార్య జాతులైన దాసులను, దస్యులను యుద్ధంలో జయించారని చెప్పే సిద్ధాంతానికి తావు లేదని ఋగ్వేదంలోని అనేక ఋక్కుల్లో పేర్కొన్న "ఆర్య" శబ్దాన్ని ఆధారం చేసుకొని డా.బి.ఆర్. అంబేద్కర్ సోదాహరణంగా నిరూపించారు.

"ఆర్యులు భారతదేశంపై దాడి చేసి జయించారనేది అభూత కల్పన." అని డా.బి.ఆర్. అంబేద్కర్ వాదన (శూద్రులెవరు? అంబేద్కర్ రచనలు ప్రసంగాలు 7 వ సంపుటి, 1992 : 73) అంతేకాదు "దాసులు, దస్యులు భారత దేశానికి చెందిన ఆదిమతెగల వారు అనడం ఖచ్చితంగా తప్పు" [3 పే. 73] అని కూడా డా.బి.ఆర్. అంబేద్కర్ ఆర్యజాతి సిద్ధాంతాన్ని పూర్వ పక్షం చేసే ప్రయత్నం చేశారు.

ఈ పై సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొనే 'రాగవాసిష్ఠం' నాటక రచయిత బోయి భీమన్న గారు భారతీయులందరూ ఆర్యులే అనే సిద్ధాంతాన్ని ఈ నాటకంలో అన్వయించే ప్రయత్నం చేశారు.

పైగా ఈ నాటకం గురించి హైమవతీ గారు భీమన్న గారి ఆత్మకథలో రాస్తూ "ఆర్యులు ద్రావుడులు ఒకే జాతికి చెందిన వారు, రక్త సంబంధీకులు" అనే సిద్ధాంతం కూడా నార్ల వారికి నచ్చలేదా కాలంలో. రాగవాసిష్ఠం నాటకం ఈ సిద్ధాంతం మీద వ్రాయబడినట్టిదే" (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982 : 277) అని మరింతగా స్పష్టం చేయడాన్ని గమనించవలసి ఉంది.

ఈ నాటకం గురించే వ్యాఖానిస్తూ హైమవతీ గారు "నిండాచాదస్తం గల సనాతన పండితులు సైతం కాదనలేని సిద్ధాంతాలు భీమన్నవి" (పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, 1982 : 634) అన్నారు.

ఏది ఏమైనా డా.బి.ఆర్. అంబేద్కర్ భావజాలం బోయి భీమన్న గారిలో స్పష్టంగా కనిపిస్తుందని చెప్పడానికి ఈ నాటకం గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చు.

అంతేకాకుండా ఆర్య, అనార్య భేద భావాలు స్థల కాలాలను అనుసరించి ఏర్పడినవని చెప్పడం ద్వారా కూడా ఒక విశ్వజనీనమైన మానవుణ్ణి రచయిత ఈ నాటకంలో ప్రతిష్టించే ప్రయత్నం చేసినట్లు చెప్పే వీలుంది.

నాటక నామౌచిత్యం

ఈ నాటకానికి రచయిత రాగవాసిష్ఠం అని పేరు పెట్టారు. దీన్ని హైమవతీ గారు పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్నలో రాగవాశిష్ఠం అనే చాలా సార్లు రాశారు. ఈ వ్యాసంలో మాత్రం నాటకం ముఖ చిత్రంపై ఉన్న రాగవాసిష్ఠం అనే ప్రయోగించడానికి ప్రయత్నించాను.యోగవాశిష్ఠం, జ్ఞానవాసిష్ఠం ఉన్నట్లే ఈ పవిత్ర కల్యాణ గాథకు 'రాగవాసిష్ఠం' అనే పేరు పెట్టానని రచయిత రాసుకున్న ముందుమాటలోనే చెప్పుకున్నారు. 'రాగం' అంటే అనుబంధం, ప్రేమ, అనురాగం వంటి అర్థాలు ఉన్నాయి. వసిష్ఠని ప్రేమ, వసిష్ఠని అనురాగం, వసిష్ఠనిపై అనురాగం వంటి అర్థాలను ఆశించి ఈ నాటకానికి ఈ పేరు పెట్టారని తెలుస్తుంది. నాటకం చివరి వరకూ రాగబంధమే. అంటే ప్రేమ బంధమే కొనసాగింది. ఈ విధంగా చూసినప్పుడు ఇది గొప్ప ఔచిత్యంతో పెట్టిన పేరే.

ఈ విధంగా పరిశీలించినప్పుడు రాగవాసిష్ఠం నాటకంలో కొన్ని చర్చనీయాంశాలు ఉన్నాయనీ, సృజనాత్మక సాహిత్యం కేవలం ఆనందం కోసమే కాకుండా ఆలోచనాత్మకంగా కూడా మలచి సాహిత్య ప్రయోజనాన్ని గుర్తించేలా చేయవచ్చని నిరూపించిన రచనగా దీన్ని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. జ్ఞానానందకవి. యస్.టి, 1997, షెడ్యూలు కులాలు అంటరానివా! కాకినాడ: సురగాలి ప్రచురణలు

2. జగన్నాధం నములకంటి. 1968, ఆరుంధతీదేవి చరిత్రము. హైదరాబాద్ : వైదిక గ్రంథప్రచారమండలి ప్రచురణలు

3. నారాయణరెడ్డి, సి.(ప్రధాన సంపాదకుడు) 1992, బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు – ప్రసంగాలు 7వ సంపుటి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణలు

4. భీమన్న బోయి. 1959, రాగవాశిష్ఠం. హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు

5. మూర్తి .బి .బి.యస్,1992, దళిత కథామంజరి. రాజమండ్రి : త్రివేణి ప్రింటర్స్ ప్రచురణలు

6. నరసింహాచార్య యన్.యల్. (వ్యాఖ్యాత), 2000, మనుస్మృతి, (తెలుగు తాత్పర్యం సహితం) హైదరాబాదు: గాయత్రీ ప్రచురణలు

7. వేదవ్యాస, 2000, ప్రాచీన భగవద్గీత (పరిష్కృతమైన మూలము), యోగమిత్రమండలి ప్రచురణ, హైదరాబాదు, ప్రథమ ముద్రణ.

8. హైమవతి, 1982, ద్వితీయ ముద్రణ, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, (ప్రథమ ముద్రణ, 1978), హైదరాబాదు : సుఖేలానికేతన్ ప్రచురణలు

9. Religion and Society By S. Radhakrishnan p. 129

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న పాలేరు నాటక విశిష్ట లక్షణ విశ్లేషణ

- ఆచార్య సంగి రమేశ్

ఉపోద్ఘాతం

జనజీవన రీతుల్లో వచ్చే మార్పుల్ని గమనించి వాటిని నిక్షిప్తం చేయడంలోనూ ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రయోజన కారిగా ఉండటంలోనూ నాటకాల పాత్ర గొప్పది. జీవిత సత్యాలనూ మానవ మనస్తత్వంలోఉన్న భిన్న పార్శ్వాలనూ తెలుగు సాంఘిక నాటకాలు సమగ్రంగా ప్రదర్శించాయి. నాటకంలో చిత్రించే సమస్య ఏదైనా అది రచయిత జీవన పరిధి మీద ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు.

సమకాలీన సమాజంలో ప్రగతిని దర్శించాలనుకునే రచయిత దృష్టి ఎప్పుడూ సంఘంలో ఉన్న సమస్యల మీద కేంద్రీకృతమౌతుంది. "కావ్యేషు నాటకం రమ్యం, నాటకాంతం హి సాహిత్యం" దశరూపకాలలో నాటకం విశిష్టమైనది. సర్వకళా సమాహారంగా సంగీతం, నృత్యం,అభినయాలతో అలరారే నాటక ప్రక్రియ సర్వజనాలకు ఆమోదంగా విలసిల్లింది.

కారణం దృశ్యరూప నాటకంలో ప్రతి పాత్ర కళ్ళ ముందు కనిపించేలా నటులు నటించడం లేదా జీవించడం జరుగుతుంది. నాటకం జీవితాన్ని ప్రతిబింబిస్తుంది జీవితం నాటకాన్ని అనుసరిస్తుంది. నర్మగర్భంగా సమాజానికి సందేశం ఇస్తుంది. మానవ సంబంధాలను వాటి తాలూకు భావోద్వేగాలను, సమాజ స్థితి గతులను, ఆదర్శాలను, ఆశావాదాలను చిత్రించే కళాఖండం నాటకం.

కీలకమైన పదాలు

నాటకం దృశ్య, శ్రవణ మాధ్యమం, భూస్వాములు, సమసమాజం, మూఢవిశ్వాసాలు, సామాజిక చైతన్యం , ఏకజాతి, అంటరానితన నిర్మూలన

పరిశోధన ప్రారంభం

ఏ రచయితకైనా. రచనకైనా కొన్ని ఆదర్శాలు, ఆశయాలు ఉంటాయి. ఆయా విషయాల ప్రతిబింబంగానే పాత్రల చిత్రీకరణ జరుగుతుంది. ఏ నాటకానికైనా ఆ నాటకంలోని ఇతివృత్తానికి సంభాషణలు వెన్నెముక వంటివి. పాత్రలకు సజీవ తత్వాన్ని చేకూర్చేవి. సంభాషణలే నాటకం యొక్క విజయం. నాటక రచయిత యొక్క సంభాషణాశిల్పం మీద నాటక జీవనం ఆధారపడి ఉంటుంది. నాటకం దృశ్య, శ్రవణ మాధ్యమం కావున నాటకం రక్తి కట్టాలంటే అందులోని సంభాషణలు కూడా జన రంజకంగా ఉండాలి. నాటకంలోని ఆయా పాత్రల స్వభావాన్ని, మనోభావాలను వ్యక్తం చేయడానికి ఆధారమైనవి సంభాషణలు. పాలేరు నాటకంలో కూడా అటువంటి సజీవమైన సంభాషణలే మనకు కనిపిస్తాయి. సంభాషణ రచనలో భీమన్న గారు చూపిన శిల్ప నైపుణ్యానికి నిదర్శనం పాలేరు నాటకం. దానితో పాటు ఏ రచన అయినా సమాజానికి హితాన్ని కలిగించాలి అందులో ఆనందంతో పాటు అంతర్లీనంగా ఉపదేశం కూడా ఉండాలి. అప్పుడే అది కొంతకాలం నిలబడుతుంది. జనాల నీరాజనాలను అందుకుంటుంది. కుల నిర్మూలన జరిగితేనే సమాజంలోని అసమానతలు తొలగిపోతాయనే దృక్పథం ఇందులో కనబడుతుంది. భూస్వాముల ఆగడాలను చదువు యొక్క ఆవశ్యకతను ఇది తెలియజేస్తుంది. స్వయంగా కష్టపడి చదివి ఒక విద్యావేత్తగా అధికారిగా ఎదిగిన ఒక పాలేరు జీవితాన్ని అద్భుతంగా చిత్రించిన నాటకం పాలేరు.

పాలేరు నాటకంలో ప్రతి పాత్ర సమసమాజాన్ని స్థాపించడానికి తీర్చిదిద్దబడ్డది. వ్యక్తుల కన్నా సమాజం గొప్పది అని చెప్పడమే భీమన్న గారి పాలేరు నాటక లక్ష్యం. సమాజంలో మార్పును ఆశించే రచయితలంతా తమ రచనల్లో ఆయా పాత్ర ద్వారా తమ ఉద్దేశాన్ని, సందేశాన్ని తెలియజేస్తారు.

పాలేరు నాటక ప్రభావంతో ఎందరో పాలేరులు చదువుకోవడం ఈ నాటకానికి ఉన్న విశిష్టగుణం. సమాజంలో అమలులో ఉన్న పుట్టుక, కులం పద్ధతి రద్దు కావాలి, గుణకర్మలను బట్టి కులం పరిగణించబడాలంటారు భీమన్న. పట్టుదలతో చదివి ఎదగాలనే, విజ్ఞత కలిగి జీవించాలనే విషయాన్నీ ప్రబోధిస్తూ రాసినదే పాలేరు నాటకం. తెలుగు వారిలో ఇంత చైతన్యం నింపిన నాటకం మరొకటి లేదు. కవి కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలని వారి రచనల్లో ప్రతిఫలించాయి. ఆధునిక నాటక సాహిత్యంలో పాలేరు నాటకం విప్లవాత్మకమైన చరిత్రను సృష్టించి అత్యుత్తమ సాంఘిక నాటకంగా ఖ్యాతి పొందింది.

బానిసలా పనిచేసే ప్రతి అస్వతంత్రుడు పాలేరే అంటాడు భీమన్న. భూస్వామ్య వ్యవస్థను, పాలేరుల జీవన వృత్తాంతాన్ని వాస్తవికంగా చిత్రీకరించారు. సమాజంలో పేరుకుపోయిన మూఢవిశ్వాసాలను ఎంతో లోతుగా ఆవిష్కరించారు. ఈ నాటకంలో పాలేరు వెంకన్న ఎన్నో అవమానాలు ఎదుర్కొని చదువు పూర్తి చేసుకుని డిప్యూటీ కలెక్టర్‌గా తిరిగి తన ఊరికి రావడం ఇందులోని కథాంశం. అట్లాగే ఒక సున్నితమైన భావోద్వేగపూరితపు ప్రేమ అనే కోణాన్ని జోడించి వనబాల వెంకన్న పాత్ర ద్వారా వర్ణాంతర వివాహాన్ని చిత్రించిన తీరులో భీమన్న అంటరానితన నిర్మూలన ధ్యేయం గోచరించింది.

పాలేరు నాటకంలో ముఖ్యంగా రెండు సామాజిక విప్లవాలు మనకు కనిపిస్తాయి. ఒకటి వెంకన్న వనబాలల వివాహం ద్వారా కులభేద వ్యత్యాసాలు నిర్మూలించబడి భారతజాతి ఏకజాతిగా

శక్తివంతం కావాలన్నా ఉద్దేశం. రెండవ అంశం అణగద్రొక్కబడుతున్న దళితుల బ్రతుకుల్లో విద్యద్వారా సమగ్ర దేశాభ్యుదయం వెల్లివిరియడం. ఈ రెండు విప్లవాలను సమాంతరంగా నడిపించారు పాలేరు నాటకంలో బోయి భీమన్న. విద్య వల్లనే దళితుల జీవితాల్లో మార్పులు వస్తాయని సామాన్య దళితుల్లో సామాజిక చైతన్యం చదువుకుంటేనే సాధ్యమనే వాస్తవాన్ని గ్రహించాలంటాడు భీమన్న.

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శ్రీ కాకి మాధవరావు గారి మాటల్ని గుర్తు చేసుకోవాలి **నేను పాలేరుని, పాలేరు నాటకం చూసి చదువుకోవాలని అక్షరాలు నేర్చుకొని చదివి, కలెక్టర్ అయ్యాను పాలేరు నాటక ప్రభావం నామీద, నా ప్రజల మీద ఎంతగానో ఉంది ఈ నాటకం రాకపోతే నేనొక అనామకుడిగా పాలేరుగానే మిగిలిపోయి ఉండేవాడిని, బోయి భీమన్న గారి రుణం జన్మజన్మలకు తీర్చుకోలేనిది** అని చెప్పడం ప్రజలపైన ఈ నాటక లోతైన ప్రభావం ఎంత గొప్పదో అర్థమవుతుంది.

ఈ పాలేరు నాటకాన్ని కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి కులం, వర్గం లేదని వాదించిన కోనాడ సూర్యప్రకాశరావుకి అంకితం ఇవ్వడం జరిగింది. భీమన్న గారికి చిరకీర్తిని ఆర్జించి పెట్టింది పాలేరు నాటకం. వాల్మీకికి రాముడు సమకాలికుడైతే, వ్యాసుడికి ధర్మరాజు సమకాలికుడైతే, పాలేరు వెంకన్న నా సమకాలికుడని భీమన్నగారు చెప్పుకున్నారు.

ముగింపు

బోయి భీమన్నగారు వ్యవస్థీకృతమై ఉన్న అంటరానితనమనే రుగ్మతను తీవ్రంగా ఖండించారు. మౌలిక సాహిత్యానికి ఉండవలసిన ప్రధాన గుణం సమకాలీనత. సమకాలినతలేని ఎంత గొప్పదైన అది సాహిత్యం అనిపించుకోదు. కవి ఏ కాలంలో జీవించాడో ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక,ఆధ్యాత్మిక విషయాలన్నీ అతడి రచనల్లో ప్రతిపాదించాలి. పాలేరు నాటకం అది సాధించింది.

సమకాలీన సాహిత్యానికి సార్వజనీనత తోడైనప్పుడు దానికి సజీవ సుస్థిరత్వం సిద్ధిస్తుంది. అన్న సందేశమే పాలేరు నాటక ప్రధాన సందేశం.

ఆధార గ్రంథ సూచిక :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 3, వచన కవితలు భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2010
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 4, నాటకాలు, భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2008
3. మంజులత, ఆవుల. (సం.) బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్: 2008

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయిభీమన్న అద్భుతసృష్టి - అశోకవనిలో రాముడు

- డా. సి. నర్సింహులు,
అసోసియేట్ ప్రొఫెసర్,
9440577319.

తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో 1911 సెప్టెంబరు 19 ఒక దళిత కుటుంబంలో నాగమ్మ, పల్లయ్య దంపతులకు రెండవసంతానంగా పుట్టాడు. వీరి తల్లిదండ్రులకు ఐదుగురు మగపిల్లలు ఒక ఆడ పిల్ల. తండ్రి పల్లయ్య మగపిల్లలకు 1. ధర్మరాజు 2. భీమన్న 3. అర్జున 4. నకుల 5. సహదేవ పేర్లు పెట్టారు. అమ్మాయిపేరు విజయభారతి. సామాజిక చైతన్యాన్ని ఆశించిన భీమన్న అనేక గ్రంథాలను రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. పద్య, గేయ, వచన రచనలతోపాటు నాటకాలను కూడా వ్రాశాడు. అందులో ముఖ్యంగా దళిత చైతన్య రచనలు కూడా ఉన్నాయి. అందులో ఒకటి అంబేద్కర్ వ్రాసిన కులనిర్మూలన పుస్తకాన్ని తెలుగులోనికి అనువదించాడు. ఇతడు సామాజిక చైతన్యము మరియు దళిత చైతన్యముతోపాటు ప్రకృతిచైతన్యవంతమైన రచనలు కూడా చేశాడు. మోడువారిన దళితజీవితాలపై చాలా కావ్యాలు రాసినప్పటికి, మోడువారిన వనములో వసంతాన్ని సృష్టించిన రచన కూడా చేశాడు. ఆ రచనే "అశోకవనిలో రాముడు". ఈ కావ్యాన్ని చాలామంది పరిశోధకులు స్పృశించలేదు. భీమన్న కావ్యాల జాబితాలో కూడా తక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

రావణుడు సీతను అపహరించి లంకలో అశోకవనిలో పెట్టడంవలన అది సీత శోకంతో శోకవనిగా మారిపోయింది. రామునిరాకతో అది శోకవనిగా కాకుండా అశోకవని అనుపేరు సార్థకనామధేయమని ఆ వనాన్ని అద్భుతంగా వర్ణించి భీమన్న "అశోకవనిలో రాముడు" రచనలో నిరూపించాడు. అందుకే నా అంశం "భీమన్న అద్భుతసృష్టి - అశోకవనిలో రాముడు" అని శీర్షికను పెట్టడం జరిగింది.

బోయిభీమన్న నాన్నగారైన పల్లయ్య గొప్పవేదాంతి. వారియింటిలో వేదాంతాల పుస్తకాలేకాక భారత, భాగవత, రామాయణకావ్యాలు కూడా వుండేవి. వారి నాన్నగారికి ఉభయగోదావరి జిల్లాలలో చాలామంది శిష్యులుండేవారు. అందులో ఒకరు బ్రహ్మశ్రీ దాసరి నరసింహంగారు. ఆ కాలంలో గురువును కలుసుకోవడానికి సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో అప్పుడప్పుడు ఐదారు మాసాలకొకసారి నరసింహంగారు గురుదర్శనంకోసం భీమన్ననాన్నగారి దగ్గరకు వచ్చి సాహిత్యగోష్టులు నిర్వహించేవారు. ఒకరోజు భీమన్న గేయాలు, పద్యాలు రాసి వచ్చిన వారి దగ్గర చదివి వినిపించేవారు. నరసింహంగారు భీమన్నగురించి వాళ్ళ నాన్నదగ్గర "అబ్బాయి కవిత్వం రాస్తున్నాడు అనగా" ఏడ్చాడు, వెధవ గచ్చకాయ, పుచ్చకాయ కవిత్వమవుతాయా? వ్రాస్తే మహాభారతం వంటి గ్రంథం రాయాలి అన్నాడు.

అప్పటినుండి భీమన్నకు మహాకావ్యాలు రాయకున్నా ఆ కావ్యాల కొనసాగింపుగా వున్న రచనలైనా చేయాలనే సంకల్పం కలిగింది. ఆ సంకల్పమే నూతన రచనాసృష్టికి కారణమైంది. ఈ రచన గురించి భీమన్న మాటలో....

"ఆనాటి మానాన్న ఆకాంక్షే ఈ కావ్యం అనడానికి పూర్తిగా వీలులేదు. (కాని కొంత వరకదే) ఆయన ఆశించిన దానిలో సహస్రాంశం కూడా కాదిది. ఆనాటికి, ఈనాటికి నడుమ దేశకాలాదులలో వచ్చిన మార్పు భారతరామాయణాలవంటి మహాగ్రంథాల అవతరణకు అనుకూలమైనట్టిదికాదు. భారత, రామాయణాలవంటి మహాసాహిత్యసృష్టిని చేయగల ఋషులు ఈనాడులేరు. ఎవరైనా అందుకు సాహసించినా, చదివే తీరిక, ఓపిక నేటి మానవునికి లేదు. ఆకలి, నిరుద్యోగం, తిండివేట, పనిరద్దీ. ఇవే పరమార్థంగావున్న నేటి మానవుడి బ్రతుకులో భక్తికి, బ్రహ్మోపాసనకు సమయమెక్కడిది? అంగట్లో కొనుక్కుతిని పరుగెత్తేవాడికి ఆలోచనామృతం ఎలా సాధ్యం? అందుకే ఈనాటి మాకు ఏగచ్చకాయో, పుచ్చకాయో వండి వడ్డించడమే మహాకవిత్వమైపోయింది. 'ఆకలి రుచి ఎరుగదు. ఆధునిక సాహిత్యం రసమెరుగదు.' ఇక నా విషయం మా నాన్నలోని బ్రహ్మోపాసన కరిగి నాలో రసోపాసనగా రూపం దిద్దుకొన్నదనుకోవచ్చు. శృంగారదృష్టితో తప్ప సృష్టిలో ఏ వస్తువునూ నేను మరో విధంగా చూడలేను. సృష్టి సమస్తమూ ఉమాశంకరుల, సీతారాముల, రాధాకృష్ణుల విశ్వశ్రేయోలీలగానే కనిపిస్తుంది నాకు."అశోకవనిలో రాముడు" అనే ఈ కావ్యానికి కూడా మూలభావం అదే" అని బోయిభీమన్నగారు అద్భుతమైన సృష్టిచేశారు.

"అశోకవనిలో రాముడు"

ఇది చాలా చిన్నకావ్యం. భీమన్న ఈ కావ్యాన్ని 122 పద్యాలతో పూర్తి చేశాడు. దాదాపు శతకం వంటిది. కాని శతక పద్యాలు ముక్తకాలు, ఇవి కథాంశ పద్యాలు. కాని ముక్తకాలవలెవుండే నవ్యసృష్టి. ఇందులో రాముడు మౌనపాత్రధారి. వనం అశోకం. కాని శోకంలోవున్నది. సీతకు శోకవనం, రామునకు అశోకవనం. రాముడు రావడంతోనే అశోకవనం అన్న మునుపటిపేరు సార్థకమైంది. రామునిరాకతోటే ఆరు ఋతువులొచ్చాయి. వనం అందంగా విరాజిల్లింది. ఇది ఒక భీమన్న ఊహ. ఈ ఊహనే రామాయణాంతర కావ్యంగా విలసిల్లింది. ఇందలి కథా చిన్నది. ఊహాకథే.

రావణసంహారం తర్వాత రాముడు ఆ రాత్రి రావణుడు సీతను లంకలోని అశోకవనంలో పెట్టాడుకదా! తెచ్చిన స్త్రీని అంత:పురంలోనో, లేక బందీగా చెరసాలలోనో పెట్టాలి. కాని వనములో పెట్టడమేమిటి? అది ఎట్టి వనమో చూతమని రామునికి కోర్కె కలిగినదని, ఈ ఊహ మహర్షియైన వాల్మీకికి కలుగలేదని, కలిగినా! తనకొరకు వదిలాడని కవి భావించి, రామున్ని యుద్ధభూమినుండి, అశోకవనికి తీసుకొచ్చాడు. వనము వసంతంగా మారి రామున్ని దర్శించింది. వనములోని ప్రతిమొక్క, ప్రతివృక్షము రాముని దర్శనముతో పులకించిపోయింది. చివరకు గడ్డిపరకలు కూడా రామదర్శనంచేసి రామపాదాలను స్పృశించాయియని ఊహించాడు భీమన్న. ఈ కావ్యంలోని తృణము రామపాదాన్ని స్పృశించిన విధానాన్ని భీమన్న...

ఎక్కడివాడొ! ఏమికథొ! ఏసతి కన్నదొ! ఏల వచ్చెనో
ఇక్కడికిప్డు! సూర్యుడుదయించను రోజును, కాని ఇంతగా
చక్కనివాడు చిక్కడెదొ సౌహృదయముండినతప్ప, ఇప్పుడే
మ్రొక్కెదమంచు రాముపదముల్ స్పృశించువనిన్ తృణాదులున్!

అశోకవనిలో రాక్షసులు తిరుగాడారు. వారి వికృత చేష్టలు చూసి చూసి వనములోని వృక్షాలు రాక్షసులుగా మారినై, లతలు దుర్మార్గంగావున్నాయి. సీతను విభీషణుడు తీసుకొనిపోయి రామునికి యుద్ధభూమిలో అప్పగించాడు. సుగ్రీవుని ఆధీనంలో సీతను వుంచి రాముడు యిక్కడికి వచ్చాడు. సీతకు శోకం కల్గించిన వనం యిప్పుడు తనపేరు సార్థకమైనట్లుగా రామునిపాదం తాకగానే అశోకవనిగా మారింది.

రక్కసిచెట్లు రాముగని రంగులుమారె, విభీషణమ్ములై
మ్రొక్కె మహాగమమ్ములల మూడు జగమ్ముల కేకరూపతన్
అక్కున చేరె శ్రీలతలు ఆమనిసంపదలెల్ల తామెయై
చొక్కె మధువ్రతాలు, వనిశోభిలె రాముపదాభిరామమై!

నిత్యశివపూజ దురంధరుడైన రావణుడు ఈశ్వరుని సేవించనిదే ఆహారము భుజింపడు. దేవతలందరిని ఎదిరించిన రావణుని శక్తికి మించినవాడు ఎవరైనా వుంటాడా? అంటే హద్దుమీరితే గడ్డిపోచ కూడా శక్తివంతమైతుంది అంటాడు భీమన్న.

సుమతీశతకంలో తమస్థానాన్ని తప్పిన (హద్దుదాటిన) మిత్రులే శత్రువులైతారంటాడు బద్దెన. ఆ పద్యం.

కమలములు నీటబాసిన
కమలాప్తునిరశ్మిసోకి కమలినభంగిన్
తమతమ నెలవులు దప్పిన
తమ మిత్రులే శత్రులౌట తథ్యము సుమతీ!

భీమన్న వనవర్ణన అట్లేవుంది.

ప్రొద్దుటలేచి కోటిశివపూజలు చేసియకాని ముట్టదే
చద్దియు రావణుండతని శక్తికి మించిన దైవముండునే?
తద్దమనేశ్వరుండు గురితప్పిన అమొక్కదానగూలె పో!
హద్దును మీరినప్ప పదియంతల శక్తియు గడ్డిపోచయౌ!

రావణుని మరణానంతరము దేవతలు సంతోషపడి పుష్పవర్షం కురిపిస్తారు. జానకిరాముల కళ్యాణములో జానకి రామునిపై పూల తలంబ్రాలు పోస్తుంది. వనంలోని లతలు రామునిపై పుష్పములు కురిపించినప్పుడు దేవతల పుష్పవర్షం, సీత పోసిన పూలతలంబ్రాలుగా ఊహించి పద్యాన్ని సృష్టించాడు భీమన.

అడలున రావణాసురుని ఆఖరుశీర్షముతున్గి నేలపై
పడ, దివిచల్లినట్టిపువువానల మొగ్గలు చెట్లలో చి
క్కడి, అటెవుండి, ఇప్పుడవి ఔదలలొంచగరాలె రాముపై
పుడమిజ తొల్లిచల్లిన పువుందలబ్రాలను జ్ఞప్తి చేయుచున్

ఈ భూమిపై రాక్షసత్వాన్ని పోగొట్టి మానవత్వాన్ని నిలుపడానికి రాముడు వచ్చాడని భావించాడు కవి. ఇందులో దుర్మార్గులైన బలవంతులు, ధనవంతులైన మనుషులనుండి బడుగువర్గాలవారిని పేదలైన దరిద్రులని కాపాడాలని నర్మగర్భముగా సమాజములోని మంచివారి అభివృద్ధిని, దళిత చైతన్యాన్ని కాంక్షించాడు కవి. ఈ కావ్యాన్ని అప్పటి సాంఘీక సంక్షేమశాఖమంత్రియైన మాన్యశ్రీ దాసరి పెరుమాళ్ళు గారికి అంకితమిస్తూ, సమాజ సంక్షేమాన్ని, పరహితాన్ని కోరాడు.

అలభోజరాజొ, రాయలవారొ కాకున్న
సాహిత్యపోషణ సాధ్యపడునె?
గౌతమ బుద్దుడో, గాంధి మహాత్ముడో
కాదేని, ప్రజపట్ల కరుణయున్నె?
రాముడో, భీముడో, రాధాప్రియుడొకాక
శ్రీగూడి శక్తి వరించగలదె?
అమృతకరుడొ, వాని అబ్బయొకానిచో
పరహితగుణవృత్తి పట్టుపడునె?
ఇందరును, మరియెందరో ఇద్ధమతులు
ఎల్లతమ శుభాంశలతో దీపించినట్టి
మధురమూర్తి మాపెరుమాళ్ళు మాన్యమంత్రి
మత్కృతీశుడు నిత్యసంపత్ ప్రభుండు!

ఈ విధంగా బోయిభీమన్నగారి "అశోకవనిలో రాముడు" అద్భుతమైన ప్రకృతి (వనము) వర్ణనతో నిండిన కావ్యంగానే గాకుండా మానవుని శోకంలో కూడా సంతోషాన్ని కలిగించె

సమాజచైతన్యం, దళిత చైతన్యం కలిగిన భావయుక్తంగావున్న రచన. ఈ కావ్యాన్ని పూర్తిగా పరిశీలించినచో విశ్వవిద్యాలయంనుండి యం.ఫిల్ పట్టాపొందవచ్చు. నా ఈ సదస్సు పత్రమైన "బోయిభీమన్న అద్భుతసృష్టి – అశోకవనిలో రాముడు" వ్యాసాన్ని ముగిస్తున్నాను.

"సర్వేజన: సుఖినోభవంతు"

ఆధార గ్రంథాలు:

1. పాలేరు నుండి పద్మశ్రీ వరకు డా॥ బోయిభీమన్న
2. నెమలికన్నులు – డా॥ దార్ల వెంకటేశ్వరరావు
3. అశోకవనిలో రాముడు – బోయిభీమన్న
4. సుమతీ శతకం – బద్దెన
5. పాలేరు (నాటకం) – డా॥ బోయిభీమన్న

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న "పిల్లీ శతకం" – తాత్విక దృక్పథం

– డా. జి. అనిత
అసోసియేట్ ప్రొఫెసరు
Cell No: 9849272449

సారాంశం

తెలుగు శతక సాహిత్యంలో బోయి భీమన్న రచించిన 'పిల్లీశతకం' ఒక విశిష్టమైన, వ్యంగ్య–తాత్విక గ్రంథంగా నిలుస్తుంది. సంప్రదాయ శతకాలలో దేవుడు, నీతి లేదా భక్తి ప్రధానంగా ఉన్నప్పటికీ, పిల్లీ శతకంలో పిల్లీ అనే సాధారణ జీవి ప్రతీకగా మారి, మానవ స్వభావాలు, సమాజ వికృతులు, ద్వంద్వ ధోరణులు, స్వార్థ బుద్ధులు మొదలైన వాటిపై తీవ్రమైన విమర్శ చేస్తుంది. ఈ శతకం ద్వారా రచయిత జీవన సత్యాలను ఉపమానాలు, అన్యాపదేశాలు, సామెతలు, వ్యంగ్య ధ్వనుల రూపంలో పాఠకుడికి చేరవేసాడు.

ఈ పరిశోధనా వ్యాసం లక్ష్యం: ఎంపిక చేసిన పద్యాల ఆధారంగా పిల్లీశతకంలోని తాత్విక దృక్పథాన్ని విశ్లేషించడం, ముఖ్యంగా నిక్షిప్తమైన సామెతల వాడకం రచయిత భావవ్యక్తీకరణలో ఏ విధంగా సహకరిస్తుందో ఈ అధ్యయనంలో వివరించడానికి ప్రయత్నిస్తాను. పిల్లీశతకం ఒక సాహిత్య రచనగానే కాక, సామాజిక తత్త్వ గ్రంథంగా ఎలా నిలుపుతుందో నిరూపించడమే ఈ వ్యాసపు కేంద్ర బిందువు.

Key Words :- పిల్లీశతకం, ధ్వని, సమాజం, మానవులు, తాత్వికత, ఎలుక, సామెత

రచయిత పరిచయం: బోయి భీమన్న 1911, సెప్టెంబరు 19 న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో జన్మించాడు. ఇతని తల్లిదండ్రులు నాగమ్మ, పల్లయ్య. భీమన్న 1935లో

బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై 1937లో బి.ఇడి పూర్తి చేశాడు. గుడిసెలు కాలిపోతున్నై గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వరించింది. 2001లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2005 డిసెంబరు 16న హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు.

బోయి భీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజాస్పృహ గల కవిగా గుర్తింపు పొందాడు. ఆయన రచనల్లో సమాజంపై గాఢమైన పరిశీలన, అణగారిన వర్గాల పట్ల సానుభూతి, మానవ స్వభావంలోని వక్రతలపై విమర్శ ప్రధానంగా దర్శనమిస్తాయి. సంప్రదాయ కవిత్వానికి భిన్నంగా, భీమన్న తన భావజాలాన్ని సూటిగా, వ్యంగ్యంగా, సూటిగా గుచ్చే విధంగా వ్యక్తీకరించగల శైలిని అవలంభించాడు.

భీమన్నకు శతక రచన ఒక సాధనం మాత్రమే కాదు, అది ఆయనకు సమాజాన్ని విశ్లేషించే ఒక సాహిత్య ఆయుధం. 'పిల్లీ శతకం'లో ఆయన ఎంచుకున్న పిల్లీ ప్రతీక సాధారణంగా కనిపించే జీవి అయినప్పటికీ, మానవ సమాజంలోని మోసం, కపటత్వం, అవకాశవాదం వంటి లక్షణాలను వ్యక్తీకరించడానికి ఎంతో సమర్థంగా ఉపయోగపడుతుంది. ఈ ప్రత్యేక ఎంపికే భీమన్న తాత్విక లోతును సూచిస్తుంది.

బోయి భీమన్న రచనల్లో ధర్మం– అధర్మం అనే సిద్ధాంతాలను ఉపదేశ రూపంలో కాకుండా, లోకానుభవాల ద్వారానే చూపడం విశేషం, అందుకే ఆయన కవిత్వం బోధనాత్మకంగా కాక, ఆలోచనాత్మకంగా పాఠకుడిని ప్రభావితం చేస్తుంది.

గ్రంథ పరిచయం– పిల్లీశతకం

'పిల్లీశతకం' తెలుగు శతక సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది. సాధారణంగా శతకాలు ఒకే అంశంపై నైతికత లేదా భక్తి అందిస్తాయి. కాని పిల్లీశతకం ఆ సంప్రదాయాన్ని విరిచి పారేస్తూ, సమాజ విమర్శనే కేంద్రంగా చేసుకుని ముందుకు సాగుతుంది. ఇందులోని ప్రతి పద్యం స్వతంత్ర్యంగా అర్థవంతమైనదిగా ఉండటంతో పాటు, మొత్తం గ్రంథం ఒక సమగ్ర సామాజిక వ్యాఖ్యానంగా నిలుస్తుంది. పిల్లీని కేంద్ర బిందువుగా చేసుకుని రచయిత మానవ ప్రవర్తనను విశ్లేషిస్తాడు. ఎలుకను పట్టేందుకు నిద్రిస్తున్నట్లుగా నటించే పిల్లీ, అవకాశాన్ని చూసి దాడి చేసే స్వభావం– ఇలాంటి లక్షణాలు మనుషులలోని ద్వంద్వ నైతికతను ప్రతిబింబిస్తాయి.

ఈ విధంగా పిల్లీ శతకం అన్యాపదేశాత్మక శతకంగా గుర్తింపు పొందింది. భీమన్న పిల్లీశతకం పీఠికలో "నేను వాల్మీకి వారసున్ని' అని తన గురించి ప్రకటించాడు. "శీలాన్ని, అసలు మానవత్వాన్నే పోగొట్టుకొని, కేవలం బ్రతకడానికి చీకటి పెంట కుప్పల్లో తుట్ట పురుగుల కంటే కూడా హీనంగా గిజగిజ తన్నుకొంటున్న నేటి ధన కుక్షులు కనీసం ఈ పిల్లీ శతకాన్నైనా చదివి బాగు పడతారేమో చూడాలి" అని తను పిల్లీ శతకం రాయడానికి గల ఉద్దేశం ప్రకటించాడు.

పిల్లీశతకంలో మొత్తం 126 పద్యాలున్నాయి. కంద పద్యాలలో రాయబడింది. మకుటం "పిల్లీ", గ్రంథంలోని భాష సులభమైనదే అయినా భావం మాత్రం లోతైనది. ముఖ్యంగా కొన్ని పద్యాలలో ఉపయోగించిన సామెతలు పాఠకుడికి సుపరిచితమైన లోక జ్ఞానాన్ని తాత్విక స్థాయికి

తీసుకెళ్తాయి. సామెతల వాడకం వల్ల భావం మరింత గాఢంగా స్మరణీయంగా మారుతుంది. ఇది పిల్లీశతకాన్ని కేవలం కవితా సంకలనం కాకుండా, జీవిత బోధ గ్రంథంగా నిలబెడుతుంది.

పిల్లీ శతకంలోని వస్తు విశ్లేషణ
(ధర్మం– లోకవ్యవహారం– సామాజిక విమర్శ)
పిల్లీ ప్రతీక మరియు మానవ స్వభావం

పిల్లీశతకం వస్తువు పూర్తిగా పిల్లీ అనే ప్రతీక చుట్టూ నిర్మితమై ఉంది. సంప్రదాయంగా పిల్లీ ఒక సాధారణ జీవి. కానీ బోయి భీమన్న దృష్టిలో పిల్లీ మానవ సమాజానికి ప్రతినిధి. దాని నిశ్శబ్ద నడక, అవకాశాన్ని ఎదురు చూసే స్వభావం,అవసరమైనప్పుడు ఉగ్రరూపం ధరించడం, ఈ లక్షణాలన్నీ మనుషులలోని కపట నైతికతను ప్రతిఫలింపజేస్తాయి. ఈ ప్రతీక ద్వారా రచయిత నేరుగా మనిషిని విమర్శించకుండా, అన్యాపదేశ రూపంలో సమాజంలోని దోషాలను చూపిస్తాడు.. ఇదే పిల్లీశతకంలోని వస్తు వైశిష్ట్యం.

ధర్మ – అధర్మ భావన

పిల్లీ శతకంలో ధర్మం – అధర్మం సంప్రదాయ శాస్త్రీయ నిర్వచనాల రూపంలో కాకుండా లోకానుభవం ఆధారంగా చిత్రించబడుతుంది. పిల్లీ ఎలుకను పట్టడానికి మెల్లగా నడుస్తూ, నిద్రిస్తున్నట్లు నటించడం ఇది బాహ్యంగా శాంతి, అంతర్గతంగా హింస అనే ద్వంద్వత్వాన్ని సూచిస్తుంది.

ఇది మానవ సమాజంలో కనిపించే "పైకి ధర్మం, లోపల స్వార్థం'అనే ధోరణికి సంకేతం.

ఈ సందర్భాలలో భీమన్న ధర్మాన్ని ఉపదేశించడు. అధర్మాన్ని చూపించడం ద్వారా ధర్మం విలువను పాఠకుడి మనసులో పుట్టిస్తాడు.

లోకవ్యవహార దృష్టి:

పిల్లీ శతకం పూర్తిగా లోక వ్యవహార దృష్టితో నడుస్తుంది. ఇందులోని పాత్రలు దేవతలు కావు, మహాత్ములు కావు సాధారణ జీవులు. అందుకే ఇది పాఠకునికి సన్నిహితంగా అనిపిస్తుంది.

పిల్లీ ప్రవర్తన మనుషులు సమాజంలో ఎలా అవకాశవాదులుగా మారుతారో సూచిస్తుంది.

1. అవసరమైనప్పుడు వినయంగా ఉండటం
2. లాభం వచ్చినప్పుడు క్రూరంగా మారటం
3. శక్తివంతుల ముందు లొంగిపోవడం, ఈ లక్షణాలన్నీ లోకవ్యవహారంలోని వాస్తవాలను ప్రతిబింబిస్తాయి.

సామాజిక విమర్శ

పిల్లీశతకం యొక్క కేంద్ర వస్తువు సామాజిక విమర్శ రాజకీయం, ధనం, బలం, వేషధారణ మొదలగునవి ఇవి మనిషిని ఎలా దారి తప్పిస్తాయో పిల్లీ స్వభావం ద్వారా రచయిత చూపిస్తాడు.

భీమన్న విమర్శలో ప్రత్యేకత ఏమంటే అది కోపంతో కూడినదిగా కాక, వ్యంగ్యంతో కూడినది. వ్యంగ్యం వల్ల విమర్శ పదునెక్కుతుంది. కానీ పాఠకుడు విసుగుచెందడు, ధ్వని వ్యంగ్యంగా వ్యక్తమైతే, వ్యంగ్యాత్మకత మరింత స్పష్టంగా గాయపరిచే విధంగా కనిపిస్తుంది. వ్యంగ్యం అనేది హాస్యానికి మాత్రమే పరిమితమైనది కాదు; అది లోపల తీవ్ర నిరసన, నిరాశ, సమాజ వికృతులపై అసహనంను కలిగి ఉంటుంది. బోయి భీమన్న ఈ వ్యంగ్యాత్మకతను పిల్లీ శతకంలో అత్యంత సహజంగా ఆవిష్కరించాడు.

పిల్లీశతకంలో సామెతల ప్రస్తావన

పిల్లీశతకంలోని కొన్ని పద్యాలలో సామెతలు ప్రత్యక్షంగా లేదా అంతర్భాగంగా కనిపిస్తాయి. సామెత అనేది సామాన్య ప్రజల అనుభవసారానికి రూపం. భీమన్న ఈ సామెతలను ఉపయోగించడం ద్వారా

1. భావాన్ని సంక్షిప్తంగా చెబుతాడు.
2. పాఠకుడికి పరిచయమైన జ్ఞానాన్ని ఆశ్రయిస్తాడు.
3. తాత్విక భావాన్ని సులభంగా అర్థమయ్యేలా చేస్తాడు.

పిల్లీ ప్రవర్తనను వివరిస్తూ వచ్చే సామెతలు, మానవ స్వభావాన్ని విమర్శించే సాధనాలుగా మారుతాయి. ఇది పిల్లీ శతకాన్ని గ్రామీణ లోకజ్ఞానంతో అనుసంధానమైన శతకంగా నిలబెడుతుంది.

పిల్లీ శతకంలో జన వ్యవహారంలో ఉన్న సామెతలు కొన్ని

1. పని లేని మంగలి పిల్లీ తల గొరిగినట్లు
2. గోడపై పిల్లీ వాటము
3. పిల్లీశీలము
4. పొయ్యిలోన పిల్లీలేవలే
5. మార్జాల కబలము, మార్జాలన్యాయము
6. పిట్టా పిట్టా పోరును పిల్లీ తీర్చినట్టు
7. కాలుగాలినపిల్లీ
8. చేపల గంపకు పిల్లీ కాపలా
9. పిల్లీకి సాక్ష్యం ఎలుక
10. పిల్లీని చంకన బెట్టుక వెళ్ళుట

పై సామెతలను ప్రయోగిస్తూ భీమన్న శతకంలో విమర్శ బాణాలను వదిలారు. సామెత అనేది ప్రజల అనుభవసారానికి సంక్షిప్త రూపం. తెలుగు సాహిత్యంలో సామెతలు కేవలం అలంకారాలుగా కాక, లోకతత్వాన్ని వ్యక్తపరిచే సాధనాలుగా పనిచేస్తాయి. బోయిభీమన్న పిల్లీశతకంలో సామెతలు ప్రత్యక్షంగా, మరికొన్ని సందర్భాలలో అంతర్భావంగా తాత్విక లోతును మరింతపెంచుతాయి.

పిల్లీశతకం ధర్మాన్ని ఉపదేశించదు. కాని ఆలోచనకు పదును పెడుతుంది. లోకవ్యవహారాన్ని వాస్తవికంగా చిత్రిస్తుంది. సామాజిక లోపాలను వ్యంగ్య ధ్వనితో విమర్శిస్తుంది. సామెతల ద్వారా తాత్విక భావాన్ని లోతుగా చేస్తుంది. అందువల్ల ఇది కేవలం శతకం కాకుండా, సామాజికతత్వ గ్రంథంగా భావించవచ్చు.

పిల్లీశతకంలో ధ్వని

తెలుగుసాహిత్యంలో ధ్వని అనగా బాహ్యార్థం కంటే లోతైన అంతర్భావాన్ని సూచించే శక్తి, బోయి భీమన్న పిల్లీశతకంలో ఈ ధ్వని ప్రధానంగా వ్యంగ్యరూపంలో వ్యక్తమవుతుంది. పిల్లీ ప్రవర్తన వర్ణించినట్టు కనిపించినా, అంతర్భావంగా అది మనిషి స్వార్థబుద్ధి, ద్వంద్వ నైతికత, అవకాశవాద ధోరణులను సూచిస్తుంది.

॥పద్యం॥

"మనసు కలవారలనుకొని
మణుజులకున్ చెప్పి చెప్పి మహినెంద్రో కవుల్
మనసు చెడి చచ్చి పోయిరి!
మనసున్నది నీకు, తెలిసి మనవే!పిల్లీ!"

మానవులకు మనస్సనేదే లేదని, పిల్లీ మనసుకలదని పై పద్యంలో వివరించెను. ఇక్కడ బోయి భీమన్న ధ్వని ద్వారా చెప్పింది ఏమిటంటే ధర్మాన్ని మాటలలో పలుకుతూ, చర్యలలో క్రూరత్వాన్ని చూపేవారు, సమాజంలో అధికంగా ఉన్నారు అనే భావంతో సామెత స్వరూప ధ్వని ఉంది. ఇది లోకజ్ఞానాన్ని దగ్గరగా ఉండి, వ్యంగ్యాన్ని మరింత పదునెక్కిస్తుంది.

॥పద్యం॥

"ఈ లోకములో కొందరు
గ్రోలలేక ఒలుకబోసుకొని,
దానిని మార్జాలగుణమంద్రు! నీ గుణ
జాలము మా నరుల కింద్ర జాలమె! పిల్లీ!"

పై పద్యంలో భీమన్న మానవుడు తన శక్తిని, తెలివిని తాత్కాలిక లాభాల కోసం వృథా చేయడాన్ని విమర్శిస్తాడు. పిల్లీ క్షణిక ఆహారం కోసం అతి ప్రయత్నం చేయడం ద్వారా, మనిషి కూడా ధనం– కామం– భోగాల వెనుక పరుగు తీస్తూ నిజమైన లక్ష్యాన్ని మరచిపోతాడని సూచిస్తున్నాడు.

ముగింపు:

బోయి భీమన్న రచించిన పిల్లీశతకం సంప్రదాయ తెలుగు శతక సాహిత్యంలో ఒక విప్లవాత్మక రచనగా నిలుస్తుంది. దేవుడు, భక్తి లేదా శుద్ధనీతి బోధకు పరిమితమైన శతకాలకు భిన్నంగా, ఈ శతకం సమాజాన్ని మానవ స్వభావాన్ని వ్యవస్థల వక్రతను ప్రశ్నిస్తుంది.

నా ఈ పరిశోధన వ్యాసంలో పద్యాల ఆధారంగా చేసిన విశ్లేషణ ద్వారా ఈ ముఖ్యమైన తాత్విక భావాలు స్పష్టమయ్యాయి.

పిల్లీ ఒక సాధారణ జీవి కాదు; అది స్వార్థం, అధికారం, అన్యాపదేశం, వక్రోక్తి మొదలగునవి శైలి అలంకారాల కన్నా తాత్విక సాధనాలుగా ఉపయోగించబడ్డాయి. అందువల్ల పిల్లీశతకాన్ని కేవలం శతకం అని పిలవడం తక్కువే. ఇది ఒక సామాజిక తాత్విక గ్రంథం. ఆధునిక కాలంలో కూడా తన ప్రశస్తిని కోల్పోని రచన, పిల్లీ శతకం వ్యక్తులను కాక, వ్యవస్థలను, ఆలోచనా విధానాలను ప్రశ్నిస్తుంది.

ఆధార గ్రంథాలు

1. బోయిభీమన్న పిల్లీతకం. విమర్శనాత్మక సంచిక, హైదరాబాదు, తెలుగు అకాడమీ.
2. కృష్ణమూర్తి, బి., తెలుగు శతక సాహిత్యం, తిరుపతి; శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రచురణలు (1993)
3. రామకృష్ణ, తాడేపల్లి ఆధునిక తెలుగు కవిత్వం– ధోరణులు, హైదరాబాదు, తెలుగు అకాడమీ (1989).
4. సుబ్రహ్మణ్యం, కె. కావ్యాలంకార సిద్ధాంతాలు, విజయవాడ, ఆంధ్ర సాహిత్య పరిషత్ (1996).

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

కళా ప్రపూర్ణ డా. బోయిభీమన్న పిల్లీ శతకం - సామాజికాంశాలు

- డా. అంబటి భానుప్రకాశ్,
9948948787.

వ్యాస సంగ్రహం :

'శతేన శతకం ప్రోక్తం...' అని శతకానికి అమృతానందయోగి నిర్వచనం. తెలుగు సాహిత్యంలో శతకానికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. పూర్వం నుంచీ ఎందరో కవులు తమ సాహితీ వ్యాసంగాన్ని శతక ప్రక్రియతోనే ప్రారంభించారంటే అతిశయోక్తి కాదు. వందపద్యాల రచన శతకం. ఆత్మాశ్రయమై, మకుట, ఛందో నియమం కలిగిన రచన. అదే కోవలో డా. బోయిభీమన్న రాసిన పిల్లీ శతకం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

'పిల్లీ శతకం' బోయి భీమన్న రచించిన ఒక వ్యంగ్య శతకం.మానవులలో ఉండే మంచి చెడు, నీతి, చమత్కారం, హాస్యం, వైరాగ్యం, మొదలైన సామాజిక అంశాలను వస్తువులుగా చేసుకొని సాగింది. ప్రస్తుత సమాజంలోని కుల, మత, ధన, పదవీ వ్యామోహాలు వంటి బలహీనతలను పిల్లీతో పోలుస్తూ, సమాజంలోని వైవిధ్యాలను, వైరుధ్యాలను, మానవ స్వభావంలోని లోపాలను సైతం వర్ణిస్తూ, విమర్శనాత్మకంగా రాశారు. ముఖ్యంగాముగింపులో"ఢిల్లీ వర కేగవచ్చు, తెలియవె! పిల్లీ!" అనే పద్యంతో పాటు, పిల్లీకి సంబధించిన అనేక సామెతలను, జాతీయాలను ఈ శతకంలో సందర్భానుగుణంగా పొందుపరిచాడు కవి.

మానవ జీవితంలో పిల్లీ ఎంతగా పెనవేసుకున్న బంధమో ఈ శతకం తెలుపుతుంది. తేలిక పదాలతో, చక్కని ధారతో భావయుక్తమైనది.ఈ శతకం సమాజంపై లోతైన పరిశీలనతో పాటు,వినూత్నమైన ఆలోచనలు రేకెత్తించడమే కాక, వినోదంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందించే రచన.

కీలకపదాలు : సామాజిక చైతన్యం, హాస్యం, వ్యంగ్యం, ప్రాచుర్యం, విచక్షణ, అభ్యుదయం.

ఉపోద్ఘాతం :-

సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయితలలో ప్రముఖుడు డా. బోయిభీమన్న. 1911 సెప్టెంబరు 19న తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబంలో పుట్టారు. నాగమ్మ మరియు పుల్లయ్య ఇతని తల్లిదండ్రులు. విద్యాభాసం తర్వాత బోర్డు హైస్కూలులో చరిత్రను బోధించే ఉపాధ్యాయునిగా, తర్వాత ఆంధ్రప్రదేశ్ అనువాద విభాగం డైరెక్టర్ గా, రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ గా 1964 వరకు పనిచేశారు.

భీమన్న రాసిన 'గుడిసెలు కాలిపోతున్నై' గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. వీరు పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా రాశారు. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని సైతం రాశారు. వివిధ పుస్తకాలకు వీరు స్వయంగా వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ వారి కళాప్రపూర్ణ (1971), పద్మశ్రీ పురస్కారం (1973), కాశీవిద్యాపీఠం గౌరవ డాక్టరేట్ (1976), పద్మభూషణ్ పురస్కారం (2001), కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం, తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు వీరు పొందిన కొన్ని ముఖ్యమైన పురస్కారాలు. వీరు 2005 డిసెంబరు 16న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

డా. బోయి భీమన్న రాసిన పిల్లీ శతకంలో గల సామాజికాంశాలను వివరించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

విషయ విశ్లేషణ :-

బోయి భీమన్న రచనల్లో హాస్య,వ్యంగ్య శతకం'పిల్లీ శతకం'. 'కాదేదీ కవితకనర్హంఅన్నీ కవితామయమేనోయ్' అని శ్రీశ్రీ చెప్పినట్లుగా భీమన్న పిల్లీని కావ్య వస్తువుగా స్వీకరించి,తెలుగు సాహితీవనంలో పిల్లీకీ ఒక గౌరవాన్ని సంపాదించి పెట్టాడు. ప్రకృతిలో గౌరవప్రదమైన పశుపక్ష్యాదులు ఎన్నో ఉన్నప్పటికీ హేళనగా, నీచ దృష్టితో చూడబడుతున్నవీ లేకపోలేదు. తమతమ కావ్యాల్లో అల్ప ప్రాణులను వర్ణిస్తూ పద్యాలు వ్రాసిన కవులున్నారు. అలాంటి వాటిని తమ కవితావస్తువులుగా స్వీకరించి కవిత్వాన్ని రాసినవారూఉన్నారు. అయా శతకాలన్నీ అధిక్షేప శతకాలుగా నిలిచిపోయాయి. హాస్యం, వ్యంగ్యం ధ్వనించే ఈ రచనలు సమాజంలో నెలకొన్న దురాచారాలను, మూఢాచారాలను ఎత్తిచూపి, సాహితీ అభిమానులను ఎంతగానో అలరించినవి. వాటిల్లో గబ్బిలాన్ని,వాయసాన్ని(కాకి) కవితావస్తువులుగా చేసుకొని గుఱ్ఱం జాషువా, మామిండ్ల రామగౌడ్,మొదలైనవారు ఆయా ప్రాణులను మహోన్నతంగా వర్ణించి ఉన్నతమైన స్థానాన్ని కల్పించారు. కానీ పూర్తిగా కావ్యాలుగా, శతకాలుగా వ్రాసిన వారు అరుదు. వారిలో భీమన్న ఒకడు.

ఈ శతకం దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి ఆధ్వర్యంలో ఆకాశవాణిలో కావ్య గానం చేయబడిన పద్యాలు కొన్నైతే, వాణి, భారతి పత్రికలలో ప్రశంసించబడినవి మరికొన్ని. దాశరధి కృష్ణమాచార్య

రచించిన అభినవ 'దాశరధీ శతకం' ఉపోద్ఘాతంలో నిడదవోలు వెంకటరావు గారు ఈ శతకాన్ని ప్రత్యేకంగా మెచ్చుకున్నారని సాహిత్యకారుల అభిప్రాయం.

మానవునితో కలిసి మెలిసి ఉంటూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో సంపూర్ణంగా ఉన్న జంతువు పిల్లీ. పిల్లీని గురించి ఉన్న సామెతలు, చమత్కారాలు, నానుడు, విశ్వాసాలు మరే జంతువు గురించి లేవంటే అతిశయోక్తి కాదు. అందుకే పిల్లీని శతకానికి నాయకగా తీసుకున్నానని ఈ శతకం విలక్షణమైనదని పీఠికలో ప్రకటించుకున్నాడు బోయి భీమన్న. వీరి శతకానికి రాసుకున్న పీఠిక కూడా అనేకమైన అంశాలను ప్రస్తావించింది.

కావ్య పీఠికలో "భాష మీద ఆధిపత్యం కలవాడు ఏ రంగంలోనైనా రాణిస్తాడని,భాషకు మూలం ధారణ అని అలాంటి ధారణాశక్తి పెంపొందడానికి ప్రాచీన కావ్యాలను కంఠస్థం చేయాలి" అనే అంశాలు పూర్వం మన దేశంలో ఉండేవని దానికి విరుద్ధమైనటువంటి ఆధునిక విద్యా పద్ధతి నిరుద్యోగుల్ని, నిరీక్షణను సృష్టిస్తున్నదని వాపోయాడు.

శతకం– శత శబ్దానికి 'కమ్' అనే ప్రత్యయం చేరి శతకమైనది. "దివాకర్లవారు, డా!!జి. నాగయ్య, జి.వి. సుబ్రహ్మణ్యం, నిడుద వోలు వేంకటరావు మున్నగు పరిశోధకుల అభిప్రాయాలను బట్టి మొత్తం మీద సంఖ్యా నియమం, మకుట నియమం, వృత్త నియమం, ముక్తక నియమం అనేవి శతకమునకు ముఖ్యమైన లక్షణాలని చెప్పవచ్చు.

"మకుటోపేతమైనందున శ్రవణ సుభగంబై, ముక్తక పద్య యుత మైనందున ఇచ్ఛా భావ వ్యక్తీకరణంబున కాలవాలంబై, అష్టోత్తర శతపద్య పరిమితమేయయినందున త్వరితగతి పరిసమాప్తి కనుకూలంబై, ఏక ఛందోనుసారియయినందున పద్య రచనాభ్యాసమునకు సుసాధనంబై శతక ప్రక్రియ యలరారుచున్నది. నీతి నడుగువారికి నీతి గఱపుచు, భక్తిగోరు వారలను భక్తి పరవశులను గావించుచు, శృంగార వైరాగ్యాధిక్షేపాది వైవిధ్యభరితంబై, ఆంధ్ర భాషా సరస్వతీమ తల్లిమెడలో పచ్చల పతకమోయన విరాజిల్లుచున్నదీ శతకము. పురిటిలోనే బాలారిష్టములతో నల్లాడు సాహితీ ప్రక్రియలున్న యాధునిక యుగమున సైతము కాలదోష మన్నది యెఱుగక వర్ధిల్లుచున్నదీ శతకము".

ఈ వాక్యాలు యువ కవిమిత్రులు శ్రీ మేడిచర్ల హరి నాగభూషణం గారు విరచించిన పాగుంట వేంకటేశ్వర శతకానికి వెలుదండ సత్యనారాయణ గారు కూర్చిన పీఠిక లోనివి. ఇందులో శతక లక్షణాలను సంక్షిప్తంగా ప్రస్తావిస్తూ ఈ నాటికీ శతక ప్రక్రియకు కాలదోషం పట్టలేదని, నానాటికీ వర్ధిల్లుతూనే ఉన్నదని సాహితీకారులు గుర్తించాలని పేర్కొన్నారు."

పిల్లీ మీద ఉన్న సామెతలు ;–

పిల్లీకి ఎలుక సాక్షి
పిల్లీకి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం
పిల్లీకి బిచ్చం పెట్టనివాడు
పిల్లీ కళ్ళు మూసుకుని పాలు తాగినట్లు
పిట్టపోరు పిట్టపోరు పిల్లీ తీర్చినట్లు

పిల్లనిచ్చినవాడు ఈగ – పుచ్చుకున్నవాడు పులి
పిల్లీ ఎదురైతే తల్లి కూడా శత్రువే
పిల్లీ కన్ను,
పిల్లీ గొంతు
పిల్లీ లేనప్పుడే ఎలుకలు గంతులు వేస్తాయి
పిల్లీ వలస తిప్పినట్లు
శీలమన పిల్లీ శీలమె శీలము

ఈ సామెతలు పిల్లీ స్వభావాన్ని, మానవ సంబంధాలనుమరియుసామాజిక పరిస్థితులను వ్యంగ్యంగా, నానుడుల రూపంలో తెలియజేస్తున్నాయి.

పూర్వ సంప్రదాయ శతకకవుల దారిలోనే శతకంలో తొలి పద్యం శ్రీకారంతోనే ప్రారంభించి "శ్రీకారము నేను గొల్తు సిద్దము; పిల్లీ" అని ప్రకటించాడు భీమన్న. శ్రీకారంలో పిల్లీనే దర్శించాడని తెలుస్తున్నది.

సామాజికాంశాలు :

నీతి, న్యాయం, నైతికవిలువలు, మాతృప్రేమ, రాజకీయ, ప్రజాజీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార విశ్వాసాలు, నమ్మకాలు మొదలైన అంశాలెన్నో సమాజంలోముడిపడి ఉన్నాయి.కొన్ని నమ్మకాలు, విశ్వాసాలు వివిధ సందర్భాలలో మనుషులకు అనేక సమస్యలను సృష్టించి కష్టాలపాలు చేస్తుంటాయి. అలాంటి వాటిని ఎత్తి చూపుతూ బోయిభీమన్న పిల్లీ శతకాన్ని రచించారు.

సాధారణంగా ఎక్కడికైనా ప్రయాణమైనప్పుడు పిల్లీ ఎదురుపడితే అపశకునంగా భావిస్తారు. ప్రయాణాన్ని మానుకుంటారు.ఈ విశ్వాసాలు ఇక చెల్లవని ఘాటుగానే చెప్పాడు. తాను ఈ సాహిత్యపు పిల్లీని చంకన పెట్టుకునే డిల్లీ వరకు వెళ్లానని, యూనివర్సిటీ గౌరవ డాక్టరేటు, కళా ప్రపూర్ణ, పద్మశ్రీలను అందుకున్న భీమన్న తాను పొందిన గౌరవాన్ని ఉదాహరణగా చూపిస్తాడు.

పిల్లీని చంకను బెట్టుక
వెళ్ళుట యనుపిచ్చినుడులు విశ్వాసములున్
చెల్లవిక నిన్ను గైకొని
ఢిల్లీ వరకేగవచ్చు తెలియవె పిల్లీ (ప. 124)

ప్రస్తుత తరుణంలో కులప్రాబల్యం పెరిగిపోతున్న తరుణంలో మనకులం వాడైతే అందలమెక్కించడం కాదంటే అధోగతి పాలు చేయడం అనేది సమాజంలో సర్వసాధారణంగా మారిన అంశం. ఈ అంశాన్ని ఎత్తిచూపి ఇలా ప్రస్తావించాడు. 'ప్రతిభ ఉన్న చోట కులవిచక్షణ లేదు మన మహర్షులందరూ కూడా వర్ణ వ్యవస్థకు వెలుపల పుట్టిన వారని, ప్రతిభకు కుల వర్ణ వర్గ భేదాలకు

సంబంధం లేదని వాల్మీకి వశిష్ఠుడు వ్యాసుడు మొదలైన వాళ్ళు కాగలిగార'ని అభిప్రాయపడినాడు. ఈ పద్యంలో.....

వినదగు ఎవరు చెప్పిన
విని ఆ చెప్పినయతండు వేరే కులమా
మన కులమా అని చూడక–
మనిషిని గుర్తించువాడే మనుజుడు పిల్లీ (ప–పీఠిక)

ఆధునిక సమాజంలో కామం విచ్చలవిడితనాన్ని అలవర్చుకున్న సందర్భాన్ని ఉద్దేశించి అనంగ విద్యను భీమన్న వివరించాడు. కామవిద్యకు సంబంధించిన అంశాలను విప్పి చెప్పితే చెడిపోతారని మూర్ఖవాదం సత్యసమ్మతమైనది కాదని అభిప్రాయపడతారు. కామశాస్త్ర అంశాలను శాస్త్రీయంగా బోధించకపోతే అశాస్త్రీయంగా అలవర్చుకుంటారని అంటాడు. సెక్స్ విద్యను సక్రమ మార్గంలో తెలుసుకున్నందువల్ల ఏ వయసులో ఎవరు పాడుకారని పైగా జీవిత గమనంలో విజయాన్ని సాధిస్తారని వివరిస్తాడు.

పనిలేని మంగలి పిల్లీ తల గొరిగాడని సామెత ....సోమరి తనాన్ని నిరసిస్తూ కష్టపడి పని చేసే తత్వాన్ని అలవరచుకోవాలని చెబుతాడు.పని లేకపోతే ఈ ప్రపంచానికి మనుగడ లేదని, పని తప్పి తిరిగే వాడికి ఇహపరాలు సైతం ఉండవని అంటాడు.

పని లేని మంగలికిన్ బల్
పని చెప్పిన మేటి వీవు; పని లేకున్నన్
మనుగడయే లేదు జగతికి !
పని దొంగకు లేదు ఇహము పరమును; పిల్లీ (ప–9)

అందాన్ని గూర్చి వర్ణిస్తూ హృదయ స్పందనను కంద పద్య కవితా రూపంలో అందిస్తానని అందుకొమ్మంటాడు కవి.

అందమన నేమి! హృదయ
స్పందనమే అందమౌను; స్పందనె కవితా
నందము, కాన నీకది
కందముతోనిత్తు, ప్రీతి గైకొను పిల్లీ! (ప–20)

వర్తమానంలో కొందరు తమ పేరుప్రఖ్యాతుల కోసమై పూర్వ కవుల రచనల్ని ఏదో మార్పుచేసి తనవని చెప్పుకుంటారు. ఇలాంటి తస్కరణ వదిలి జీవించలేడా అని ప్రశ్నిస్తాడుకవి.

ప్రాచుర్యము కోసరమై
ప్రాచీనపు గ్రంథములకు పండితు డేవో
మాచికలు వేసి తన వను!
వాచకములు లేవె బ్రతుక వసుధన్ పిల్లీ! (ప–30)

లోకంలో కీర్తి పొందడానికి వారిని వీళ్లు, వీరిని వాళ్లు ఒకరికొకరు పొగడుకోవడం జరుగుతున్నదనే సత్యాన్ని వెలిబుచ్చాడు కవి.

వారిని వీరును, వీరిని
వారును బహుగొప్ప చేసి పైకెత్తుచు, తత్
బేరమును పంచుకొందురు;
కీరితి గడియించువారి కిటుకిది పిల్లీ! (ప-33)

ధనాన్ని గురించి ప్రస్తావిస్తూ గుప్పిటి నిండా డబ్బు ఉన్నవాడె మనిషనే సత్యాన్ని వెలిబుచ్చాడు. బలశాలి పాలకుడౌతాడని,కొబ్బరి వేస్తేనే కూర రుచిఅని,దిబ్బడ వేసేదే ముక్కని వ్యంగ్యంగా ఉధ్బోదిస్తాడు.

జబ్బ గలవాడె జనపతి
కొబ్బరి వేసినదె కూర, గుప్పిటి నిండా
డబ్బుగలవాడె మనుజుడు
దిబ్బడ వేసినదె ముక్కు, తెలియవె పిల్లీ; (ప-46)

మనుషుల ప్రవర్తనను ఇలా వ్యక్తం చేస్తాడు కవి. మనస్సుల్లో విషాన్ని నింపుకుని బయటకు మాత్రం తేనెచినుకులు చిందిస్తారు. అలాంటి వారినే ప్రజలు నమ్ముతారని,అలాంటి గుణము ఉంటే బాగుపడతావని అంటాడు కవి.

హృదయములో విషమున్నను
వదనములో తేనె కార్చవమ్మా! ప్రజల
భ్యుదయపరురాలి వని నీ
పదములు సేవింత్రు, బాగుపడుదువు పిల్లీ! (ప-50)

మరో పద్యంలో మనుషుల గుణాన్ని వర్ణిస్తూ .... సృష్టిలో ఉన్న పశువులు, పక్షులు, జలచరాలు, జీవులన్నీ అర్థమౌతాయి కానీ మనుజుడు మాత్రం అర్థం కాడని విచారాన్ని వ్యక్తం చేస్తాడు.

అర్థమగు పశులు, పక్షులు
అర్థమ్మగు జలచరాలు, అణుజీవములున్;
అర్థమ్ముకారు మనుజులు
అర్థమునకు దాసులైన వ్యర్థులు; పిల్లీ ! (ప-59)

కళ్ళు మూసి పాలు దాగుతూ తనను ఎవరు చూడరని పిల్లీ అనుకోవడం చూపిస్తూ, ఇక మనుషులు నీకు అనుచరులుగా వస్తారని తెలుపుతాడు.ఎలుకను పట్టుకోవడమనే విద్యను పిల్లీకి ఎవరైనా నేర్పుతారా .... పిల్లీకి బిచ్చం పెట్టక పోవడం.... ఇదంతా స్వభావసిద్ధమని ప్రకటిస్తాడు కవి.

పిల్లీకి ఎలుక సాక్ష్యమా అనే పెద్దలు కూడా తమ అనుచర వర్గాన్ని పోషించుకుంటారు. ఇక పిల్లీ లేని సమయంలో ఎలుకలు ఇల్లు పీకి పందిరేస్తాయి. లోకంలో మోసగాళ్ళు చెలరేగి పోతుంటే మూడుకన్నుల శివుడు ఎటు పోయాడని నిలదీస్తాడు.

పిల్లీ బాజారుకు పోయిన
ఇల్లు తీసి పంద్రివేయు నెలుకలు; మరి మా
ముల్లోచను డెటు పోయెనొ!
కల్లోలము చేతురవని కపటులు! పిల్లీ! (ప–106)

ముగింపు :

డా. బోయి భీమన్న "పిల్లీ శతకం"లో సామాజికాంశాలను హాస్య వ్యంగ్యోక్తులతో సున్నితంగా ఎత్తిచూపారు. పండిత పామర జనరంజకంగా సరసభావ యుక్తంగా, సూటిగా, సులభంగా అర్థమయ్యే పదజాలంతో, చక్కని ధారాశుద్ధితో సాగిన పద్యాలివి.

ముఖ్యంగా సమాజంలో నెలకొన్న సమస్యలైనమూఢాచారాలు పాటించడం, మానవత్వం లేకపోవడం, శకునాలు పాటించడం, మానవుడు, దానవుడు, కులవిచక్షణ, కామశాస్త్రం, సోమరితనం, పాండిత్యం, రాజకీయం, కీర్తి ప్రతిష్టలనుమొదలైన అంశాలనెన్నింటినో ఎత్తిచూపి, విమర్శనాత్మకంగా రాసిన శతకం ఇది. వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన భీమన్న పిల్లీ శతకం కూడా ప్రశంసనీయమైనది.

ఆధార గ్రంథాలు :

1. పిల్లీ శతకం – డా. బోయి భీమన్న
2. కదంబం – సం. డా. సాగి కమలాకర శర్మ
3. పాగుంట వేంకటేశ్వర శతకం–మేడిచర్ల హరినాగభూషణం, ముందు మాట – డా. వెలుదండ సత్యనారాయణ.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

'గుడిసెలు కాలిపోతున్నై'- సామాజిక తాత్వికత

- డా. వెల్దండి శ్రీధర్
తెలుగు అధ్యాపకులు

వ్యాస సంగ్రహం:

పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటి ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక విప్లవాత్మకమైన రచన. ఈ పరిశోధన వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం ఈ కావ్యంలోని సామాజిక తాత్వికతను విశ్లేషించడం. సమాజంలోని అన్యాయాలను, కుల వివక్షను, దారిద్ర్యాన్ని రూపుమాపాలనే కవి ఆకాంక్షను ఈ వ్యాసం చర్చిస్తుంది. కేవలం నీతులు చెప్పడం వల్ల సమాజం మారదని, శ్రమజీవులకు బ్రతికే మార్గం చూపాలని భీమన్న బలంగా వాదించారు. ఈ కావ్యం ద్వారా ఆయన దళితుల బాధలను, ఆకలిని, ఆవేదనను విశ్వవ్యాప్తం చేశారు. "గుడిసెలు కాలిపోతున్నై" అంటే కేవలం నివాసాలు కాలిపోవడం కాదు, అణగారిన వర్గాల ఆశలు, ఆశయాలు మండిపోతున్నాయని అర్థం. ఈ కావ్యానికి 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం దీని గొప్పతనానికి నిదర్శనం.

పరిశోధన ఊహా ప్రణాళిక:

ఈ పరిశోధనలో 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యంలోని కవితలను, పీఠికను విశ్లేషణాత్మక పద్ధతిలో అధ్యయనం చేయడం జరుగుతుంది. గుడిసెలు కాలడం అనేది కేవలం భౌతిక దృశ్యం కాదు, అది అజ్ఞానాన్ని, అబలత్వాన్ని దహించే ఒక 'సమతా జ్యోతి'గా కవి ఎలా చిత్రించారో పరిశీలిస్తాను. అంబేద్కర్ సిద్ధాంతాలు, మానవతావాదం, హేతుబద్ధమైన ఆలోచనలు ఈ కావ్యంలో ఎలా అంతర్లీనంగా ఉన్నాయో ఈ వ్యాసం వివరిస్తుంది.

పరిశోధన పద్ధతులు:

ఈ పరిశోధనలో 'వర్ణనాత్మక' మరియు 'విశ్లేషణాత్మక' పద్ధతులను అనుసరించడమైనది. మూల గ్రంథంలోని కవితలను సామాజిక కోణంలో విశ్లేషించడం జరిగింది.

ఆశించిన ఫలితాలు:

ఈ పరిశోధన ద్వారా భీమన్న తాత్వికతలోని లోతును అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం చేసే 'నిర్మూలన' పథకాలు ప్రత్యామ్నాయ 'నిర్మాణం' లేకుండా ఎలా విఫలమవుతున్నాయో ఈ కావ్యం నేటికీ అన్వయించుకోదగ్గదిగా ఉంది. శ్రమజీవుల సాధికారత, కుల నిర్మూలన, మూఢనమ్మకాల నుంచి విముక్తి ద్వారానే నిజమైన సామాజిక మార్పు సాధ్యమని ఈ వ్యాసం నిరూపిస్తుంది. భవిష్యత్ సామాజిక పరిశోధనలకు ఈ విశ్లేషణ ఒక దిక్సూచిలా నిలుస్తుందని ఆశించవచ్చు.

కీ వర్డ్స్:

బోయి భీమన్న, సామాజిక తాత్వికత, సమతా జ్యోతి, కుల నిర్మూలన, శ్రమజీవుల సాధికారత.

ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్యంలో అభ్యుదయ, విప్లవ, దళిత సాహిత్య ధోరణుల కలయికగా నిలిచిన అరుదైన కావ్యం 'గుడిసెలు కాలిపోతున్నై'. బోయి భీమన్న ఈ కావ్యంలో సమాజంలోని అట్టడుగు వర్గాల వేదనను, శ్రమజీవుల దైన్యాన్ని అత్యంత శక్తివంతంగా చిత్రించారు. ఈ కావ్యం ఒక సామాజిక సిద్ధాంత గ్రంథం. సమాజంలోని అసమానతలను, కుల వివక్షను రూపుమాపాలనే బలమైన ఆకాంక్ష ఇందులో కనిపిస్తుంది. భీమన్న ఈ కావ్యంలో కూలీల జీవితాలను అద్దం పట్టారు. పగలంతా ఖామందుల పొలాల్లో రెక్కలు ముక్కలు చేసుకుని పని చేసే కూలీలు, చీకటి పడ్డాక కూడా విశ్రాంతి దొరకని వైనాన్ని ఆయన చిత్రించారు. "సాయంత్రమయింది. పొద్దు కుంకింది. చీకటి కమ్మింది. అప్పటికిగాని వదల్లేదు పని నుంచి కూలీలను ఖామందు." ఈ వాక్యాల్లో శ్రమ దోపిడీ పరాకాష్టను మనం చూడవచ్చు.

1. దళిత దృక్పథం:

ఈ కావ్యంలో దళితుల బాధలను, ఆకలిని, ఆవేదనను విశ్వవ్యాప్తం చేశారు. 'గుడిసెలు కాలడం' అనేది ఒక ప్రతీకాత్మకమైన అంశం. కవి దృష్టిలో గుడిసెలు కాలడం అంటే కేవలం పేదల ఇళ్లు కాలిపోవడం కాదు. అది అజ్ఞానాన్ని, అబలత్వాన్ని, సమాజంలోని మురికిని దహించే 'సర్వమానవ సమతా జ్యోతి'.

"గుడిసెలు కాలిపోతున్నై!
ఓహో గుడిసెలు కాలిపోతున్నై!!
ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయి వుంటై
గుడిసెలు మరెవరికుంటై

.....
ఈ గుడిసెలు
మళ్లీ మళ్లీ అవతరిస్తుంటై
పోతుంటై
పుట్టుకొస్తుంటై
ఈ విషవలయం సాగడం
ఎంతవరకు?
రహస్యం గుడిసెల వాళ్లకు తెలిసేవరకు" (పుటలు 33, 34)

దళితులు నివసించే పేటలను 'నరకం కంటే మురికిది' అని వర్ణించడం ద్వారా సమాజం వారి పట్ల చూపే నిర్లక్ష్యాన్ని భీమన్న ఎత్తిచూపారు. దేశ సంపదను సృష్టిస్తున్న చేతులకు నీడ కరువవ్వడం, ఉన్న గుడిసెలు కూడా అగ్నికి ఆహుతి కావడం ఈ కావ్యంలోని ప్రధాన వేదన. అన్యాయానికీ, అధర్మానికీ, మానవుడు మానవుణ్ణి పెట్టే హింసకూ జీవ నిదర్శనాలైన ఆ గుడిసెల్ని తగలబెట్టి, వాటి స్థానంలో మేడలు లేవాలని కవి ఆకాంక్షిస్తారు. అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండటం దళితులకు తగదని, తమ హక్కుల కోసం పోరాడాలని ఈ కావ్యం ప్రబోధిస్తుంది. మతం, కులం పేరుతో జరుగుతున్న అరాచకాలను ఎండగట్టడంలో భీమన్న రాజీ పడలేదు. భీమన్న దృక్పథం కేవలం కుల వివక్షకు వ్యతిరేకంగానే కాకుండా, ఆర్థిక దోపిడీని ఎదిరించే శ్రమ శక్తిని గౌరవించేదిగా ఉంది. విప్లవాత్మకమైన మార్పు ద్వారానే దళితుల జీవితాల్లో వెలుగులు వస్తాయని ఆయన నమ్మాడు. సమాజంలో మనుషులందరూ సమానమనే మానవతావాదాన్ని దళిత దృక్పథంతో జోడించి వివరించారు.

2. సామాజిక ఎక్స్‌రే రిపోర్టు:

దేశ సంపదను సృష్టిస్తూ, జాతిని పోషిస్తున్న నిస్వార్థ శ్రమజీవులు నరకం కంటే మురికిగా ఉన్న పేటల్లో నివసించడం పట్ల భీమన్న తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. "ఈ చీకటి ఆకటి పొగ గుడిసెల్లోనా

ఈ జాతి జీవన దాతలు నివసిస్తున్నది!" అని ఆయన ప్రశ్నించడం లోని సామాజిక ఆవేదన స్పష్టంగా కనిపిస్తుంది.

"ఇక్కడి హోటళ్లు మొసళ్లు
ఇక్కడి వీధులు వ్యాధులు
ఇక్కడి పురజనులు –
పాపం, వట్టి గిరిజనులు
నోరూ, వాయీ లేని హరిజనులు
ఒక్క క్షణమైనా ఇక్కడిక ఉండలేను
ఏమైనా సరే! ఇంటికిపోవాలి" (పుట. 61)

పనిని వెతుక్కుంటూ నగరానికి వచ్చిన వలసకూలికైనా, కవికైనా, రవికైనా ఇంటి బెంగ తప్పదని అంటాడు. తనదైన ఇల్లు అది గుడిసైనా, మేడైనా పోయి తీరాలని ఆరాటపడుతాడు. పోరుగూరు మరీ బాధిస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశాడు.

"ఈ మానవ లోకంలో
ఒకొక్కడికి కొకొక్క రోగం
పైకి బాగానే కనిపిస్తారు
లోపల ఏదో కుళ్లు, ఏవో పుళ్లు
అందమైన దంత క్షతాల వెనక
గారపట్టిన పుచ్చు పళ్లు" (పుట. 64)

సగటు మనిషి మనసులో ఎంత కుళ్లు ఉందో ఎక్స్‌రే తీసి చూపిస్తాడు కవి. మనిషికి మనిషికి మధ్య అంతరం, సామాజిక, ఆర్థిక దూరాలను ఎత్తి చూపుతాడు. ఓర్వలేనితనాన్ని ఎండగడుతాడు. "ఇది కలియుగం, ప్రజల యుగం/ప్రజలే ఇప్పుడు స్వయం పాలకులు/ఈనాటి విశ్వరూపం జనం/ఏవీ ఎక్కడున్నై ఆ దున్నలు/చూపు విరగ్గొట్టేస్తా వాటి వెన్నులు" (పుట. 74) అంటూ ప్రజాస్వామ్య గొప్పతనాన్ని, ప్రజా శక్తిని ప్రదర్శించాడు.

"ఇంట్లో కంపు కొడతాం బైట గుబాళిస్తాం
హృదయాన్ని ఎండగడుతాం, శరీరాన్ని మేపుతాం
బుద్ధిని బహిష్కరిస్తాం! దురాశకు డిన్నర్లిస్తాం
స్వార్థాలకు పతాకలు కట్టి ఎగురవేస్తాం
మేం అధునికులం" (పుట. 180)

మనిషి తనకు తాను ఆధునికుడనుకుంటూనే తిరోగమనం చేస్తున్నాడని ఈసడించుకుంటాడు. మనిషి తాను నిర్మించుకున్న ఆధునిక సౌకర్యాలలోనే నలిగిపోతున్నాడని వాపోతాడు. స్వార్థం, బూటకపు ఆదర్శాల్లో జీవిస్తూ రోజు రోజుకు క్షీణిస్తున్నాడని హెచ్చరిస్తాడు.

3. నిర్మాణం లేని నిర్మూలనం:

ప్రభుత్వాలు 'మురికివాడల నిర్మూలన' పేరిట గుడిసెలను పీకిపారేస్తున్నాయి తప్ప, వారికి ప్రత్యామ్నాయ వసతి కల్పించడం లేదని భీమన్న విమర్శించారు. మైసూరు ప్రభుత్వం పాకీ వృత్తిని నిషేధించినప్పుడు, ఆ వృత్తి చేసేవారే దానిని కొనసాగించమని కోర్టుకు వెళ్లడం వెనుక ఉన్న సామాజిక విషాదాన్ని ఆయన ఎత్తిచూపారు. ప్రత్యామ్నాయ ఉపాధి లేనప్పుడు నిషేధాలు వ్యర్థమని ఆయన వాదన.

4. కులం – మతం:

"కుల వ్యవస్థ నిర్మూలించబడనిదే ఈ భారత సమాజానికి ముక్తి లేదు" అన్న డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ సిద్ధాంతాన్ని భీమన్న ఈ కావ్యంలో బలంగా వినిపించారు. కులం తెలియక ముందు

గౌరవించబడి, తెలిసిన తర్వాత అవమానించబడే సామాజిక దురాచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

"ఓరీ మూర్ఖుడా! మతం విషం రా విషం
నల్లమందాన్నాడెవడో అది అబద్ధం
మతం విషం ఆత్మనే చంపుతున్న విషం
.....
మానవ భావన నుంచి
మతాన్ని తొలగించితే చాలు
విశ్వమానవ శ్రేయస్సు" (పుట.44)

అలాగే, మతం, భక్తి పేరిట పేదలను అజ్ఞానంలో ఉంచే పద్ధతులను ఆయన విమర్శిస్తూ, మనిషికి నీతుల కంటే బ్రతికే మార్గం ముఖ్యమని చాటారు. ఎంత కాలం గొర్రెలా బతుకుతావు? సింహంలా తిరగబడుమని కర్తవ్యాన్ని బోధిస్తాడు.

"నాస్తికుడంటే
మంచి చెడ్డలతో నిమిత్తం లేకుండా
మతాన్నే పట్టుకు వ్రేలాడేవాడు
మనిషిని మనిషిగా గుర్తించనివాడు" (పుట. 70)

ఆస్తికుడంటే భయం, భక్తి ఉన్నవాడని, నాస్తికుడంటే మతాన్ని పట్టుకువేలాడేవాడని హేతుబద్ధమైన నిర్వచనం ఇచ్చాడు.

"ఈ గుడులన్నీ మట్టివి
ఈ దేవుళ్లంతా మిణుగురులు
ఈ మతాలన్నీ దొంగల గుహలు
ఈ మనుషులు బుర్రల్లేని బొమ్మలు" (పుట. 81)

గొర్రెల్లా తలూపడం కాదు, కుల, మత, వర్ణ, వర్గ విముక్తమైన విశ్వైక మానవతా మార్గం వైపు మరలండీ అని మానవ లోకానికి పిలుపునిచ్చాడు. అప్పుడే ఆనంద రసాద్వైతం కలుగుతుందని హితబోధ చేశాడు.

"మనిషి గుణం మారడం లేదు
కారణం మతం!
మనిషి మెదడు పెరగడం లేదు
కారణం భక్తి" (పుట. 207)

మతం, భక్తి మాటున మనిషి మరింత మూర్ఖుడవుతున్నాడని బోయి భీమన్న ఫిర్యాదు. ప్రార్థనలు, భజనలు అన్నీ వట్టి శవజాగరణలేనని తేల్చి పారేస్తాడు. మతం ఒక పిచ్చి అని అంటాడు. మతం, భక్తీ రెండూ గొర్రెల కోసం పెట్టిన ఎర అని అందులో పడి చైతన్యాన్ని కోల్పోవద్దని చెప్తాడు.

ముగింపు:

'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యం నిండా దళిత వర్గాల, అట్టడుగు వర్గాల గొంతులు వినిపిస్తాయి. అవినీతి, బంధుప్రతి, రాజకీయ నాయకుల డొల్లతనం, ఓటు విలువ ఇలా ఎన్నో సామాజికాంశాల మీద భీమన్న ఆలోచనా ధార ఈ కావ్యం. ఇందులో భీమన్న టోన్ ఎంతో వ్యంగ్యంగా ఉండి సగటు పాఠకుడిలో ఒక నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుంది. బోయి భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' కేవలం నినాదాల కావ్యం కాదు. అది సామాజిక మార్పుకు ఒక దిక్సూచి. "మనిషికి నీతులు చెప్పవద్దు, బ్రతికే మార్గం చూపండి" అన్న ఆయన మాటలు నేటి ఆర్థిక, సామాజిక పరిస్థితులకు కూడా అద్దం పడతాయి. దేవుడు, మతం, భక్తి అనే మత్తు నుంచి ప్రజలు మేలుకొని, మానవత్వం కేసి మరలాలని, తమ హక్కులను తామే గుర్తించాలని ఈ కావ్యం ప్రబోధిస్తుంది. ఇందులో దళిత దృక్పథం అనేది కేవలం ఒక కులానికి సంబంధించినది కాక, ప్రపంచవ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న ప్రతి మనిషికి ప్రతినిధిగా నిలుస్తుంది. భీమన్న ఆశించిన సమసమాజ స్థాపన దిశగా ఈ కావ్యం ఇప్పటికీ దిశానిర్దేశం చేస్తూనే ఉంది. గుడిసెలు కాలినా, ఆ గుడిసెల్లోని ఆత్మవిశ్వాసం చావదు అని నిరూపించిన మహనీయుడు భీమన్న. హేతుబద్ధత, సామాజిక న్యాయం, మానవత్వమే ఈ కావ్యం యొక్క పరమ తాత్వికత.

ఉపయుక్త గ్రంథాలు:

1. బోయి భీమన్న, గుడిసెలు కాలిపోతున్నై, ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్.
2. దళిత సాహిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు.
3. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – వివిధ వాల్యూమ్స్.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న గారి పీఠికల పరిశీలన

– పోరెడ్డి మృదుల
తెలుగు పరిశోధక విద్యార్థి
సెల్ :630390565.

ఉపోద్ఘాతం:

పీఠికల్లో గ్రంథ నేపథ్యం, విషయపరిచయం, వ్యక్తిగత జీవిత విశేషాలు మొదలైనవి పేర్కొంటారు. పీఠిక లేకుండా పుస్తకం రాయడం కంటే పుస్తకం లేకుండా పీఠిక రాయడమే నయం అని "క్రిస్టఫర్ మార్స్" అనే రచయిత పీఠికకున్న ప్రాముఖ్యతను తెలియజేశారు అనే మాటను ఉటంకిస్తూ డాక్టర్ బోయి భీమన్న సాహిత్య పీఠం వారు ఈ గ్రంథాన్ని ముద్రించారు. ఈ పుస్తకానికి ముందుమాట గా "పీఠికా పరమేశ్వరుడు బోయి భీమన్న" అనే శీర్షికతో ఆచార్య కే. సంజీవరావు (శిఖామణి) గారు బోయి భీమన్న గారి రచనలను, వాటికి సూచించిన పీఠికలను, పీఠికల ఆంతర్యాన్ని కూడా వివరించే ప్రయత్నం చేశారు. భీమన్న గారు తమ కావ్యాల్లో ఏ విషయాన్ని ప్రతిపాదించాలని అనుకుంటున్నారో వాటి నిరూపణ కోసం చక్కని పరిశోధనాత్మక విషయాలను రూఢీ పరచడం మనకు ఈ పీఠికల ద్వారా కనిపిస్తుంది. పంచములు ఆర్యులే అని నిరూపించడానికి వేదాలు, నిరుద్ధభారతం, హరిశ్చంద్రో పాఖ్యానం, అమరకోశం, మనుస్మృతి, భగవద్గీత, విజ్ఞాన సర్వస్వాలు, ఉపనిషత్తులు మొదలైన ఆకరాలనే కాక కాళిదాసు, శంకరాచార్యులు ,వేమన లాంటి మహామహుల అభిప్రాయాల్ని సైతం తెలియజేశారు. ఇంతటి పరిశోధనాత్మక పీఠికలు తెలుగులో రాసిన వారిని వేళ్ళపై లెక్కపెట్టవచ్చు అని శిఖామణి గారు బోయి భీమన్న గారి ప్రయత్నాన్ని పొగిడిన తీరును కూడా ఈ పీఠికల పుస్తకం చదవడం ద్వారా తెలుసుకోవచ్చు.

భీమన్న గారి పీఠికలన్నీ కూడా విషయ వివేచన, చక్కని శైలితో కూడి ఉన్నాయి. భీమన్న గారి పద్య కావ్యాలు, వచన కవిత్వం, గేయానికి సంబంధించిన పీఠికలు మొదటి వాల్యూమ్ గా ప్రచురిస్తే, భీమన్న నాటకాలు సైద్ధాంతిక గ్రంథాలు, జీవిత చరిత్రకు సంబంధించిన పీఠికలు రెండవ వాల్యూమ్ గా పాఠకుల, విద్యార్థుల, పరిశోధకుల సౌకర్యార్థం బోయి భీమన్న సాహిత్య పీఠం వారు ప్రచురించారు. ఒక పీఠిక చదివితే ఒక రచన చదివినట్టు మరి పీఠికల పుస్తకమే చదివితే ఎన్నో రచనలు చదివినట్టు కనుక బోయి భీమన్న సాహిత్య పీఠానికి అందరం కృతజ్ఞులమే.

వ్యాస విశ్లేషణ :

తమ కావ్యాలకు స్వీయ పీఠికలు రాసుకున్న వారిలో జాషువా, కరుణశ్రీ, త్రిపురనేని రామస్వామి చౌదరి, నార్ల వెంకటేశ్వరరావు, గుంటూరు శేషేంద్ర శర్మ వంటి వారి లాగే వైవిధ్య భరితమైన పీఠికలను రాశారు భీమన్న గారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన "గుడిసెలు కాలిపోతున్నై రచనకు "దండోరా" అనే పేరును పీఠికకు పెట్టారు. దండోరా అంటే అర్థం – ప్రకటన చేయడం. ఈ గుడిసెలు కాలిపోతున్నై అనే రచన ద్వారా గుడిసెలు మళ్లీమళ్లీ అవతరిస్తుంటాయి/ పోతుంటాయి/ పుట్టుకొస్తుంటాయి/ ఈ విష వలయం సాగడం కొనసాగుతూనే ఉంటుందట/ ఎప్పటివరకటా/ ఈ రహస్యం గుడిసెల్లో బ్రతికే వాళ్లకు తెలిసే వరకట..... అని దండోరా వేస్తాడు. ఇలాగే "నా ఊహలలో వాల్మీకి కి పండోరా" అనే పీఠికగా, "పాలేరు కి బాణా కర్ర" అని "కూలి రాజు కి సర్వోదయ సోషలిజం" అని "రాగవాశిష్ఠానికి ఈ నాటకం బయోడేటా" అని వేద వ్యాసుడు నాటకానికి జ్ఞానం నుంచి జన్మకు" అని "మోక్షం నా జన్మ హక్కుకు ఉపనయనం" అని వైవిధ్యభరితమైన శీర్షికలతో పీఠికలను రాశారు భీమన్న గారు.

'పాలేరు' నాటకానికి రాసిన "బాణాకర్ర"లో భారతీయ గ్రామాలలో రైతులకు, కూలీలకు కూడా ఆయుధాలు చేతి కర్రలే. ముఖ్యంగా పాలేరులకు ఆత్మరక్షణం ఇదే అంటాడు. ఈ నాటకానిది ఒక విప్లవ చరిత్రగా చెప్పుకుంటాము. సామాజిక, విద్యా రంగాలలో, వ్యవసాయ కూలీ వర్గాలలో ఈ నాటకం సాధించిన మార్పు తెలుగు సాహిత్య చరిత్రలో, తెలుగువారి జీవితాలలో వెలుగురేఖగా నిలిచింది. దీని వివరాలు మనం "పాలేరు నుండి పద్మశ్రీ వరకు" అనే గ్రంథంలో చూస్తాము. ఈ రచన మౌలిక సాహిత్యానికి ఉండవలసిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలలో సమకాలీనతను సాధించినట్లుగా భీమన్న గారు పాలేరు పీఠికలో ప్రస్తావించారు. నిజంగా కూడా అదే జరిగినట్లు పాఠకులుగా పాలేరు నాటకం చదివినప్పుడు అనుభూతి చెందుతాం.

'కూలి రాజు' నాటకానికి "సర్వోదయ సోషలిజం" అనే శీర్షికతో ఆనాటి "మద్రాసు రాష్ట్ర మంత్రి వేముల కూర్మయ్య" గారికి అంకిత మిచ్చినట్లు పీఠిక నందు ప్రస్తావించారు. ఇది మొదట కేవలం వ్యవసాయ కూలీల సాంఘిక, ఆర్థిక సమస్యలను తీసుకొని 'కష్టజీవి' అనే పేరుతో రాసిన నాటకం. ఈ రచనా కాల సమయంలో దేశమంతా, రాష్ట్రమంతా ఉద్యమ వాతావరణం కనుక రాష్ట్రంలో చాలా చోట్ల ప్రదర్శించబడింది. దీనిని ఎక్కువగా ప్రదర్శించిన వాళ్ళు కాంగ్రెస్ సోషలిస్టు భావాలు, కమ్యూనిస్ట్ సంస్కరణ భావాలు కల విద్యావంతులైన కాపు, కమ్మ, బ్రాహ్మణ యువకులే కావడం గమనార్హం. పద్యాలకు, పాటలకు, సోషలిస్టు వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వబడిన నాటకం ఇది. ఈ నాటకానికి సంగీత దర్శకుడు సుప్రసిద్ధ సినీ సంగీత దర్శకుడైన టీవీ రాజుగారు. అంటే నాడు ఈ నాటక ప్రదర్శనకు, సాహిత్యానికి ఉన్న ప్రాధాన్యం ఏమిటో మనం గమనించవచ్చు. ఈ నాటకం ద్వారానే వ్యవసాయ కూలీ యూనియన్ అఖిలభారత జాతీయ పార్టీగా 1951 సారస్వత ఎన్నికలలో మూడవ స్థానంలో జయప్రకాశ్ నారాయణ గారి ఆధ్వర్యంలో గెలవగలిగింది. కారణం ఇది కదా కూలిని రాజుగా గెలిపించింది.

"పైరు పాటకు ప్రస్తావన "అనే శీర్షికతో పీఠిక రాసి అప్పటి "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య" గారికి అంకితమి చ్చారు. కుర్రవాళ్ళ షికార్లు ఈ పాటకు ఆలంబన. దీన్ని సంగీత రూపకంగా ప్రదర్శించవచ్చు నృత్యాన్ని కూడా జోడించవచ్చు. నాడు ఆకాశవాణిలో ప్రసారమై రంజింపచేసినటువంటి రచన ఇది.

రాగవాసిష్టం నాటకానికి పీఠిక పేరు "ఈ నాటకం బయోడేటా" పేరుతో గ్రంథస్తం చేశారు. రాగవాసిష్టం అంటే వశిష్ఠుని యొక్క రాగం, అనురాగం, ప్రేమ, పెళ్లి అని అర్థం. శూద్రత్వం నుండి బ్రాహ్మణత్వం సాధించిన వశిష్ఠుడు మాతంగ కన్య అరుంధతి వివాహానికి సంబంధించిన కథ ఇది. హరిజనులు ఆర్యులేనని అసలు ద్రావిడులు కూడా ఆర్యులేనని నిరూపించడం కోసం ఈ రచన చేశానని భీమన్న గారు పీఠికలో ప్రస్తావించడం మనం గమనించవచ్చు.

"ప్రగతి" అనే వ్యంగ్య నాటకానికి "ప్రగతి పథం" అనే శీర్షికతో పీఠికను రాశారు. ఈ రచనను 1976లో గౌరవనీయులైన మర్రి చెన్నారెడ్డి గారు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గా ఉన్నప్పుడు ఆయనకు అంకితమిచ్చారు. ఇది చంద్రునికో నూలిపోగు లాంటిది అని కూడా పీఠికలో ప్రస్తావించారు భీమన్న గారు. ఈ ప్రగతి నాటకం ఒక దృశ్యకావ్యం. దీని పరిష్కరణ ప్రచురణలో బోయి హైమావతీ మేడం గారి కృషి ఎనలేనిదని పీఠికలో ప్రస్తావించారు. ఇంకా బొజ్జతారకం వంటి వారి ప్రోత్సాహాన్ని కూడా స్తుతించారు. ప్రగతి అంటే ఏమిటో కూడా భీమన్న గారు ఈ పీఠికలో ఇలా అంటారు.....అదొక విలక్షణమైన మానవమేధస్సు మాత్రమే సాధించ గల కళాత్మక పురోగమనం. అంటే భారతదేశంలో చారిత్రకంగా మనకు తెలిసిన అతి పురాతన నాగరికత సింధూ నది లోయలోని హరప్పా, మొహంజొదారో శిధిలాల దగ్గర నుండి నేటిదాకా, మనదాకా జరిగిన పురోగతిని సూత్రప్రాయంగా చిత్రించారు ఈ నాటకంలో. ముఖ్యంగా స్త్రీలకు అన్నింటా సమాన హక్కులు ఉండాలని, ఉద్యమం నుండి శారీరక ప్రదర్శనలో కూడా స్త్రీలు పురుషున్ని ఎదిరించి జయించగల శక్తిని సంపాదించుకోవాలనే అంశాన్ని వస్తువుగా తీసుకున్నానని, సర్వతోముఖ ప్రగతి సాధనకు సూచనలు కూడా చేస్తున్నానని ఈ పీఠికలో ప్రస్తావించారు. ఉదాహరణకు వ్యవసాయ భూమిని జాతీయం చేయాలి, నిత్య వాడకం వస్తువుల పరిశ్రమలను, సేవలను కూడా జాతీయం చేయాలి, మైనారిటీ తీరిన ప్రతి వ్యక్తికీ ఇళ్ల స్థలం పంపిణీ చేయాలి, వృద్ధులకు ఆశ్రమాలను అందుబాటులో ఉంచాలి, పనికి ఆహారం వంటి మొదలైన పథకాలు ప్రవేశపెట్టాలి వంటి మొదలైనవి.

ఈ నాటకంలో ఆధునిక జాతీయ విద్య గురించి మాట్లాడుతూ వృత్తి విద్యా విధానాన్ని సమర్థించారు. ప్రగతి అనే నాయిక అన్ని విద్యలను అన్ని కలలను నేర్చిన నాయిక. ధనస్వామికం, పారిశ్రామికం, వ్యాపారికం వంటి వ్యవస్థలు ఆవిడను ఎన్ని అవస్థలు పెడుతూ వస్తున్నాయో చెప్పే ఇతివృత్తం. అన్ని అవస్థలనూ దాటుకుంటూ ముందుకు సాగడమే ప్రగతి యొక్క ప్రగతి పథంగా నాటక లక్ష్యాలను పీఠిక ద్వారా వివరించారు భీమన్నగారు. ప్రగతి అనేది ఆరు దృశ్యాల వ్యంగ్యనాటకం. దీనిలో' ఏది గతి – ఏది ప్రగతి' అనే పాటని కూడా పొందుపరిచారు. కవికి ప్రగతి ప్రగతికి కవి అనేది నా సిద్ధాంతం. కవి అంటే కేవలం కవిత్వం రాసే వాడే కాదు, భావనాశక్తి, సృజనాత్మక శక్తి గల ప్రతివాడు కవే నా దృష్టిలో, అట్టిశక్తి మనిషిని ముందుకు కదిలిస్తుంది, కదలిక ఒక క్రమంలో జరగడం

ప్రగతి అని భీమన్న గారి ప్రగతి దర్శనాన్ని వివరించి, మేధావి, కళాపోషకుడు అని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారి సాహిత్య హృదయాన్ని ఆవిష్కృతం అయ్యేలా కీర్తించి మర్రి చెన్నా రెడ్డి గారికి అంకితమంటూ....

సత్వమందు మర్రి, సాహిత్య సౌందర్య/ మాధవమున గున్నమావి చెన్ను/ మాన్య ముఖ్యమంత్రి మా మర్రి చెన్నయ్య! మహిత శక్తిశాలి! విహిత శూలి!.... వంటి ఎనిమిది పద్యాలతో కూడిన అంకిత పత్రాన్ని 1979 ఏప్రిల్ 9న రాసినట్టుగా ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఈ రచన ద్వారా నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యా సంబంధిత స్థితిగతులను, నాటి రాజకీయ నాయకుల మనో వైఖరిని, భీమన్న గారి సత్సంబంధాలను సైతం తెలుసుకునే వీలుంది.

"ధర్మవ్యాధుడు రచనకు ధర్మపీఠం అనే పీఠికతో".. .. నన్ను ధర్మవ్యాధుడు నా బాల్యంలోనే పట్టుకొని తన ప్రభావంలోకి ఆకర్షించుకున్నాడు అంటూ వేల సంవత్సరాల పూర్వపు కృతయుగం నాటి ధర్మవ్యాధుని ప్రభావం ఈనాడు నామీద పడినంతగా మరెవరి మీదా పడలేదనే నా ఉద్దేశం. ఈ యుగంలో నేనే ధర్మవ్యాధుడి సరాసరి వారసుడినని నేను చెప్పుకోవడానికి ఇదే కారణం. ఆనాడు ధర్మవ్యాధుడు కూడా అన్ని శక్తులు ఉన్న బ్రహ్మ జ్ఞాని అయి ఉండి కూడా అప్పటి సమాజం దృష్టిలో ఒట్టి కటిక వాడే కదా! అంటరాని వాడే కదా! ఆత్మ జ్ఞాన లక్షణమే అట్టిది అంటూ ధర్మవ్యాధుడు కర్మయోగి, ఆత్మజ్ఞాని, అపరోక్ష సాక్షాత్కారం పొందినవాడు, అంతర్ముఖుడు, బ్రహ్మైక్యం చెందినవాడు అని ధర్మవ్యాధుని యొక్క కథను తెలియజేస్తున్నట్టుగా మనకు పీఠిక ఉద్బోధిస్తుంది. మొత్తంగా కర్మ నిజస్వరూపాన్ని వివరిస్తున్నట్లు కర్మను గురించి సాధికారికంగా చెప్పగలిగినవాడు ధర్మవ్యాధుడొక్కడే. హింస, అహింస మొదలైన కర్మలకు బాధ్యత ఆయా వ్యక్తులు కాదని ధర్మవ్యాధుడు సిద్ధాంతీకరించాడు. 'మును తను చేసిన కర్మంబున' అనే ధర్మవ్యాధుని మాటకు అర్థం..... గతంలో తాను చేసిన పనికి అనే అర్థం. గత జన్మలో అని కాదు అని వివరిస్తున్నట్టుగా కూడా పీఠిక ద్వారా మనకు అవగతమవుతుంది. ఈ గ్రంథాన్ని మహిమాన్విత డాక్టర్ వాసిరెడ్డి సీతా దేవి గారికి అంకితమివ్వడం అమందానందంగా ఉందని సీతాదేవి గారి పట్ల గౌరవాభిమానాలను వ్యక్తపరిచారు. "వేద వ్యాసుడు రచనను జ్ఞానం నుంచి జన్మకు అనే పీఠికతో శ్రీమతి ప్రతిభా భారతి" గారికి అంకితమిస్తున్నట్లు.....

ప్రస్తుతం ఆంధ్ర అసెంబ్లీ అధ్యక్ష పీఠంపై/ స్పీకరుగా లోకమాన్య అవుతున్న/ వ్యాస గీతా వరప్రసాద సుప్రభాత హారతి! శ్రీమతి కావలి ప్రతిభాభారతి! అని పీఠికలో నిక్షిప్తం చేసి ధర్మవ్యాధుడు, వేద వ్యాసుడు రెండూ జంట నాటకాలు అని ఈ రెండు రచనలపై స్వీయ అభిమానాన్ని ప్రకటించారు. వేద వ్యాసుడు రచనలో" వేద సమాజంలో వృత్తి విభజన తప్ప జాతి విభజన లేదు, ఇక్కడ జాతి అంటే జన్మ అని అర్థం" ఎక్కడ జన్మించిన వాడైనా, ఎలా పుట్టిన వాడైనా బ్రహ్మజ్ఞాని అయినవాడు బ్రాహ్మడే, ధైర్య సాహసాలు కలవాడు క్షత్రియుడు, ఏ పనిని స్వయంగా చేసుకోలేని వాడు శూద్రుడు. ఆ కాలంలో జన్మకు ప్రాధాన్యం లేదు, మానసిక స్థాయికి మాత్రమే ప్రాధాన్యం ఉండేది. అస్పృశ్యత లేదు, ప్రజ్ఞకు తగ్గ గౌరవం ఉండేది, ప్రతిభకు అగ్రగన్యత ఉండేదని నాటి వర్ణవ్యవస్థ విధానం గురించి కూడా మనకు ఈ రచన ద్వారా లభిస్తుంది.

భీమన్న గారి చేత విరచితమైన" రాగవైశాఖి" ఒక ప్రణయ లేఖా కావ్యం. దీనికి "రాగ వీచిక" అనే శీర్షికను తీసుకొని యువతీ యువకుల మధ్య సాగే ప్రణయలేఖల సముదాయాన్ని కావ్యంగా మలిచారు. రాగవైశాఖి రచనలో శృంగారం ఉన్నప్పటికీ తాత్వికచింతన, సామాజిక స్పృహ చాలా ఎక్కువగా ఉందని, ఇది అనేక సమస్యలపై ప్రజలకు కనువిప్పు కలిగించే లాగా కూడా ఉందని, కనుక నిషేధించవలసిన అవసరం లేదని ఆయా పండితులు అభిప్రాయాలు వెలిబుచ్చారంటూ అప్పటి ముఖ్యమంత్రి" కాసు బ్రహ్మానంద రెడ్డి" గారు అసెంబ్లీలో ప్రకటన చేయడం ముదావహం. "Raga vysakhi is the book of the decade I feel like that...." అంటూ డాక్టర్ బెజవాడ గోపాల్ రెడ్డి గారు పేర్కొనడం అతిశయోక్తి కాదు.

ముగింపు :

భీమన్న గారు తన బాల్యం నుండి వేదాలు, కావ్యాలు, పురాణాలు వంటి రకరకాల హితోదికమైన సాహిత్యాలు పరిశోధించి భారతీయ సంస్కృతికి, భారతీయ సాహిత్యానికి, భారతీయ వేదాంత దర్శనానికి మూలపురుషులమని దళిత సోదరులందరిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా తన రచనలలో వస్తువులను ఎంచుకున్నారు. నిత్యం రైతుల, కూలీల, శ్రామికుల తరపున తన సాహితీగళాన్నీ వినిపించి అమాయకుల ఆత్మరక్షణ ఆయుధంగా , శక్తిగా తోడై నిలిచారు. మొత్తంగా భీమన్న గారి రచనలలో వైరుధ్యాంశాలు ఎన్ని ఉన్నా కూడా పాఠకులలో జ్ఞానపిపాసను, విశ్వజనైక దృష్టిని మేల్కొల్పడానికి ఉపకరిస్తాయి అని ధంకా భజాయించి చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు:

1. బోయి భీమన్న గారి పీఠికలు –1, 2 భాగాలు.

ప్రచురణ :

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2015, భీమన్న గారి 105వ జయంతి సందర్భంగా.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న ప్రగతిశీల మానవీయ ఆలోచనల ధార - అవలోకనం

(పాలేరు నుండి పద్మశ్రీ వరకు)

- డా. లక్ష్మయ్య,
అసోసియేట్ ప్రొఫెసర్,
9133635714.

'మన సరస్వతి మన దేశంలో లేదురా, ఆమె ఏనాడో అమెరికా, రష్యాలకు వలస పోయింది. మనం మన ఆర్షత్వాన్ని పోగొట్టుకొన్నం సామాజిక సంకుచితాలతో, కాలదోషం పట్టిన ఆచార, విశ్వాసాలతో, ప్రగతిని, ప్రగతిశీలతనూ, నాశనం చేసుకున్నం, ధార్మిక పునరుజ్జీవన కృషికి కారణ బద్ధులమైతే తప్ప, మన సరస్వతి మన దగ్గరకు రాదురా...!' అని వేదన మయ హృదితో పుట్టపర్తి నారాయణాచార్యులు జాతికి గుర్తుచేశాడు. ఆ ఆర్తి భీమన్న హృదిని క్షాళన చేసింది. తత్ఫలితంగా ధార్మిక పునరుజ్జీవన కృషికి, తన కలాన్ని అంకితం చేసుకొన్నాడు.

మౌలికపదాలు (కీవర్డు):

లవం, ప్రేమ / ప్రణయతత్వం, సర్వాహారి, సర్వోదయం, ఆర్షధర్మం, శివసోషలిజం, వన్యవ్యవస్థ, సనాతనం, సెంటిమెంట్, సాంస్కృతిక విప్లవం, హిందూమతం మానవీయ అభ్యుదయం.

భీమన్న హృదిలో సాహిత్యతత్వం:

కవి ఏ కాలంలో జీవించాడో ఆ కాలానికి సంబంధించిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలు తన రచనల్లో ప్రతిఫలించాలనేది భీమన్న అభిలాష, దీనినే విమర్శకులు జాతి, వార్తా, చమత్కారాలుగా పేర్కొన్నారు. తల్లి రక్తం బిడ్డలో ప్రవహించినంత సహజంగా బ్రతుకు తత్వం రచనల్లో అనివార్యంగా ప్రతిఫలిస్తుంది. ఈ న్యాయమే భీమన్న సాహితీ సృజనలో ద్యోతకమైంది.

భీమన్న అత్యాధునిక సాహిత్య భీష్ముడు.ఆ భీష్ముడు కౌరవుల సార్వభౌమాధికారాన్ని అంగీకరిస్తూనే, పాండవుల విజయాన్ని కాంక్షించాడు. ఈ భీమన్న వైదికసమాజ వైభవాన్ని ఆమోదిస్తూనే, అంబేడ్కర్ తాత్విక చైతన్యం సమాజంలో విస్తరించాలని కాంక్షించాడు. ఈయన కేవలం హరిజన చైతన్యం దగ్గరే నిలిచిపోకుండా మానవీయత, ప్రగతిశీలత, జాతీయదృష్టి, ప్రణయతత్వం వంటి ఉదాత్తమైన భావజాలం తో మమేకమై సాహితీ సృజనచేశాడు. ఆరంభంలో ఈయన హృది రెండు మార్గాల్లో పయనించింది. అవి – అంబేడ్కర్ ఆలోచన, ఆచరణతో సాగుతున్న హరిజన ఉద్యమం లో గుండె కలపడం, గాంధీ నాయకత్వం లోని జాతీయోద్యమంలో అడుగులు కదపడం అనేది 30 వ దశకంలో సమాంతరంగా సాహితీ క్షేత్రం సాగించాడు. పాలేరు నుండి పద్మ శ్రీ వరకు – భీమన జీవిత చరిత్ర లో అక్షరబద్ధమైన అనర్ఘరత్నాలాంటి మానవీయ ఆలోచనలను, నేటి సమాజానికి మరొక్కసారి గుర్తు చేయడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

భీమన్న తన సాహిత్యంలో నిజాన్ని నిక్కచ్చిగా చెప్పడం, మనస్సును మాధుర్యాని కేసి మరల్చడం, సహజ విప్లవ ప్రగతిని వేగిర పర్చడం అనే లక్షణాలు తన రచనల్లోఉంటాయనిపేర్కొన్నాడు.

లంచం పుచ్చుకొన్న లక్ష రూపాయల కంటే, ఒక తుపాకి బలమైంది !
తుపాకులు పుచ్చుకొన్న లక్ష మంది సైన్యం కంటే, ఆటం బాంబు బలమైంది !
లక్ష ఆటం బాంబుల కంటే, కార్మికుని ఒక్క చెమట బొట్టు బలమైంది !
లక్ష మంది మార్క్ ల సిద్ధాంతం కంటే, ఒక్క మహాత్ముడి రాజనీతిబలమైంది !
లక్ష మంది మహాత్ముల రాజనీతి కంటే, ఒక్క అంబేడ్కర్ మానవ సమతా ధర్మం బలమైంది !

ఈ నిక్కచ్చి నిజం, నన్నయ భారతంలో చెప్పిన **'నుత జల పూరి తంబులగు... సూనృత వాక్యం మేలు చూడగన్.'** అనే పద్యం సత్యవిశిష్టతను తెలిపిన సందర్భం స్సురిస్తుంది. ఈ తీరులో భీమన్న సమతా ధర్మం పట్ల గల గాఢ వాంఛక్రమోన్నతి వచన పంక్తుల్లో పాఠకునికి నిక్కచ్చిగాఅవగతమౌతుంది.

అందం అనేది వయస్సుతో పాటు వికసించే భావం. అందం మానసిక మైనట్టిది, బాహ్య వస్తువును ఏ దృష్టితో చూస్తే, అది ఆరూపం లోనే కనబడుతుంది. సరసంగా చూస్తే – సుందరం, అరసంగా చూస్తే – అసహ్యం,విరసంగా చూస్తే – విరుద్ధం అని పేర్కొంటాడు భీమన్న (ఏకం పరమాత్మ బహు రూప జీవం – అనే అద్వైత తత్వానికి ప్రేమ నిదర్శనం)

హృదయములు రెండు మనసులు రెండు,
ండు కాయ ములు కూడ అద్దాల కరణి
నొకట నొకటి స్వచ్ఛ మై ప్రతి
ఫలించు కొనవలయు, ఒకటి నొకటి విభిన్నత నొందరాదు.(రాగోదయం)

ప్రణయ తత్వం:

పెళ్లి ఆడటం కోసమో, శారీరక సుఖం కోసమో కాదు. ప్రేమించిన వాళ్లను పెళ్లి చేసుకోవడం మంచిదే కాని, పెళ్లి చేసుకోకుండా ఉండటం ఉత్తమోత్తమం. ప్రియురాలు ఉద్యానవనం లాంటిది.

భార్య ఇల్లు వంటిది. ప్రేమకు సాఫల్యం పిల్లలను కనడం కాదు – ఆత్మైక్యం. ఇది భీమన్న ప్రణయ తత్వం. ప్రేమను ఆనందానుభూతిగా, పెళ్లిని విద్యుక్త ధర్మం అనే తీరులో నిలుపుకుంటే జీవితంలో రెండు దొరకుతాయి.

పల్లెటూళ్లలో వ్యవసాయమో, వృత్తి పనులో చేసుకుంటూ ఎంతటెంతటి జ్ఞానులు, విజ్ఞానులు నివురు గప్పినట్లుగా ఉంటారో జంగం వెంకన్న తన తండ్రి పల్లయ్యను ఉద్ధరించిన తీరుకు సమ్మోహనపడి తన కవిత్వ పరమార్థంగా స్వీకరించాడు భీమన్న. గురువును వెతుకుతూ శిష్యుడు వెళ్లడం లౌకికం; శిష్యుణ్ని వెతుకుతూ గురువు వెళ్లడం పారమార్థం. గురు స్థానంలోని సాహిత్యం శిష్యులనే సమాజం చెంతకు వెళ్లి తీరాలంటాడు భీమన్న. దీనిని తూచా తప్పకుండా తన సృజనలో చూపాడు.

భీమన్న సృజన స్వతంత్రమైనది. స్థిరపడిన సాహిత్య మార్గంలో నడిచిపోవడం ఆయనకు ఏమాత్రం నచ్చదు. బారెడు దూరమైన బాటలో నడిచే నైజం కాదు. క్రోసెడు దూరమైన కొత్త బాట వేయాలనేది భీమన్న అన్వేషణ. అందుకే వస్తు రూపాల్లో, వస్తు దృక్పథంలో స్వతంత్రతను ప్రదర్శించాడు. ప్రయోగవాదిగా, సిద్ధాంతకర్తగా ముందుకు సాగాడు. ద్వైతం, విశిష్టాద్వైతాలకు భిన్నంగా – రసాద్వైతం; సోషలిజానికి ప్రతిగా – శివ సోషలిజం; వర్ణ, వర్గ వ్యవస్థలకు బదులుగా – వన్య వ్యవస్థను ప్రతిపాదించి తన సృజనతో ప్రచారం చేశాడు. తెలుగు ఆధునిక సాహిత్యంలో భీమన్న సృజన దీపసభలాగా సమాజాన్ని కాంతివంతం చేస్తున్నది.

హేతుబద్ధ సామాజిక జ్ఞాని:

ఇక్కడ నేను నిలబడ్డ నా వంశ మూల పురుషుడి కోసం చూసినప్పుడు వాల్మీకి, వ్యాసుడు కనిపిస్తారు. ఈనాడు నేను పంచమున్నే కావచ్చు; ఆనాడు వాళ్లు బ్రహ్మజ్ఞానులు, బ్రాహ్మణులు. బ్రాహ్మణత్వం అనేది నేటి డిగ్రీలాంటిది – అదొక జ్ఞాన అర్హత. వైదిక వర్ణాలు జ్ఞానార్హతలే. బ్రహ్మజ్ఞానం సాధించిన వాడికి బ్రాహ్మణ పట్టా ఇచ్చేవారు. బ్రాహ్మణుడిని పూజించడం అంటే బ్రహ్మజ్ఞానం సంపాదించిన వాడిని పూజనీయుడిగా చూడటం అని అర్థం. ప్రతి వ్యక్తి పుట్టుకతో శూద్రుడు – ఏమి తెలియని వాడు. విద్యార్జనతో పాటు ధనార్జనం చేసినవాడు వైశ్యుడు. కామోపభోగాలను అనుభవిస్తే క్షత్రియుడై వెలుగుతాడు. ఈ మూడు దశలు దాటితే బ్రహ్మజ్ఞాని (ఆత్మసాక్షాత్కారి). ఇవి ఒక రకంగా నేటి తరగతులతో సమానం.

వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ దశల వరకు వికసించిన వాళ్లలో కొందరు స్వార్థపరులు తమ సుఖభోగాలను తమ వంశానికే స్థిరపరచుకోవడం కోసం పుట్టుక కులం అనే వైదికేతర స్థితిని కట్టుబాటుగా చేశారు. ప్రగతి నిరోధానికి ఆజ్యం పోశారు. ఆనాడు అమలులో ఉన్న వర్ణాశ్రమ ధర్మాలకు నేడు పండితుల నోళ్లలో చిలుక పలుకులుగా వస్తున్న ధర్మాలకు శవ జీవ సంబంధం కూడా లేదు. మనిషి స్వప్రయోజనం కోసం, స్వాతిశయం కోసం ఎంతటి పాడు పనికైనా వెనుదీయని వాళ్లు మానవ స్వభావాన్ని దైవానికి అట్టగట్టి పురాణ, ఇతిహాస పాత్రలను తమకు అనుకూలంగా సాక్షపు బూచిగా తీర్చిదిద్దుకున్నారు. సీతారాములు, కృష్ణార్జునులు కేవలం మానవులే; తమకు ఎదురైన

కష్టాలన్నింటిని ధైర్యసాహసాలతో అధిగమించి సమయానుకూలంగా రాజనీతిని ప్రదర్శించి తుది విజయం పొంది మానవోత్తములుగా నిలిచిన వాళ్లే. మనకు ఆదర్శవంతులు. మత పెద్దలు, సంకుచితులు ప్రతి ఉత్తములను దైవాలుగా స్థిరపరిచి సమాజ పురోభివృద్ధికి సమాధులు ఎక్కడికక్కడ కట్టేశారు.

కాయలు, గింజలు, మొక్కలు, చేపలు, పిట్టలు, మేకలు, గొర్రెలు – అన్నీ జీవులే. జీవికి జీవే ఆహారమవుతోంది. తనకు ఒక జీవి ఆహారం; తాను మరొక జీవికి ఆహారం. ఒక ప్రక్క ఆహారం సంపాదించుకోవాలి; మరో ప్రక్క మరో జీవికి ఆహారం కాకుండా తనను తాను కాపాడుకోవాలి. పరహింస, ఆత్మరక్షణ – ఈ రెండు ప్రకృతిలో ప్రాథమిక అవసరాలే. కాబట్టి జీవులకు పాపపుణ్యాల ప్రసక్తి లేదు. సప్త ఋషులు శవాలను తిన్న ఉదంతాలు ఈ సత్యంలోనివే. పాపపుణ్యాలు మిథ్యా సిద్ధాంతంలోనివే.

సర్వాహారి:

అగ్రవర్ణులు కింది వర్గాల వారిని అణచిపెట్టుకోవడానికి కట్టుబాట్లు చేసిన ఆగడాలే. "మా అమ్మ మాంసం తినేది, కాని నీకు పాలే ఇచ్చింది. అందుకే నేను సర్వాహారిగా ఉన్నాను" అంటాడు భీమన్న.

పరబ్రహ్మను ఒక జీవ సముద్రం అనుకోవచ్చు. ప్రతి జీవి అందులో ఒక అల. తిరిగి అలలు సముద్రంలో లవం (లీనమవడం) పొందుతాయి. కర్మను బట్టి జన్మ ఏర్పడుతుంది అనేది నిజం కాదు. గ్లాసెడు (కర్మ) నీళ్లను సముద్రంలో పోసి అవే నీళ్లను తిరిగి పొందలేము కదా! అలాగే పరమాత్మలో లీనమైన ఆత్మను కూడా పట్టలేం. ఇది స్వార్థులు, ద్రోహబుద్ధి ఏర్పరచిన కృతక కట్టుబాటు.

మధ్యప్రాచ్యంలో సరిహద్దు ప్రాంతాల దాయాదులు ద్రావిడులు, ఆర్యులు వలసతో ప్రాంతాలు మారిన తమ పూర్వ వైరాన్ని వెంట తెచ్చుకున్నవారు. వీరిని సిరిజనులని వేదం పేర్కొంటుంది. తమ కుదురు/గుంపు/సమూహ కట్టుబాట్లను అతిక్రమించిన వారిని వెలివేశారు (అసిరిజనులు). కాలక్రమంలో వెలివేయబడినవారే అధిక సంఖ్యాకులై అసిరిజనులే సిరిజనులుగా చెలామణిలోకి వచ్చారు. నిజమైన మూల సిరిజనులను వీరే దూరం పెట్టారు. అలా కాలక్రమంలో వీరే హరిజనులుగా పిలువబడ్డారు. మామాలు ఆర్యులే. వృత్తులను బట్టి కులాలు వచ్చాయి. ప్రవక్తలు పెరిగే కొద్ది మతాలు వచ్చాయి.

పురాణాల ప్రకారం మాతంగుడు హరిజనుడే. స్వయంగా సరస్వతియే ఇతని వద్ద విద్య నేర్చుకోవడానికి పుత్రికగా జన్మించిందని, కాళిదాసు శ్లోకాన్ని సాక్ష్యంగా చూపాడు భీమన్న – "మాతంగ కన్యాం మనసా స్మరామి...!" హరిజనుల అంతరంగాలలో స్వాభిమానాన్ని నింపి, సమకాలీన సమాజంలో అన్ని గౌరవాలకు తగిన వారనే భావనను వారిలో ప్రోది చేశాడు భీమన్న. లక్షల ఎకరాల పొలాలను దోసెడు నీళ్లతో సాగు చేయడానికి ప్రయత్నించడం ఎలాంటిదో, హరిజనుల ప్రగతి కోసం నేడు సాగుతున్న కృషి కూడా నేల విడిచి సాములాంటిదని భీమన్న విమర్శిస్తాడు.

కట్నాలు, కానుకలు ఇవ్వడం, పుచ్చుకోవడం తప్పేమీ కాదంటాడు. ఇవి స్నేహవాత్సల్యాలకు ప్రతీకలు. తల్లిదండ్రులు ఆస్తిలో సమాన వాటాలు ఇవ్వకుండా వరకట్నం పోవాలనడం అర్థరహితం అంటాడు.

అక్షరాయుధ సాంస్కృతిక విప్లవుడు:

సిరిజనులకు కలగాల్సింది అజ్ఞానం నుండి ఉద్ధరణ; హరిజనులకు కావలసింది దారిద్ర్యం నుండి ఉద్ధరణ. తద్వారా ఉభయులను ఏకజాతిగా కూర్చడం. ఈ పనిని ఎవరికి వారు తమ తమ పరిధిలో, తమ తమ శక్తిమేరకు చేసే చైతన్యం కలగాలి.

సెంటిమెంట్:

గతం నుంచి తప్పుకోలేని బలహీన మనస్తత్వం. ఇదొక ఆచారం, సంప్రదాయం, అనుబంధం – గతంతో తాదాత్మ్యం చెందడం లాంటిది. దేశకాల అవసరాలను బట్టి ఏ సరళిలోనైనా శాసనం తేబడుతుంది. కాలమార్పుతో అట్టి శాసనం కూడా మారాల్సి ఉంటుంది. వినియోగ అవసరం తీరినప్పటికీ కాలదోషం పట్టిన ఏ శాసనమైనా ఈజిప్టు మమ్మీలా నిలిచి ఉంటే దానిని మనం సెంటిమెంట్‌గా భావిస్తున్నాం. ఆదిమకాలంలో రాజ్యాల గుర్తు కోసం కట్టుకున్న తోలు పేలిక జెండా. యజ్ఞాలు పోయిన తర్వాత కూడా యజ్ఞకాల చిహ్నాలను నిలుపుకోవడం ఏమిటి? అనాటి తోలు పేలిక నేడు నూలిపోగై నిలిచి ఉండటంలో అర్థం లేదు. దీనిపై ఆర్య, బ్రహ్మ సమాజాలు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఆ సెంటిమెంటును కొనసాగించడం సిరిజనుల అజ్ఞానంగానే భావించాలి. అందుకే హిందువులు ఒట్టి శరీరారాధకులు అంటాడు భీమన్న.

"మాకు శరీరమే ప్రదానం; ఆత్మ ముఖ్యం కాదు. జెండా ఉన్న శరీరాన్ని తప్ప వేరొక శరీరాన్ని మేము ముట్టుకోం" అనేది వారి అజ్ఞానం. కాని ఆర్షధర్మంలో ఈ పద్ధతి లేదనేది భీమన్న ఆలోచన. మతాధిపతులకు, మతావేశపరులకు, వాళ్ల వెంబడి తిరిగే గొర్రెలకు "అహం బ్రహ్మాస్మి" కాదు – "అహం శరీరాస్మి" అని భీమన్న నిజాన్ని నిలుపుతాడు. అందుకే ప్రజలు, ముఖ్యంగా నేటి యువత, ఈ భ్రమలన్నీ వదిలేసి వాస్తవ దృష్టితో, విచక్షణ, విజ్ఞానంతో నడుచుకోవడమే నిజమైన సాంస్కృతిక విప్లవం అని భీమన్న ఆలోచన.

ఆర్షధర్మంలో లేనివి – నిలువు, అడ్డుబోట్లు, జుట్లు, గెడ్డాలు, యజ్ఞాలు, ఉత్సవాలు, గుడులు, క్షేత్రాలు, దిక్కులు, ప్రార్థనలు మొదలైనవి. వీటిని పాటించే వాళ్లంతా ఒట్టి సోగ్గాళ్లు, భౌతిక ఆరాధకులు. వీరికి ఆత్మశుద్ధితో పనిలేదు. ప్రజలను మభ్యపెట్టి బ్రతికే వాళ్లు. ఏ మతంలో చూసినా వీళ్లదే అగ్రస్థానం. స్వార్థపూరిత మనిషి తనకు అనుకూలమైనది దెయ్యమైనా చేరదీస్తాడు; తనకు ప్రతికూలమైనది దైవమైనా పరాదోలుతాడు.

నేడు కరెన్సీ నోట్లను చిత్తు కాగితాల్లాగా విరజిమ్మగలిగిన కోటీశ్వరులే ఎన్నికల్లో గెలుస్తున్నారు. వాళ్ల ఆశ్రితులను గెలిపించుకుంటున్నారు. నిరంకుశంగా పాలించగలుగుతున్నారు. నీతిమాలిన మార్గాల ద్వారా కోట్లు గడిస్తున్నారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారింది. పరిపాలనలో ధనానికే తప్ప ప్రజలకు స్థానం లేదు. రాజకీయ చైతన్యం గల మేధావులు పదవుల్లోకి రావాలంటే ఎన్నికలను

ప్రభుత్వమే జరపాలి. "నిజం ఆడితే నిష్టూరం" అనే సామెత మానవజాతిని నాశనం చేసింది. నిజం నిషేధించబడింది. ముఖప్రీతికరమైన వందిమాగధ భజనకళ సింహాసనం ఎక్కి కూర్చుంది. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది.

సనాతనం:

ఇది వేద ఉపనిషత్ యుగ ధర్మం కాదు. ఆర్షధర్మం హిందూ మతంగా మారిన స్మృతుల కాలం నుంచి ఆర్ష జీవనంలో చేరిన కాలుష్యాన్నే సనాతనం గాభావించాడు భీమన్న.

మతం మనిషికి ఇచ్చిన శాసనం మానవత్వానికి స్వస్తి చెప్పడమే. మతం బలహీనులను సాధు జీవులుగా, బలవంతులను క్రూర మృగాలుగా మలిచింది. దీనికి విరుగుడే మతం మార్పోరలు కరిగి మనిషి – మనీషిగా మారడమే విప్లవం అని భీమన్న ఆకాంక్ష. మన సమాజంలో సరసతా భావం స్థిరపడాలంటే మనుషుల మధ్య సోదరత్వం వెల్లివిరియడం అత్యవసరం. కాని వివిధ కారణాలతో సమరసత లోసిస్తుంది.

సమరసత:

ఇది హృదయానికి సంబంధించిన భావావేశం. వ్యక్తి వృష్టి నుండి సమిష్టి పరమేష్టి వైపు కొనసాగే విశాల హృదయ పరివర్తన. సామాజిక సమరసత, రసాద్వైత సమర్చనను రెండు కళ్లుగా చేసుకొని భీమన్న సాహితీ సృజన సాగించాడు.

మామా పేటలను మూడు రకాలుగా వాడుకున్న స్వార్థ రాజకీయ ఎత్తుగడలను భీమన్న విశ్లేషించాడు. కమ్యూనిష్టు ప్రభావంలోని మామా పేటలలో రాజకీయ లక్ష్యమే తప్ప చైతన్యం కోరుకోలేదు. భూస్వాముల ప్రభావంలోని మామా పేటలలో ఆర్థిక దాస్యం, మత మౌఢ్యం రాజ్యమేలింది తప్ప చైతన్యం శూన్యం. అంబేద్కరిస్టుల ప్రభావంలోని మామా పేటల్లో చైతన్యం పాళ్లు ఎక్కువ.

సృష్టి మట్టి నుంచే పుట్టింది. ఆ మట్టిని ఆరాధించే శ్రమజీవులే నిజమైన సృష్టికర్తలు, సృజనశీలులు. ప్రతిభ మట్టి వంటిది. పాండిత్యం కార్ఖానా వంటిది. సాంప్రదాయకులు, స్వార్థ పండితులు సహజ ప్రతిభను చంపివేస్తూ కార్ఖానాలను పెంచిపోషించారు. తద్వారా మన జాతి ఆత్మ అనుకునే మౌలిక సాహితీ సృజన రాలేకపోయింది.

సర్వోదయం:

సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, శ్రేయోరాజ్యం తదితరాలను కలిపి సాగే మానవీయ వికాసాన్ని సర్వోదయంగా భీమన్న పేర్కొన్నాడు. భారతీయ సమాజంలో కమ్యూనిజం, సోషలిజం ఏ ఉద్యమమైన ఫలప్రదం కాలేదు. ఏజెండా కూడా పేదలకు నీడనివ్వలేదు. శత్రు రాక్షస మూకలను ముష్టాముష్టి ఎదురించిన త్యాగధనులు కూడా పదవీ భూతాలకు దాసానుదాసులైనారు. భారతీయ జనాత్మకు పూర్వ ప్రతినిధిగా నిలిచిన నాయకుడు ఒక్కడూ కూడా లేకపోయాడని భీమన్న మనో విప్లవ వేదన. దీనిని కాలమే పరిష్కరిస్తుందని ఆశిద్దాం.

సాంస్కృతిక విప్లవం:

భారతదేశంలో ఎన్నో రంగాలలో విప్లవాలు వచ్చి ప్రగతి నిచ్చాయి. ఎలాంటి మార్పు లేకుండా చవటి పర్రు (చౌడు నేల)గా పడి ఉన్నది ఒక్క సాంస్కృతిక రంగమే. ఈ సత్య స్వరూపాన్ని గుర్తించి ఈ తరం యువకులు పురోగమించి సాంస్కృతిక విప్లవం సాధించాలి.

ప్రకోపిస్తున్న సాంఘిక దురాఘాతకులు:

జీవులన్నింటిలో మనిషికి మననం ప్రత్యేకం. ఇది జన్మతః వచ్చింది. ఇదే మనశ్శక్తి. ఇది అణుబాంబు కన్నా శక్తివంతమైనది. అంతటి శక్తి ఉన్న మనిషి సెంటిమెంట్‌లో ఇరుక్కొని సాంస్కృతిక విప్లవం సాధించలేక అమానవీయమైన మతం అడుసులో కూరుకుపోతున్నాడు. స్వేచ్ఛగా ఆలోచించడం మనిషి జన్మహక్కు. అది గుర్తించిన అగ్రజన్ములు ముందుగానే జాగ్రత్తపడి తమ స్థాయికి ఇతరులెవరు చేరుకోకూడదనే అనుజన్ములకు అంధవిశ్వాసాలనే సెంటిమెంట్లను బిగించి గుప్పిట్లో పట్టుకుని తమ పబ్బం గడుపుకుంటున్నారు. వీరికి మతం గుర్రపు కళ్లెంలా పనిచేస్తుంది. ఇది నేటి కుల, వర్గ, జాతి, మత, సామాజిక వ్యవస్థలను అగోచరమైన కట్టుబాట్లతో కట్టిపడేస్తుంది. ఇదే న్యాయమని, ధర్మమని, తరుణోపాయమని, మోక్షమని రకరకాల మిథ్యా సిద్ధాంతాలతో మోసగిస్తూ అగ్రేసరత్వాన్ని, గురుత్వాన్ని, నాయకత్వాన్ని, సోదరద్రోహాన్ని నిలువునా చేస్తూ అన్ని రంగాలను ఆడిస్తున్నారు.

సభలు, గోష్టులు, చర్చలు, పర్యటనలు ఇవన్నీ ప్రజల డబ్బును పాయసం లాగా ఆస్వాదించడానికి బ్యూరోక్రసీ కనిపెట్టిన ఉపాయాలు. సమాజంలోని అగ్రశ్రేణి యుక్తిపరులు ఖజానాను ఆత్మరాంచేయడానికి పన్నిన పన్నాగాలు. సామ్రాజ్యవాదం, సోషలిజం, కమ్యూనిజం సాంఘికంగా ఏ పద్ధతైనా సరే ఇదే నాటకం.

ప్రజలకు తాగుడు నేర్పి అలవాటు చేసిన వాళ్లు ఏదైనా తాగేస్తారు. కనుక వాళ్లకు కల్తీ సారా అందిద్దామనుకోవడం న్యాయమా? కల్తీ సారా ఒక్క శరీరాన్ని నాశనం చేస్తుంది. కల్తీ సినీరంగం మనిషి ఆత్మలనే ధ్వంసం చేస్తున్నది. కల్లు మరిగినవాడు చల్లను నిరాకరించినట్లుగా బూతు సినిమాలకు అలవాటు పడిన ప్రేక్షకులు కళాత్మక సినిమాలను ఆదరించరు. ఇది ఎంతటి నైతిక పతనం! ఒక జాతిని సాంస్కృతికంగా పతనం చేయడమే కదా! దొంగల ముఠాల కంటే వ్యాపారుల కూటాలే ఎక్కువ ప్రజా పీడకులు. సమాజంలోని అగ్రశ్రేణి దోపిడీ ధోరణి మొత్తం సమాజ స్వభావాన్నే కలుషితం చేస్తూ స్వార్థం కేసి మళ్లీస్తున్నది. ఇవి సమాజంలో విషపు కోరలు చాస్తున్న ప్రకోపాలు, ఘాతుకాలు అని భీమన్న విశ్లేషణ.

ప్రచ్ఛన్న ఆర్షధర్మ పిపాసి:

కరెంటు బల్బులోని శక్తి ఎంత పెరిగితే అంత ఎక్కువ దూరానికి వెలుగు వెదజల్లినట్లు, మెదడులోని శక్తి పెరిగితే అంత నిశితమైన సత్యాలు గోచరిస్తూ ఉంటాయి. జపతపాదుల ద్వారా మెదడు శక్తిని పెంచుకున్న వారే ఋషులు. అట్టివారు దర్శించి వెల్లడించిన సత్యాలే వేదాలు. ఇవి అపౌరుషేయాలు అంటే భగవత్ ప్రేరణ వల్ల ఋషుల నోటివెంట వెలువడిన సత్యాలు. ఋగ్వేద కాలం

ప్రకృతి నియమాలకు అనుగుణమైన ధర్మాలను బోధించింది. దీనినే ఆర్షధర్మం అని వ్యవహరిస్తున్నారు. ఆర్షధర్మం మానవ ప్రగతికి నాలుగు దశలను సూచించింది. అవి నాలుగు వర్ణాలు, నాలుగు ఉపాయాలు, నాలుగు ఆశ్రమాలు, నాలుగు పురుషార్థాలు. మనిషి తన జీవితకాలంలో అనుభవిస్తూ అధిగమించాల్సిన విధులు, బాధ్యతలను సూచించింది.

హిందూమతం:

భారతజాతిని నీచ భావనతో పిలిచిన పదమే హిందూ. ఈ పదం ఆర్వాచీనమైనదే. ఆర్షధర్మంలో అనేక అవలక్షణాలు నింపుకున్న కంపు పదం హిందూమతం. మతం అనేది బహు నవీనమైన మాట; ఆర్షధర్మం బహు ప్రాచీనం. ఇది ప్రకృతి గతమైన జీవనానికి సూచిక.

నేటి మతాలన్నీ మానవ ప్రగతికి నిరోధకమైనట్టివే. మనిషికి మతం ప్రధానం కాదు; జాతి ప్రధానం. భారతజాతి ఏ మతం వాళ్లనైనా భరిస్తుంది. ఏ మతమూలేని వాళ్లను కూడా ఆదరిస్తుంది. మా జాతికి మానవీయత హృదయం, భావ స్వేచ్ఛ ఆత్మ అంటాడు భీమన్న.

మానవీయ అభ్యుదయం:

ఒకనాటి విలువలు, అవసరాలు తీరిన తర్వాత కూడా ఈజిప్టు మమ్మీలలా నిలిచి ఉన్న వాటిని వదులుకొని ముందుకు సాగడమే నిజమైన మానవీయ అభ్యుదయం అంటాడు భీమన్న. ప్రపంచానికి భారతీయ ఋషులు ఇచ్చిన ఆధ్యాత్మిక భాగాదేయం అద్వితీయమైనది. ఆర్షధర్మ పునరుత్తేజం కోసం బ్రహ్మ, ఆర్య, రామకృష్ణ మఠం కృషి చేశాయి. వీటిలో మూల స్థాపకుల తర్వాత మత స్వార్థులు చేరడంతో ముందుకు సాగలేకపోయింది. బుద్ధ, శంకర, రామానుజ, వివేకానంద తదితరులు చెప్పినట్టు ప్రజలు ఎందుకు నడుచుకోలేదు? వీళ్లంతా ఒట్టి కాపరులు. వీరి శుద్ధ బోధనలు ప్రజల (గొర్రెల) దాకా చేరనివ్వని తోడేళ్లు, పులులు (స్వార్థులు). మత పెద్దలు, పండితులు, సంకుచితులు, అజ్ఞానులు– ఆర్షధర్మాన్ని ఖూనీ చేసిన వాళ్లు. వీరంతా జాతిని నిర్వీర్యం చేసిన ద్రోహులు.

ప్రపంచాన్ని ఏలాల్సిన ఆర్షధర్మం, విశ్వాన్నే ఆర్షమయం చేయాల్సిన భారతీయుడు శతాబ్దాల తరబడి విదేశీయులకు దాస్యం చేయడానికి కారణం ఈ సంకుచిత స్వార్థుల వలన జాతిలో చేరిన అసమానతలతో ఆర్షధర్మం మసకబారింది.

పుట్టుకతో వచ్చిన భయాన్ని, అంధకారాన్ని, అజ్ఞానాన్ని క్రమంగా ఛేదించుకుంటూ ముందుకు సాగడమే నేటి తరం చేయాల్సిన పని. ఇదే నిజమైన సాంస్కృతిక విప్లవం. తద్వారా ఆర్షధర్మ పునరుత్తేజం – ఇది భారతీయోన్నతి. ఇది భీమన్న ఆలోచనల ఔన్నత్యం.

ఉపయుక్త గ్రంథ సూచీ:

1. యాగంటి చిన్నారావు: ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర – 2008
2. డా. కె. సంజీవరావు: బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం – 2008
3. చల్లా అనంత పద్మనాభస్వామి: సాహితీ భీముడు – 2016
4. నమస్తే తెలంగాణ: భీమన్న సాహితీ పురస్కారం – 2014

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

కొండ అద్దమందు....

– రాఘవేంద్ర రావు,
తెలుగు ఉపన్యాసకులు
9441544174

తెలుగు సాహితీ వినీలాకాశంలో ఎన్ని తారకలో తమ వెలుగులను విరజిమ్ముతున్నాయి..... ఆ కోవలో ఎందరో కవులు, రచయితలు తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. వారిలో ఎన్నదగిన వ్యక్తులు కొందరు. అట్లాంటి వారిలో తొలి వరుసలో డాక్టర్ బోయి భీమన్న గారు ఉంటారు. వారి వ్యక్తిగత జీవితాన్ని మరియు సాహితీ జీవితాన్ని విడదీసి చదవడం సాధ్యం కాదు. నేలను విడిచి సాహితీ సాము చేసిన వ్యక్తి కాదు. పాలేరు నుంచి పద్మశ్రీ దాక అంతకుమించి పద్మభూషణ్ దాకా సాగిన వారి సాహితీప్రస్థానాన్ని అనుశీలనంచేయడం కష్టసాధ్యం. భీమన్న గారి గురించి ఒక వ్యాసం రాయడం అంటే శక్తికి మించిన పని. ఒక వాదానికి, ఒక ఉద్వేగానికి కట్టుబడిన వ్యక్తి కాదు. నిలువెత్తు మనిషి. జీవన విలువలను సమగ్రంగా అధ్యయనం చేసి, సమాజంతో అనుసంధానం చేసి, సిద్ధాంతీకరించుకొని, అక్షరబద్ధం చేసి మన ముందు నిలబెట్టిన వారి సాహితీ జీవితాన్ని గురించి ఒక వ్యాసంలో రాయడం అసాధ్యం. వాటిని గురించి పరిశీలిస్తుంటే శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం రాసిన యోగ్యతా పత్రం లోని కొన్ని మాటలు గుర్తుకొచ్చాయి శ్రీశ్రీ కవితలను తూచే రాళ్లు తన వద్ద లేవని చలం అంటాడు తూచే అవసరం లేదు అనుభవించి పలవరించమని శ్రీశ్రీ అడిగితే ....అనే మాట నాకు గుర్తొచ్చింది. భీమన్న రచనలను తూచేందుకు నా వద్దనే కాదు, ఎవరి వద్ద ఏ కొలతలు ఉండకపోవచ్చు. తూచే రాళ్లు గాని కొలిసే పనిముట్లు గాని అంతు పట్టవు. ఒక వాదానికి, ఒక నిర్వేదానికి, ఒక ఉద్వేగానికి అతీతుడైన వ్యక్తి అన్ని రకాల భావోద్వేగాలను అతని అంతరంగ భావాలతో సమన్వయపరిచి అక్షరబద్ధం చేసిన మహోన్నతుడు. సంతృప్తిగా పలవరించడం కూడా సాధ్యం కాని నిస్తేజ పాఠకుడిని. కొంతవరకు వారిని రచనల ద్వారా వారి సాహితీ వ్యక్తిత్వాన్ని దర్శించే ప్రయత్నం చేయడమే వ్యాసోద్దేశం.

మౌలిక పదాలు : రసాద్వైతం, అకాండతాండవం, అద్వైత వేదాంతం, రాగవైశాఖి, సమరసభావన, సరస్వతీ అర్పణం, శివార్పణం, సత్యం శివం సుందరం, వైదిక సాహిత్యం.

కవిత్వం – దృక్పథం :

'నానృషీ కురుతే కావ్యమ్' అని కావ్యోక్తి. కావ్యకర్త యగు కవి సమాజంలోని మంచిచెడులను సమాజహితంగానే దర్శించాలి. తాను దర్శించిన దానిని వర్ణించాలి. దానికి తగిన ప్రతిభ అంతరంగంలో వికసించి ఉండాలి.

శక్తిర్నిపుణతా లోక శాస్త్ర కావ్యాద్యవేక్షణాత్
కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతి హేతుస్తదుద్భవే.

శక్తి, నైపుణ్యము, అభ్యాసము కావ్య హేతువులని అలంకారికులు పేర్కొన్నారు. వీటినే ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము లని అంటారు. వీటిలో ప్రతిభ సహజసిద్ధమైనది. ప్రతిభను హేతుబద్ధంగా తన ఉనికిలో ఉన్న అంశాలకు అన్వయించుకొని శాస్త్రీయంగా నిరూపించుకోవడం వ్యుత్పత్తి. ప్రతిభావ్యుత్పత్తులను నిరంతరం మెరుగు పరుచుకోవడమే అభ్యాసం. వీటి ద్వారా కావ్యం ఆవిర్భవించడం సాధారణం.

సృష్టిలో అందం, వికారం, అనేవి లేవు. మానవుడి దృష్టికి నచ్చినవి అందంగానూ, నచ్చనివి వికారంగానూ కనిపిస్తాయి. వికారంగా కనిపించే వస్తువులో అందాన్ని చూడగలగడమే కళాదృష్టి. కవితా కర్తవ్యం. అలాగే అందమైనదాన్ని అసహ్యకరంగా చిత్రించడం కళా లక్షణం కాదు. కవితా లక్షణమూ కాదు. ఇది కవులకు ఉండవలసిన లక్షణం.

బాల్య దశలోనే ప్రతిభాశాలియైన భీమన్న తన తల్లిదండ్రులనుంచి అందివచ్చిన సంస్కార వంతమైన జీవితంలో నుంచి జీవన విలువలను అలవరుచుకున్నారు. ప్రకృతి అందాలతో మమేకమైన అతని జీవితం ప్రతిభను మెరుగుపరిచి కవిగా నిలబెట్టింది. ఆ ప్రయాణం పాలేరు నుంచి పద్మశ్రీ ని దాటి పద్మభూషణ్ దాకా సాగింది. ఆ ప్రయాణం నిండా ఎంత చీకటి! ఎన్ని దీపాలు!!.... ఆ క్రమంలో వారి ప్రస్థానాన్ని వారి మాటల్లోనే అవలోకనం చేద్దాం!

సామాజిక నేపథ్యం :

అంటరాని కులములోపుట్టి సామాజిక అయోమయ స్థితి నుంచి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ అంతదూరం సాగి రావడానికి దారి తీసిన పురోగమన నేపథ్యాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు.ఆ పురోగమనానికి అడుగడుగునా దారి చూపించిన అనేక దీపాలను గుర్తుకు చేసుకున్నారు. ఒక్కొక్క దీపము దారి చూపు వెనక్కి పోతుంటే మరొక కొత్త దీపం వచ్చి ముందుకు నడిపిస్తూ వచ్చింది. చీకటి ఒక్కటే దీపాలు అనేకం కదా అని తన పురోగమనానికి వెలుగు చూపిన దీపాలను గుర్తు చేసుకునే క్రమంలో ఎంత చీకటి! ఎంత చీకటి ఎన్ని దీపాలు!! అందులో వారి జీవనయానం కనబడుతుంది.

సాహిత్య సృష్టికి పేదరికం అడ్డురాదు అని చెబుతూ తన గ్రంథాలన్నింటిని తనే ముద్రించుకున్న విషయం తన గౌరవ సన్మానాలను సరస్వతీ అర్పణంగాను, కష్టాలను శివార్పణం గానూ

చెప్పుకున్నారు. సత్యం శివం సుందరం ఆయన సాహిత్యసన్నివేశం లో ఒక భావనగా వీరి రచనల్లో కనిపిస్తాయి. శృంగార రసాన్ని ఆశ్రయించిన వాడిగా, సమకాలీన సాంఘిక సమస్యలను కవితా వస్తువులుగా స్వీకరించి కవిత్వాన్ని కాంతసమ్మితంగా చెప్పాలని అన్నారు.

బోయ భీమన్నది పేద హరిజన, కార్మిక, కర్షక కుటుంబమే అయినా అతని తండ్రికి ఆ ఊరంతటికీ పెద్దమాలతనం చుట్టుపక్కల కులమత ప్రమేయం లేకుండా ఎవరికి ఏ తగువులు ఏర్పడిన తుది తీర్పు చెప్పేవాడే పల్లయ్య. ఆ ప్రాంతంలోని ప్రజలకు ఆయన మాటపై మన్నన ఎక్కువ. ఆయన సాన్నిధ్యం అద్వైత వేదాంతిగా తీర్చిదిద్దవలసింది అయినా ప్రకృతి సౌందర్యం తనను కవిగా శిల్పీకరించిందని చెప్పుకున్నాడు.

పల్లయ్య గారికి భారతం మీద ప్రత్యేక అభిమానం ఉండవచ్చు. అందుకని తన కొడుకులు అయిదు గురికీ పాండవుల పేర్లు పెట్టాడు. వారిలో రెండవ వారే భీమన్నగారు. తక్కిన వారి పేర్ల ప్రస్తావన మనకు అప్రస్తుతమే. పేరుకు భీముడే అయిన తాత్వికతలో భీష్ముడంతటివాడు తనకు అందివచ్చిన, కంటికి కనిపించిన, అనుభవించిన సమాజంలోని మంచి చెడులను నిష్కర్షగా కవిత్వీకరించిన వ్యక్తి. భీష్ముని వలె మౌనం దాల్చలేదు. కురుక్షేత్రంలో కలబడి నిలిచిన భీమునివలె స్థిరంగా నిలబడ్డాడు.

సాహిత్య సేవ :

సహస్ర పూర్ణ చంద్ర దర్శనం చేసిన తొమ్మిది పదుల నిండుజీవితంలో ఏడు పదులకు పైగా పుస్తకాలను రచించాడు. వాటిలో నాటకాలు, కవితలు, పాటలు, వచన రచనలు అనేకం ఉన్నాయి సమాజంలోని సమకాలీన అంశాలనే కాక వైదిక, పౌరాణిక విషయాలమీద తన అభిప్రాయాలను,నమ్మకాలను తన కవిత్వంలో నిర్మొహమాటంగా వ్యక్తీకరించాడు. చిన్నప్పటి నుంచి భీమన్నకున్న తనను తాను విమర్శించుకోవడం అలవాటు. అలాగే పూర్వ, సమకాలీన కవుల జీవితాలతో తన జీవితాన్ని పోల్చి చూడడం కూడా. అది కొంతవరకు మేలు, కొంతవరకు కీడు చేసి ఉండవచ్చు. అయినా వెనకడుగు వేయలేదు. అందుకని అతడు రాసిన నాకు తెలిసినజాషువా, శ్రీ శ్రీ కమ్యూనిస్టు కాదు రచనలను పరిశీలించవచ్చు.

వ్యాస వాల్మీకులను తమవారిగాను అరుంధతిని తమ ఆడపడుచులను నిరూపించుకొని రాసిన రచనలు ఆలోచింపచేస్తాయి. పౌరాణిక పాత్రలపై సునిశితమైన పరిశీలనా దృష్టి వారిది. ఎక్కడా అనౌచిత్యం కనబడదు. ఎంతటి పౌరాణిక స్పృహ కలవాడైన అంగీకరించి తీరాల్సిందే. వేద వ్యాసుడు, ఆదికవివాల్మీకి,రాగవాసిష్టం, అశోకవనిలో రాముడు వంటి కృతులు భీమన్న గారి ఆలోచన దృష్టికి నిదర్శనాలు. రాగవాసిష్టం లో రసాద్వైతం గురించి మాట్లాడారు. రసాద్వైతం అంటే "రసము" (ఆనందం లేదా అనుభూతి) ద్వారా విశ్వమంతా ఒకటే అని భావించడం. పాలేరు, కూలిరాజు,చాండాలిక వంటి నాటకాలు అతనిలోని సామాజిక మార్పును దళిత చైతన్యాన్ని ఆశిస్తూ కొనసాగిన రచనలు. పాలేరు నాటకాన్ని చదివి కాకి మాధవరావు లాంటి వారు స్ఫూర్తి పొంది ఉన్నతాధికారులు కాగలిగారు. భీమన్నగారు జీవితాంతం కుల నిర్మూలన కోసం, పీడిత ప్రజల

అభ్యుదయం కోసం రచనలు చేశారు. వారు రాసిన ప్రముఖ గేయాల్లో అకాండతాండవం ఒకటి శివతాండవాన్ని వర్ణిస్తూ ఆధ్యాత్మిక, తాత్విక కోణాల్లో కొనసాగిన రచన ఇది. అతని తాత్విక చింతన సమరసతా మార్గంలో పయనించింది. గుడిసెలు కాలిపోతున్నై అనేది బీద దళిత జీవన పోరాటానికి ప్రతీకగా కనబడుతుంది. అంబేద్కర్ ను, గాంధీని సమానంగా ప్రేమించిన అతని మనస్తత్వం వారిని నిరాడంబరంగా ఆరాధించింది. అంబేద్కర్ పై అంబేద్కర్ సుప్రభాతం, అంబేద్కర్ మతం, అంబేద్కరిజం వంటి అనేక కావ్యాలు రూపుదిద్దుకున్నాయి. చాలా కావ్యాలు గాంధీ గారి సత్యాగ్రహాన్ని, శాంతిని కీర్తిస్తూ కనబడతాయి. జానపదుని జాబులు పల్లెటూరి జీవితాన్ని పట్టణ వాసికి పరిచయం చేసిన ఒక లేఖ. సమాజంలో అనవసరమైనది అపశకునమైనది ఏదీ ఉండదని అతనిభావన అందుకే పిల్లీశతకం అనేది రూపుదిద్దు కుంది. ఆ పిల్లిని చంకన పెట్టుకొని తాను ఢిల్లీకి వెళ్లి పద్మశ్రీని పొందినట్లుగా చెప్పుకున్నాడు. పిల్లీ శతకంలోని పీఠికలో సమకాలీన రాజకీయ నాయకులు, అధికారులు, సమాజంలోని గొప్పవారుగా కీర్తింపబడే వారి జీవితం అధికార దర్పం అనవసర అహం కనబడుతూ ఉంటాయి.

రాగవైశాఖి' వంటి రచనలలో సత్యం, శివం, సుందరం అనేవి కేవలం శబ్దాలు కాదని, అవి పరమ జ్ఞానానికి (బ్రహ్మకు) ప్రతీకలని పేర్కొన్నారు. పడిపోతున్న అడ్డుగోడలు నాటకం ద్వారా నవ సమాజాన్ని కాంక్షించారు. చివరి మెట్టు మీది శివుడు అతడు ఆసుపత్రిపాలైనప్పుడు ఆసుపత్రిలో జీవన పోరాటం చేసిన దశలో రాసుకున్న కవితావల్లరి.

భరతజాతికి వాల్మీకీ, వ్యాసుడూ వంటి హరిజన మహర్షులే మూల పురుషులన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఈ వాదాన్ని ఏ బ్రాహ్మణ పండితుడూ, ఏ హిందూ మతాధిపతీ ఖండించలేదు. చాలమంది సమర్థించారు కూడా.

అంబేడ్కరిజానికి బద్ధవ్యతిరేకమైన గో బ్యాక్ టు వేదాస్ అంటూ సంచలనాత్మకమైన పిలుపు నిచ్చాడు. వేదకాలంలో కులం లేదని వృత్తిగతంగా మాత్రమే మనిషికి గుర్తింపు ఉండేదని భీమన్న నమ్మకం. ఇలాంటి వైరుధ్యాలు కూడా భీమన్న సాహిత్యంలో కనబడతాయి. భీమన్న అత్యాధునిక సాహిత్య భీష్ముడు, కౌరవుల సార్వ భౌమాధికారాన్ని అంగీకరిస్తూనే భీష్ముడు పాండవుల విజయాన్ని అభిలషించినట్లుగా భీమన్న కూడా సమాజ వైభవానికి కొంతవరకు వైదికాన్ని ఆమోదిస్తూనే, అంబేద్కర్ తాత్విక చైతన్యం భారతదేశంలో విస్తరించాలని ఆకాంక్షించాడు. కేవలం దళిత చైతన్యం దగ్గరే భీమన్న ఆగిపోకుండా మానవతా వాదం, ప్రేమతత్వం, జాతీయ దృష్టి, ప్రగతిశీల దృష్టి వంటివిశ్వజనీన ఆలోచనలను కూడా భీమన్న అద్భుతంగా కవిత్వీకరించాడు.

రాజకీయ అవగాహన

సామాజికాంశాలే కాదు, రాజకీయాలపై కూడా ఆయన అవగాహన గొప్పది. శాసనమండలి సభ్యులుగా (1978-84) పనిచేశారు కూడా. జాతీయ ఉద్యమాన్ని నడిపిన కాంగ్రెస్ స్వాతంత్ర అనంతరం కూడా గాంధీజీ నాయకత్వంలో కొనసాగి ఉంటే ఇంత అవినీతితో నిండి ఉండేది కాదని వారి అభిప్రాయం

శ్రామిక వర్గాన్ని రైతు కూలీలను సంఘటితపరిచి జాతి సముద్ధరణ చేయాలని అభిలషించే కమ్యూనిస్టులు కూడా జాతి సామాజిక ప్రవృత్తిని అసలుఅర్థం చేసుకోలేకపోయారు అని భీమన అభిప్రాయం

భారతీయ జనతాపార్టీ విషయానికొస్తే అదొక విషాదభరిత చరిత్ర. వీళ్ళకు సంప్రదాయమూ తెలియదు, సంస్కారమూ తెలియదు. బ్రాహ్మణులంటే బ్రహ్మజ్ఞానులు అనీ, బ్రహ్మజ్ఞానం పుట్టుకతో వచ్చేది కాదనీ, బ్రహ్మజ్ఞానులు అన్ని కులాలతోనూ వుంటారనీ వీళ్ళకు తెలియదు. అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

కొత్తగా రంగంలో దిగిన బహుజనసమాజ్ పార్టీ కూడా యావద్దేశ సమైక్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టు కొన్నట్లు లేదు. కుల ప్రాతిపదికపై నిర్మించబడే ఏ పార్టీ కూడా విజయం సాధించజాలదని అన్నారు.

ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఎన్నుకోబడిన వ్యక్తి ఎంత గొప్పవాడైనా తన నియోజకవర్గ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తాడు. అంతేకాదు. ఆ నియోజకవర్గంలో ఏ కులం, ఏ మతం వోటర్లు అధికంగా వుంటే అట్టివాళ్ళ ప్రయోజనాలకు తలవంచుతాడు. ఈ పద్ధతే దేశం స్వతంత్రమైన నాటినుంచీ కూడా జాతిని నిర్వీర్యం చేస్తూ వస్తున్నది. అని మన రాజకీయ వ్యవస్థ పై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీనికి అధ్యక్ష పాలనా విధానం మేలైనదని వారి ఆలోచన.

విధాన పరిషత్తులో సభ్యులు పార్టీల పరంగా ఉండకూడదు. సమాజంలోని విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు సభ్యులుగా ఉండాలని వారి భావన.

ముఖ్యమంత్రి అంజయ్య తో

బోయి భీమన్న గారు కౌన్సిల్ సభ్యుడిగా వుండగా అసెంబ్లీ అయిదేళ్ళ టర్ములోనూ నలుగురు ముఖ్యమంత్రులు మారారు మొదట డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారు. ఆయన తరువాత అంజయ్యగారు ముఖ్యమంత్రి అయ్యారు. తన మంత్రివర్గంలో 60 మందిని నియమించు కొన్నారు. అది వారికి నచ్చలేదు. అప్పుడు భీమన్న గారు ఒక కవిత చెప్పారు.

దేశాధినేత రెండు గుర్రాలతో నడిపించిన రాజ్యరథానికి
అరవయి ఆబోతులను పూన్చావా రాజ్య సారథీ! అవి ఎటు ఎలా నడుస్తా యనేది దేవుడెరుగు, వాటన్నిటికీ గడ్డీ గాదం ఎక్కడ నుంచి తెస్తావ్ ?

ఈ కవితను విన్న అంజయ్యగారు, "భీమన్నగారూ! మీరు అప్పుడే నన్ను కలిసివుంటే, అందులో మీరు కూడా ఒక ఆబోతు అయివుండేవారు" అన్నారు. అంజయ్యగారిలో అమాయకంగా కనిపించే అత్యంత లలితమైన హ్యూమర్ ఎంత ఉందో చూడండి ! అని భీమన్న గారే చెప్పారు.

లక్ష ఎకరాల పొలాన్ని దోసెడు నీళ్ళతో సాగుచెయ్యటానికి ప్రయత్నించడం ఎలాంటిదో దళితుల ప్రగతికి నేడు జరుగుతున్న కృషి అలాంటిదని ఆయన విమర్శించాడు. భూమిని, వ్యవసాయాన్ని, పరిశ్రమలను జాతీయం చేస్తేనే భారత దేశంలో ప్రజాస్వామ్య సోషలిజం ఆవిర్భవిస్తుందని భీమన్న

పిలుపునిచ్చాడు. ఆధునిక సాహిత్యంలో భీమన్న సాహిత్యం దీపసభ లాగా సమాజాన్ని కాంతివంతం చేస్తుందని వారి భావన. దళిత అనే పదం వారికి నచ్చదు. పూర్వం నిమ్న అనేవాళ్ళు. అర్థాలను బట్టి 'దళిత' కంటే నిమ్న అనడమే ఎక్కువ గౌరవప్రదమని అన్నారు.

మన ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి వారు చెప్పిందే ఒక పద్యం

కుక్కలు చింపిన విస్తరి,
నక్కల పాలైన నంది, నాయకులు తలో
.....ముక్కను తినగా, మిగిలిన
బొక్క సుమీ జాతి ఈ డెమోక్రసి లోనన్.

ఒక్క భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం ఇలాగే ఉందని వారి వ్యాఖ్య.

జనత గుడ్డిదైన జనషండుడే నేత, అని ప్రజాస్వామ్యం లో ప్రజల బాధ్యతను కూడా గుర్తు చేశారు.

కవులతో సహవాసం

దేశమంటే మనుషులు కాదు. దేశమంటే మట్టి.

ఒక దేశం నాది అనుకుంటే, ఆ దేశంలో మనుషులున్నా లేకపోయినా, అది గడ్డికూడా మొలవని ఇసుక ఎడారి అయినా, మంచుమల అయినా, అది నాదే అని గురజాడనే ధిక్కరించారు.

విశ్వనాథ సత్యనారాయణ గారు ఒక సందర్భంలో. 'ఆనాటి సరస్వతి వేరూ, ఈనాటి సరస్వతి వేరూ" అని అన్నారు. దానికి జవాబుగా భీమన్న గారు "సరస్వతి వేరు వేరు కాదు. నాడు నేడు సరస్వతి ఒక్కర్తే. ఆనాడు కంచిపట్టు చీరలు కట్టింది. ఈనాడు మినీ స్కర్టులు వేస్తున్నది." అనే మాటలో వారి ధ్వని గూఢమైనది.

హైందవ సమాజంలోని కులవ్యవస్థ మొత్తం సమాజాన్నే నిర్వీర్యం చేసి, విచ్ఛిన్నం చేసి, నాశనం చేసింది. ఇది పరిష్కారాన్ని ధిక్కరిస్తున్న ఒక విషమ సమస్య. ఈ చాతుర్వర్ణ వ్యవస్థను నాలుగు పడగల విషసర్పం అన్నాడు జాషువా.

కుల మనెడి ఊబిలో పడి కొట్టుకొనియెడు
భరత గోమాత నుద్ధరింపంగ దలంచి
కలము దూసిన విప్లవ కవివి నీవు
జాషువా, నీవె బుుగ్ధర్మ జాతి పితవు. అని జాషువా ను కొనియాడారు.

గతానుగతికంగా సాగుతున్న సాహిత్యాన్ని మలుపు తిప్పినవినండూరి ఎంకిపాటలు అని కొనియాడారు.

ప్రాచీన కవుల రచనలలో కూడా అనౌచిత్యాలు అనేకం ఉన్నాయి. పోతన, పెద్దన రచనలలోని అనౌచిత్యాలు కొన్నింటిని ఎత్తిచూపారు.

ముగింపు

తనను గురించి తాను చెప్పుకోవాలంటే ఒక ఆత్మ కథను రాసుకోవాలి అలాంటి ఆత్మ కథను రాసుకునే ఓపిక తనకు లేదని అవసరము తనకు లేదని ఆత్మకథ జోలికి వెళ్ళనని అంటాడు. తన జీవిత చరిత్రను ఎవరైనా రాస్తే మంచిదే, కానీ దానిపై తనకు బాధ్యత ఉండదని అదే రాసేవాడి బాధ్యతని అని చెబుతాడు.

కృతయుగంబునధర్మవ్యాధులుబోయ
త్రేతాయుగంబునవాల్మీకి బోయ
ద్వాపరయుగమునవ్యాసుడుబోయ
కలియుగమున భీమన్న బోయ.

అని తనను తాను యుగపురుషుల స్థాయితో అన్వయించుకొన్నారు భీమన్న గారు. ఇందులో అతిశయోక్తిని కాదు వారి ఆత్మ విశ్వాసాన్ని గుర్తించాలి. వ్యాస, వాల్మీకి, కాళిదాసాదులనుండి జాషువా, విశ్వనాథ, శ్రీశ్రీ ల వరకు సాహిత్యాన్ని పరామర్శించారు. ఆంగ్లేయుల నుండి ఆధునికుల వరకు పాలనా విధానాలలోని తప్పొప్పులను నిర్మొహమాటంగా ఎత్తిచూపారు.

వ్యాసు డనగ నెవడు ఆనాటి మనుజుడే
తనకు తెలిసినంత మనకు తెలిపె
వ్యాస ప్రోక్త మెల్ల పరమ సత్యము కాదు
పరమ సత్యమేదియు ధరణి లేదు !

అని పరమసత్యమనేది ఏదీ లేదని దృఢంగా విశ్వసించారు. ఆది మానవుడి నుండి ఆధునిక మానవుడి వరకు, వైదికవాఙ్మయము నుండి గతితార్కిక భౌతికవాదం వరకు అధ్యయనం చేసి వాటిని సహానుభూతితో అవగతం చేసుకుని తాను దర్శించిన సత్యాలను ఏ వాదానికి అంటగట్టకుండా తనకు తానే కొత్త దృక్పథాన్ని ఏర్పరుచుకున్న భీమన్న లాంటి కవి కవియుగానికొక్కరు అనడం లో ఎలాంటి సందేహంలేదు.

బోయి భీమన్న గారి గురించి నాకుగా అర్థమయిన చిరు పరిచయమే ఈ వ్యాసం. ఇది సంపూర్ణచిత్రము కాదు. సమగ్రదర్శనమూ కాదు. ఒక ప్రయత్నం మాత్రమే. కొండను అద్దంలో చూపే ప్రయత్నం. కేవలం ప్రతిబింబం అంతే. వస్తువుకుండే త్రిమీతీయత ప్రతిబింబానికి ఉండదు. పైగా కుడిఎడమలు తారుమారుగానూ ఉంటాయి. కానీ ఎంతో కొంత వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. ఆ దిశగా అడుగులు అంతే... విజ్ఞులు అర్థం చేసుకుంటారని ఆశిస్తూ...

ఆధార గ్రంథాలు

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ
2. ఎంత చీకటి! ఎన్ని దీపాలు!! – సహస్ర పూర్ణచంద్ర దర్శనోత్సవ కమిటీ ప్రచురణ
3. చివరి మెట్టు మీది శివుడు – బోయి భీమన్న
4. బోయి భీమన్న – వికీపీడియా

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

డా.బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై - మానవతావాదం

- డా.బి. లచ్చయ్య,
అసిస్టెంట్ ప్రొఫెసర్

పరిచయం:

దళితుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించిన డా.బోయి భీమన్న. తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురులో 19 సెప్టెంబర్ 1911న జన్మించారు. నాగమ్మ, పల్లయ్య తల్లిదండ్రులు. పాఠశాల విద్య మామిడికుదురులోను, ఉన్నతవిద్యను కాకినాడలోను చదివి సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పవచ్చు. విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత రాజోలులోని బోర్డు హైస్కూల్‌లో చరిత్రను బోధించే ఉపాధ్యాయుడిగా పనిచేశారు. తర్వాత అనువాద విభాగం డైరెక్టర్‌గా, రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్‌గా 1964 వరకు పనిచేశారు. తాపీ ధర్మారావు సంపాదకత్వంలోని జనవాణి పత్రికలో పనిచేశారు, ఆ తరువాత కుసుమ ధర్మన్న సంపాదకత్వంలోని జయభేరి వార పత్రికలోను, గూడవల్లి రామబ్రహ్మం ప్రజామిత్ర పత్రికలో సహాయ సంపాదకుడిగా 1969 వరకు పనిచేశారు.

రచనలు:

9వ తరగతిలోనే "నిషా వస్తువులు నిషేధించాలి" అనే వ్యాసం రచించారు.

1. పద్యకావ్యాలు: మధుబాల, మధుగీత, దీపసభ, భీమన్న కావ్య కుసుమాలు, మణిమానసం, భీమన్న మాట వెలదులు, చాటువులు, స్వగతాలు, నా ఊహలలో వాల్మీకి, పంచమ స్వరం, భీమన్న శంఖారావం, అంబేద్కర్ సుప్రభాతం, పిల్లిశతకం,

బాలయోగీయం, జన్మాంతరవైరమ్, అశోకవనిలో రాముడు, ఏకపద్యోపాఖ్యానం మొదలైనవి.

2. వచన కవిత్వం: భీమన్న నఖత్రాలు, గిల్లి చెబుతున్న, భీమన్న ఉగాదులు, చివరమెట్టు మీద శివుడు, గుడిసెలు కాలిపోతున్నై, అనాది కోస నుండి అనంతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు మొదలగునవి.
3. గేయ కావ్యాలు: భీమన్న పాటల తోట, అకాండతాండవం, రాఖీలు, పాటలలో అంబేద్కర్, బొమ్మ మొదలగునవి.
4. నాటకాలు: బాలయోగి, పడిపోతున్న అడ్డుగోడలు, చాండాలిక, కూలిరాజు, చిత్రకళా ప్రదర్శన, పాలేరు, అసూయ, పైరుపాట అనేవి సాంఘిక నాటకాలు.

   ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, రాగవాశిష్టం, ధర్మవ్యాధుడు అనేవి పౌరాణిక నాటకాలు.
5. వచన రచనలు: ధర్మంకోసం పోరాటం, అంబేద్కరిజం, జానపదుని జాబులు, డాక్టరుఖాసు, కులనిర్మూలన, అంబేద్కర్ మతం, నాకు తెలిసిన జాషువా, పురాణాలలో హరి – గిరిజన మనీషులు, శ్రీశ్రీ కమ్యూనిస్టుకాదు మొదలగునవి.
6. జీవిత చరిత్రలు: డాక్టరుఖాన్, మధుబాల, రాజకీయవీరుడు
7. నవలలు: రాగవైశాఖి

   త్రిపదలు, అకాండతాండవం (గేయకావ్యం)
8. ఇతర రచనలు: ది సెవెంత్ సీజన్ (ఇంగ్లీస్), పిల్లిశతకం, ఏకపద్యోపాఖ్యానం, రాఖీలు, కేదారేశ్వరి మణిమానసం మొదలగునవి

"పాలేరు నుంచి పద్మశ్రీ వరకు" అనే గ్రంథం విమర్శకుల ప్రశంసలను అందుకుంది.

బిరుదులు:

నిరంతర సాహితీ కృషీవలుడు పద్మభూషణ్ డా.బోయి భీమన్న పద్యం, గేయం, వచనం, నాటకం, నవల, సంగీత నృత్య రూపకం, శతకం, విమర్శ ప్రక్రియలలో వారు విశేషమైన రచనలు చేశారు. వారి సాహితీ కృషికి తగినట్లుగా అనేక సాహిత్య సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు వివిధ బిరుదులతో, సత్కారాలు, సన్మానాలు చేశాయి.

1968సం॥లో కాకినాడలో "మహాకవి" బిరుదుతో సన్మానం జరిగింది. 1971 సం॥లో సాహితీ వసంతం, ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశాయి. 1973 సం॥లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ" పురస్కారంతో భీమన్నను సత్కరించింది. 1975 సం॥లో "గుడిసెలు కాలిపోతున్నై" కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1976 సం॥లో కాశీ విద్యాపీఠం, వారణాసి వారు గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ను ప్రధానం చేశారు. 1993 సం॥లో నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు వారు "గౌరవ డాక్టరేట్" ను ప్రధానం చేశారు. 2000 సం॥లో విజయనగరం విజయ భావన సాహితీ సంస్థ వారు ఉగాది నాడు "నవయుగ

కవిసార్వభౌమ బిరుదు" ను ప్రధానం చేశారు. 2001 సం॥లో భారత ప్రభుత్వం "పద్మభూషణ్ " బిరుదునిచ్చి సత్కరించింది.

పదవులు:

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి సభ్యులుగాను, ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగాను, ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగాను పని చేశారు.

కనకాభిషేకం, గండపెండేరం, విశిష్ట సభ్యత్వాలు వంటివి ఎన్నో ఉన్నాయి.

డిసెంబర్ 6, 2005 సం॥లో హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు.

గుడిసెలు కాలిపోతున్నై – మానవతావాదం

డా॥ బోయి భీమన్న వచన కవితలలో "గుడిసెలు కాలిపోతున్నై" విశిష్టమైన కావ్య సంపుటి. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును 1975 సం॥లో అందుకున్న రచన ఇది.

కుల వ్యవస్థ కూలనిదే భారత జాతికి విముక్తి లేదు. కులం, మతం, రాజకీయ పార్టీల పేరుతో పేద ప్రజలు మోసగింపబడుతున్నారని ఆవేదన చెందుతారు. దీనికి మానవునిలోని స్వార్థ గుణమే ప్రధాన కారణం అంటారు. అవినీతి, లంచగొండితనం, దోపిడి విధానం, మతమౌఢ్యం, కులజాడ్యం మొదలైన సామాజిక రుగ్మతల మీద ఎక్కుపెట్టిన కవితాక్షరమే ఈ గుడిసెలు కాలిపోతున్నై.

తరతరాలుగా దళితులు గుడిసెల్లో నివసిస్తున్నారు. అనేక కారణాలను చూపి ఆధిపత్య కులాల వాళ్ళు దళితులను అణగద్రొక్కుతూనే ఉన్నారు. దగాపడి, అణచివేతకు గురికాబడి, అవమానించబడి ప్రతినిత్యం పోరాటం చేస్తూ చస్తూ, బతుకుతు పూరి గుడిసెలో కాలం వెళ్ళదీస్తున్న దళితుల గుడిసెలే క్రమం తప్పకుండా కాలిపోతుండడాన్ని బోయి భీమన్న నిశితంగా పరిశీలించి, దాని వెనక జరుగుతున్న కుట్రలను బయటపెట్టడంలో భాగంగా తన ధర్మాగ్రహాన్ని, ఆవేదనను ఈ కవితలో తెలియజేశాడు.

గుడిసెలు కాలిపోతున్నై
ఓహో, కాలిపోతున్నై
ఎవరి గుడిసెలో పాపం!
మాల మాదిగలవే అయివుంటై
గుడిసెలు మరెవరి కుంటై?

చాలమందికే వుంటైలే
అసలు ఈ దేశధర్మమే అంత!
అయితే – ఈ గుడిసెలు
ఏడాది కొకసారైనా కాలిపోతుంటై!

గుడిసెలు కాలిపోవడం, తిరిగి గుడిసెలు నిర్మించడం, మరల గుడిసెలు కాలిపోవడం అనే విషవలయం లాంటి పరిస్థితుల వెనక ఉన్న కుతంత్రాలను ఛేదించే సాహసం చేశాడు బోయి భీమన్న.

కాలిపోయిన గుడిసెల స్థానంలో మళ్ళీ గుడిసెలు ఎందుకు వేయాలి? భవనాలు లేవద్దా? అనే విప్లవాత్మక ప్రశ్నతో దళితుల అభ్యున్నతి కోసం భీమన్న వ్యక్తపరిచిన ఆవేదన సమాజం మార్పు చెందాలని ఆశిస్తాడు.

అదే మన ధర్మంలోని రహస్యం

ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై
పోతుంటై
పుట్టుకొస్తుంటై !

ఒకరు బంగ్లాలో నివసించడం, మరొకరు గుడిసెలో నివసించడం అనేది ధర్మమని నమ్మిస్తూ పాటించే సూత్రాలు పేదలను ముఖ్యంగా దళితులను దగా చేయడమేనని చెబుతారు భీమన్న. ధర్మం ముసుగు తొడిగి తరతరాలుగా చేస్తున్న దోపిడి, దౌర్జన్యం గురించి అప్రమత్తం కావాలని మానసిక, సామాజిక విముక్తి కోసం అట్టడుగు వర్గాలవారు, బహుజనులు పోరాటం చేసి ఆ విషవిలయం నుండి బైటికి రావాలని, లేకపోతే ఆ గుడిసెలు మళ్ళి మళ్ళి అలా కాలిపోతూనే ఉంటాయని, గుడిసెలు ఎందుకు కాలిపోతున్నాయో అనే మర్మాన్ని తప్పకుండా తెలుసుకోవాలని భీమన్న ధర్మబోధ చేశాడు.

ముగింపు: "నేను సత్యాన్వేషిణి కాను, సత్యమే నేను" అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో సుదీర్ఘకాలం రచనా వ్యాసంగాన్ని కొనసాగించి అనేక సత్కారాలను అందుకుని మహాకవిగా, నవయుగ కవిసార్వభౌమగా, పద్మశ్రీగా, పద్మభూషణ్ వంటి అత్యున్నత బిరుదులు అందుకున్నారు. అలాగే అనేక గౌరవ డాక్టరేట్లు అందుకున్న సాహితీమూర్తి బోయి భీమన్న. సాటి మనిషిని మనిషిగా గుర్తించాలని పోరాటం చేసినవాడు. కులనిర్మూలన జరగాలని కోరుకొని అంబేద్కరిజంను అనుసరించాడు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి సమాజ చైతన్యం కోసం రచనలను చేసి ప్రభావితం చేసిన దార్శనికుడు. ప్రజాస్వామ్యం, మానవతావాదం దృక్పథంతో తాను ఆకళింపు చేసుకున్న విషయాలను తాత్విక దృష్టితో కొత్త ఆలోచనలకు దారులు చూపిన మహానీయుడు డా.బోయి భీమన్న అని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథ సూచిక

1. భీమన్న బోయి, 2008.బోయి భీమన్న సమగ్రసాహిత్యం, సంపుటి 4, హైదరాబాదు: తెలుగువిశ్వవిద్యాలయం.
2. భీమన్నబోయి,2010.బోయిభీమన్నసమగ్రసాహిత్యం,సంపుటి 3, హైదరాబాదు: తెలుగువిశ్వవిద్యాలయం.
3. బోయి భీమన్న సాహితీ షష్ఠి పూర్తి సంచిక సం॥ గనుముల జ్ఞానేశ్వర్.
4. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న బోయి హైమవతీ.
5. మంజులత, ఎ. (సం) 2008, బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న అఖండ తాండవం - మానవ సంబంధాలు

- డా. జంపుల తిరుపతయ్య,
తెలుగు లెక్చరర్
Cell: 901 460 5004.

అఖండ తాండవం - శివ తత్వం :
వాగర్థావివ సంపృత్తా వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ"

శబ్దము, దాని యొక్క అర్థము ఏ విధంగా విడదీయలేనివిగా కలిసి ఉంటాయో, ఆ విధంగా మిళితమై ఉన్న పార్వతీ పరమేశ్వరులకు, సమస్త జగత్తుకు జననీజనకులైన ఆ ఆది దంపతులకు, శబ్దార్థజ్ఞానాన్ని ప్రసాదించటానికి నమస్కరిస్తున్నానన్నది కవికుల గురువైన కాళిదాస మహాకవి ఇష్టదేవతాస్తుతి. శివ పార్వతుల సమైక్యరూపమే అష్టమూర్తి యొక్క అర్ధనారీ స్వరూపం. ప్రకృతి పురుషుల సంయుక్త భావమే శివశక్తుల సమాహారతత్వం. శివుడు పరమానందరూపుడు. నిర్వికారుడు. సాధువులైన సత్పురుషుల మనస్సులయందు శయనించేవాడు. శివ శబ్దమే కల్యాణప్రదం. శివుడు సర్వులకు శుభాలనిచ్చేవాడు. మహేశ్వరుడు - శంకరుడు, ఈశానుడు, భూతేశుడు, చంద్రశేఖరుడు, మృత్యుంజయుడు మొదలైన సహస్ర నామాలతో విరాజిల్లేవాడు. సకల లోకవాసులచేత సంస్తుతింపబడేవాడు. భక్తానుగ్రహకారకుడు. సజ్జనుల కష్టాలు తొలగించి, వారికి భద్రత కలిగించేవాడు.

"ఈశ్వరః సర్వభూతానాం" అన్నట్లు పరమేశ్వరుడు. సర్వ జీవరాశుల్లోను నిలిచి ఉంటాడు. అభవుడు, వరప్రదాత అయిన శివుని మాహాత్మ్యాన్ని గురించి అనేక పురాణాలు ఉద్ఘాటించాయి. అలాంటి లయ కారుని గురించి బోయి భీమ్మన్న గారు 189 గేయాలతో ఛందో బద్ధమైన గ్రంథం

సమకాలిన సామజిక దృక్పథంతో రాయడం ఆనందించదగిన విషయం. శివ తత్వాన్ని మానవ సంబంధాలలో అన్వయం చేయడం, ఆధ్యాత్మిక దృష్టిలో అత్యంత లోతైనది, విస్తృతమైనది. శివుడు కేవలం దేవుడు మాత్రమే కాదు; ఆయన ఒక జీవన విధానం, ఒక తాత్విక సత్యం. శివ తాత్వము సృష్టి--స్థితి--లయల సమన్వయంగా ఉండగా, అదే తత్వము మానవ సంబంధాలలో కూడా సమతుల్యత, అవగాహన, త్యాగం మరియు పరిణామాన్ని సూచిస్తుంది.

అఖండ తాండవం – మనవ సంబంధాలు :

మనము పసిపాపల మటోయీ ?
మహేశుడు వత్సలత చూపగ ?
.....
అర్ధ నారీశ్వరుడు తన స
ర్వార్ధ సృజనోన్మాట్య కళలో

శివుని రూపాన్ని పరిశీలిస్తే ఆయన త్యాగానికి, వైరాగ్యానికి, కరుణకు ,ప్రేమ, సమతకు ప్రతీకగా అనిపిస్తుంది. మానవ సంబంధాలలో ఈ లక్షణాలు ఎంతో అవసరం. మానవ సంబంధాలలో ముఖ్యమైనది దాంపత్య జీవితం, పరిశీలిస్తే దంపతులు పరస్పర అవగాహన లేకపోతే సంబంధం నిలవదు. శివుడు పార్వతితో సమానత్వాన్ని పాటించినట్లే, భార్యాభర్తల మధ్య కూడా అహంకారం లేకుండా పరస్పర గౌరవం ఉండాలి. శివుడు అర్ధనారీశ్వర తత్వంగా వ్యక్తమవడం ద్వారా "నేను -- నీవు" అనే భేదం కాకుండా "మనము" అనే భావనను బోధిస్తాడు

రాజ్యమేలే వాంఛ నిన్నొక
రాక్షసుని జేసినా దటో ?
స్వర్గమున కని, నరక పథమున
స్వారి కడలిన బ్రతు కటో ?

నాటి కాలమే కాదు నేటి కాలంలో కూడా రాజ్య పాలన వాంఛ తో నాయకులు, పాలకులు ఎన్నో ఆకృత్యాలకు పాల్పడుతున్నారు. విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాలని కోరికతో అతి స్వార్థాన్ని పెంచుకొని, కులానికి, మతానికి ప్రాధాన్యత ఇస్తూ సమాజాన్ని తప్పు దారిలోకి తోస్తుంది ఈ నవ సమాజం కూడా అందుకే భీమన్న గారు అవసరం లేని కోరికలను విడిచిపెట్టడం మంచిదని. మానవ సంబంధాలలో అధిక ఆశలు, అహంకారం, స్వార్థం సంబంధాలను విషపూరితంగా మారుస్తాయని తెలియజేస్తూనే, శివుని వైరాగ్యాన్ని అనుసరిస్తే, మనం ఇతరులపై అధిక ఆశలు, అంచనాలు పెట్టుకోకుండా, వారిని వారు ఉన్నట్లే అంగీకరించగలరని. ఇదికుటుంబ, రాజకీయ, సామాజిక బంధాలలో మరియు స్నేహాలలో సంబంధాలలో ఎంతో శాంతిని చేకూర్చుతుందని కవి భావన.

భూమి రాజ్య మదేల ? నీ కిదే
ప్రేమ రాజ్యము, ఏలు కోవోయ్ !
మేర కల్గును భూమి శక్తికి ,
మేర లేదీ ప్రేమ శక్తికి ?
పడగ లెత్తిన పగల నడుమ
ప్రణయ సుఖములు సాధ్యమా ?
సత్య సుందర మనుజ జన్మకు
మృత్యు వొకటే లక్ష్యమా ?

మనవ సంబంధాలు, భూమి, రాజ్యాల కంటే ప్రేమ రాజ్యంలోనే ఎక్కువ కాలం పదిలంగా ఉంటాయని కవి భావన. ఈ ప్రేమ తత్వమే శివ తత్వమని, దాన్ని అనుసరించిన సమాజానికి పగలు ప్రతీకారాలు తెలియవని భీమన్న గారి అభిప్రాయంగా చెప్ప వచ్చు. సత్యం, శివం , సుందరం అంటేనే మనిషి జన్మకు సార్థకం అని అవి లేని మనిషి జన్మ మృత్యు వాతను పొందుదురు. శివ తత్వమే ప్రేమ తత్వం , కవిత్వ అంతరాత్మ , అదే కవి ఆత్మ తత్వం. నేడు సమాజంలో జరుగుచున్న అంతరాలను తొలగించే శక్తి ఒక్క ప్రేమ శక్తికే ఉంది అంటారు కవి.

కర్మ మని కుర్చోకురా ?
కర్మ శీలుడ వగుమురా !
కర్మ మనునది లేదు రా ! నీ
ధర్మమే నీ జీవితముకా!
చెడ్డ విత్తనములను చల్లీ
దొడ్డ ఫలమును కోరు నెవ్వాడు?
కర్మ శూరుడ వైనపుడే నీ
కాంక్ష లన్నియు తీరురా

నాటి సమాజాలలో మనుషులు కర్మ సిద్దాంతాన్ని నమ్మి తను చేయవలిసిన పనిని చేయకుండా నా కర్మ ఇంతే అని సరిపెట్టు కొని, కర్తవ్యాన్ని విస్మరించి, మూడ నమ్మకాలను నమ్ము చున్నారు అని కవి తన ఆవేదన వ్యక్తం చేశారు. కాని నేటికి సమాజంలో ఇంకా ఆ మూడ విశ్వాసాలు, నమ్మకాలు మనుషులను పిడిస్తూనే ఉన్నాయి. ఇలాంటి నమ్మకాల వల్ల మనవ సంబంధాలు తెగిపోతున్నాయి. చెడ్డ పనులు చేసిన, అక్రమ మార్గాలను ఎంచుకున్న , తన కర్తవ్యాన్ని , బాధ్యతలు విస్మరించి మంచి ఫలితాలను ఆశించే సమాజాన్ని చూసి కవి భావన. మంచి సమాజం ఉండ లంటే మంచి ఆలోచన, మంచి ప్రవర్తన ఉండాలంటాడు. “నీ ధర్మమే నీ జీవితం” అంటాడు కవి అదేవిధంగా “కర్మ శురుదవైతేనే నీ కాంక్షలన్నీ తీరుతాయి అంటాడు. ఉత్తముడిగా కీర్తి పొందాలంటే ధర్మమైన కర్మను నిర్వర్తించాలి అప్పుడే సామాజిక , రాజకీయ , కుటుంబ సంబంధాలు ప్రభావితం చేస్తాయి అదే శివ తత్వం , అదే అఖండ కావ్య తత్వం.

ముగింపు:

లోకానికి సంబంధించిన ఒక తాత్విక కవిత్వం బోయి భీమన్న గారి అకాండ తాండవం, శివ తత్వాన్ని లోకంలోని మానవజాతికి అన్వయించి, మానవజాతి మార్పును కాంక్షించిన సహృదయ కవి. జీవితం పట్ల కవికున్నంత పట్టింపు బహు శా మరెవరికీ ఉండదేమో. భావోద్వేగాలను బలంగా ప్రకటించే వ్యక్తి కవి. లోకంలో అన్ని విషయాల పట్ల ఇంత లోతుగా ఆలోచించే తత్వం ఒక్క కవికే ఉందంటే అతిశయోక్తి కాదు. శాస్త్రజ్ఞులు, తాత్వికులు , నాయకులు , మేధావులు , సామాజికులు కొన్ని అంశాలు పట్టించు కుంటారు , కొన్ని పట్టించు కోరు కానీ కవి అన్ని విషయాలను పట్టించు కుంటారు. అలాంటి గొప్ప వ్యక్తిత్వం కలిగిన కవి బోయి భీమన్న. సమ సమాజ నిర్మాణము కోసం , సంఘంలో వివక్షతకు, దోపిడికి గురైతున్న సమాజాన్ని చైతన్య పరిచే రచనలను ఎన్నో రచించారు. అకాండ తాండవంలోని శివ తత్వాన్ని తెలుపుతూ సమాజాన్ని అనుసరించ మని తద్వారా మానవజాతి ససంబంధాలు పెరిగి సంతోషంగా జీవిస్తారని కవి ఆశించారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం (సంపుటి–1) – తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్
2. పాలేరు నుండి పద్మ శ్రీ వరకు – బోయి భీమన్న
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం – ఆరుద్ర (సంపుటి–4)

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

పాలేరు నాటకం – సామాజిక విప్లవ పరిశీలన

– డా. ఎన్. సుభాషిణి
అసిస్టెంట్ ప్రొఫెసర్

వ్యాస సంగ్రహం

ఈ పరిశోధనా వ్యాసం ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో సామాజిక సంస్కరణలకు నాంది పలికిన బోయి భీమన్న గారి 'పాలేరు' (1938) నాటకాన్ని సమగ్రంగా విశ్లేషిస్తుంది. కుల వివక్ష, అస్పృశ్యత, మరియు వెట్టిచాకిరీ వంటి అమానవీయ ఆచారాల మధ్య నలిగిపోతున్న దళిత సమాజాన్ని మేల్కొల్పిన 'మేనిఫెస్టో' ఈ నాటకం. నాటక నాయకుడు వెంకన్న జీవన ప్రయాణం ద్వారా, 'విద్య' అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా, ఒక జాతి విముక్తికి ఎలా దోహదపడుతుందో ఇక్కడ చర్చించబడింది.

కీలక పదాలు : విద్య, అస్పృశ్యత, వెట్టి చాకిరి, సాంఘిక అంతరాలు

ఉపోద్ఘాతం :

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిది. సమాజంలోని మార్పులను సాహిత్యకర్తలు తమ రచనల ద్వారా ప్రతిబింబిస్తారు. తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్దం ప్రారంభం ఒక సందిగ్ధ సమయం. ఒకవైపు పాశ్చాత్య విద్య ప్రభావం, మరోవైపు జాతీయోద్యమ చైతన్యం తెలుగు నేలపై కొత్త ఆలోచనలను రేకెత్తించాయి. ఈ తరుణంలో అణగారిన వర్గాల బాధలను, ఆవేదనలను అక్షరీకరించడానికి 'దళిత సాహిత్యం' ఒక శక్తివంతమైన ప్రక్రియగా ఆవిర్భవించింది. ఆ విప్లవానికి ఆదిపురుషుడు మహాకవి బోయి భీమన్న.

ఆయన రచించిన 'పాలేరు' నాటకం కేవలం ఒక కళారూపం కాదు. అది ఒక సామాజిక గర్జన. "పాలేరు తనం నుండి కలెక్టర్ తనం వరకు" అనేది కేవలం ఒక నినాదం కాదు, అది ఒక జాతి

ఆశయం. ఈ నాటకం వెలువడిన తర్వాత తెలుగు నేలపై సంభవించిన మార్పులు అసాధారణమైనవి. అప్పటివరకు కేవలం అగ్రవర్ణాల ఇతివృత్తాలతో సాగిన నాటక రంగానికి, 'దళిత జీవితాన్ని' ప్రధాన వస్తువుగా పరిచయం చేసిన ఘనత ఈ నాటకానిదే.

బోయి భీమన్న: జీవితం – సామాజిక నేపథ్యం :

భీమన్న ఒక పేద దళిత కుటుంబంలో జన్మించారు. తూర్పు గోదావరి జిల్లాలోని మామిడికుదురు గ్రామంలో ఆయన ఎదుర్కొన్న సామాజిక వివక్ష ఆయన కలంలో సిరాగా మారింది. ఆయనకు చిన్నతనంలోనే అంటరానితనం వల్ల కలిగే అవమానాలు తెలుసు.

ఆయనపై అంబేద్కర్ 'జాతి విముక్తి' సిద్ధాంతాలు, గాంధీజీ 'హరిజనోద్ధరణ' ఉద్యమాలు సమాంతరంగా పనిచేశాయి. అయితే, భీమన్న కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, కార్యాచరణ వైపు మొగ్గు చూపారు. ఆయన కలం నుండి జాలువారిన 'పాలేరు', 'కూలిరాజు' వంటి నాటకాలు నాటి సామాజిక అవసరాల నుండి పుట్టినవే.

పాలేరు నాటకం: ఇతివృత్తం – పాత్ర చిత్రణ :

ఈ నాటక కథా వస్తువు చాలా సరళమైనది కానీ అత్యంత శక్తివంతమైనది.

- ❒ వెంకన్న (నాయకుడు): జ్ఞాన తృష్ణ కలిగిన బాల్య దళిత మేధావి. పశువుల వెనుక తిరుగుతున్నా, అతని చూపు మాత్రం అక్షరాల వైపు ఉంటుంది.
- ❒ వనబాల (నాయకి) సామాజికాంతరాలు పాటించని అభ్యుదయ దృక్పథం కలిగిన సుకుమార బాల. వెంకన్న కి మానసిక ధైర్యం, ప్రేరణ.
- ❒ సుబ్బన్న (తండ్రి): తరతరాల బానిసత్వానికి ప్రతీక. "రాసిపెట్టి ఉంటేనే ఏదైనా జరుగుతుంది" అనే విధివాదాన్ని నమ్మే అమాయక పల్లెటూరి మనిషి.
- ❒ ఉపకారి (ఉపాధ్యాయుడు): విద్యాదానమే నిజమైన సమాజ సేవ అని నమ్మే సంస్కర్త.
- ❒ కుబేర్రావు (భూస్వామి): అణచివేతకు, అధికార గర్వానికి చిహ్నం.

వెంకన్న తన కష్టాలను జయించి, విద్యావంతుడై, చివరకు జిల్లా కలెక్టర్ గా తన గ్రామానికే రావడం ఈ నాటకంలోని గొప్ప మలుపు. ఇది దళిత సమాజంలో ఒక అద్భుతమైన ఆశావహ దృక్పథాన్ని నింపింది.

అస్పృశ్యత మరియు కుల వ్యవస్థ: చారిత్రక విశ్లేషణ :

భారతీయ సమాజంలో కులం అనేది ఒక సామాజిక హోదా మాత్రమే కాదు, అది ఒక ఆర్థిక వ్యవస్థ కూడా. అట్టడుగు కులాలకు విద్యను దూరం చేయడం ద్వారా వారిని కేవలం శారీరక శ్రమకు మాత్రమే పరిమితం చేశారు. భీమన్న ఈ అన్యాయాన్ని నాటకంలో ప్రతిఘటించారు.

"దేవుడు అందరినీ మనుషులుగా పుట్టిస్తే, మనుషులు మాత్రం ఒకరిని దేవునిగా, మరొకరిని అంటరానివానిగా ఎందుకు చూస్తున్నారు?" అంటరానితనం వల్ల వెంకన్న వంటి ప్రతిభావంతులు కూడా బానిసలుగా మిగిలిపోతున్న వైనాన్ని భీమన్న ఈ నాటకంలో ఎండగట్టారు.

వెట్టిచాకిరీ – ఆర్థిక బానిసత్వం: పాలేరు వ్యవస్థ :

'పాలేరు' వ్యవస్థ అనేది ఒక రకమైన అప్పుల బానిసత్వం. తండ్రి చేసిన కొద్దిపాటి అప్పు కోసం కొడుకు జీవితాంతం వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. ఇది వ్యక్తిత్వ హననమే కాకుండా, ఒక జాతి ఆర్థిక ఎదుగుదలను అడ్డుకునే కుట్ర. వెంకన్న పాత్ర ద్వారా ఈ వ్యవస్థలో ఉన్న క్రూరత్వాన్ని భీమన్న ప్రపంచానికి చూపారు. పశువుల వెనుక తిరుగుతూ, సరైన తిండి, బట్ట లేకుండా ఉండే పాలేర్ల జీవితం నాటి గ్రామీణ భారత చేదు నిజం.

విద్యా విప్లవం: దళిత సాధికారతకు ఏకైక మార్గం :

భీమన్న గారి సందేశంలో అత్యంత కీలకమైన అంశం 'విద్య'. అంబేద్కర్ గారు చెప్పిన "చదువుకో, చైతన్యపడు, పోరాడు" అనే సూత్రాన్ని ఈ నాటకం అన్వయించింది.

"కలం పట్టని చెయ్యి గొడ్డలి పట్టాల్సిందే, పుస్తకం తెరవని కళ్లు అంధకారంలో మిగలాల్సిందే."

వెంకన్న కలెక్టర్ కావడం అనేది కేవలం ఒక వ్యక్తిగత విజయం కాదు, అది చదువు ద్వారా పొందే సామాజిక అధికారం. అధికారం చేతిలోకి వచ్చినప్పుడే అణచివేత ఆగుతుందని ఈ నాటకం చాటి చెబుతుంది.

నాటకంలోని భాష – శైలి – నాటకీయత :

భీమన్న గారు ఈ నాటకంలో వాడిన భాష ప్రజల భాష. పల్లెటూరి యాస, జాతీయాలు, నుడికారాలతో నాటకం జీవకళతో ఉట్టిపడుతుంది. క్లిష్టమైన గ్రాంథిక భాషను కాదని, ప్రజలకు సులభంగా అర్థమయ్యే వ్యావహారిక భాషను వాడటం వల్ల ఈ నాటకం అడవిలోని ప్రజల వరకు చేరింది.

నాటకంలోని సంభాషణలు చాలా సూటిగా, గుండెకు తగిలేలా ఉంటాయి. ముఖ్యంగా సుబ్బన్న మరియు వెంకన్నల మధ్య జరిగే సంభాషణలు తండ్రి కొడుకుల మధ్య ఉన్న ప్రేమని, సామాజిక ఆవేదనని సమాంతరంగా చూపిస్తాయి.

సామాజిక ప్రభావం: సాహిత్య చరిత్రలో ఒక మైలురాయి :

సాహిత్య చరిత్రకారులు ఈ నాటకాన్ని 'తెలుగు దళిత మేనిఫెస్టో' అని పిలుస్తారు. ఈ నాటక ప్రభావం వల్ల ఆంధ్రదేశంలో వేలాది మంది పాలేర్లు తమ బానిస సంకెళ్లను తెంచుకున్నారు. ఎంతోమంది దళిత యువకులు వెంకన్నను స్ఫూర్తిగా తీసుకుని ఐ.ఏ.ఎస్ (IAS), ఐ.పి.ఎస్ (IPS) అధికారులయ్యారు.

"నేను పాలేరుని. పాలేరు నాటకం చూసి చదువుకోవాలని అక్షరాలు నేర్చుకుని, చదివి, కలెక్టర్ అయ్యాను. పాలేరు నాటక ప్రభావం నా మీద నా ప్రజల మీద ఎంతగానో ఉంది. ఈ నాటకం

రాకపోతే నేను ఒక అనామకుడిగా, పాలేరుగానే మిగిలిపోయి ఉండేవాడిని. బోయి భీమన్న గారి రుణం జన్మజన్మలకు తీర్చుకోలేనిది".

– శ్రీ కాకి మాధవరావు గారు ఐ.ఏ.ఎస్

నాటకం ప్రదర్శించబడిన చోటల్లా భూస్వాములు తమ పాలేర్లను వదిలేయాల్సి వచ్చింది, ఎందుకంటే ప్రజల్లో అంతటి చైతన్యం వచ్చింది. ఇది సాహిత్యం సృష్టించిన ఒక నిశ్శబ్ద విప్లవం.

సమకాలీనత – నేటి సమాజంలో పాలేరు సందేశం :

నేడు అంటరానితనం చట్టరిత్యా నేరం అయినప్పటికీ, పరోక్ష వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది. కార్పొరేట్ విద్యా సంస్థల్లో, కార్యాలయాల్లో దళితులు ఎదుర్కొంటున్న మానసిక వివక్షను ఎదుర్కోవడానికి 'పాలేరు' నాటకం నేటికీ స్ఫూర్తినిస్తుంది. "మన గమ్యం పాలేరు తనం కాదు, పాలకులం కావడమే" అనే సందేశం నేటి యువతకు అత్యంత అవసరం.

ముగింపు :

మహాకవి బోయి భీమన్న గారు అందించిన 'పాలేరు' నాటకం తెలుగు సాహిత్యానికే కాకుండా సమస్త మానవాళికి ఒక పాఠం. ఒక మనిషిని కులం పేరుతోనో, వృత్తి పేరుతోనో అణచివేయడం పాపం అని ఈ నాటకం హెచ్చరిస్తుంది.ఈ నాటకాన్ని కేవలం సాహిత్యంగా చూడకుండా, ఒక సామాజిక శాస్త్రంగా (Sociology) అధ్యయనం చేయాలి.

వెంకన్న కలెక్టర్ కావడంతో నాటకం ముగిసినా, సామాజిక మార్పు అనే నాటకం నిరంతరం కొనసాగుతూనే ఉండాలి. అదే భీమన్న గారికి మనం ఇచ్చే అసలైన నివాళి.

ఉపయుక్త గ్రంథ సూచి

1. భీమన్న, బోయి – పాలేరు (నాటకం), ప్రచురణ: 1938.
2. భీమన్న, బోయి – నా కథ (ఆత్మకథ), తెలుగు అకాడమీ.
3. భీమన్న, బోయి – పిల్లీ శతకం, జన్మ హక్కు.
4. ఆచార్య కొలకలూరి ఇనాక్ – దళిత సాహిత్య విమర్శ.
5. కేతు విశ్వనాథరెడ్డి – ఆధునిక తెలుగు సాహిత్య ధోరణులు.
6. బాబాసాహెబ్ అంబేద్కర్ – Annihilation of Caste (తెలుగు అనువాదం: కుల నిర్మూలన).
7. డా. జె. మనోహర్ – దళిత జీవిత చిత్రణ – పరిశోధనా వ్యాసాలు.
10. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణలు – బోయి భీమన్న సాహిత్య సర్వస్వం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్యం - వైజ్ఞానిక దృష్టికోణం

- డా. కొనకొండ్ల సుభాషిణి
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్ : 8328031698

సారాంశం

బోయి భీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రజాసాహిత్యానికి ప్రతీకగా నిలిచిన మహాకవి. ఆయన సాహిత్యం సంప్రదాయ భావుకతను అధిగమించి, మానవ జీవితాన్ని శాస్త్రీయంగా విశ్లేషించే దృక్పథాన్ని ప్రతిపాదిస్తుంది. భావోద్వేగాలకన్నా వాస్తవం, అంధభక్తికన్నా తర్కం, విధివాదానికన్నా మానవ శ్రమ అనే తాత్విక ధోరణి ఆయన రచనలలో స్పష్టంగా దర్శనమిస్తుంది. ఈ పరిశోధనా వ్యాసం బోయి భీమన్న సాహిత్యంలో వ్యక్తమైన వైజ్ఞానిక దృష్టికోణాన్ని విశ్లేషిస్తూ, కారణ--ఫలిత సిద్ధాంతం, అంధవిశ్వాసాలపై విమర్శ, శ్రమకు ఆర్థిక--శాస్త్రీయ విలువ, ప్రకృతి పట్ల శాస్త్రీయ అవగాహన, సామాజిక వ్యవస్థల విశ్లేషణ వంటి అంశాలను విస్తృతంగా పరిశీలిస్తుంది. ఈ అధ్యయనం భీమన్నను కేవలం ప్రజాకవిగా కాకుండా, శాస్త్రీయ ఆలోచనలను ప్రజలలో వ్యాప్తి చేసిన సామాజిక చింతకుడిగా ప్రతిపాదిస్తుంది.

మౌళిక పదాలు:

బోయి భీమన్నసాహిత్యం, కారణ-ఫలిత సిద్ధాంతం, శాస్త్రీయ చింతన, మానసిక వైజ్ఞానిక భావనలు.

పరిచయం

సాహిత్యం సమాజానికి అద్దంలాంటిది. సమాజంలో చోటుచేసుకునే ఆలోచనా మార్పులు, ఆర్థిక-సామాజిక పరిణామాలు, రాజకీయ చైతన్యం సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. భారతదేశంలో

ముఖ్యంగా 20వ శతాబ్దంలో శాస్త్రీయ విజ్ఞానం, ఆధునిక విద్యా వ్యవస్థ, సామాజిక సంస్కరణ ఉద్యమాలు ప్రజల ఆలోచనా ధోరణిలో గణనీయమైన మార్పును తీసుకువచ్చాయి. ఈ ప్రభావం తెలుగు సాహిత్యంపై కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ మార్పుల నేపథ్యంలో సాహిత్యం దైవకేంద్రిత భావాల నుండి మానవ కేంద్రిత ఆలోచనల వైపు మళ్లింది. బోయి భీమన్న ఈ పరిణామానికి ప్రతినిధిగా నిలిచారు. ఆయన సాహిత్యం పేదల జీవన వాస్తవాలను, కూలీల శ్రమను, దోపిడీ వ్యవస్థలను యథార్థంగా చిత్రిస్తుంది. పేదరికాన్ని విధి ఫలితంగా అంగీకరించకుండా, దానికి సామాజిక–ఆర్థిక కారణాలను అన్వేషించమని పాఠకులను ప్రేరేపిస్తుంది. అందువల్ల భీమన్న సాహిత్యం ఒక సామాజిక–శాస్త్రీయ ప్రకటనగా ప్రత్యేక స్థానం పొందుతుంది.

సాహిత్య నేపథ్యం మరియు భీమన్న స్థానం

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే భక్తికాల సాహిత్యంలో దైవానుభూతి, ఆధ్యాత్మికత ప్రధానంగా కనిపిస్తాయి. కానీ ప్రగతిశీల సాహిత్యం మానవ జీవితంలోని వాస్తవ సమస్యలను కేంద్రంగా చేసుకుంది.

బోయి భీమన్న ఈ ప్రగతిశీల సాహిత్య ధారకు చెందిన కవిగా గుర్తించబడతారు. అయితే ఆయన ప్రత్యేకత ఏమిటంటే–ఆయన ప్రగతిశీలత భావోద్వేగాలకే పరిమితం కాకుండా, తర్కం, అనుభవం, పరిశీలనలపై ఆధారపడింది. ఆయన కవిత్వం చదువుకున్న వర్గానికే కాదు, సామాన్య ప్రజలకు కూడా సులభంగా అర్థమయ్యేలా ఉంటుంది. ఇది శాస్త్రీయ దృష్టిలో ముఖ్యమైన లక్షణం. ఎందుకంటే శాస్త్రీయ ఆలోచన ప్రజల్లోకి చేరాలంటే భాష సరళంగా ఉండాలి.

పరిశోధన ప్రాముఖ్యత

బోయి భీమన్నపై జరిగిన పరిశోధనలు ప్రధానంగా ఆయనను ప్రజాకవి, శ్రమకవి, ప్రగతిశీల కవిగా విశ్లేషించాయి. అయితే ఆయన సాహిత్యంలో దాగి ఉన్న వైజ్ఞానిక దృష్టిని ప్రత్యేకంగా అధ్యయనం చేయడం ఇప్పటివరకు తక్కువగా జరిగింది.

ఈ పరిశోధనసాహిత్యం కేవలం భావోద్వేగాలను వ్యక్తం చేసే సాధనం మాత్రమే కాకుండా, శాస్త్రీయ ఆలోచనలను ప్రజలలో నాటివేయగల సాధనమని ఇది నిరూపిస్తుంది. భీమన్న సాహిత్యం యువతలో తర్కశక్తిని పెంపొందించడానికి, అంధవిశ్వాసాల నుంచి విముక్తి కలిగించడానికి ఉపయోగపడుతుంది. అంతేకాకుండా తెలుగు సాహిత్యంలో శాస్త్రీయ దృష్టి ఎలా వికసించిందో అర్థం చేసుకోవడానికి ఈ అధ్యయనం దోహదపడుతుంది.

పరిశోధన లక్ష్యాలు

ఈ పరిశోధన యొక్క ప్రధాన లక్ష్యం బోయి భీమన్న సాహిత్యంలో వ్యక్తమైన వైజ్ఞానిక దృష్టి స్వరూపాన్ని స్పష్టంగా గుర్తించడం.అదే విధంగా, ఆయన రచనల్లో కనిపించే తర్కబద్ధమైన ఆలోచనలను విశ్లేషించడం, అంధవిశ్వాసాలపై చేసిన విమర్శను అధ్యయనం చేయడం, శ్రమ మరియు

సామాజిక సమస్యలపై ఆయన చేసిన శాస్త్రీయ విశ్లేషణను వివరించడం, ఆధునిక సమాజంలో ఆయన సాహిత్యం ఎంతవరకు ప్రాసంగికమో నిరూపించడం ఈ పరిశోధన లక్ష్యాలుగా ఉన్నాయి.

పరిశోధనా విధానం

ఈ పరిశోధన వివరణాత్మక–విశ్లేషణాత్మక పద్ధతిని అనుసరిస్తుంది.బోయి భీమన్న కవితా సంకలనాలు, నాటకాలు, వ్యాసాలు ప్రాథమిక వనరులుగా ఉపయోగించబడ్డాయి.తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలు, విమర్శాత్మక వ్యాసాలు ద్వితీయ వనరులుగా తీసుకోబడ్డాయి. భావనాత్మక విశ్లేషణ, సామాజిక–శాస్త్రీయ దృక్పథం, తులనాత్మక అధ్యయనం వంటి పద్ధతులు అనుసరించబడ్డాయి.

వైజ్ఞానిక దృష్టి: భావనాత్మక వివరణ

వైజ్ఞానిక దృష్టి అంటే కేవలం ప్రయోగశాలల విజ్ఞానం కాదు. అది తర్కబద్ధమైన ఆలోచన, కారణ–ఫలిత సంబంధాన్ని గుర్తించే సామర్థ్యం, అనుభవాధారిత విశ్లేషణ, అంధవిశ్వాసాల నిరాకరణ వంటి లక్షణాల సమాహారం. భీమన్న సాహిత్యంలో ఈ లక్షణాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. ఆయన కవిత్వం నమ్మకాలను ప్రశ్నిస్తుంది; భావోద్వేగాలను కాకుండా వాస్తవాలను ముందుకు తెస్తుంది.

కారణ–ఫలిత సిద్ధాంతం మరియు పేదరిక విశ్లేషణ

భీమన్న కవిత్వంలో పేదరికం విధివల్ల రాదు. అది సామాజిక, రాజకీయ, ఆర్థిక నిర్మాణాల ఫలితం. పేదరికానికి దేవుడు లేదా పాపం కారణమని చెప్పే సంప్రదాయ భావనను ఆయన తీవ్రంగా తిరస్కరిస్తారు. పేదరికానికి కారణాలు వెతకడం, దోపిడీ వ్యవస్థలను గుర్తించడం శాస్త్రీయ ఆలోచనకు మూలం. ఈ దృక్పథం భీమన్నను సామాజిక శాస్త్రవేత్తల సరసన నిలబెడుతుంది.

అంధవిశ్వాసాలపై విమర్శ

భీమన్న సాహిత్యంలో దేవుడిపై ప్రశ్నలు వేయడం ప్రధానంగా కనిపిస్తుంది. ఇది నాస్తికత్వం కాదు; అంధభక్తిపై నిరసన. ఆయన అభిప్రాయం ప్రకారం మనిషి తన జీవితాన్ని తానే మార్చుకోవాలి. ప్రశ్నించడం, అన్వేషించడం శాస్త్రీయ ఆలోచనకు మూలస్తంభాలు. ఈ లక్షణాలే భీమన్న కవిత్వాన్ని ఆధునిక వైజ్ఞానిక దృక్పథానికి దగ్గర చేస్తాయి.

శ్రమ: శాస్త్రీయ మరియు ఆర్థిక దృష్టి

భీమన్న శ్రమను పూజించరు; విశ్లేషిస్తారు. శ్రమ ఉత్పత్తికి మూలమని, సంపద సృష్టికి ఆధారమని ఆయన స్పష్టంగా చెబుతారు. శ్రమ లేకుండా సంపద లేదనే భావన ఆర్థిక శాస్త్రంలోని మూల సూత్రాలతో సారూప్యత కలిగి ఉంటుంది. ఈ విధంగా భీమన్న శ్రమను ఒక శాస్త్రీయ, ఆర్థిక కోణంలో పరిశీలిస్తారు.

ప్రకృతి పట్ల శాస్త్రీయ అవగాహన

భీమన్న ప్రకృతిని దైవిక శక్తిగా కాకుండా సహజ వ్యవస్థగా చూస్తారు. వర్షం, పంట, ఆకలి వంటి అంశాల మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని ఆయన స్పష్టంగా చూపిస్తారు. ప్రకృతి

సంఘటనలకు సహజ కారణాలే ఉంటాయని ఆయన కవిత్వం సూచిస్తుంది. ఇది పర్యావరణ శాస్త్ర దృక్పథానికి చాలా దగ్గరగా ఉంటుంది.

సామాజిక శాస్త్ర దృక్పథం

భీమన్న సాహిత్యంలో వ్యక్తిగత సమస్యలకన్నా వ్యవస్థాపక లోపాలపై విమర్శ ఎక్కువగా ఉంటుంది. దోపిడీ, అసమానతలు వ్యక్తుల తప్పుల వల్ల కాదు; వ్యవస్థల వల్లనే ఉద్భవిస్తాయని ఆయన స్పష్టం చేస్తారు. ఇది సమాజ శాస్త్రానికి అనుగుణమైన దృక్పథం.

ఆధునిక కాలంలో భీమన్న ప్రాసంగికత

నేటి సమాజంలో కూడా అంధవిశ్వాసాలు, శ్రమ దోపిడీ, ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో భీమన్న సాహిత్యం ప్రజలను ఆలోచింపజేసే శక్తిని కలిగి ఉంది. యువతలో తర్కశక్తిని పెంపొందించడానికి ఆయన సాహిత్యం అత్యంత అవసరం.

విమర్శాత్మక అవలోకనం

భీమన్న సాహిత్యంలో భావుకత తక్కువ అని కొంతమంది విమర్శకులు పేర్కొన్నారు. అయితే ఇది ఆయన లక్ష్యాన్ని అర్థం చేసుకోలేకపోవడమే. ఆయన లక్ష్యం సౌందర్య ప్రదర్శన కాదు–సత్య ఆవిష్కరణ. శాస్త్రీయ దృష్టి కలిగిన సాహిత్యంలో వాస్తవాలకే ప్రాధాన్యం ఉంటుంది.

ఉపసంహారం

బోయి భీమన్న సాహిత్యం ఆధునిక తెలుగు సాహిత్యంలో వైజ్ఞానిక దృష్టికి మైలురాయిగా నిలుస్తుంది. ఆయన రచనలు భావోద్వేగాలకన్నా తర్కానికి, భక్తికన్నా మానవ శ్రమకు ప్రాధాన్యం ఇస్తాయి. ప్రజలను నమ్మమని కాదు–ఆలోచించమని, ప్రశ్నించమని, తర్కించమని నేర్పించే సాహిత్యమే భీమన్న సాహిత్యం. అందువల్ల అది కాలాతీతమైన విలువను సంతరించుకుంది.

సూచన గ్రంథాలు

1. బోయి భీమన్న – కవితా సంకలనాలు
2. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర
3. ప్రగతిశీల తెలుగు సాహిత్య విమర్శ వ్యాసాలు
4. సామాజిక శాస్త్ర గ్రంథాలు

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

"బోయి భీమన్న సాహిత్యం: దళిత చైతన్యం నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వం"

– బొడ్డు భరద్వాజ
స్కూల్ అసిస్టెంట్ – తెలుగు
9440888870

బోయి భీమన్న (1911–2005) తెలుగు సాహిత్య రంగంలో ఒక అగ్రగామి వ్యక్తిత్వం. అతని సాహిత్యం దళిత చైతన్యం, సామాజిక విమర్శ, మరియు అంతిమంగా విశ్వమానవ సౌభ్రాతృత్వం అనే విస్తృత భావనల మధ్య పరిణామ క్రమాన్ని ప్రతిబింబిస్తుంది. భారతీయ సమాజంలో దళిత సాహిత్యం ఒక ప్రత్యేకమైన ప్రతిఘటన, గుర్తింపు, మరియు విముక్తి కోసం సాగిన పోరాటాల స్వరంగా ఉద్భవించింది. భీమన్న రచనలు ఈ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచాయి. అణగారిన వర్గాల బాధలను, ఆకాంక్షలను లోతుగా వ్యక్తీకరించాయి. అతని కవితలు, నాటకాలు, వ్యాసాలు సామాజిక అన్యాయాలపై తీవ్రమైన విమర్శను అందించాయి, అదే సమయంలో మానవతావాదం, సమానత్వం యొక్క ఆదర్శాలను ప్రచారం చేశాయి. దళిత సమాజం యొక్క ప్రత్యేక సమస్యలపై అతని ప్రారంభ దృష్టి నుండి మానవ జాతి యొక్క సార్వత్రిక ఐక్యత వైపు అతని భావజాల పరిణామాన్ని అన్వేషిస్తుంది.

'బానిసతనమును బాపుమురా, భారతభూమికి భాగ్యము తేరా! సకల దేశముల సర్వ మానవుల సామ్యము సాధింపుమురా' అంటూ తన రచనలతో అణగారిన సమాజాన్ని ప్రేరేపించిన సాహిత్య సిద్ధాంతకర్త బోయి భీమన్న. పేదరికం, అంటరానితనం, అవమానాల స్వానుభవాలతో అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన సాహితీవేత్త. సామాజిక అసమానతలు, వర్ణవ్యవస్థ, మరియు దళితుల దుర్దశపై మనోభావాలను వ్యక్తీకరించడమే కాక, సమాజాన్ని మేల్కొల్పే ప్రయత్నాలు చేపట్టారు. తెలుగు సాహిత్యంలో దళితుల బాధలు, ఆత్మగౌరవం, తిరుగుబాటు మరియు విశ్వమానవతా భావన వ్యక్తమయ్యాయి. భీమన్న కేవలం దళిత సమాజానికి పరిమితం కాకుండా, సమస్త మానవ సమాజాన్ని సోదరభావంతో చూడాలనే విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని అభివృద్ధి చేశారు. బోయి భీమన్న గారు సాహితీ లోకానికే కాక యావత్ భారతదేశానికి పద్మశ్రీ భీమన్నగా, ఉత్తమ కవిగా

సుపరిచితులు. భీమన్న గారు తెలుగుజాతిలో మేధావి వర్గంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలవారు. లోకులు కాకులే. కోకిల పిల్ల లోకు విచ్చావంటే నూకలు కల్ల. చేతికందిన పూలు చిదిమిపారేస్తారు. అందకపోతే ఆరని పెడతారు. పైనున్న వాళ్ళ కాళ్ళు పట్టుకు వేలాడుతారు. తక్కువ వాళ్ళను తొక్కుకుపోతారు అంటారు కవి బోయి భీమన్న. కులం ఒక జాతిగా, మతం ఒక వర్గంగా, నిత్యం పోరాడుతూ అంతరించిపోతున్న జాతిని సమన్వయం ద్వారా సమైక్యపరచాలన్నదే నా మతం అంటారు బోయి భీమన్న. వ్యక్తుల మౌలిక మనస్తత్వాలను గుర్తించడం ద్వారా జాతిని ఏకీకృతం చేయవచ్చునని బోయి భీమన్న గారు భావించారు. వ్యవస్థను ధిక్కరించే వారికి కొదవలేదు, ధిక్కరించే వారిలో వివక్షను అనుభవించిన వారు కొందరే. ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదించిన వారు మరీ అరుదు. భీమన్నలో వివక్ష అనుభవం, ధిక్కార చైతన్యం, ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదించిన అనితర తత్వం ఉన్నాయి.

బోయి భీమన్న జీవిత ప్రభావాలు: సామాజిక నేపథ్యం:

బోయి భీమన్న జీవితం మరియు రచనలు అతను పెరిగిన సామాజిక, రాజకీయ వాతావరణం ద్వారా లోతుగా ప్రభావితమయ్యాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో భారతీయ సమాజం, ముఖ్యంగా అణగారిన వర్గాలు, తీవ్రమైన కుల వివక్ష మరియు సామాజిక అసమానతలతో సతమతమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన భీమన్న 1911 సెప్టెంబరు 19న దళిత కుటుంబంలో జన్మించారు. ఇది అతని బాల్యంపై మరియు అతని ప్రపంచ దృక్పథంపై శాశ్వత ముద్ర వేసింది. అతను వ్యక్తిగతంగా అనుభవించిన వివక్ష, అంటరానితనం యొక్క కఠిన వాస్తవాలు అతని రచనలకు ప్రధాన ప్రేరణగా పనిచేశాయి. విద్యను అభ్యసించడంలో ఎదురైన సవాళ్లు, సామాజిక బహిష్కరణలు అతని ప్రారంభ రచనలలో దళిత అస్తిత్వం మరియు న్యాయం కోసం గట్టిగా నిలబడటానికి దోహదపడ్డాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి సంఘ సంస్కర్తల ఆలోచనలు, దళిత ఉద్యమాల పెరుగుదల అతని భావజాల వికాసానికి దారి చూపాయి.

తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యాన్ని ఆవిష్కరించిన మహానుభావులలో బోయి భీమన్న అగ్రగణ్యుడు. దళిత (మాల) కుటుంబంలో జన్మించిన ఆయన, పేదరికం, అంటరానితనం, కులదోపిడీ అనుభవాలతో పెరిగాడు. తండ్రి పుల్లయ్య, తల్లి నాగమ్మలకు ఐదుగురు కుమారులలో ఒకడైన భీమన్న, చిన్నప్పటి నుండి సామాజిక అన్యాయాలను స్వానుభవించి, అక్షరాలను ఆయుధంగా మలిచాడు. బి.ఏ., బి.ఎడ్. పూర్తి చేసి, ఉపాధ్యాయుడిగా, పత్రికాకారుడిగా, అంబేద్కర్ రచనల అనువాదకుడిగా కీలక పాత్ర పోషించాడు. 70కి పైగా పుస్తకాలు రాసిన ఆయనకు 1975లో 'గుడిసెలు కాలిపోతున్నై' కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 2001లో పద్మ భూషణ్‌లు లభించాయి.

సాహిత్యంలో భీమన్న సృష్టించిన ఒరవడి అద్వితీయం, అజరామరం. ఆయన రచనలన్నింటిలోనూ అంతర్లీనంగా ఉన్న విషయం ఒక్కటే–అదే 'భారతజాతి ఏకత్వం'. సమాజంలో చెడ్డవాళ్ళే కాదు, అనేకులు మంచివాళ్ళుంటారని తెలియజేయటం భీమన్న సాహిత్యంలోని విశిష్టగుణం. పాలేరు నాటకంలో వనబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుటుంబంలో నుండి వచ్చినప్పటికీ, అలాంటి వాళ్ళలోనూ సంకుచిత మనస్తత్వంతో కులతత్వం లేని వాళ్ళు ఉంటారనే విషయాన్ని

తెలియజేశారు. హరిజనులుగా సమాజంచే పిలువబడ్డవారి అంతరంగాలలో స్వాభిమానాన్ని నింపి, సమకాలీన సమాజంతో గౌరవానికి అర్హులయ్యేటట్లుగా చేయటం భీమన్న గారి సాహిత్య లక్ష్యం. పాలేరు, కూలిరాజు వంటి నాటకాలలోనూ, 'జన్మాంతర వైరం,' 'అంబేడ్కర్ సుప్రభాతం,' 'అంబేడ్కరిజం,' 'పంచమ స్వరం' మొదలైన కావ్యాలలోనూ ఈ తపన స్పష్టంగా గోచరిస్తుంది. సాహిత్యంలో భీమన్న సృష్టించిన ఒరవడి అద్వితీయం, అజరామరం. హరిజనులుగా సమాజంచే పిలువబడిన వారి అంతరంగాలలో స్వాభిమానాన్ని నింపి సమకాలీన సమాజంతో వారు గౌరవానికి అర్హులయ్యేట్టు చేయడం బోయి భీమన్న సాహిత్య లక్ష్యం. సంస్కరణ, జాతీయ వాద దృష్టి కలగలసిన అద్భుత సమరసతా కవితా మూర్తి భీమన్న అని చెప్పవచ్చు. సమాజంలో సంఘర్షణలకు కారణమైన కుల, మత, వర్గ విభేదాలను అధిగమించాలంటే అందరూ విద్యావంతులు కావాలన్నది ఆయన సమాజానికి ఇచ్చిన సందేశం.

'సామాజిక సమరసత, సాహితీ సమర్చన' అన్న అంశాలను రెండు కళ్లుగా చేసుకుని భీమన్న జీవించారు. కులం లేని జాతి ఆవిర్భావం కోసం కలలు కన్నారు. కుల మతాల కంటే మానవతకు ప్రాధాన్యమిచ్చారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప కవి బోయి భీమన్న. పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత వంటి పలు సాహితీ ప్రక్రియల్లో 70కి పైగా రచనలు చేసినారు. బోయి భీమన్న తన రచనలలో కుల మతాల కంటే మానవతకు ప్రాధాన్యమిచ్చారు. భీమన్న చూపిన సమరసతా మార్గం మనకు ఎంతైనా అనుసరణీయం.

బ్రిటీష్ వలసవాద పాలనలో జాతీయోద్యమ కాల ధర్మంతో ఆనాటి ప్రఖ్యాత కవులందరూ భారతదేశ పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రాభవాలను కీర్తిస్తుంటే అందుకు విభిన్నంగా భీమన్న 'భారతదేశ ఆధ్యాత్మిక, పౌరాణిక, సాంస్కృతిక వారసత్వానికి పునాదులు నిర్మించింది దళితులే' అని తన రచనల ద్వారా చాటిచెప్పాడు.ఈ రకమైన ఎరుకతో 'ఆదికవి వాల్మీకి' వేదవ్యాసుడు, రాగవాసిష్ఠం లాంటి పౌరాణిక నాటకాలు వెలువరించాడు. నవ్య సంప్రదాయకవులకు అసలుసిసలైన భారతీయ వారసత్వ గరిమను, ఆది భారతీయుల, మూలవాసుల మహిమను తేటతెల్లం చేశాడు. అరుంధతీ, వశిష్ఠుల కళ్యాణ చరిత్రను భీమన్న తిరగరాశాడు. ఆర్య, ద్రావిడ జాతుల ఆవిర్భావ వికాసాన్ని పునర్మూల్యాంకనం చేశాడు. పౌరాణిక పద్య నాటకాలను అత్యంత ప్రతిభావంతంగా రచించిన భీమన్న తెలుగు సాంఘీక నాటకానికి కూడా ఎనలేని గౌరవాన్ని తీసుకొచ్చాడు. పాలేరు, కూలిరాజు నాటకాల ద్వారా దళితుల్లో విద్యాచైతన్యాన్ని, రాజ్యాధికార భావనను పెంపొందింపజేయటంలో భీమన్న చారిత్రాత్మకమైన పాత్ర పోషించాడు. ఆంధ్రదేశంలో కొన్ని వేలసార్లు ప్రదర్శింపబడిన పాలేరు నాటకాన్ని దర్శించి వ్యవసాయ కూలీలుగా బ్రతుకులీడుస్తున్న వందలాది మంది దళితులు చదువుకొని కలెక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఎదిగిన ఉదాహరణలెన్నో ఉన్నాయి. కాకి మాధవరావు వంటివారు 'నేను రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీని మాత్రమే కాదు "నేను పాలేరు వెంకన్నను అని సగర్వంగా చెప్పుకుంటాను" అంటూ ఒక సభలో పేర్కొనటం పాలేరు నాటకం గొప్పతనానికి నిదర్శనం.

'లే దస్పృశ్యత, లేదు లేమి, కులముల్ లేవు, ఆర్షలోకమ్ము తత్ భేద క్లేశము లెల్లతీరి, ధ్వజమెత్తెన్ లోక శ్రేయస్సుకై వేదోక్తమ్మిది సర్వజాతి సమతావిష్కార తత్వమ్ము బ్రాహ్మీ దేవత్వము నొంది సాగుడొకటై, మేధావులై ఎల్లరున్' అనే సందేశాన్ని అందించారు.

'గోచిపెట్టుట నేర్చుకొనగానె బిడ్డకు
చేతికి కర్రిచ్చు రైతులార!
నడక నేర్చినతోనె బుడతను గొంపోయి
పాలేరు ధనముంచు మాలలార!
పసిబిడ్డ తెచ్చు సంపాదన కాశించి
మనుగడలే మాపు జనకులార!
వంటయిల్లే ప్రపంచమ్ముగా చేసి
తనయల మెడకోయు తల్లులార!
జాతి శక్తివిహీనమై చచ్చుచుండ
కనులను మూసికొంటిరే గాఢనిద్ర
శక్తికంతకు మూలము చదువుకాన
చదువ బంపుడు మీ తనూజాళినింక'

మానవజాతి పురోగమనానికి జ్ఞానం ఎంత ఆవశ్యకమో కొన్ని దశాబ్దాల క్రితమే గుర్తించిన కవి బోయి భీమన్న. పైన చెప్పుకున్న పద్యం ఆయనదే. తెలుగు సాహిత్యంలో భీమన్న పేరును అజరామరం చేసిన 'పాలేరు' నాటకంలోని పద్యమిది. 'జనం వైజ్ఞానికంగా ఎదగటానికి నిరంతరం కృషి చేసేవాడే కవి' అన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. పాలేర్లు, రైతుకూలీలు తమబిడ్డలను చదివించాలని, తద్వారా వారి అభివృద్ధికి బాటవేయాలని 'పాలేరు' నాటకంలో ఉద్బోధించారు.

సామాజిక అసమానతలను కుల, మత, లింగ, వర్ణ వివక్షలను ఆయన నిరసించారు. వాటిని ఇతివృత్తాలుగా మలిచి తన నాటకాల్లో దృశ్యమానం చేసారు. పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, రాగ వాశిష్టం వంటి ఎన్నో నాటకాలు రచించారు. 'భీమన్న నిజమైన కవి. ఆర్తి ఆయన కవిత్వానికి ప్రాణం. వ్యంగ్యం జీవకళ' అని వర్ణించారు ఎన్ గోపి. మన సమాజంలో అసమానతలు పోయేంతవరకూ ఆయన రచనలు పోరాడమని ప్రేరేపిస్తాయని చెప్పారు

' నేను సూర్యుణ్ణి కాను చంద్రుణ్ణి
నాకున్నది ఎండకాదు గుండె
నేను కోరేది మీ దయా ధర్మ భిక్ష కాదు
నాకు రావలసిన బాకీ'

అని భీమన్న అనటంలో ఒక సామాజిక స్పష్టత వ్యక్తమవుతుంది. అధికారం కోసం వలలు పన్నే నాయకుల పట్ల జాగ్రత్త అవసరమని బోయి భీమన్న బోధించారు. ఓటర్ల మనస్తత్వంపై భీమన్న విసిరిన వ్యాఖ్యానాలు ఎన్నో!

"బలం కలవాడు పులి
తెలివి కలవాడు నక్క
ఈ ఇరువర్గాలకూ ఆహారంగా
బతుకుతున్న వర్గాలు గొర్రెలు"

అంటూ ఎన్నో ములుకుల్లాంటి మాటలు విసిరారు. సామాజిక అసమానతను, మత, లింగవివక్షను ఆయన నిరసించారు. పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, రాగ వాశిష్టం వంటి ఎన్నో నాటకాలు రచించారు. మన సమాజంలో అసమానతలు పోయేంతవరకూ ఆయన రచను పోరాటాన్ని ప్రేరేపిస్తాయని చెప్పారు. నవ సమాజం కోసం తన కలాన్ని కదిలించిన మహోన్నతుడు. ఆయన సాహిత్యం దళిత చైతన్యం నుండి ప్రారంభమై, సమానత్వం, సౌభ్రాతృత్వం వైపు విస్తరిస్తుంది. గాంధీ, అంబేద్కర్ ప్రభావాలతో, కులవ్యవస్థను విమర్శిస్తూ, వసుధైక కుటుంబ భావాన్ని ప్రోత్సహిస్తాడు.

బోయి భీమన్న జీవిత చరిత్ర మరియు సాహిత్య పరిచయం:

భీమన్న జీవితం దళిత సమరసతా ఉద్యమానికి ప్రేరణ. పల్లె పాఠశాలలో చదువుతూ కులదోపిడిని ఎదిరించి, రాజోలులో దళిత బాలల వసతి ఏర్పర్చాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, అంబేద్కర్ 'అన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్' (Annihilation of Caste) ను తెలుగులోకి అనువదించాడు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడిగా (1978–1984) కూడా పనిచేశాడు. సాహిత్యంలో పద్యం, గేయం, నాటకాలు, వచన కావ్యాలు రచించాడు. ప్రధాన రచనలు: 'పాలేరు' (నాటకం, 1938), 'గుడిసెలు కాలిపోతున్నై' (కవిత్వం, 1975), 'కూలిరాజు' (1946), 'రాగవాసిష్ఠం', 'రాభీలు', 'ధర్మం కోసం పోరాటం', 'జానపదుని జాబులు'. ఆకాశవాణి కోసం భావగీతాలు రాశాడు. ఆయన సాహిత్యం 'సమరసతా సాహిత్య సిద్ధాంతం'కు మూలం: దళిత ఆత్మగౌరవం నుండి మానవ సమానత్వం వరకు.

దళిత చైతన్యం: రచనలలో ప్రతిబింబం:

భీమన్న సాహిత్యం దళితుల ఏడుపు, పోరాటాన్ని స్పష్టంగా చూపిస్తుంది. 'పాలేరు' నాటకం దళిత చైతన్యానికి మైలురాయి. పాలేరు వెంకన్న పాత్ర ద్వారా అస్పృశ్యత, చదువు నిరాకరణ, భూస్వాముల దోపిడీని వివరిస్తాడు. వెంకన్న–వనబాల ప్రేమకథలో కులాంతర వివాహం ద్వారా కులనిర్మూలనను ప్రోత్సహిస్తాడు. ఉపకారి పాత్ర విద్య శక్తిని చూపి, 'చదువు లేకపోతే మూర్ఖత్వమే" అని హెచ్చరిస్తాడు. ఈ నాటకం దళిత కుటుంబాల్లో చదువు అవగాహనా తీసుకొచ్చింది. గుడిసెలు కాలిపోతున్నై' కవిత్వ సంకలనం. దళితుల గుడిసెలు ఏడాదికోసారి కాలిపోవడాన్ని ప్రతీకాత్మకంగా చిత్రిస్తుంది. చీమలు శ్రామిక దళితులు, పాములు కులదోపిడీదారులు. 'గుడిసెలు కాలిపోతున్నై, కొత్తవి వస్తాయి' అనే చైతన్యం దళిత పునరుద్ధరణను సూచిస్తుంది. 'కూలిరాజు' లో కూలీల ఆర్థిక పోరాటం, 'రాగవాసిష్ఠం'లో అరుంధతి–వశిష్ఠుల ప్రేమ ద్వారా ఆర్య–అనార్య సిద్ధాంతాన్ని ఖండిస్తాడు. ఈ రచనలు అంబేద్కర్ 'జాతి నిర్మూలన' ఆలోచనలను ప్రతిఫలిస్తాయి. దళితులు ఆత్మగౌరవంతో జీవించాలని, రాజ్యాధికారం సాధించాలని పిలుస్తాయి.

సామాజిక సమానత్వం వైపు మార్పు:

దళిత చైతన్యం నుండి సామాజిక సమానత్వం వైపు భీమన్న మార్పు అద్భుతం. 'ధర్మం కోసం పోరాటం'లో బహుజన సమాజం, కుల-వర్గ విభజనలను విమర్శిస్తూ, స్వాతంత్ర్యం-సమానత్వం-సౌభ్రాతృత్వాన్ని కోరుతాడు. 'జానపదుని జాబులు' లో ఆర్థిక అసమానతలు (కొంపల కూల్చడం, బేడ డబ్బులు) ను గుర్తించి, భూసంస్కరణ అవసరాన్ని చెబుతాడు. 'పిల్లీ శతకం'లో మూర్ఖత్వం. పెత్తందారీ నియంత్రణలను హాస్యాస్పదంగా విమర్శిస్తాడు. విద్య, హేతువాదం ద్వారా కుల నిర్మూలన సాధ్యమని నిరూపిస్తాడు. ఆయన సాహిత్యం దళితులను శ్రామికులుగానే కాకుండా, సమాజ సంస్కారకులుగా చూపిస్తుంది.

విశ్వమానవ సౌభ్రాతృత్వం:

భీమన్న సాహిత్యం దళిత ఆవిష్కారం నుండి వసుధైక కుటుంబ భావానికి చేరుకుంటుంది. 'రాభీలు' కవిత్వంలో మానవ ఏకత్వం, 'దీపసభ'లో జ్ఞాన దీపికలు సౌభ్రాతృత్వాన్ని ప్రకాశింపజేస్తాయి. 'వ్యక్తి వికాసమే జాతి, జాతి వికాసమే వసుధ' అనే తాత్విక దృక్పథం ఆయనది. 'ఆదికవి వాల్మీకి', 'వేదవ్యాసుడు' నాటకాలలో దళితులే మహర్షులని చూపి, కులాల అతీత మానవత్వాన్ని హైలైట్ చేస్తాడు. 'అంబేద్కరమతం'లో అంబేద్కర్ భావజాలాన్ని విస్తరించి, మతాల కంటే మానవత్వాన్ని ప్రాధాన్యత ఇస్తాడు. హింసావాదానికి వ్యతిరేకంగా, సమైక్యతను ప్రోత్సహిస్తాడు. 'పాటలలో అంబేద్కర్' (118 పాటలు) దళిత చైతన్యాన్ని విశ్వ సమానత్వంతో లింక్ చేస్తుంది. ఆయన సాహిత్యం 'సకల దేశముల సర్వ మానవుల సామ్యము సాధింపుమురా' అనే మంత్రంతో మానవ సోదరత్వాన్ని సాధనం చేస్తుంది.

విమర్శనాత్మక విశ్లేషణ మరియు వారసత్వం:

భీమన్న సాహిత్యం దళిత సాహిత్యంలో విలక్షణం:

ప్రాచీన హిందూ తాత్వికతతో పంచముల ఆత్మగౌరవం అవిచ్ఛిన్నమైంది. కానీ కొందరు విమర్శకులు ఆయన రచనలను 'సంస్కరణాత్మకం'గా మాత్రమే చూస్తారు, హింసాత్మక పోరాటాన్ని తక్కువ చేస్తారని వాదిస్తారు. అయితే, ఆయన 'జానపదుని జాబులు'లో ఆర్థిక పోరాటాన్ని బలపరుస్తాడు. వారసత్వం: తెలుగు దళిత సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, కులరహిత సమాజ ఆశయాన్ని ప్రచారం చేశాడు. ఆయన రచనలు ఇప్పటికీ దళిత ఉద్యమాలకు ప్రేరణ.

దళిత చైతన్యం :

డాక్టర్ బోయి భీమన్న సాహిత్యం దళిత చైతన్యాన్ని సమర్థవంతంగా వ్యక్తీకరించింది, అణగారిన వర్గాల బాధలు, ఆకాంక్షలను తెలుగు సాహిత్య ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చింది. అతని రచనలలో దళిత అనుభవాలను వివరించడానికి ఒక స్పష్టమైన ప్రయత్నం కనిపిస్తుంది. దళిత సాహిత్యం 1958లో బొంబాయిలో జరిగిన "దళిత సాహిత్య సదస్సు"లో మొదట ప్రవేశపెట్టబడింది, ఆ తర్వాత మరాఠీ రచయితల బృందం 1972లో "దళిత పాంథర్స్"గా వ్యవస్థీకృతమై కుల వ్యవస్థను తమ

రచనలలో వ్యతిరేకించింది. భీమన్న ఈ ఉద్యమానికి ముందుగానే తనదైన శైలిలో దళిత గొంతుకగా మారారు. అతని రచనలు సామాజిక అసమానతలపై విమర్శనాత్మక దృక్పథాన్ని అందించాయి, దళిత వర్గాల దీనస్థితిని ప్రశ్నించాయి.

బోయి భీమన్న కాలంలో దళిత సమాజ స్థితిగతులు:

బోయి భీమన్న కాలంలో దళిత సమాజం తీవ్రమైన కుల వివక్ష, ఆర్థిక దోపిడీ, మరియు సామాజిక అంటరానితనం ఎదుర్కొంది. ఈ స్థితిగతులు భారతీయ సమాజంలో పాతుకుపోయిన వర్ణ వ్యవస్థ యొక్క పర్యవసానంగా ఉన్నాయి, ఇక్కడ దళితులు సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అట్టడుగున ఉంచబడ్డారు. భీమన్న తన రచనల ద్వారా ఈ అమానవీయ ఆచారాలను బహిర్గతం చేశారు. దళితుల జీవితాల్లోని కఠిన వాస్తవాలను, వారి ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటాలను స్పష్టంగా చిత్రించారు. విద్య, ఉపాధి, మరియు సామాజిక ప్రవేశం వంటి ప్రాథమిక హక్కులకు కూడా దళితులు నోచుకోలేదని అతను పదేపదే నొక్కి చెప్పారు. ఈ దుర్భర పరిస్థితులు అతని సాహిత్యంలో ఒక ముఖ్యమైన ఇతివృత్తంగా మారాయి, సామాజిక సంస్కరణల ఆవశ్యకతను నొక్కి చెప్పాయి. అతని సమకాలీన దళిత మహిళా రచయితలు కూడా కుల, లింగ వివక్షను ఎదుర్కొని, తమ రచనలలో ఈ సమస్యలను లేవనెత్తారు.

ఆత్మగౌరవం, స్వీయ పరివర్తన:

'బోయి భీమన్న' రచనలు దళిత ఆత్మగౌరవం మరియు స్వీయ పరివర్తన అనే అంశాలను కేంద్రంగా చేసుకున్నాయి. అతని ప్రసిద్ధ నాటకం 'పాలేరు', ఒక దళిత యువకుడి అంకితభావం ద్వారా సామాజిక అడ్డంకులను అధిగమించి, ఆత్మగౌరవాన్ని పొందడం ఎలాగో చిత్రీకరిస్తుంది. ఈ నాటకం దళిత వర్గాల మధ్య విద్య మరియు స్వీయ–అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. 'గుడిసెలు కాలిపోతున్నై' వంటి కవితా సంకలనాలు దళిత ప్రజల బాధలను, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూనే, సామాజిక మార్పు కోసం వారి ఆత్మవిశ్వాసాన్ని, సంకల్పాన్ని కూడా హైలైట్ చేశాయి. భీమన్న కేవలం వివక్షను చిత్రించడమే కాకుండా, దళితులు తమ స్థితిని మార్చుకోవడానికి, తమ హక్కుల కోసం నిలబడటానికి స్వీయ–శక్తిని ఎలా కూడగట్టుకోవచ్చో చూపించారు. అతని సాహిత్యం సామాజిక నిర్మాణాలను ప్రశ్నించడానికి, దళిత గుర్తింపును పునర్నిర్వచించడానికి ఒక వేదికగా మారింది, వారిని నిస్సహాయ బాధితులుగా కాకుండా, తమ విధిని నిర్ణయించుకోగల శక్తివంతమైన వ్యక్తులుగా చూపింది; ఇది మహారాష్ట్రలోని 'అంబేద్కర్ జల్సా' వంటి కళారూపాలతో సమానమైన ప్రభావాన్ని చూపింది, అవి అణగారిన వర్గాల నొప్పి, అన్యాయం, మరియు పోరాటాలను సాంప్రదాయ మరియు ఆధునిక రూపాల ద్వారా వ్యక్తీకరించాయి.

దళిత ఉద్యమాలకు భీమన్న రచనలు:

బోయి భీమన్న రచనలు దళిత ఉద్యమాలకు ఒక బలమైన ప్రేరణగా, భావజాల మద్దతుగా నిలిచాయి. అతని సాహిత్య కృషి దళిత గుర్తింపును పెంపొందించడంలో, సామాజిక న్యాయం కోసం సాగే పోరాటానికి కొత్త శక్తిని ఇవ్వడంలో గణనీయమైన పాత్ర పోషించింది. భీమన్న కవిత్వం,

నాటకాలు, మరియు వ్యాసాలు దళిత ప్రజలలో సామూహిక చైతన్యాన్ని రేకెత్తించాయి, వారికి తమ హక్కుల గురించి అవగాహన కల్పించాయి. అతని సందేశం అణగారిన వర్గాలను తమ అణచివేతకు వ్యతిరేకంగా నిలబడటానికి, సమానత్వం కోసం డిమాండ్ చేయడానికి ప్రోత్సహించింది. దళిత కళాకారులు మరియు కార్యకర్తలను ప్రభావితం చేసిన మహారాష్ట్రలోని 'అంబేద్కర్ జల్సా' వంటి కళారూపాల మాదిరిగానే, భీమన్న సాహిత్యం కూడా సామాజిక విముక్తిని కోరుకునే ఉద్యమాలకు ఒక ముఖ్యమైన భాగాన్ని అందించింది. అతని రచనలు దళిత విప్లవ స్ఫూర్తిని ప్రేరేపించాయి, కులం, జాతి మరియు వర్గం యొక్క స్టీరియోటైప్ ఫ్రేమ్‌లకు వ్యతిరేకంగా బలమైన నిరసనను నమోదు చేయడానికి ఒక వేదికను సృష్టించాయి.

సామాజిక విమర్శ, విప్లవాత్మక తత్వం:

బోయి భీమన్న సాహిత్యం దళిత చైతన్యాన్ని వ్యక్తీకరించడమే కాకుండా, భారతీయ సామాజిక నిర్మాణాలపై ఒక తీవ్రమైన విమర్శను అందించింది. అతని విప్లవాత్మక తత్వం కుల వ్యవస్థ యొక్క మూలాలను ప్రశ్నించింది, దాని అమానవీయ ప్రభావాలను బహిర్గతం చేసింది. భీమన్న తన రచనల ద్వారా సాంప్రదాయ సామాజిక సోపానక్రమాలను సవాలు చేశారు, సమాజంలోని అంతర్గత వైరుధ్యాలను సూటిగా ఎత్తి చూపారు. అతను కేవలం దళిత అనుభవాలను వివరించడానికే పరిమితం కాలేదు, బదులుగా, సామాజిక అసమానతలకు కారణమయ్యే వ్యవస్థాగత సమస్యలను విశ్లేషించారు. అతని విమర్శనాత్మక దృక్పథం సామాజిక మార్పు కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను అందించింది, ఇది ప్రస్తుత సామాజిక సాహిత్యంలో దళిత మధ్యతరగతి ఆకాంక్షలను, పోరాటాలను ప్రతిధ్వనిస్తుంది.

వర్గ, జాతి వ్యతిరేక పోరాటాలు:

భీమన్న రచనలు కుల వ్యవస్థ యొక్క అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడాయి. అతను వర్గ మరియు జాతి ఆధారిత విభజనలను ఖండించారు, ఇవి సమాజాన్ని చీల్చి, మానవ గౌరవాన్ని అణగదొక్కాయి. దీపశిఖ వంటి అతని కవితా సంకలనాలు కుల వివక్షకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల సామూహిక ఆగ్రహాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించాయి. అతను కులం కేవలం ఒక సామాజిక వర్గీకరణ కాదని, అది ఆర్థిక దోపిడీకి, రాజకీయ అధికారాన్ని నిలుపుకోవడానికి ఒక సాధనంగా ఉపయోగించబడిందని స్పష్టం చేశారు. భీమన్న సాంఘిక సంస్కరణల ఆవశ్యకతను నొక్కి చెప్పారు, సామాజిక న్యాయం మరియు సమానత్వం లేకుండా నిజమైన పురోగతి అసాధ్యమని వాదించారు. అతని పోరాటం దళితుల సామాజిక చైతన్యాన్ని, స్వయం ప్రతిపత్తిని ప్రోత్సహించింది, ఇది వారిని తరతరాలుగా కొనసాగిన అణచివేత నుండి విముక్తి పొందేలా ప్రోత్సహించింది.

భీమన్న రచనల్లో సామాజిక సమానత్వ భావన:

బోయి భీమన్న రచనలలో సామాజిక సమానత్వ భావన ఒక కేంద్ర ఇతివృత్తం. అతను మానవులందరూ సమానమే అనే సార్వత్రిక సూత్రాన్ని గట్టిగా సమర్థించారు, కులం, మతం లేదా ఆర్థిక స్థితి ఆధారంగా వివక్షను తీవ్రంగా ఖండించారు. భీమన్న తన కవిత్వం ద్వారా, "నరనరాల జీర్ణించుకొనిన కులము" నుండి విముక్తి పొంది, "మానవులంతా ఒక్కటే" అనే సందేశాన్ని

అందించారు. అతని రచనలు సమాజంలోని అణచివేతకు గురైన వర్గాలకు స్వరం ఇచ్చాయి, వారి హక్కులు మరియు గౌరవాన్ని నొక్కి చెప్పాయి. ఇది కేవలం దళితులకే పరిమితం కాలేదు. అతను స్త్రీల హక్కులు, శ్రామిక వర్గాల పోరాటాలు వంటి విస్తృత సామాజిక సమస్యల పట్ల కూడా సున్నితత్వాన్ని ప్రదర్శించారు. ఈ సమగ్ర దృక్పథం అతనిని ఒక సాధారణ దళిత రచయిత నుండి మానవతావాదిగా మార్చింది, అతని సాహిత్యం సామాజిక న్యాయం కోసం ఒక నిరంతర ఆకాంక్షను ప్రతిబింబించింది.

విశ్వమానవ సౌభ్రాతృత్వం: భావజాల పరిణామం

బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం దళిత చైతన్యం నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వం వైపు ఒక ముఖ్యమైన భావజాల పరిణామాన్ని సూచిస్తుంది. అతని ప్రారంభ రచనలు దళిత అనుభవాలపై దృష్టి సారించినప్పటికీ, అతని తత్వశాస్త్రం క్రమంగా విస్తృత మానవతావాద దృక్పథాన్ని కలుపుకుంది. కుల-ఆధారిత వివక్షను అధిగమించి, అతను మానవజాతి యొక్క సార్వత్రిక ఐక్యతను, సహనాన్ని, మరియు పరస్పర గౌరవాన్ని నొక్కి చెప్పడం ప్రారంభించారు. ఈ పరిణామం అతని వ్యక్తిగత వృద్ధిని, అలాగే సామాజిక న్యాయం యొక్క విస్తృత అవగాహనను ప్రతిబింబిస్తుంది. భీమన్న విశ్వమానవ సౌభ్రాతృత్వం కేవలం ఒక ఆదర్శం కాదని, అది నిజమైన సామాజిక శాంతి మరియు పురోగతికి ప్రాథమిక అవసరమని విశ్వసించారు. అతని ఈ భావన ఆధునిక భారతీయ సాహిత్యంలో ఒక ముఖ్యమైన దిశగా మారింది.

అంతర్జాతీయత మరియు మానవతా విలువలు:

భీమన్న రచనలు క్రమంగా అంతర్జాతీయత మరియు సార్వత్రిక మానవతా విలువలను స్వీకరించాయి. అతను మానవజాతిని విభజించే అన్ని గోడలను తొలగించాలని పిలుపునిచ్చారు, జాతి, మతం, మరియు జాతీయతలకు అతీతంగా మానవులందరినీ ఐక్యం చేసే ఒక ఉమ్మడి మానవత్వ భావనను నొక్కి చెప్పారు. అతని కవితలు తరచుగా ప్రపంచ శాంతి, సహనం, మరియు కరుణ యొక్క సందేశాలను అందించాయి. భీమన్న దృష్టిలో, దళిత విముక్తి అనేది విస్తృత మానవ విముక్తి ఉద్యమంలో ఒక భాగం. ఈ దృక్పథం అతనిని ఇతర సంస్కృతులు మరియు సామాజిక ఉద్యమాలతో సంబంధం ఏర్పరచుకోవడానికి ప్రోత్సహించింది, తద్వారా అతని సాహిత్యం ప్రపంచవ్యాప్త మానవ హక్కుల పోరాటాలకు సంబంధితంగా మారింది. ఇది ఇరాన్‌లో సంస్కరణల కోసం ఖతామీ యొక్క ప్రయత్నాల మాదిరిగానే ఉంది, అక్కడ నాగరికతల మధ్య సంభాషణ దేశంలోనే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు.

జాతీయ – అంతర్జాతీయ దృక్కోణాల్లో భీమన్న ప్రభావం:

బోయి భీమన్న సాహిత్యం జాతీయ మరియు అంతర్జాతీయ దృక్కోణాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపింది. జాతీయ స్థాయిలో, అతను దళిత సాహిత్యంలో ఒక శక్తివంతమైన స్వరాన్ని అందించారు, సామాజిక న్యాయం కోసం చర్చను తీవ్రతరం చేశారు. అతని రచనలు అనేక ఇతర భారతీయ భాషలలోని దళిత రచయితలను ప్రభావితం చేశాయి, తమ సొంత అనుభవాలను వ్యక్తీకరించడానికి వారిని ప్రోత్సహించాయి. అంతర్జాతీయంగా, అతని మానవతావాద సందేశం సార్వత్రిక ఆకర్షణను కలిగి ఉంది. భీమన్న రచనలు మానవ హక్కులు, సమానత్వం, మరియు

సౌభ్రాతృత్వం యొక్క ప్రపంచవ్యాప్త ఆదర్శాలకు దోహదపడ్డాయి. అతని ఫిలాసఫీ, కేవలం ఒక ప్రాంతీయ లేదా జాతీయ సమస్యకు పరిమితం కాకుండా, మానవ సమాజాలన్నింటికీ వర్తించే సార్వత్రిక సత్యాలను ప్రతిబింబిస్తుంది. ఈ ప్రభావం, సాహిత్య విమర్శ విభాగం యొక్క విజయాల మాదిరిగానే, జాతీయ సాహిత్యం యొక్క చరిత్ర మరియు సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడంలో అతనిని ఒక ముఖ్యమైన వ్యక్తిగా నిలబెట్టింది.

భీమన్న సాహిత్యంలో సౌభ్రాతృత్వ మార్గదర్శకత్వం:

భీమన్న సాహిత్యం సౌభ్రాతృత్వానికి ఒక మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది, మానవుల మధ్య శాంతియుత సహజీవనం కోసం ఒక నమూనాను అందిస్తుంది. అతను తన రచనల ద్వారా విభజనలను అధిగమించి, ఉమ్మడి మానవ విలువల ఆధారంగా ఒక సమగ్ర సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. భీమన్న యొక్క "గుడిసెలు కాలిపోతున్నై" వంటి కవితలు దళితుల బాధలను వ్యక్తం చేస్తూనే, మానవులందరూ ఒకే కుటుంబం అనే విస్తృత భావనను ప్రచారం చేశాయి. అతను అణగారిన వర్గాలకు చెందిన వారిని మాత్రమే కాకుండా, అణచివేతదారులను కూడా పరివర్తన చెందడానికి, పశ్చాత్తాపం చెందడానికి ప్రోత్సహించారు, తద్వారా నిజమైన సౌభ్రాతృత్వం సాధ్యమవుతుంది. అతని సాహిత్యం సామాజిక సంస్కరణ కేవలం చట్టపరమైన మార్పుల ద్వారా కాకుండా, హృదయాల మరియు మనస్సుల మార్పు ద్వారా వస్తుందని బోధించింది, ఇది దయాగుణం, కరుణ, మరియు అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఈ సూత్రాలు అతని పనిలో అంతర్భాగంగా ఉంటాయి. సామాజిక మార్పుకు ఒక సమగ్రమైన, నైతిక విధానాన్ని సూచిస్తాయి.

దళిత చైతన్యం నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వం వైపు – సమగ్ర విశ్లేషణ:

బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం దళిత చైతన్యం యొక్క గాఢమైన వ్యక్తీకరణ నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వం యొక్క విస్తృత ఆదర్శం వరకు ఒక నిరంతర పరిణామంగా కనిపిస్తుంది. అతని ప్రారంభ రచనలు దళిత ప్రజల నిర్దిష్ట బాధలు మరియు పోరాటాలపై దృష్టి సారించాయి, వారికి స్వరం ఇచ్చి, వారి గుర్తింపును స్థాపించాయి. ఈ దశలో, అతను సామాజిక అన్యాయాలపై తీవ్రమైన విమర్శను అందించారు, కుల వివక్షకు వ్యతిరేకంగా నిరసన స్వరంగా నిలిచారు. క్రమంగా, అతని భావజాలం పరిణతి చెందింది, దళిత విముక్తిని మానవజాతి మొత్తానికి వర్తించే సార్వత్రిక మానవ హక్కులు మరియు సౌభ్రాతృత్వం యొక్క విస్తృత చట్రంలో చేర్చింది. భీమన్న కేవలం దళిత కవిగా మాత్రమే కాకుండా, సమస్త మానవజాతి శ్రేయస్సును కోరుకునే ఒక మానవతావాదిగా ఎదిగారు.

భీమన్న రచనా పరిణామ క్రమంలో భావచలనం అతని వ్యక్తిగత మరియు సామాజిక అనుభవాలను ప్రతిబింబిస్తుంది. అతని ప్రారంభ కవిత్వం, పాలేరు వంటి నాటకాలు, దళిత అస్తిత్వ వేదనను, ఆత్మగౌరవం కోసం తపనను ప్రస్ఫుటంగా చూపాయి. ఈ రచనలు దళిత ప్రజలలో స్వీయ-పరివర్తన మరియు సామాజిక మార్పుకు ప్రేరణనిచ్చాయి. కాలక్రమేణా, అతని దృష్టి విస్తృతమైంది, కుల విభజనలకు అతీతంగా మానవజాతి యొక్క సార్వత్రిక బంధాలపై కేంద్రీకరించబడింది. దీపశిఖ వంటి అతని తర్వాతి రచనలు మానవతావాదం, శాంతి, మరియు ప్రపంచ సౌభ్రాతృత్వం యొక్క సందేశాలను ప్రతిబింబించాయి. ఈ భావచలనం భీమన్న యొక్క మేధో పరిపక్వతను, అతని కరుణ

యొక్క లోతును సూచిస్తుంది, ఇది సామాజిక న్యాయం కోసం నిర్దిష్ట పోరాటం నుండి సార్వత్రిక మానవ విముక్తి కోసం ఒక ఆకాంక్షగా రూపాంతరం చెందింది. అతని ఈ పరిణామం 19వ శతాబ్దపు కజక్ సాహిత్య చరిత్రలో మతపరమైన అంశాలను అధ్యయనం చేసిన పండితుల పనితో సమానంగా ఉంది, అక్కడ కూడా భావజాల పరిణామాలు గమనించబడ్డాయి.

ప్రస్తుత సామాజిక సాహిత్యంపై భీమన్న ప్రభావాలు:

బోయి భీమన్న సాహిత్యం ప్రస్తుత సామాజిక సాహిత్యంపై సుదీర్ఘమైన ప్రభావాన్ని చూపింది. అతని రచనలు దళిత అనుభవాలను, ఆకాంక్షలను వ్యక్తీకరించడంలో ఇతర రచయితలకు మార్గదర్శకత్వం వహించాయి. ఆధునిక దళిత సాహిత్యం, ప్రత్యేకించి దళిత మధ్యతరగతి యొక్క పోరాటాలు మరియు ఆకాంక్షలను అన్వేషించే రచనలు (Pankaj & Jha, 2023), భీమన్న స్థాపించిన పునాదులపై నిర్మించబడ్డాయి. అతని మానవతావాద దృక్పథం, సామాజిక సమానత్వం కోసం అతని పిలుపులు, నేటికీ సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న వారికి ప్రేరణగా నిలుస్తున్నాయి. భీమన్న యొక్క సమగ్ర దృక్పథం, కుల వివక్షను అధిగమించి విశ్వమానవ సౌభ్రాతృత్వం వైపు సాగాలనే అతని సందేశం, ఆధునిక రచయితలు తమ రచనలలో విస్తృత సామాజిక సమస్యలను పరిష్కరించడానికి ప్రోత్సహించింది. అతని ప్రభావం కేవలం దళిత సాహిత్యానికే పరిమితం కాకుండా, సమానత్వం మరియు మానవ గౌరవం కోసం నిరంతరంగా జరిగే చర్చలలో కూడా ప్రతిధ్వనిస్తుంది. ఇది సామాజిక ఉద్యమాల సాంస్కృతిక ప్రభావాలతో ముడిపడి ఉంది.

పురస్కారాలు:

ఆంధ్ర విశ్వకళాపరిషత్ వారిచేత కళా ప్రపూర్ణ – 1971

పద్మశ్రీ పురస్కారం – 1973

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు– 1975

కాశీ విద్యాపీఠం గౌరవ డాక్టరేట్ – 1976

పద్మ భూషణ్ పురస్కారం – 2001

నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్

1991లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం

తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు – 2004

పాద సూచికలు:

1. వ్యక్తిగత నేపథ్యం మరియు పురస్కారాలు:

   బోయి భీమన్న 1911 సెప్టెంబరు 19న తూర్పు గోదావరి జిల్లాలోని ఒక దళిత కుటుంబంలో పుల్లయ్య, నాగమ్మ దంపతులకు జన్మించారు.

ఆయన బి.ఏ., బి.ఎడ్. పూర్తి చేసి ఉపాధ్యాయుడిగా, పత్రికాకారుడిగా పనిచేశారు.

1975లో 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

భారత ప్రభుత్వం ఆయనను 1973లో 'పద్మశ్రీ' మరియు 2001లో 'పద్మ భూషణ్' పురస్కారాలతో గౌరవించింది.

2. దళిత చైతన్యం – ప్రముఖ రచనలు:

పాలేరు (1938): దళితుల్లో విద్యా చైతన్యాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించిన చారిత్రాత్మక నాటకం. ఈ నాటక ప్రేరణతో ఎంతోమంది పాలేరు స్థాయి నుండి ఉన్నతాధికారులుగా ఎదిగారు.

కూలిరాజు (1946): ఈ రచనలో కూలీల ఆర్థిక పోరాటాలను చిత్రించారు.

రాగవైశాఖి: అరుంధతీ-వశిష్ఠుల కథ ద్వారా ఆర్య-అనార్య సిద్ధాంతాన్ని పునర్మూల్యాంకనం చేస్తూ రాసిన పౌరాణిక నాటకం.

అంబేద్కర్ ప్రభావం: అంబేద్కర్ రాసిన 'అన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్' గ్రంథాన్ని భీమన్న తెలుగులోకి అనువదించారు.

3. సామాజిక మరియు విశ్వమానవ దృక్పథం:

భీమన్న సాహిత్యం దళిత చైతన్యంతో ప్రారంభమై 'విశ్వమానవ సౌభ్రాతృత్వం' వైపు పరిణామం చెందింది.

'సకల దేశముల సర్వ మానవుల సామ్యము సాధింపుమురా' అనే నినాదంతో మానవ ఏకత్వాన్ని ప్రబోధించారు.

కుల వ్యవస్థ కేవలం సామాజిక విభజనే కాదని, అది ఆర్థిక దోపిడీకి ఒక సాధనమని ఆయన విశ్లేషించారు.

వ్యక్తి వికాసమే జాతి వికాసమని, అది వసుధైక కుటుంబానికి దారితీస్తుందని భీమన్న నమ్మారు.

రాజకీయ మరియు ఇతర రంగాలు

భీమన్న క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.

1978 నుండి 1984 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడిగా సేవలు అందించారు.

ఆకాశవాణి కోసం అనేక భావగీతాలను రచించారు.

ముగింపు:

బోయి భీమన్న సాహిత్యం దళిత చైతన్యం నుండి విశ్వమానవ సౌభ్రాతృత్వం వైపు ఒక ప్రకాశవంతమైన ప్రయాణాన్ని సూచిస్తుంది. అతను దళిత ప్రజల బాధలు, పోరాటాలకు స్వరం ఇవ్వడమే కాకుండా, మానవజాతి యొక్క సార్వత్రిక ఐక్యత, ప్రేమ, మరియు సహనం యొక్క సందేశాలను అందించారు. అతని రచనలు సామాజిక అన్యాయాలపై ఒక పదునైన విమర్శను అందిస్తూనే, సమాజంలోని అన్ని వర్గాల మధ్య సయోధ్య, గౌరవం కోసం ఒక దార్శనికతను అందించాయి. భీమన్న సాహిత్య కృషి భారతీయ సామాజిక–సాహిత్య చరిత్రలో ఒక విడదీయరాని భాగం, ఇది భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

పాలేరు నాటకానికి వ్రాసిన ముందుమాటలో భీమన్న స్పష్టంగానే వర్గం, కులం పట్ల తన అభిప్రాయాల్ని ప్రకటించాడు. 'భారత్‌లో వర్గపద్ధతి లేదు. వర్ణవ్యవస్థ అంటే కుల వ్యవస్థ వుంది. ఇక్కడ కూలీలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి' అన్నాడు. వర్గపోరాటాలు జరుగుతున్న తీరుని విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టిమాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించాడు. ఇంత స్పష్టంగా కులనిర్మూలనను ఆశించిన భీమన్న సాహిత్యాన్ని వివిధ జాతీయసదస్సుల్లో కులం లేదన్నారని వక్రీకరిస్తున్నారు. మూడవది వర్ణాంతవివాహాల వల్ల కులనిర్మూన జరగడాన్ని ఆకాంక్షించారు. ఈ విషయాలన్నీ బాధ్యతగల సాహితీవేత్తలు గుర్తించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిఫలమే భీమన్న సాహిత్యమని గుర్తించాల్సి ఉందని డా. దార్ల వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించింది నూటికి నూరుశాతం నిజమని తెలుస్తుంది.

బోయి భీమన్న సాహిత్య ప్రస్థానం భారతీయ సమాజం యొక్క సంక్లిష్టతలను, ముఖ్యంగా కుల వ్యవస్థ యొక్క అణచివేత స్వభావాన్ని, మరియు మానవ ఆత్మ యొక్క స్థితిస్థాపకతను స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అతని ప్రారంభ రచనలు దళిత అస్తిత్వం, ఆత్మగౌరవం, మరియు సామాజిక న్యాయం కోసం నిరసన స్వరాలుగా ఉద్భవించాయి. కాలక్రమేణా, అతని తత్వశాస్త్రం విస్తృతమై, మానవులందరినీ ఏకం చేసే విశ్వమానవ సౌభ్రాతృత్వం యొక్క ఆదర్శాలపై దృష్టి సారించింది. భీమన్న కేవలం ఒక కవి లేదా నాటకకర్త మాత్రమే కాదు అతను సామాజిక సంస్కర్త, అతని మాటలు అనేక మందికి ప్రేరణనిచ్చాయి. అతని సాహిత్యం సామాజిక మార్పుకు ఒక శక్తివంతమైన సాధనంగా ఎలా ఉపయోగపడుతుందో నిరూపించింది, విభజనలను తగ్గించి, మానవతా విలువలను పెంపొందించింది. అతని రచనలు సమానత్వం, గౌరవం, మరియు శాంతియుత సహజీవనం కోసం నిరంతరంగా పిలుపునిచ్చాయి.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. గుడిసెలు కాలిపోతున్నై (కవిత్వం), ప్రథమ ముద్రణ 1973
2. పాలేరు (నాటిక/కావ్యం) 19వ ముద్రణ, 1988
3. దీప సభ (కవిత్వం), ప్రథమ ముద్రణ 1955

4. జానపదుని జాబులు (పల్లెటూరి లేఖలు) జూన్, 1957
5. రాగవైశాఖి – ప్రథమ ముద్రణ 1965
6. ధర్మం కోసం పోరాటం (వ్యాస సంకలనం), మొదటి ముద్రణ 1968
7. వీకిపీడియా నుండి..
8. డాక్టర్ కొలకలూరి ఇనాక్: భీమన్న సాహిత్యంపై, ముఖ్యంగా దళిత కవిత్వంపై ఆయన విమర్శనాత్మక వ్యాసాలు.
9. ఆచార్య ఎండ్లూరి సుధాకర్: దళిత సాహిత్యం – సిద్ధాంతంపై రాసిన గ్రంథాలు, అందులో భీమన్న స్థానం.
10. డాక్టర్ కాత్యాయనీ విద్మహే: ఆధునిక తెలుగు కవిత్వం
11. తెలుగు అకాడమీ: ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర
12. డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు వ్యాసం– 'సాహిత్య భాస్కరుడు మహాకవి బోయి భీమన్న'

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

డా. బోయిభీమన్న గారి "పిల్లీ శతకం–ఒక పరిశీలన"

– ఎమ్.ఎచ్.నాగభూషణం
తెలుగు సహాయ ఆచార్యులు

వ్యాససంగ్రహము:

ప్రముఖ కవి, పద్మభూషణ్ బోయి భీమన్న గారు రచించిన 'పిల్లీ శతకం' ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన కావ్యం. జంతువును ప్రతినిధిగా చేసుకుని సమాజంలోని రుగ్మతలను, మానవ స్వభావాలను ఎండగట్టిన తీరు ఈ శతకంలో అద్భుతంగా కనిపిస్తుంది. సాధారణంగా శతక సాహిత్యం అనగానే భక్తి లేదా నీతి ప్రధానంగా సాగుతుంది. కానీ బోయి భీమన్న గారు 'పిల్లీ'ని ఒక చిహ్నంగా మలచుకుని, దాని ద్వారా సామాజిక విమర్శను సంధించారు.ఇందులో పిల్లీ కేవలం ఒక జంతువు కాదు, అది మనిషిలోని స్వార్థానికి, అవకాశవాదానికి మరియు సమాజంలోని కుళ్లుకు ప్రతిరూపం. పిల్లీ ఎలుకలను వేటాడడం, బలహీనులను బలవంతులు అణచివేయడం వంటి అంశాలను సమాజంలోని అగ్రవర్ణ, పేద వర్గాల మధ్య ఉన్న వ్యత్యాసాలకు అద్దం పట్టేలా వివరించారు.

ఈ శతకంలో పిల్లీ చేష్టలను వర్ణిస్తూనే, పరోక్షంగా రాజకీయ నాయకుల తీరును, మత గురువుల వేషధారణను భీమన్న గారు ఎండగట్టారు. "పైకి సాధువులా కనిపిస్తూ లోపల కపట బుద్ధి కలిగిన వారిని" పిల్లీతో పోల్చారు. బోయి భీమన్న గారు ఈ శతకాన్ని సరళమైన గ్రాంథికం మరియు వాడుక భాష కలగలిపి రాశారు. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో ఉంటూనే, పండితులను మెప్పించే లోతైన అర్థాలు ఇందులో ఉన్నాయి. ఛందోబద్ధమైన పద్యాలైనప్పటికీ, ఎక్కడా క్లిష్టత లేకుండా సాగుతాయి. 'పిల్లీ శతకం' కేవలం వినోదం కోసం రాసింది కాదు. మనిషి తనలోని నీచ బుద్ధులను అనగా కపటం,స్వార్థం వదిలిపెట్టి, నిజాయితీగా బతకాలనే సందేశాన్ని ఈ కావ్యం ఇస్తుంది. బాహ్య వేషధారణ కంటే అంతఃశుద్ధి ముఖ్యమని కవి ఈ శతకం ద్వారా ఉద్ఘాటించారు. తెలుగు శతక సాహిత్యంలో జంతువు ను కథానాయకుడిగా చేసి, ఇంతటి సామాజిక చైతన్యాన్ని కలిగించిన రచనలు అరుదు. బోయి భీమన్న గారి విలక్షణ శైలికి, వారి సామాజిక స్పృహకు 'పిల్లీ శతకం' ఒక

నిలువుటద్దం. సమాజంలో ఎంతోకొంత సామాజిక చైతన్యం కలగాలనే ఉద్దేశంతో ఈ వ్యాసమును వ్రాయడం జరిగింది.

కీలకపదాలు: తెలుగు సాహిత్యము, శతకము, ముక్తకములు, బోయిభీమన్న, పిల్లీశతకము, శకునాలు.

ఉపోద్ఘాతము:

శతకం తెలుగు కవులకు ఇష్టమైన ప్రక్రియ.మామూలు కవుల నుంచి మహాకవుల దాకా శతకాలు రచించి కవితాభ్యాస సోపానాలు నిర్మించుకున్నారు. తెలుగు సారస్వతంలో శతక ప్రక్రియకు ప్రముఖమైన స్థానం ఉంది. ఈ ప్రక్రియ ఆదికవి నన్నయ కాలంలోనే మొలకెత్తి దినదిన ప్రవర్ధమానంగా వర్ధిల్లుతూనే ఉంది. భక్తి, నీతి, అధిక్షేప, హాస్య, శృంగార మరియు చరిత్ర మొదలగు అంశాలపై అనేకానేక శతకాలు వచ్చాయి,వస్తున్నాయి.

తెలుగు సాహిత్యంలో అత్యంత శక్తివంతమైనది శతక ప్రక్రియ. ఆత్మాశ్రయమై గృహాన్ని దాటి సమాజాన్ని దాటి ప్రాంత దేశాలను దాటి విశ్వం వైపు ప్రయాణించే భావాలు ఈ ప్రక్రియలో తెలుగు కవులు పరమాద్భుతంగా పొందుపరచారు. కావ్యకర్తకన్నా శతక కర్తకు స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఎందుకనగా సామాజిక అంశాలతో పాటు వ్యక్తిగత విషయాలు కూడా పేర్కొనవచ్చు.

చరిత్ర:

శతకం తెలుగు సాహిత్యంలో ఓ విశిష్టమైన స్థానం సంతరించుకుంది. సుమారు 1000 సంవత్సరముల నుండి అవిచ్ఛిన్నంగా వస్తున్న ఓ అందమైన సాహితీ ప్రక్రియ శతకం. శతక కవులకు స్వీయానుభవం వ్యక్తం చేయడానికి స్వేచ్ఛ పుష్కలంగా ఉంటుంది. ఈ ప్రక్రియలో ఏదో ఒక కథకు ఏదో ఒక వర్ణనకు కట్టుబడి ఉండాలన్న కట్టడి లేదు.

ఆత్మనివేదన రూపమైన శతకం తెలుగు సాహిత్యానికే అపూర్వ అలంకారం. సాహిత్య సాధకులు అయిన కవులు తమ ప్రయోగ దక్షతకు మెరుగులు దిద్దుకోవడం కొరకు శతకాన్ని ఆశ్రయించారు. తెలుగు సాహిత్యంలో పద్యానికి ప్రశస్తమైన స్థానం ఉంది. ఆది నుంచి పద్యానికి పట్టాభిషేకం చేసిన ఘనత శతక సాహిత్యానికి ఉంది. కవిలోని పలు రకాల భావాలను పలికించడానికి శతకం ఒక మంచి ప్రక్రియ.

తెలుగున క్రీ.శ.1220 ప్రాంతమున పాల్కురికి సోమనాథుడు వృషాధిప శతకము రాసిన నాటి నుండి నేటి వరకు శతకాలు పుంఖాను పుంఖాలుగా వెలువడుతూనే ఉన్నాయి. తెలుగు సాహితీ జగత్తులో విశిష్టంగా వర్ధిల్లుతున్న ప్రక్రియ శతక రచన.

శతకములు ముక్తకములు:

శతకములోని పద్యములన్నియు ముక్తకములు.అనగా ఎప్పుడెప్పుడు ఏ ఏ భావములు స్ఫురించునో, అప్పుడప్పుడాయా భావములను పద్యము లందిమిడించి పరతత్వమునకు నివేదించుకొందురు. ముక్తక రచన వలన ప్రయోజన మేమనగా కావ్యము నందు వలె ఒక కథా

క్రమమును గాని, ఒక వర్ణనా ప్రణాళికనుగాని అనుసరించవలసిన శ్రమయుండదు. ఏ పద్యమునకు ఆ పద్యమే సర్వ స్వతంత్రము.

తెలుగు భాషయందలి సహజమైన మాధుర్యమును సౌందర్యమును వెలువరించు రచనలలో శతకము అత్యంత ప్రధానమైనవి. శతకంలో కవి మనతో మన భాషలో మాట్లాడుతూ తన బాధ, తన సాధన, తన అనుభవం మనవి చేస్తాడు. అందువల్లనే శతక కవి మనకు సన్నిహితంగా వస్తాడు.

రచయిత పరిచయం:

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత. మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మ భూషణ్ తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ, సన్మానా లందుకున్న కవి, బోయి భీమన్న.

బోయి భీమన్న సుమారు 70 పుస్తకాలు రాశారు.పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా వ్రాశారు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మ క దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొన్ని ఏవో కొత్త ప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్నీ చెప్తున్న ట్లుంటుంది.ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని వ్రాశారు. వీటన్నింటితో పాటు అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించారు. ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశారు. వీరు వ్రాసిన 'జయ జయ జయ అంబేద్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

పిల్లీశతకం:

మానవునితో కలిసిమెలిసి ఉంటూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా సంపూర్ణంగా కల జంతువు పిల్లీ ఒక్కటే. పిల్లీని గురించి ఉన్నన్ని సామెతలు, చమత్కారాలు, నానుడులు విశ్వాసాలు మరే జంతువు గురించి లేవు. అందుకే పిల్లీని ఈ శతకానికి మకుటముగా తీసుకున్నానని బోయి భీమన్నగారు ప్రకటించారు. ఇంతవరకు ప్రకటించబడ్డ తన గ్రంథాల కంటే ఈ శతకం విలక్షణమైనదని సహృదయలు గుర్తించగలరని ఈ పుస్తకము పీఠికలో తెలియజేశారు

పిల్లీ శకునం అనేది భారతీయ సంప్రదాయంలో ఒక ముఖ్యమైన నమ్మకం. పిల్లీ ఎదురు రావడం, మ్యావ్ మ్యావ్ అని అరవడం, లేదా దాని ప్రవర్తనను బట్టి శుభాలు, అశుభాలు జరుగుతాయని నమ్ముతారు. సాధారణంగా, ప్రయాణంలో పిల్లీ ఎదురు వస్తే అశుభం, కానీ కొన్ని సందర్భాల్లో, పిల్లీ పిల్లలు పుట్టడం, పిల్లీ మనల్ని అనుసరించడం వంటివి సంపదకు సంకేతాలుగా భావిస్తారు, అయితే నల్ల పిల్లులు అదృష్టాన్ని తెస్తాయని కొందరు నమ్ముతారు.

"చదువని వాడజ్ఞుండగు,చదివిన సదసద్వివేక చతురత గల్గున్", అని భాగవతం రాసిన పోతన గారు అన్నట్లు.. బోయిభీమన్న గారు కూడా

"వినదగు నెవ్వరు చెప్పిన
విని –ఆ చెప్పినయతండు వేరే కులమా
మన కులమా అని చూడక

మనిషని గుర్తించువాడే మనుజుడు పిల్లీ" అని మనిషిని కులమతాలతో భేదం లేకుండా మనిషిగా గుర్తించమని లోకానికి చెబుతున్నాడు. బోయి భీమన్న గారు శకునాలు ఒట్టి మూఢనమ్మకాలు కావని మంచి చెడ్డల ఛాయలని అందుకు ఉదాహరణగా అందమైన వస్తువులు ఇంపైన మాటలు మనసుకు ఆహ్లాదము కలిగిస్తాయని, ఏ మనసైన శుభము విజయము కోరుకుంటుందని, అశుభ వికార సన్నివేశాలను పరిహరిస్తుందని తెలియజేశారు. మన మీద ఒక దొంగ వాడి కన్ను పడడానికి ధర్మదాత కన్ను పడడానికి తేడా ఉందని తెలిపారు. దొంగకు పోలీసు అపశకునం ధనికుడు శుభశకునమని కావున ఆయా వ్యక్తుల గుణ వృత్తి స్వభావాలను బట్టి అపకారకాలు అపశకునాలు ఉపకారకాలు శుభశకునాలు అని తెలిపి ఇవి నమ్మకాలు కావు నిత్య సత్యాలు అని తెలియజేశారు. అయితే ఇందులో కొన్ని మినహాయింపులు ఉంటాయని శత్రువు కాపాడనూవచ్చు, మిత్రుడు చంపనూవచ్చు అని తెలియజేశారు. కానీ ఈ పిల్లీ శతకం మాత్రం నిత్య శుభాలను ఇస్తూ సర్వ మానవులకు సుందర జీవితానికి మార్గం చూపుతుందని తెలియజేశారు

సారముగ "పిల్లీ వట్టిన
యీరు" వనుచు వ్రాసిపెట్టి, ఎంతయు నీకా
తారార్కమైన కీరితి
గూరిచె తిక్కన్న తెలిసికొంటివె, పిల్లీ! 22

"పిల్లీ వట్టిన యీరు" అనే పదబంధం తెలుగు జాతీయం. దీనికి అక్షరాలా "పిల్లీ పట్టుకున్న దారం" అని అర్థం. విస్తృత అర్థంలో, ఇది అల్పమైన, చిన్నపాటి లేదా నిజమైన ప్రాముఖ్యత లేని దానిని సూచిస్తుంది. పిల్లీ ఆడుకునే దారం ఎంత సులభంగా కొట్టిపారవేయబడుతుందో లేదా ఎంత అముఖ్యమైనదో, అలాగే ఏదైనా అంత సులభంగా కొట్టిపారవేయబడుతుందని లేదా అముఖ్యమైనదని ఇది సూచిస్తుంది. "పిల్లీ వట్టిన యీరు" అని రాయడం ద్వారా, తిక్కన గొప్ప మరియు శాశ్వతమైన కీర్తిని ప్రసాదించాడని కవి ఈ పద్యంలో తెలియజేస్తున్నారు. బహుశా వ్యంగ్యంగా అంత అల్పమైనది కూడా అతని మాటల ద్వారా అమరత్వం పొందవచ్చని సూచిస్తుంది.

"ఓయమ్మ! నీ కుమారుడు
మా ఇండ్లను పాలు పెరుగు మననీ డనుచున్
ఏ యమ్మ నిను స్మరించదు?
నీ యున్నదె గోకులమ్ము నిజముగ పిల్లీ!" 12

అనే పద్యంలో యశోదమ్మను గోపికలు ఆడిగినట్లుగా ఎవ్వరూ నిన్ను స్మరించక పోయినా నీ ఉన్నదే నిజముగా గోకులమని చెప్పడం వాస్తవమే.ఎందుకనగా నేడు పాల వాసన పసిగట్టిన పిల్లులన్నీ చిన్ని కృష్ణుడి లాగా పాలను చాటుగా త్రాగి పోవాలని చూడడం ప్రతి వంటింటిలో మనకు విదితమే..

శతకముల కొలది నీతులు
శత విధముల గలవు, వాని జను లెరుగుదురున్;
మెతుకులు ముఖ్యము జీవికి;
బ్రతుకుటయే ముఖ్య నీతి పథమౌ! పిల్లీ! 18

ఈ పద్యం జీవితం పట్ల ఉన్న ఒక గొప్ప వాస్తవిక దృక్పథాన్ని తెలియజేస్తోంది. లోకంలో వందల కొద్దీ శతకాలు ఉన్నాయి, వాటిలో వేల కొద్దీ నీతులు ఉన్నాయి. ప్రజలందరికీ ఈ నీతులు ఏదో ఒక రకంగా తెలుసు.కానీ మనిషికి అన్నింటికంటే ముఖ్యం కడుపు నిండా మెతుకులు దొరకడం.ఆకలి తీరనిదే ఏ నీతి పనికిరాదు. కావున అన్ని నీతుల కంటే గొప్ప నీతి ఏమిటంటే మొదట బతకడం. ప్రాణాన్ని నిలుపుకోవడమే అన్నింటికంటే ప్రాథమికమైన మార్గము. ఆకలి ముందు ఏ సిద్ధాంతాలు పనిచేయవు అనే చేదు నిజాన్ని ఈ పద్యం ద్వారా కవి తెలియజేశారు.

పురుష వ్యాఘ్రుం డనుచున్
పురుష సింహుడనుచు, పురుష పుంగవుడనుచున్
నరుడు మృగము కాదలచును!
నరుడందుకె శివుడు కాడు, నమ్ము! పిల్లీ! 72

కామ క్రోధ లోభ మోహ మదమాశ్చర్యాలలో అన్నిటినీ గాని ఏ కొన్నిటినో గాని తీర్చు కోవడానికి మాత్రమే జీవితాన్ని వెచ్చించేవాడు మృగం కంటే ఉన్నతుడెలా అవుతాడు. సంగీత సాహిత్యాది లలిత కళలలో అభినివేశం కలిగి వాటి అనుభవం కోసం తన జీవితంలోని విలువైన కాలాన్ని తాను కష్టించి సంపాదించుకున్న ధనంలోని విలువైన భాగాన్ని వెచ్చించగలవాడే నిజమైన మనిషి.ఏ సాంస్కృతిక ప్రదర్శననైనా సరే టికెట్ కొనుక్కుని చూడాలి. ఏ పుస్తకం అయినా సరే కొనుక్కొని చదవాలి. ఫ్రీ పాసులు నరకానికి ఈడ్చు కుపోయే కుక్కలు. ప్రభుత్వం ఖర్చుతో అంటే ప్రజల డబ్బుతో దేశ విదేశ సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తూ ఆయా రంగాలలో ప్రవేశం కల రసజ్ఞులను ఆ చుట్టు ప్రక్కలకైనా రానీయకుండా తామే కుటుంబాలతో సహా ఉచితంగా ముందు సీట్లను ఆక్రమించే అధికారులను, సోషల్ వర్కర్లను, రాజకీయ నాయకులను గురించి నేనేమీ అనడం లేదని వాళ్లంతా పురుష సిమ్ములు ప్రజలే ఒట్టి గొర్రెలని ఈ పద్యం ద్వారా రచయిత పీఠికలో ప్రస్తావించారు.నేడు మన డబ్బు తింటూ మన నెత్తిపై వామన పాదము, భస్మాసుర హస్తమో పెడుతున్న మన ప్రతినిధులు అంతా ఇదే తరహా పురుష సిమ్ములని ఈ పద్యంలోని భావం.

శీల మన పిల్లీ శీలమె
శీలము, అదె సహజ సిద్ధ జీవితమెపుడున్;
శీల మన సెక్సె యనుకొని
కూలిరి పెక్కండ్రు ఘనులు కుందున,పిల్లీ! 86

ఈ పద్యం 'శీలం' అనే పదానికి ఉన్న లోతైన అర్థాన్ని, సమాజంలో ఉన్న అపోహలను చాలా స్పష్టంగా వివరిస్తోంది. శీలం అంటే కేవలం లైంగిక పవిత్రత అని మాత్రమే అనుకోవడం పొరపాటు. శీలం అంటే ఒక వ్యక్తి యొక్క సహజ సిద్ధమైన ప్రవర్తన, ఉత్తమమైన జీవన విధానం మరియు నైతిక విలువలు. కానీ, దురదృష్టవశాత్తూ చాలా మంది గొప్పవారు కూడా శీలం అంటే కేవలం శారీరక సంబంధమైన విషయమేనని భ్రమపడి, అనవసరమైన ఆందోళనలతో, కుంగుబాటుతో తమ జీవితాలను పాడుచేసుకుంటున్నారు.

శీలాన్ని కేవలం శరీరానికి పరిమితం చేయకుండా, అది మనిషి స్వభావానికి సంబంధించినదని కవి గుర్తు చేస్తున్నారు. పెక్కండ్రు ఘనులు' అంటే ఎంతో మేధావులు కూడా ఈ విషయంలో సంకుచితంగా ఆలోచించి ఇబ్బందులు పడుతున్నారని చెప్పడం విశేషం.

పిల్లీని చంకను బెట్టుక
వెళ్ళుట యను పిచ్చి నుడులు, విశ్వాసములున్
చెల్లవిక; నిన్ను గైకొని
ఢిల్లీ వర కేగ వచ్చు, తెలియవె? పిల్లీ! 124

పూర్వం పిల్లీ ఎదురొచ్చినా లేదా పిల్లీని వెంట తీసుకెళ్లినా అశుభమని, అది ఒక అపశకునమని భావించేవారు. "పిల్లీని చంకన పెట్టుకుని వెళ్లడం పిచ్చితనం" అనే పాత నమ్మకాలు ఇక చెల్లవు అని కవి ఇక్కడ చెబుతున్నారు.

"పిల్లీని చంకన పెట్టుకుని వెళ్లడం పిచ్చి మాట అని,అది అశుభమని నమ్మే కాలం పోయింది. ఆ పాత విశ్వాసాలు ఇక సాగవు. ఓ పిల్లీ! నిన్ను వెంట పెట్టుకుని ఇప్పుడు ఏకంగా దేశ రాజధాని ఢిల్లీ వరకు నిరభ్యంతరంగా వెళ్లవచ్చు.అంటే లోకం మారింది, మూఢనమ్మకాలు నశించాయి అని అర్థం. ఈ విషయం నీకు తెలియదా?" పిల్లీ అశుభం అనే అర్థం లేని నమ్మకాన్ని కవి కొట్టిపారేశారు.కాలం మారింది, మనుషులు విజ్ఞానంతో ఆలోచించాలి తప్ప పాత పిచ్చి నమ్మకాలను పట్టుకుని కూర్చోకూడదని సూచించారు.

ముగింపు:

బోయి భీమన్న గారు రాసిన "పిల్లీ శతకం" తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన సామాజిక విమర్శతో మరియు వ్యంగ్యాత్మకమైన రచనతో కూడినది.సాధారణంగా శతకాలు దేవుళ్ళను స్తుతిస్తూ లేదా నీతులను బోధిస్తూ సాగుతాయి.కానీ భీమన్న గారు ఒక పిల్లీని ప్రతీకగా తీసుకుని సమాజంలోని లోపాలను, మనుషుల మనస్తత్వాలను ఎండగట్టారు.పిల్లీ స్వభావాన్ని అంటే దొంగతనంగా పాలు తాగడం,చప్పుడు కాకుండా రావడం మొదలగు స్వభావాలు మనుషుల స్వార్థానికి, అవకాశవాదానికి అన్వయించి చెప్పారు. సమాజంలో ఉన్న అన్యాయాలను,కులమతాల జాడ్యాలను ఈ శతకం ద్వారా వ్యంగ్యంగా ఎంతో చమత్కారంగా ప్రశ్నించారు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా సరళమైన, స్పష్టమైన గ్రాంధిక మరియు వాడుక భాషల కలయికతో ఈ శతకంలోని పద్యాలు కొనసాగుతాయి.

పిల్లీ శతకంలో బోయిభీమన్న చూపించిన దార్శనికత ఎంతో లోతైనది. ఒక చిన్న జంతువును ఆధారం చేసుకుని మానవ జీవితంలోని సంక్లిష్టతలను వివరించడం ఆయనకే చెల్లింది. "లోకంలోని దొంగతనాన్ని, మోసాన్ని చూపించి, మనిషిని మేల్కొల్పడం" ఈ శతకం యొక్క ప్రధాన ఉద్దేశం.

ఆధార గ్రంథాలు:

1. బోయిభీమన్న పిల్లీశతకం
2. బోయిభీమన్న కవిత్వం–వస్తు వైవిధ్యం–కాత్యాయనీ విద్మహే
3. ఆంధ్రశతక సాహిత్య వికాసము–డా. కె.గోపాలకృష్ణారావు
4. సాహితీ కిన్నెర–డిగ్రీ తెలుగు పాఠ్యపుస్తకము

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

శ్రమజీవుల ప్రేమతత్వం భీమన్న 'పైరు పాట'

– డా. సి. అనిత కుమారి
అసిస్టెంట్ ప్రొఫెసర్
ఫోన్ నెంబర్: 9866238682

ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్యంలో ప్రజాకవిత్వానికి, ఉద్యమ సాహిత్యానికి, సామాజిక చైతన్యానికి అంకితమైన కవుల్లో బోయి భీమన్న ప్రముఖ స్థానంలో నిలుస్తారు. వారి రచనల్లో గ్రామీణ జీవితం, దళిత – బహుజన వర్గాల బాధలు, రైతు కూలీల పోరాటాలన్నీ ప్రతిబింబిస్తాయి. భీమన్న రచనల్లో నేల వాసన,కష్టజీవుల కన్నీరు, చెమట చుక్కల వాసన మొదలైనవన్నీ ప్రజా జీవితాన్ని ఆవిష్కరింపచేస్తాయి. ఈ కోవలోకి చెందినదే 'పైరు పాట'. దిగువ కులాల ప్రజలంతా శ్రమైక్యజీవనానికి అంకితమైన వారు. అమాయక ప్రేమలకు ప్రతిరూపాలు. పచ్చని పొలాలతో నిత్యజీవితం గడుపుతూ గడ్డి పోచలతో ముచ్చటించేవాళ్లు. నోరులేని మూగజీవాలతో సావాసం చేస్తూ వాటికి కడుపు నింపే కన్నతల్లుల వంటి ప్రేమ గల వాళ్లు. అలాంటివారి కదలికలను, పచ్చిక బీళ్ళ వెంట గడ్డి చేత పట్టుకొని పయనించే పిల్లలను, కుర్రవాళ్ళ షికార్లను ఆలంబనగా చేసుకుని సంగీత రూపకంగా ప్రదర్శించుకోవటానికి, నృత్యాన్ని సైతం జోడించుకోవటానికి అనుగుణంగా ఉండే రచన చేశాడు. ఈ రచనలో శ్రమజీవులను విశ్వమానవాళి ప్రేమించే దిశగా తీర్చిదిద్దాడు.

పరిచయం:

నృత్య సంగీత రూపకంగా ప్రదర్శించగల ఈ పైరుపాటను ఏడు రంగాలుగా విభజించి రాశాడు. ఇందులోని ఆరు రంగాలు ఒక దృశ్యంగా కొనసాగితే, ఏడవ రంగం నేటికీ కూడా ఏ పెండ్లి సందర్భంలోనైనా ప్రదర్శించుకోవడానికి అనుగుణంగా ఉండేటట్లు రాశాడు. ఈ రచనను ఆంధ్రప్రదేశ్‌లో రెండవ ముఖ్యమంత్రిగా నియమితులైన దామోదర సంజీవయ్యకు అంకితం ఇచ్చాడు. సంజీవయ్య గారు పొట్టకూటికి లేని పరిస్థితిని అధిగమించి అంచలంచలుగా ముఖ్యమంత్రి దాకా అనేక పదవులను చేపడుతూ ఎదిగిన క్రమాన్ని వేనోళ్ళ కీర్తించాడు. ఇందులో ప్రధాన పాత్రగా విద్యాధికుడు,భాగ్యవంతుడు అయిన గ్రామీణ యువకుడు, అభ్యుదయ భావాలు గలవాడు శ్రీవత్సను

పరిచయం చేశాడు. అదేవిధంగా అమాయకులైన గ్రామీణ బాలికలు గడ్డి కోత జీవనంగా గలవారు స్నేహ,శీలల పాత్రల ద్వారా శ్రమజీవుల ప్రేమ తత్వాన్ని లోకానికి చాటి చెప్పాడు. ఈ గేయంలో ప్రకృతిలోని అందాలు, రంగురంగుల పూలు, పక్షుల రాగాలు, పంట పొలాలు మొదలైన వర్ణనలతో తెలుగు భాష సౌందర్యాన్ని సాహిత్య లోకానికి అందించాడు.

పాత్రల సంభాషణ:

రోజు సాయంత్రం వేళ పంట పొలాల్లోకి షికారుకుపోతూ ఉండే శ్రీవత్సకు కీకారణ్యం లాంటి పైరులతో చూడముచ్చటగున్న గుట్టల్లో పచ్చగడ్డి కోసం వచ్చిన గడ్డిపిల్ల పరిచయమవుతుంది. లేత పచ్చిగడ్డి పెరికి పెరికి చేత బొబ్బలు వచ్చాయి. కంది రెబ్బలు గీసుకున్నాయి. అలాంటి సమయంలో లేచి రావే ప్రొద్దు పోయెనని గడ్డిపిల్లను పిలుస్తాడు. ఇంతలోనే ఒక చేత గడ్డిబుట్ట, ఒక చేత చిన్న కొడవలి పట్టుకొని శ్రీవత్స పిలుపు విని నవ్వుతూ ప్రవేశిస్తుంది గడ్డిపిల్ల. తనకు ముందు ఎప్పుడూ పరిచయం లేని వ్యక్తిని చూసి భయపడలేదు. గుండె ధైర్యంతో...

"సందేగాలికి జలదరించే
దెందమున్నది చాలు నీకు
గాలివానకు కూడా కదలని
గట్టుకదా నా మనుగడ".

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం. 2008:515)

ఈ విధంగా పలకడంలో నిజమైన శ్రమజీవుల జీవితాలు ఎప్పుడూ పొలం గట్టంతా దృఢంగా ఉంటాయనిపిస్తుంది. గరికపోచలతో జట్టు నాకు అనడంలో వ్యవసాయక జీవితాల పటిష్టతను అర్థం చేసుకోవచ్చు. శ్రీవత్స ప్రకృతిని ప్రేమించే గడ్డిపిల్లను ప్రేమిస్తుంటే, గడ్డిపిల్ల మాత్రం ప్రకృతినే ప్రేమిస్తుంది. వీరిద్దరి మధ్య సంభాషణ జరుగుతున్న సమయంలోనే జనపచేను గట్లనుండి శీల అనే మరో గడ్డిపిల్ల ఏదో పాడుకుంటూ అక్కడికి వస్తుంది. ఆమె శ్రీవత్స ను విమర్శనా దృష్టితో చూసినా అతడు మాత్రం ఆప్యాయంగా పలకరిస్తాడు. అందుకే బోయి భీమన్న శ్రీవత్స పాత్రను అభ్యుదయ భావాలు గలవాడుగా పరిచయం చేయడం సరైనదేనని మనం అర్థం చేసుకోవచ్చు.

ఇద్దరినీ మౌనంగా చూసిన శీల అందిన పరికెను ఏరుకుంటూ చేలగట్లలోకి నిష్క్రమిస్తుంది. ఆ తరువాత

'కాయ కష్టం విలువలన్నీ క
రుణ కోరే వరములన్ని

మొగమునిండా ముచ్చమటలయ్యి పొలములకు నీరు పెడుతున్నా'యంటూ గడ్డిపిల్ల శ్రమకు అంతే లేదంటాడు. ఆ మాటకు గడ్డిపిల్ల పనిచేయడం అంటే మనసుకు హాయిని గొలపడం, పనిచేస్తూ పాడే పాట ఈ బ్రతుకు కంటే గొప్పదంటుంది. ఇంతలోనే శీల ప్రవేశించి రోజు ఈ సమయానికే రాజులా వచ్చి కనబడ్డ పిల్లలతో కబుర్లు సాగిస్తున్నావు. ఏమీ పని లేదా? నీకు ఇదే పనా ఏంటి? అని శ్రీవత్స ను ప్రశ్నిస్తుంది. అందుకు శ్రీవత్స రోజు ఏ రాజు అయినా మోజులేక వస్తాడా చుక్కల సేవల

కంటే మొక్కకు పనులేముంటాయి అంటాడు. ఇక్కడ పనిచేసే పిల్లలను కవి చుక్కలతో పోల్చిన తీరు పాఠకులను అబ్బురపరుస్తుంది. అంతేకాదు బోయి భీమన్న రాజులు, పేదలకు ఉండే తారతమ్యాల్ని కూడా శీల నోట పలికించిన తీరును చూడవచ్చు.

"రోజులు గడిపే కంటే
రాజుకు పనులేముంటై
రాజుల సేవలు చేసే
రైతులకే పనులన్నీ:
సోమరి సోమన్నలకే
సుఖ సంతోషాలన్నీ"

(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, 2008: 523)

ఈ విధంగా పలికిన శీల మాటలకు వెంటనే ఎదురు సమాధానం ఇవ్వక, చిన్నపిల్ల అన్నమాటలకు క్షమాగుణంతో ఆమె చేతిలోని కొడవలిని అందుకొని గడ్డి కోయడం ప్రారంభిస్తాడు శ్రీవత్స. పడ్డలకు పరమాన్నంగా నిమిషములో రెండు బుట్టల గడ్డి కోసి నింపుతాడు. ఆ పని విధానం చూసిన శీల ఆశ్చర్యానికి గురై క్షమాపణ కోరుతూ అక్కడి నుండి వెళుతుంది. ఇంతలో అతడి చేతికి అంటిన ఎర్రసీరా మరకలను చూసిన గడ్డిపిల్ల నీ సుకుమారపు హస్తానికి రాపిడి కలిగించానని బాధపడుతుంది. శ్రీవత్స మాత్రం అది గాయం కాదు ఎర్రసిరా అంటూ పచ్చగడ్డి కోయడము, పరిపాలన చేయడము దారులు వేరే గాని దూరం ఒకటే అంటాడు.

శ్రమను పంచుకోవడంలో ఎగువ దిగువల తేడా ఉండదనే సారాంశాన్ని కవి చూపెట్టడం గొప్ప విశేషంగా భావించవచ్చు. ఇంతగా సంభాషిస్తున్న ఆ అమ్మాయి పేరు ఏంటో తెలుసుకోవాలని ఆరాటం శ్రీవత్సలో కలుగుతుంది. అందుకు నీ పేరు ఏమిటని ప్రశ్నించగా పేరు ఊరు లేని పేద పిల్ల నంటుంది. నిజంగా ప్రేమలకు తక్కువ గాని జీవితాలు గడిపే ఏ మనుషులకైనా పేరుతో, ఊరుతో పని లేదనిపిస్తుంది. అందుకే శ్రీవత్స ఆమె అందాన్ని మనసులో నింపుకొని, మోహన దేవతవు నీవు, స్నేహ రూపినివి నీవు ఇక మీదట నిన్ను 'స్నేహా' అని పిలుచుకుంటానంటాడు. ఆ తర్వాత స్నేహ–శీల మధ్యలో ఒక తాత్విక సంవాదం జరుగుతుంది. అందుకు కారణం స్నేహకు శ్రీవత్స మూలంగా ఏ కళంకం రాకూడదని ప్రకృతి దేవతను శీల మొక్కుకోవటమే. ఈ సంఘటనతో స్నేహ శీలను నిలదీస్తుంది. నేనేమైనా తప్పు చేశానా ఇంతలా ఆరాధన బుద్ధి నీకు కలగడం ఏమిటి అని ప్రశ్నిస్తూ ఆనాటి నుండి శ్రీవత్ససను దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తుంది. కానీ హృదయంలో అతడి జ్ఞాపకాలే తిరుగుతూ ఉంటాయి. ఆ తరువాత ఎవరి దారిలో వారు వెళ్ళిపోతారు. కొంతకాలానికి దీర్ఘాలోచనలో పడ్డ శ్రీవత్సను ఇప్పుడు శీల తనే ముందుగా పలకరించి స్నేహ వంటి పుష్పం నీ జీవితంలో దొరకదు, కోసుకొనే హృదయంలో దాచుకొమ్మంటుంది.

నిజానికి ఇద్దరు యువతులు ఒక యువకునితో జరిపే సంభాషణలో ఒకరి మీద ఒకరికి ఈర్ష్యద్వేషాలు రగులుకునే సందర్భాలే విరివిగా కనిపిస్తాయి. కానీ ఇందులో శీల స్నేహ బాగును కోరడం, అందుకు నేనేమైనా పర్వాలేదు. నాకు ఏ వ్యామోహం లేదు! చివరికి నీ మీద కూడా! అని

శ్రీవత్సతో తేల్చి చెప్పడం గొప్ప మానవతా హృదయం గలదిగా భావించవచ్చు. ఈ మాటలు విన్న శ్రీవత్స స్నేహకు కబురు చెప్పమని పెందలకాడే రమ్మని కోరుతాడు. శీల ప్రత్యుత్తరం వినకుండానే వెళ్ళిపోతాడు. ఆ తరువాత మరుసటి రోజు అనుకున్నట్లుగానే వారు పైరు పంటల్లో కలుసుకుంటారు. శ్రీవత్స మనసులోని నిజాన్ని దాచనివ్వక స్నేహను పరిపరి విధాలా పొగుడుతూ ముద్దు పెట్టుకుంటాడు. ఈ పరిస్థితిని చూసిన స్నేహ కోపంతో చూసే చూపులకు భయపడకుండా శ్రీవత్స తాను కానుకగా తెచ్చిన ఉంగరాన్ని వ్రేలికి తొడుగుతాడు. అంతటితో ఆమె కోపం చల్లారి మనసులో అతడిని క్షమిస్తుంది. ఈ సందర్భంగా శ్రీవత్స జ్ఞాపకాలను తన భవిష్యత్తు జీవిత ఆలోచనలను తలుచుకుంటూ నిత్యం చేల్లో గడ్డి కోసే గడ్డిపిల్ల చివరికి తన వైవాహిక జీవితాన్ని గడుపుటకు వెళ్లే క్రమంలో మూగజీవాలను చూసి మమకారంతో మాట్లాడుతుంది. పాడియావా నన్ను దీవించి పంపు అంటుంది. నీ బంగారు కొమ్ములతో భద్రత నీవు అంటుంది. నిండు చేళ్లల్లో నిర్లక్ష్యంగా మేసే బుల్లియాంబోతును జాబు రాయమంటుంది. క్షేత్రలక్ష్మిని, పుష్యలక్ష్మి ని మరిచిపోకండని వేడుకుంటుంది. చివరికి నా తల్లిదండ్రులు ఎవరో, ఎక్కడున్నారో దివినుండే ఒకసారి దీవించండని వాపోతుంది. నిజంగా ఈ సన్నివేశాన్ని కళ్ళ ముందు చిత్రీకరింపచేశాడు బోయి భీమన్న. ఎవరూ లేని అనాధల బాధలను తలుచుకుంటే గుండెలు పగిలిపోతాయి. కన్నీటి సంద్రాలు పొంగిపోతాయి. అందుకే మరింతగా వారి జీవితాలను వర్ణిస్తూ తనకీ పేరంటాలు ఎవరూ లేరని గడ్డి పువ్వులను పేరంటాలుగా రమ్మంటూ స్నేహ వేడుకున్న తీరును అక్షరీకరించాడు.

మంగళనాద స్వరం, పేరంటాల కలకలం, సందడి, చీర, రవిక, నగలు, పళ్ళు, పువ్వులు, పసుపు, కుంకుమ మొదలైన వస్తు సముదాయం గల పల్లెంతో శీల ప్రవేశిస్తుంది. ఎంతో పుణ్యశీలవని స్నేహకు హితోపదేశం తెలుపుతుంది. స్నేహ ఆనందంతో ఎర్రకలువ అయిపోతుంది. ఈ ఆనందంలో శీల సర్వత్రా ఉత్సవం జరుగుతుందని ఆడుతుంది, పాడుతుంది. బాపూజీ దీవించాడని, భరతమాత శుభాక్షింతలు వర్షించిందని చాటుతుంది. మాతృ పూజతో చివరి రంగం ముగుస్తుంది. ఈ విధంగా అనేక విషయాలన్నింటిని 'పైరుపాట'లో చూపెట్టాడు.

పైరుపాట ప్రత్యేకత :

ఆధునిక ఇతివృత్తాన్ని స్వీకరించి వచన సంభాషణలు ఎక్కడా లేకుండా పూర్తిగా గేయాలతో రచించిన నాటకాలలో బోయి భీమన్నవే మొదటివి. 'పైరుపాట', 'మానవుని మరొక మజిలీ' అనే గేయ నాటకాలలో రంగ విభజన చేయడాన్ని గమనించవచ్చు. పైరుపాటలో వస్తువు ప్రణయం. విద్యాధికుడు, భాగ్యవంతుడు అయిన గ్రామీణ యువకునికి గడ్డికోసే పేద పిల్లతో స్నేహం కావడం, పరిణయం జరగడం ఇందులోని వస్తువు. అందుకే కొందరు పరిశోధకులు ఇలా అన్నారు. " గేయాన్ని నాటక ప్రక్రియకు కూడా వాడిన కీర్తి బోయి భీమన్నకు దక్కుతుంది. మానవ సమాజ పరిణామాన్ని నాటకంగా గేయంలో మలచడం గేయ కవిత్వానికి కలికితురాయి వంటిది". (చెన్నకేశవరెడ్డి, జి. ఆధునికాంధ్ర గేయ కవిత్వం. 2015:405) ఈ విధంగా ఏడు రంగాలలో రాసినటువంటి ఈ గేయ కవిత్వాల్లో భాషా విశేషాలు కూడా విరివిగానే కనిపిస్తాయి. ఎంకజీడీ, అటుకుమావి, ఇటుకదాసి, పొన్నగంటి, చెంచలి, దొగ్గలి, బలుసు, చేదరాసి మొదలైన ఆకుకూరలు తిని పేద పిల్లలు బతుకుతారంటాడు.

గొలుగు, బలుసు, పులరేగు, గొడ్డటి, నేరేడు పండ్లు మొదలైనవి వానదేవుడిస్తే దొరికే తిండే వారి జీవితాలకు వాస్తవ తిండి అంటాడు. ఈ విధంగా ప్రకృతిలో దొరికే అన్ని ఆకులను, పువ్వులను, పండ్లను, కాయలను, గడ్డి పరుకలను సైతం ఏ ఒక్కదానిని వదిలిపెట్టకుండా ఈ 'పైరుపాట'లో వర్ణించాడు. అందుకే "గేయరూపాల విషయంలో భీమన్న గారిది రాశిలోనూ, వాసిలోనూ అందివేసిన చేయి" (భాస్కర రావు, మరపట్ల. బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం 2008:140) అన్నారు. భారత దేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' లాగే ఆయన రచనల్లో ఆ లక్షణం కనిపిస్తుంది. కుల మతాల కంటే మానవత్వాన్ని ఆశించిన ఘనుడతడు. తన తర్వాత తరం కవులకు ఆదర్శప్రాయుడు. నూతన తరాలకు గొప్ప సందేశం ఇచ్చాడు." మానవత్వం మంట కలిసిపోతున్న తరుణంలో మన భారతదేశంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మూర్తిభవించిన న్యాయదేవతగా విశ్వరూపం చూపించిన సంగతి గుర్తు చేస్తూ భారతదేశంలో ధర్మసంస్థాపన చేయుటకు గాను కవిగాయక ప్రజా నాయకుల తరపున పార్థత్వము మాట ఇచ్చాడు". (దేవయ్య, రాచమళ్ళ. భారతరత్న అంబేద్కర శతకం. 2005:XX) ఆ మాట నిలబెట్టుటకు ప్రతి భారతీయుడు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సి ఉంది.

ముగింపు:

మారుమూల పల్లెల్లో దళిత పాలేరు కుటుంబంలో పుట్టిన బిడ్డ భారత దేశంలోని అత్యున్నత పురస్కారాలను అందుకున్నాడు. తనను గన్న తల్లిదండ్రులను అడుగడుగునా స్మరించుకున్నాడు. పైరుపాటలో సైతం చివరి అంకంలో ముగింపులో కూడా మాతృ పూజతో తల్లి నాగమ్మను స్మరించాడు. అందుకే వారి ఉన్నతిని కొనియాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం ఒక సాహిత్య పీఠం ఏర్పాటు చేయడం దేశమంతా హర్షించదగ్గ విషయంగా భావించాలి. వారి ఆశయాలు, ఆలోచనలు ముందుకు తీసుకుపోవడంలో నేటి సాహితీ విద్యార్థులు భాగస్వాములు కావాలి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. ఆనందన్, కె (సంప). బోయి భీమన్న సమగ్ర సాహిత్యం (సంపుటం 4). హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2008.
2. ఆనందన్, కొళ్లాగుంట(సంప). బోయి భీమన్న సాహిత్యం–దళిత దృక్పథం. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2008.
3. చెన్నకేశవరెడ్డి, జి. ఆధునికాంధ్ర గేయ కవిత్వం. హైదరాబాద్: జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక, 2015.
4. దేవయ్య, రాచమళ్ళ. భారతరత్న అంబేద్కర శతకం. నల్లగొండ: శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహకారంతో ముద్రణ, 2005.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బాలయోగీయం రచనలో భీమన్న ఆధ్యాత్మిక, సామాజిక దృక్పథం

– డా. అతుకూరి వేంకటేశ్వర్లు (యోగి)
తెలుగు అధ్యాపకులు
ఫోన్ : 8074332611

1. పరిచయం :

తెలుగు సాహిత్యపు పూదోటలో సుగంధ పరిమళాలను వెలువరించిన కావ్యకృషీవలుడు బోయి భీమన్న. వేదకాలపు విజ్ఞానాన్ని తెలుసుకున్నవాడు, ఆధునిక కాలపు అవసరాన్ని గ్రహించినవాడు భీమన్న. సనాతన భారతీయ సంప్రదాయాలను గౌరవిస్తూ, మధ్యలో వచ్చిన అవాంఛనీయ వర్ణ వ్యత్యాసాలను సంస్కరించిన మేధావి, సాహితీవేత్త, సంస్కర్త బోయి భీమన్న.

భీమన్న రచనలలో విలక్షణమైనది "బాలయోగీయం". ఇందులో ఒక మహాయోగి జీవితాన్ని చక్కటి కావ్యంగా మలచారు.

1.1. బాలయోగి :

బాలయోగి అసలు పేరు సుబ్బారావు. వారి ఇంటి పేరు "కటికదల". ఆంధ్రరాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాలోని ముమ్మడివరంలో సాధారణ హరిజన కుటుంబంలో జన్మించారు. వీరి కుటుంబీకులు సాంఘిక న్యాయం కోసం, అస్పృశ్యతానివారణకోసం పోరాటాలు చేశారు.

బాలయోగిగా ప్రసిద్ధులైన సుబ్బారావు పది సంవత్సరాల వయస్సు వచ్చేవరకు మామూలుగా పిల్లలతో ఆడుకున్ననేవాడు. అక్షరాభ్యాసంగాని, బడికి వెళ్లటంగాని జరగలేదు. ఆ తరువాత ఐదారేండ్లపాటు పాలేరుగా పనిచేశాడు.

తన పదహారవయేట ఏ గురువు ప్రోత్సాహం లేకుండానే తనకు తానుగా తపస్సు ప్రారంభించాడు. ముమ్మడివరంలో ప్రతిసంవత్సరం "లంకతల్లమ్మ" అనే దేవతకు ఉత్సవాలు

జరుగుతూ ఉండేవి. ఆ తీర్థంలో శ్రీకృష్ణనారదులు ఉన్న ఒక చిత్రపటాన్ని కొనుక్కొని, ఒక సూర్యోదయ సమయంలో కొబ్బరిచెట్టు నీడలో ఉత్తర దిశాభిముఖంగా కూర్చొని, తాను కొన్న పటాన్ని ముందుంచుకొని, పుష్పాలతో అలంకరించి, పూజించి ధ్యాన నిమగ్నుడయ్యాడు. ఇక ఆనాటి నుండి మహాయోగిగా పరివర్తన చెందాడు. ఎండ, వానలకు కూడా చలించకుండా అందరికి ఆశ్చర్యాన్ని కలిగించాడు. మొదట్లో పండ్లు, పాలను అప్పుడప్పుడు ఆహారంగా తీసుకున్నప్పటికి, రాను రాను నిరాహారిగా, నిశ్చలుడిగా మారిపోయాడు. భక్తులు వారిని దర్శించటానికి తండోపతండాలుగా కదిలివస్తుంటే, తపోభంగం కలుగుతుందని భావించి ఆయన ధ్యానం చేసుకుంటున్న గది తలుపులను మూయించారు. ప్రతి శివరాత్రికి తలుపులు తెరచి దర్శనం కలిగించేవారు. దాదాపు 37 సం॥లు ఈ విధంగా జరిగింది. వారి ఖ్యాతి ఆంధ్రదేశ హద్దులు దాటి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

కొందరు హేతువాదులు, నాస్తికులు పనిగట్టుకొని వారికి రహస్యంగా ఆహారం అందుతుందని ప్రచారం చేశారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి, వారి ఏకాంత తపస్సుపై నిఘా ఉంచి పరిశీలించారు. వారి తపస్సులో అనుమానించవలసినది ఏదీ లేదని వారి పరిశీలనలో తేలింది.

ఇలా బాలయోగి మహాయోగిగా మారిన ఘట్టాన్ని బోయి భీమన్న ఆధ్యాత్మిక, సామాజిక దృక్పథంతో వీక్షించి "బాలయోగీయ"మనే కావ్యాన్ని రాశారు.

2. బాలయోగీయం – ఆధ్యాత్మిక దృక్పథం

భారతదేశం యోగభూమి. ఎందరో యోగులు ఈ భూమి మీద పుట్టి, ప్రపంచ ప్రజలను ప్రభావితం చేశారు. యోగవిద్యకు భారతదేశం పుట్టినిల్లు. సింధులోయనాగరికత కాలం నాటికే యోగుల బొమ్మలు కనిపించినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి.

యోగవిద్యకు అనేక సంప్రదాయాలున్నాయి. వాటిలో ప్రముఖమైనది పతంజలియోగం. దీనికి, పతంజలి మహర్షి రచించిన "యోగదర్శనం" ప్రామాణిక గ్రంథం. ఇందులో అష్టాంగాలున్నాయి. అవి:

1. యమము
2. నియమము
3. ఆసనము
4. ప్రాణాయామము
5. ప్రత్యాహారము
6. ధారణ
7. ధ్యానము
8. సమాధి

వీటిని సద్గురువు వద్ద శిష్యులు క్రమపద్ధతిలో నేర్చుకుంటారు.

"బాలయోగీయం"లోని బాలయోగి అష్టాంగాలలోని ధ్యానాన్ని అవలంభించి సమాధి స్థితిని పొందారు. బాలయోగి వ్యాస, వాల్మీకుల వంటి వాడని భీమన్న అభిప్రాయం. వాల్మీకి మహర్షి తనచుట్టూ వల్మీకం (పుట్ట) పెరిగే వరకు తపస్సు చేశాడు. మన బాలయోగి కూడా సిద్ధాసనం వేసుకొని నిద్రాహారాలు మాని తపస్సు చేశాడు.

"అన్నపానములు కామములెల్ల విడనాడి
కాల గర్భము వంటి గదిని చేరి

సిద్ధాసనము వేసి చిత్తము సరిచేసి
ఇష్టదైవము నాత్మ దృష్టి నిలిపి
మౌనము వహించి ధ్యానసమాధి మున్గి
వేదసారము వోలె దీపించు నీవు
పూర్వగాథల ఆర్ష భావుకతనేమొ
వాస్తవమ్ము నిరూపింప వచ్చినావో" (బాలయోగీయం – పు.సం.2)

అంటూ యోగం బాటనుబట్టిన బాలయోగిని భీమన్న వర్ణించాడు.

2.1. భారతదేశ ఆధ్యాత్మిక వారసుడు బాలయోగి :

భీమన్న అభిప్రాయం ప్రకారం బాలయోగి భారతదేశ ఆధ్యాత్మిక వారసుడు. వ్యాస వాల్మీకులు కూడా హరిజనులేనని, వారి సంకల్పాన్ని సఫలీకృతం చేయటానికే బాలయోగి జన్మించాడని అంటారు భీమన్న.

ఆకలికి తట్టుకోలేక వ్యాసుడు కాశీనగరాన్ని శపింపబోతే, అన్నపూర్ణాదేవి వ్యాసుణ్ణి మందలించి కాశీనగరం నుండి బహిష్కరించినదని పురాణం. ఆకలి వలన వ్యాసునికి జరిగిన అవమానాన్ని పోగొట్టటానికి బాలయోగి అవతరించాడని, నిరాహారిగా జీవించి నిదర్శం చూపాడని రచయిత భావించాడు.

"ఆకలి కాగలేని అదృధాత్ముడు వ్యాసుడు కాశి దిట్టెనన్
కాకుల నింద బాపుటకు గా దిగి వచ్చితి వీవు"

(బాలయోగీయం – పు.సం.9) అన్నారు.

ప్రకృతి నుండి దేనిని గ్రహించినా అది ఆహారమే. తినేది మాత్రమే అన్నం కాదు. తినేది, కనేది, వినేది, తాకేది, తలంచేది కూడా అన్నమే. అంటే పంచజ్ఞానేంద్రియాల ద్వారా మనసుగ్రహించే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలన్నీ ఆహారమే. యోగి అనేవాడు పరిపూర్ణ ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి ఉంటాడు. ఆత్మ పరమాత్మలో లీనమైనప్పుడు అన్నపానీయాల ఆసక్తిని అధిగమిస్తాడు. ఇలాంటి ఆధ్యాత్మిక మహా సాధకుడే "బాలయోగి" అని భీమన్న వర్ణించాడు.

"అన్నమే పరమాత్మ, దేహమ్ము నిలువ
దన్నమున గాని అనుట వాస్తవమే, కాని
ఆత్మ సూటిగ పరమాత్మ ననుభవింప
అన్న మాధ్యస్థ్య మేల మీ యట్టిదులకు?" (బాలయోగీహం – పు.సం.9)

అని చెప్పి, సామాన్యులు ఆహారం లేకుండా జీవించలేరు గాని, యోగులు జీవించగలరని అంటారు భీమన్న.

2.2. అష్ట సిద్ధులకు అతీతుడు బాలయోగి :

సాధారణంగా యోగులకు అష్టసిద్ధులు లభిస్తాయని లోకంలో ప్రతీతి. అష్టసిద్ధులు ఎనిమిది. అణిమ, గరిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, వశిత్వము, ఈశత్వమనే ఎనిమిది సిద్ధులను యోగులు ప్రదర్శిస్తారు. ఐతే, అష్ట సిద్ధుల ప్రదర్శన లోకంలో ప్రాచుర్యాన్ని పొందటానికి ఉపయోగపడతాయి కాని, సమాధి సిద్ధిని పొందటానికి ఆటంకాలుగా మారతాయి. అందుచేత బాలయోగి సిద్ధులన్నిటిని పరిత్యజించి బ్రహ్మర్షిత్వం వైపు ప్రయాణించిన మహాయోగి అని భీమన్న అభిమతం.

"సిద్ధులెల్ల పరిత్యజించిననె కాని
స్వచ్ఛమైన బ్రహ్మర్షి కాజాల రెవరు" (బాలయోగీయం – పు.సం.23)

అని బాలయోగి యొక్క బ్రహ్మర్షిత్వాన్ని స్థిరపరిచారు.

3. బాలయోగీయం – సామాజిక దృక్పథం :

బోయి భీమన్న 'బాలయోగీయం' కావ్యంలో బాలయోగిని తీర్చిదిద్దటంలో ఆధ్యాత్మిక దృక్పథమేకాక సామాజిక కోణం కూడ దాగి ఉంది. ఈ కావ్యంలో 'బాలయోగి' కల్పిత పాత్రకాదు. తన సమకాలంలో జీవించిన ఒక మహాయోగి చరిత్ర.

బాలయోగి ఒక సాధారణ హరిజన కుటుంబంలో జన్మించాడు. ఐనప్పటికి ఒక మహాయోగిగా ఎదిగాడు. గుణం ముఖ్యంగాని, కులం ముఖ్యంకాదని రుజువుచేశాడు. కొందరు స్వార్థపరులు కులం దృష్టిలో బాలయోగిని చూసినా, భక్తిభావం కలిగిన ప్రజలు మాత్రం ఆయనకు యోగిగానే చూశారంటారు. భీమన్న

"నీ కుల మేదో కనీసము తెలిసికో
దలచిరా భక్తి నిన్ గొలుచువారు?" (బాలయోగీయం– పు.సం.43)

అని ప్రశ్నించారు. నిజమైన భక్తులకు కులాలతో పనిలేదని, స్వార్థశక్తులే భేదాభిప్రాయాలను సృష్టిస్తాయని భావించారు రచయిత.

వేదకాలంలో భారతదేశంలో ఇప్పుడున్న కులవ్యవస్థ లేదని, అందరు నరులు సమానంగా జీవించారని భీమన్న అభిప్రాయం. కులానికి, జన్మకూ బ్రాహ్మణత్వంతో సంబంధంలేదని "The word Brahmana does not imply a caste in the Vedas" (The call of the Vedas by Abinash Chandra Bose) పండితులు తెలిపారు.

3.1. బాలయోగి జన్మరహస్యం :

"కృణ్వంతో విశ్వమార్యం" అంటూ వేదం, సర్వప్రపంచాన్నీ ఆర్యీకరించమని చెప్పింది. వేదవ్యాసుడు వైదిక సమసమాజ మానవత్వాన్ని చాటిచెప్పాడు. అటువంటి వేదవ్యాసుడే కాశీ నగరం నుండి బహిష్కరింపబడ్డాడు.

ఆ విధంగా వేదవ్యాసుడి అవసానదశలో, కలియుగారంభంలో ఆయన పడిన అవస్థలకు, అవమానాలకూ, విరుగుడుగ బాలయోగి జన్మించాడని భీమన్న సిద్ధాంతం.

భీమన్న. భారతదేశం యొక్క నిజమైన వేద స్వరూపాన్ని నిలబెట్టటానికే బాలయోగి అవతరించాడంటారు.

"బాలయోగి పుట్టుక వెనుక ఎంతో నిగూఢమైన, లోక పునరుద్ధారకమైన వేదరహస్యం నిక్షిప్తమై ఉన్నదన్నమాట" (బాలయోగీయం– ముందుమాట: పు.సం. X) అని తన అభిప్రాయం చెప్పారు రచయిత.

బాలయోగి కావ్యరచనలో భీమన్న సమాజంలోని కుళ్ళును కడిగిపారేశారు. అన్నం మానుకున్న బాలయోగిని అనుమానించారు గాని, అన్నాన్ని దోచుకునేవారిని అడ్డుకోలేకపోయారని అన్నారు.

"అన్నము మానుకొన్న నిను
ఆరడి సేయునె కాని, లోకమం
దున్న సమస్త అన్నమును
దోచుక దాచుక తామె మెక్కు బొ
జ్జన్నల నేమి సేయు నెవడైనను? (బాలయోగీయం– పు.సం.42)

అని బాలయోగిని అనుమానించిన వారిని ప్రశ్నించారు.

4. ముగింపు :

బోయి భీమన్న 'బాలయోగీయం' రచనలలో వేదాంత (ఆధ్యాత్మిక) దృక్పథాన్ని, సామాజిక దృక్పథాన్ని అనుసరించాడు. ఆత్మను పరమాత్మతో అనుసంధానం చేసిన బాలయోగి వంటి మహానుభావులకు అన్నపానాలతో అవసరం లేదని, నిశ్చల సమాధి ద్వారా లోకాన్ని శాంతింపచేస్తాడని భీమన్న భావించారు.

అంతేకాక, ఈ రచనలో సామాజిక దృక్పథం కూడా ఉంది. వేదకాలంలో లేని కులం తాలూకు అసమానతలు ఆధునిక కాలంలో అవతరించాయని, ఈ సమాజం కళ్ళు తెరిపించడానికి 'బాలయోగి' హరిజన కుటుంబంలో జన్మించాడని, బాలయోగి వంటి మహానుభావులను చూసి లోకం తన గుణాన్ని సవరించుకోవాలని సూచించారు భీమన్న.

ఆధార గ్రంథములు :

1. కొత్తపల్లి హనుమంతరావు మహాయోగులు, ఋషి బుక్ హౌస్, విజయవాడ– 2001
2. గౌరీ విజయ ప్రకాష్ – పతంజలి యోగ సూత్రములు –జె.పి.పబ్లికేషన్స్, విజయవాడ– 2001.
3. బిరుదురాజు రామరాజు ఆంధ్రయోగులు – నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్– 2004.

4. బోయి భీమన్న – బాలయోగీయం సాహితీనిధి ప్రచురణ, హైదరాబాద్ – 1986.
5. హైమవతీ– పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న సన్మాన సంఘ ప్రచురణ, హైదరాబాద్ –1978
6. M. hariharan - Hinduism and its Retionalism - Bharatiya Vidya Bhavan, Bombay-1987.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న రచనలు- జాతీయ సమైక్యత

– పులి జమున
తెలుగు పరిశోధక విద్యార్థి
8500169682.

భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనం. వివిధ భాషలు, కులాలు, మతాలు ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వం కలిగి మనమంతా భారతీయులం అనే భావనే దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుంది. దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, సమగ్రతను కాపాడాలనే దృక్పథమే జాతీయ సమైక్యత. దేశ సర్వతో ముఖాభివృద్ధి జాతీయ సమైక్యతతోనే సాధ్యమవుతుంది. భారతీయులందరూ ఒకే జాతిగా ఒకే భావంతో ఐకమత్యం ,సోదర భావంతో, పరస్పరం గౌరవాభిమానాలతో,జాతీయ లక్ష్యాల కోసం పాటుపడాలి. అప్పుడే దేశం స్థిరత్వంతో శాంతి సౌభాగ్యాలతో పరిఢవిల్లుతుంది. కులవాదం, మతతత్వం, భాషా వాదం, ప్రాంతీయ వాదం, సామాజిక, ఆర్థిక వాదాలు, వర్గ పోరాటాలు పెచ్చు పెరగడం దేశ అభ్యున్నతికి గొడ్డలి పెట్టు. ప్రజలలో ఐక్యత నశించి సమాజం విచ్ఛిన్నమవుతుంది. దేశాభివృద్ధికి దేశ ప్రేమ,శాంతి, సమైక్యతా భావం,భద్రత అత్యంత ఆవశ్యకాలు. ఆ సేతు సీత నగ పర్యంతం నా మాతృభూమి అనే విశ్వాసం ప్రతి భారతీయుని అంతరాంతరాలలో ప్రబలంగా నిలిచినప్పుడు జాతీయ సమైక్యత సార్ధకం అవుతుంది. ప్రతి మనిషి స్వార్థాన్ని విడనాడి జాతీయ భావాలను పెంపొందించుకుంటే విశ్వమంతా వసుధైక కుటుంబంగా విలసిల్లుతుంది.

భారతదేశంలో విదేశీ పాలన,కుల,మత,వర్ణ,వర్గ విభేదాలు, సామాజిక అసమానతలు దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తున్న సందర్భంలో సామాజిక సంరక్షణయే తమ ధ్యేయంగా భావించి సాహిత్య సృజన గావించి స్వధర్మీయ,విధర్మీయ శక్తులను తరిమి కొట్టడానికి జాతీయ భావాలను పెంపొందించే రచనలను సమాజానికి అందించి జాతీయ భావ కవితా వెలుగు బాటకు మార్గదర్శనం

చేసిన కవులెందరో ఉన్నారు. ఆ కోవలోకి చెందిన వారే పద్మశ్రీ డాక్టర్ బోయి భీమన్న. కవులందరు జాతీయ సమైక్యత భావనను వివిధ దృక్కోణాలలో రచించారు.సమాజ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సమాజాన్ని పట్టి పీడిస్తున్న వివిధ రకాలైన విభేదాలను, సామాజిక న్యాయం ద్వారా జాతీయ సమైక్యతను సాధించాలనే దృక్పథాన్ని బోయి భీమన్న తన రచనలలో ప్రస్తావించారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి సాహిత్యాన్ని బలమైన సాధనంగా వాడుకుని సమాజ సంతులనానికి ఎంతగానో కృషి చేశారు. సంస్కారవంతమైన సమాజ స్థాపనయే తన ధ్యేయంగా సామాజికుల విపరీత పోకడలను ఎండగట్టి సరియైన ఆలోచనా ధోరణిని సామాజికులకు అందించి చరిత్రలో చెరగని ముద్ర వేశారు బోయి భీమన్న. వారి అడుగుజాడలు సమాజాభ్యుదయానికి రాచబాటలై లక్షలాదిమందికి కనువిప్పు కలిగించే ప్రేరణాస్రాలుగా పనిచేశాయి.

ఆధునిక యుగ సాహితీవేత్తలలో ప్రతిభావంతుడు, ప్రగతిశీల సాహిత్య నిర్మాణ దక్షుడైన బోయి భీమన్న సర్వ మానవ సమతా పతాకమును ఎగరవేసిన జాతీయవాది. అగ్రవర్ణాలు సాగిస్తున్న ఉగ్ర దురాచారాలను ఖండించి ఎలుగెత్తి చాటిన సామాజిక చైతన్య రథసారథి.సమకాలీన సమాజాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేసి అంతకుముందున్న పాక్షిక ధోరణులను పరాస్తం చేసి సమతా దర్శనంతో సమాజాన్ని ముందుకు నడిపించడానికి తన సాహిత్యాన్ని అస్త్రంగా ప్రయోగించిన ధీశాలి బోయి భీమన్న. అగ్రవర్ణాల దురహంకారాన్ని నిలదీసి నిగ్గదీసి ఆధునిక సాహిత్య మార్గదర్శకుడిగా నిలిచి వినూత్నమైన ఆలోచనలను ఆవిష్కరించిన నవయుగ వైతాళికుడు. దళితుల పట్ల ఈ సమాజం కొనసాగించే పక్షపాత సంకుచిత వైఖరిని తెరపైకి తెచ్చి సమతా దృష్టితో స్పందిస్తూ అమానవీయ సంఘటనలను ఎత్తిచూపి సున్నితంగా హితబోధ చేసిన బోయి భీమన్న ఆధునిక తరానికి యుగకర్త అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

అంటరాని వాడని వెలివేసినా అచంచల పట్టుదలతో, దృఢదీక్షతో అంచెలంచెలుగా ఎదిగి భారత రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ అంబేద్కర్ ను బోయి భీమన్న ఆదర్శంగా తీసుకున్నారు. జాతీయ సమైక్యతా చైతన్యాన్ని అంబేద్కర్ ద్వారా పుణికి పుచ్చుకున్నారు. జాతీయతా భావాన్ని సమాజంలో పెంపొందించడానికి తన సాహిత్యాన్ని వాహికగా చేసుకుని విభిన్న ప్రక్రియలో తన రచనలను కొనసాగించారు. జాతి అస్తిత్వాన్ని,ఆత్మ గౌరవాన్ని, సాంస్కృతిక వైభవాలను చాటిచెబుతూ తన కలాన్ని ఆయుధంగా మలచుకుని జాతికి కర్తవ్యాన్ని ప్రబోధించే అంశాలను ప్రస్ఫుటంగా తన గేయాలను,పద్యాలను సంధించిన వీర సైనికులు బోయి భీమన్న. దేశ సమైక్యతకు అవరోధంగా నిలిచిన అస్పృశ్యత మహమ్మారిని, మతమౌఢ్యాన్ని, కులాధిపత్యాన్ని నిరసించారు. సమూలంగా వీటిని నశింపచేయాలనే సంకల్పంతో సందేశాన్ని అందించే ప్రబోధ గీతాలను పద్యాలను రచించారు.

"అంబేద్కరా,నీవు అవతరించిన నూరు
వత్సరాలకు వచ్చె నవకాంతి
ఏమిటా కాంతి? ఏ మానవోదయం
అందర కొకే న్యాయమన్న జ్ఞానోదయం
న్యాయమననేమి?మానవులందరును సమా

నముగ బ్రతికే జన్మహక్కు
జన్మహక్కననేమి?శాంతి సౌఖ్యములంద
రకు పంచి ఇడు వేద ఋక్కు
దేశమునకొక జాతి,జాతికొకటే నీతి
నీతి అందరికొక్కటే
ఒకడికొక నీతి,మరియొకడికి మరొక నీతి
తగదన్న మేధావి మేటి"

అంబేద్కర్ జన్మించిన నూరు సంవత్సరాలకు భారతదేశానికి సరికొత్త వెలుగు వచ్చినది.ఈ వెలుగు జాతిని చీల్చి చీకటిని తొలగిస్తుంది.జాతీయ సమైక్యతకు అవరోధాలైన అసమానతల విబేధాలను తొలగించి అందరికీ సమ న్యాయమనెడు ఆలోచనను ప్రసాదించిన వెలుగది.మానవోదయమే జాతీయ సమైక్యతకు పునాది.

దేశానికి ఒకే జాతి వుండాలి, ఆ జాతికి ఒకటే నీతి వుండాలి. ఒకరికి ఒక నీతి,మరొకరికి మరొక నీతి వుండకూడదు. విభిన్నమైన బేధాలనధిగమించి దేశానికి ఒక నీతి వుండాలని అప్పుడే జాతీయ సమైక్యత బలోపేతమవుతుందన్నారు బోయి భీమన్న. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కులాల మధ్య నిలిచిన అడ్డుగోడలను తొలగించనిదే జాతీయ సమైక్యత సాధ్యం కాదని జాతి పట్ల తన బాధ్యతను తెలిపిన కర్తవ్యశీలి బోయి భీమన్న.

"మనుజ జాతికి మూలము మతము కాదు
మతములను మార్చుకొనుచుండు మనిషి తరచు
జాతికి మూలము సంస్కృతి, సమత కాన
జాతికొక దేశముండుట సబబుగాదె"

మతోన్మాదం మారణ హోమాలను సృష్టిస్తుందే గానీ, ఆపదలో ఉన్న మానవుని కాపాడలేదని సంస్కరణ దృష్టితో, ప్రగతి వాద దృక్పథంతో ఆలోచించినప్పుడే అసలైన మానవత్వం వికసిస్తుందన్నారు బోయి భీమన్న .జాతీయ సమైక్యతను సాధించాలంటే మత వైషమ్యాలను తొలగించుకోవాలన్నారు, మనుజ జాతికి మూలం మతం కాదని, మానవత్వమే గొప్పదన్నారు.మనిషి మతానికి కాకుండా మానవత్వానికి ప్రాముఖ్యత నివ్వాలని సమాజాన్ని సంస్కరించాలనే ధ్యేయంతో జాతీయ భావ స్ఫోరకంగా రచించారు.

"విశ్వాసం మతం
విజ్ఞానం ఋతం
విశ్వాసం ఊహాభయ జనితం
విజ్ఞానం వాస్తవాభ్యుదయం
మతాచారములకు
మంత్రాంగం స్వార్థం

స్వార్థాలకు మూలం అవిశ్వాసం
సైతానుకు దాసోహం
దైవం పై విశ్వాసం గలవాడు
ధనములనెందుకు దోచుకొంటాడు
ఏకేశ్వర తత్వము నమ్మినవాడు
ఇతరులనెందుకు ద్వేషిస్తాడు
హిందూమతమే కాదు
ఏ మతమైనా ఒకటే
మేకల మందల నేలే
మృగరాజుల దర్బారిది"

మతం అనేది విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది.విజ్ఞానం ద్వారానే సరైన సత్యం బోధపడుతుంది విజ్ఞానమే అభ్యుదయానికి దోహదం చేస్తుంది. హిందూమతమే కాదు ఏ మతమైనా ఒకటేనని అది మేకలను ఏలే మృగరాజుల మంద అని తెలియజేశారు భీమన్న. స్వార్థ ప్రయోజనాలను ఆశించి ఏర్పడినవే మతాచారాలని తెలియజేశారు. విశ్వాసం అనేది లేకపోవడమే స్వార్థానికి కారణం. స్వార్థపరులు దుష్టశక్తులకు దాసోహమై ప్రవర్తిస్తారు. ఏకేశ్వర తత్వాన్ని నమ్మినవారు ఇతరులను ద్వేషించరని సర్వ మానవ సమానత్వాన్ని బోధించారు.

"ఏది హిందూ ఏది ముస్లిం
ఏది క్రైస్తవము?
ఎల్లమతముల సారమొకటే
హృదయ మీ మతము
కృష్ణుడో, క్రైస్తో, మహమ్మదో
గీతయో, బైబిలో, ఖురానో
ప్రేమనే బోధించలేదా!
ద్వేషమును నిరసించె కాదా
తూర్పు పడమర భేదమేలా
తోటకెల్లా వసంతుడొకడే
కరములె వారెటు మోడ్చి పిలిచిన
ఖంగుమను గుడి గంట ఒకటే"

మన దేశంలో హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ, బౌద్ధ, జైన, పారసీక మొదలగు మతాలు ఎన్నో ఉన్నాయి. భగవద్గీత, బైబిల్, ఖురాన్ మొదలగు పవిత్రమైన గ్రంథాలు ఉన్నాయి. కులమేదైనా, మతమేదైనా, ఏ దైవాన్ని ఆరాధించినా ద్వేషమును విడనాడి ప్రేమను బోధిస్తున్నాయని తెలియజేశారు ఎన్ని వైవిధ్యాలు ఉన్నప్పటికీ మనమంతా భారతీయులం అనే సమైక్యతా భావ సందేశాన్ని అందించారు బోయి భీమన్న.

"దీపానికి వివక్షలేదు
వాడే మానవుడికి తప్ప
వెలుగుకు వివక్షలేదు.
ఉపయోగించే మనిషికి తప్ప
మనిషి మేధే వెలుగైతే
వివక్ష దూరమై సమత వెల్లి విరుస్తుంది
ఆ కాంతి పుంజాల కాంక్ష దీపసభ"

దీపం వివక్ష లేకుండా అన్ని వైపులా వెలుగునిస్తుంది.కానీ దీపమును వాడుకుంటున్న మనిషి మనసులో మాత్రం వివక్ష వుంటుంది.మనిషి వివేకంతో మసలుకుంటే వివక్షతా రహిత సమాజంలో సమానత్వం వెలుగులీనుతుంది.ఆ సమానత్వపు వెలుగుల సమాహారమే దీపసభ యని అభివర్ణించారు బోయి భీమన్న. దీపసభలో సర్వోదయ సమాజ నిర్మాణాన్ని, సమతా దృక్పథాన్ని నొక్కి వక్కాణించారు బోయి భీమన్న.

"కూలివాడు రాజ్యమేలినప్పుడు గాని
సంఘ బాధలెల్ల చక్కబడవు
పరగనట్టి రాజ్య ప్రస్థాపనమునకై
బ్రతుకు ధారవోసి పాటుపడదు"

సామాజిక జీవనంలో కూలివాడు రాజ్యాధికారానికి దూరంగా వున్నంతకాలం అసమానతలు, అన్యాయాలు,పేదరికం, దోపిడీ మొదలైనవి తొలగవని బోయి భీమన్న స్పష్టంగా తెలియచేశారు. కూలివాడికి అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే నిజమైన ప్రజాస్వామ్యమన్నారు. కూలివాడు రాజ్యమేలినపుడు సంఘ బాధలన్నీ చక్కబడతాయని సామాజిక న్యాయం, సమానత్వం సాధ్యమవుతుందని సమతా వాదాన్ని ప్రతిపాదించారు కవి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో బోయి భీమన్న అగ్రగణ్యులు.గొప్ప సాహితీ విలువలు కలిగిన ప్రగతిశీల, సామాజిక చైతన్య కవిగా విశేష గుర్తింపు పొందారు.సమాజాన్ని ముందుకు నడిపించే లక్ష్యంతో మానవత్వాన్ని కేంద్రంగా చేసుకొని సాహిత్యం ద్వారా విశ్వ మానవతా వాదాన్ని చాటిన కవి. సమసమాజ నిర్మాణం కోసం అడుగడుగునా జాతీయ సమైక్యత నినాదాన్ని తన రచనలలో ప్రతిఫలింపచేసిన జాతీయ కవి.పాలేరు నుండి పద్మశ్రీగా ఎదిగిన మహోన్నత సాహితీమూర్తి బోయి భీమన్న.

ఆధార గ్రంథాలు :

1. గేయకావ్యాలు
2. తెలుగు సాహిత్యంలో జాతీయ వాదం
3. తెలుగు కవిత్వంలో శ్రమతత్వం
4. బోయి భీమన్న సాహిత్యం–జాతీయ దృక్పథం

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న సాహిత్యం - మానవతావాదం

- డా. చీర్ల శ్రీనివాసులు
తెలుగు ఉపాధ్యాయులు
సెల్ : 7893939887

1. ఉపోద్ఘాతం:

బోయి భీమన్న తెలుగు సాహితి చరిత్రలో విశిష్ట స్థానం సాధించుకున్న గొప్ప కవి, రచయిత, సాహితీవేత్త. తెలుగు సాహిత్యంలో బోయి భీమన్న గారు ఒక ప్రత్యేకమైన ఒరవడి సృష్టించారు. దళితుల సంక్షేమం కోసం వారు ఎన్నో వైవిధ్యభరితమైన రచనలు చేశారు. ఆ రచనలన్నీ అద్వితీయం, అజరామం. బోయి భీమన్న గారు కేవలం దళిత సాహితీ వేత్త మాత్రమే కాదు. వారి రచనలలో ఒక అంశం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అదే "భారతజాతి ఏకత్వ సమాజం"దీనిలో కేవలం చెడ్డవాళ్లే కాదు మంచి వాళ్ళు కూడా ఉంటారు అనేది ఆయన తత్వం. సమకాలీన సమాజంలో హరిజనులుగా పిలవబడే వారికి సమాజంలో ఒక గౌరవ ప్రదమైన స్థానం కల్పించడమే ఆయన సాహిత్యం యొక్క ముఖ్య ధ్యేయం. పాలేరు, కూలి రాజు వంటి నాటకాల్లోనూ... జన్మంతర వైరం, అంబేద్కర్ సుప్రభాతం, అంబేద్కరిజం, పంచమ స్వరం మొదలైన కావ్యాలలోనూ భీమన్న గారి తత్వం మనకు కనిపిస్తుంది.

2. బోయి భీమన్న బాల్యం - విద్యాభ్యాసాలు:-

"బానిసతనమును బాపుమురా....
భారత భూమికి భాగ్యము తేరా .....
సకల దేశముల సర్వ మానవుల ....
సౌమ్యము సాధింపుమురా ....

అంటూ తన రచనలలో అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం పరితపించిన సాహితీవేత్తభీమన్న. పేదరికం, అంటరానితనం, అవమానాల స్వానుభవాలతో అక్షరాలే ఆయుధంగా అనుక్షణం ఉద్యమించిన ఉద్యమ నేత బోయి భీమన్న.

వీరు 1911 సెప్టెంబర్ 19వ తేదీన తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో ఓ హరిజన కుటుంబంలో జన్మించాడు. తండ్రి పుల్లయ్య తల్లి నాగమ్మ. ఈ ఆదర్శ దంపతులకు పంచపాండవులవలె ఐదుగురు కుమారులు మరియు ఒక ఆడపిల్ల జన్మించారు. దంపతులు తమ మగ పిల్లలకు వరుసగా ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టారు.

బోయి భీమన్న గారు 1935లో బిఏ పరీక్షలు ఉత్తీర్ణులై ,1937లో బీఈడీ పూర్తి చేసి, ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డారు. బోయి భీమన్న జీవిత భాగస్వామి నాగరత్నమ్మ. వీరికి ఏకైక కుమార్తె విజయభారతి.క్రమముగా తెలుగు భాష మరియు తెలుగు సాహిత్యం పై ఆయనకు అభిమానం ఎక్కువ కాబట్టి జనవాణి, జయభేరి, ప్రజామిత్ర, ఆంధ్రప్రభ మొదలగు తెలుగు దినపత్రికల్లో సంపాదకుడిగా పనిచేశాడు. ఈ అనుభవమే వారిని గొప్ప రచయితగా నిలబెట్టింది.....

వ్యక్తి వికాసమే జాతి .....
జాతుల వికాసమే వసుధ....
వసుదైన సామ్రాజ్యమే మానవలోక పరిపూర్ణ ఫలం...

అని చాటి చెప్పిన గొప్ప మానవతావాది బోయి భీమన్న.

3. బోయి భీమన్న రచనలు:-

బోయి భీమన్న రచనలలో గొప్ప వైవిధ్యం, విశిష్టత స్పష్టంగా కనిపిస్తాయి. సమాజంలో జరిగే సంఘటనలే కవితా వస్తువులుగా స్వీకరించి అద్భుతమైన రచనలు చేశారు. దళితుల సంక్షేమం కోసం వారు వైవిధ్యమైన రచనలు చేశారు. భీమన్న గారు సుమారుగా 70 పుస్తకాలు రాశారు.పద్య, గేయ, వచన రచనలతో పాటు నాటకాలు రాశారు. ఆకాశవాణిలో ప్రసారమయ్యే ఎన్నో భావ గీతాలు రాశారు. అంతే కాకుండా అంబేద్కర్ రచనలను తెలుగులో అనువాదం చేసి అంబేద్కర్ భావజాలాన్ని తెలుగు సమాజంలో విస్తరింప చేశాడు. అంబేద్కర్ పై వీరు రాసిన "జయ జయ జయ అంబేద్కరా..." గేయం దళితులకు జాతీయ గేయమై నేటికీ ఊరూరా ప్రార్థన గీతంగా మార్మోగుతుందని డాక్టర్ దార్ల వెంకటేశ్వర రావు వ్యాఖ్యానించారు . దీనిని బట్టి భీమన్న గారి సాహిత్య గొప్పతనం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అలాగే "గుడిసెలు కాలిపోతున్నై" గ్రంధానికి వారు కేంద్ర సాహితీ అకాడమీ అవార్డు అందుకొని తెలుగు సాహిత్య కీర్తిని మరోసారి చాటారు. ఇది వారి సాహితీ సృజన విశిష్టతకు, సాహితీ ప్రతిభకు ఒక తార్కాణం.

4. బోయి భీమన్న సాహిత్యం – మానవతావాదం:-

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలై.. మానవత్వం మృగ్యమైపోతున్న ఈ రోజుల్లో మానవత్వం సమాజంలో ఏదో ఒక మూలన ఇంకా సజీవంగా ఉందని సమాజానికి చాటి చెప్పిన గొప్ప మానవతావాది బోయి భీమన్నగారు. మానవత్వం,ఎదుటి వ్యక్తిని గౌరవించడం,సమసమాజ స్థాపన వీరి రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి.

భీమన్న రచించిన 'పాలేరు' (1938)నాటకంలో కథానాయకుడు వెంకన్న ఓ కామాంధుడు దగ్గర పని చేస్తూ నానా బాధలు అనుభవిస్తూ చివరికి కష్టపడి చదువుకొని ఉన్నత స్థానానికి

చేరుకున్నాడు. బాధ్యత కలిగిన ప్రభుత్వ ఉద్యోగి పెట్టుబడిదారుల ఆగడాలను అరికట్టి దళితుల హక్కుల కోసం పోరాడిన గొప్ప మానవతావాది వెంకన్న. ఈ నాటకం ద్వారా డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను నాటక రూపంలో ప్రపంచానికి తెలియజేశారు బోయి భీమన్నగారు. "గుడిసెలు కాలిపోతున్నై" (1973) గ్రంథం ఏడాదికోసారి దళితుల గుడిసెలు ఎందుకు కాలిపోతున్నాయో.. మరలా వాటి స్థానంలో కొత్త గుడిసెలు ఎలా వస్తున్నాయో... ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను నిలదీసే చైతన్యం దళితులలో రావాలని ఈ గ్రంథం ద్వారా వ్యక్తపరిచారు. అంతేకాకుండా చీమలను శ్రామిక దళితులకు, పాములను కుల దోపిడీదారులకు ప్రతీకలుగా చేసి దీనిలో వర్ణించారు."కూలీ రాజు "(1946).. నాటకంలో కులంతో పాటు ఆర్థిక అంశాలను కూడా వివరించారు. ధర్మం కోసం పోరాటంలో బహు జనులంతా రాజ్యాధికార దిశగా పయనించాలని ఈ రచన ద్వారా వారి అభిమతాన్ని వెలిబుచ్చారు.

బోయి భీమన్న గారు సనాతన సంప్రదాయ వాది, ఈ భావాలను "ప్రాచీనుడు" అనే పాత్ర ద్వారా వర్ణించారు. నిష్కలంకమైన ప్రేమకు సాంప్రదాయం ఎలా అడ్డంకిగా మారుతుందో వివరిస్తూనే, ఆ ప్రేమతో నిజాయితీ ఉంటే అన్నింటిని జయిస్తుందని నిరూపించారు.

"రాగవాసిష్టం"యందు ఆర్య అనార్య భేదభావాలను స్థల, కాలాన్ని బట్టి ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఈ నాటకాన్ని రాయటానికి భీమన్న వేదాలను మరియు మనుస్మృతి, అమర కోశం, రామాయణం, మహాభారతాలను అధ్యయనం చేశారు.

బోయి భీమన్న గారు సమాజ సామరస్యతా మార్గమే శరణ్యం అని నమ్మాడు. సంస్కరణలు జాతీయ వాద దృష్టిని కళ్లకు కట్టినట్లు తెలిపిన అద్భుతమైన మానవతా వాది డాక్టర్ బోయి భీమన్న. సమాజంలో ప్రజల మధ్య ఘర్షణకు కారణమైన కుల, మత వర్గ భేదాలను అధిగమించాలంటే అందరూ విద్యావంతులై సమాజాన్ని ముందుకు నడిపించాలన్నది భీమన్న గారి ఆకాంక్ష. సామాజిక సామరస్యతా, సాహితి సమర్చన రెండు కళ్ళుగా భావించారు బోయి భీమన్న గారు. కులం లేని జాతి కోసం కలలు కన్నాడు కవి భావాలు సత్య గుణ ప్రధానం అయితే స్వచ్ఛ సమాజ స్థాపన జరుగుతుందని వారు విశ్వసించారు.

5. పురస్కారాలు:

తెలుగు సాహిత్యానికి బోయి భీమన్న చేసిన విశిష్ట కృషికి ఫలితంగా ఆయనను ఎన్నో అవార్డులు, పురస్కారాలు వరించాయి.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు, పద్మభూషణ్ అందుకున్నారు. 1953లో గుంటూరు జిల్లా చెరుకుపల్లి ప్రజలు బోయి భీమన్నకు గండపెండారం తొడిగి సన్మానించారు. బోయి భీమన్న గారు లెక్కకు మిక్కిలిగా గౌరవ సన్మానాలు అందుకున్నారు. భీమన్న గారు పేదరికంతోపాటు అంటరానితనం వంటి దురాచారాల సామాజిక రుగ్మతల పీడనను స్వయంగా చిన్నప్పటి నుంచి ఎదుర్కొన్న అనుభవం భీమన్న గారిది. ఈ అనుభవాన్ని ఆత్మ న్యూనతా భావనగా కాకుండా ఒక సవాలుగా స్వీకరించి అద్భుతమైన రచనలు చేశారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు డాక్టర్ బోయి భీమన్న పేరుతో సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేశారు. వీరి రచనలన్నిటిని పుస్తకాలుగా ప్రచురిస్తున్నారు. ఇవన్నీ విశ్లేషిస్తే భీమన్న గారి సమగ్ర సాహిత్య దృక్పథం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పటివరకు అనేకమంది భీమన్న గారి రచనలపై పరిశోధనలు చేశారు. వీరి జీవితం మరియు సాహిత్యం పై రాష్ట్రవ్యాప్తంగా పలు జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. ఈ పరంపరలో వీటన్నిటికీ ఒక మార్గదర్శకాన్ని కలిగించినది, ఎందరో సాహితీ పరిశోధన కారులకు దిక్సూచిగా నిలిచినది "పాలేరు నుండి పద్మ శ్రీ వరకు బోయి భీమన్న"గ్రంథం. హైమవతీ గారు చక్కని పదాత్మక శైలిలో ఎంతో అద్భుతంగా రాశారు. ఇది వీరి సాహిత్య దృక్పథాన్ని తెలియజేసే చుక్కాని లాంటిది.

తెలుగు సాహిత్యాన్ని ఒక మార్గంలో నడిపించిన బోయి భీమన్న గారు 2005 డిసెంబర్ 16వ తేదీన తన 94 ఏట హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు.

6. ఆధార గ్రంథాలు:

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం–సంపుటి 4. సంపాదకుడు ఆచార్య కె.యాదగిరి
2. సాహితి భీముడు.. డిసెంబర్ 16 (2016)
3. బోయి భీమన్న కవిత లక్ష్యం–పీడిత ప్రజల అభ్యున్నతి...భానోత్ అనిల్ కుమార్
4. బోయి భీమన్న .. డాక్టర్ బెల్లంకొండ నాగేశ్వరావు.
5. బోయి భీమన్న జీవితం సాహిత్యం – వికిపీడియా.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

గుడిసెలు కాలిపోతున్నై– సామాజిక చిత్రణ

– ఆరె రాజు,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
9441726831

బోయి భీమన్న రాసిన గుడిసెలు కాలిపోతున్నై కవిత సంపుటిలో ప్రతి కవిత నేటి సామాజిక ధోరణిని నిక్కచ్చిగా చూపిస్తూ, సూటిగా ఘాటుగా ప్రశ్నించడం కనిపిస్తుంది. ప్రతి సమాజంలో వ్యక్తులు తమతో తాము కలసిపోవడానికి ఇష్టపడతారు కాని తమ కంటే తక్కువ వారిని అంటే డబ్బు విషయంలో కావచ్చు కులం విషయంలో కావచ్చు కలుపుకోవడానికి మాత్రం ముందుకు రారనడం అతిశయోక్తి కాదు. ఈ కోణంలో చూసినట్లయితే అణగారిన కులాలను అగ్రవర్ణాలు, పేదవారిని ధనవంతులు కలుపుకొని ముందుకు సాగడానికి ఇష్టపడరని చెప్పవచ్చు. దాదాపు శతాబ్దాలుగా సాగుతున్న ఈ పోరు నేటికీ ఆగడం లేదనడం అతిశయోక్తి కాదు.

జాషువా, అంబేద్కర్, పూలే ఇలా ఎందరో సమాజంలో ఉన్నత స్థితి పొందడానికి ముందుగా ఎన్నో అవమానాలు పొందారు చరిత్రలో. ఇలాంటి కోవలో రచయితలు కూడా ఉండడం విశేషం. దళిత కవిగా పేరుపొందిన బోయి భీమన్న, ఎండ్లూరి, బోయ జంగయ్య ఇలా చాలామంది కవులు సామాజిక వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపించారు .అదేవిధంగా బోయి భీమన్న సాహిత్యం లోకంలో ప్రత్యేకతను చాటుకున్నప్పటికీ ,కవిత్వంలో ఎక్కువగా తాను పొందిన వేదనను, అవమానాలు,సామాజిక అసమానతలు మొదలైనవి చూపించాడు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందిన గుడిసెలు కాలిపోతున్నై సంపుటిలో రాజకీయ ,ఆర్థిక, సామాజిక వ్యవస్థ తీరును చూపించడం జరిగింది.

పేదవారంటే దళితులే అంటూ చెప్పిన భీమన్న సమాజంలోని దళిత ప్రజల దుస్థితిని ఈ సంపుటిలో చూపించారు. పేదవారు ఇంకా పేదవారు కావడానికి డబ్బున్న వాళ్ళు ఇంకా డబ్బున్న వారు కావడానికి సామాజిక వ్యవస్థలోని లోపాలే కారణమంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు కూడా.

భీమన్న రచించిన ఈ సంపుటిలోని కవితలు ప్రస్తుత సమాజంలోని వ్యక్తుల తీరుని కూడ చూపినట్టుగా ఉంటుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా పేదరికం, దళితరికం పోలేదు. ఎలాంటి దేశం కావాలనుకున్నామో అది ఇప్పటివరకు నిర్మితం కాలేదు. మన దేశం ఇంకా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఈ తీరు మారాలంటే ప్రజా చైతన్యంతో పాటు అధికార దుర్వినియోగం తీరులో మార్పు రావాలంటాడు కవి. అందుకే పేద ప్రజలంటే గుడిసెలో ఉండేవారు అని చెబుతూ గుడిసెలు కాలిపోవడాన్ని దుయ్యబడుతూ

గుడిసెలు కాలిపోతున్నై
ఓహో కాలిపోతున్నై
ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయివుంటై
గుడిసెలు మరెవరికుంటై
చాలామందికే వుంటైలే
అసలు ఈ దేశ ధర్మమే అంత
అయితే ఈ గుడిసెలు
ఏదాదికి కొకసారైనా కాలిపోతుంటై **– గుడిసెలు కాలిపోతున్నై, 34**

అంటూ సాగిన కవితలో దేశ స్థితి కనులకు కట్టినట్టు కనిపిస్తుంది. సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే గడ్డివాములు, గడ్డితో వేసిన గుడిసెలు కాలిపోవడం అక్కడక్కడ జరుగుతూనే ఉంటుంది. ఈ సంఘటనను కవి సామాజిక వ్యవస్థను చూపడానికి కొత్త కోణంలో ఆవిష్కరించడం జరిగింది. ఇలా ప్రతి ఎండాకాలంలో కాలిపోయే గుడిసెల గురించి చెప్తూ గుడిసెలు మాల, మాదిగలకుంటాయని చెబుతూ తిరిగి మళ్ళీ చాలామందికే ఉంటాయంటాడు. అంటే దళితులకే కాదు పేదవారికి కూడా ఉంటాయని అంతరార్థాన్ని వ్యక్తం చేస్తాడు. దీనికి గల కారణాన్ని కూడా చెప్తూ భారతదేశ ధర్మమే ఇలా ఉంటుంది, సమాజలోపాన్ని వ్యవస్థ తీరును ఎత్తి చూపుతూనే ధర్మసంస్థాపన కోసం దేవుడు ప్రతిసారి పుట్టినట్టుగా ప్రతి సంవత్సరం కాలిపోవడం కోసమే గుడిసెలు పుడుతున్నాయంటాడు. ఇలా చెప్పడం దేశంలోని పరిస్థితిని వ్యంగ్యంగా చూపించడమే. అదే విధంగా

పోతుంటై
పుట్టుకొస్తుంటై
ఈ విషవలయం సాగడం ఎంతవరకు
రహస్యం గుడిసెల వాళ్లకు తెలిసే వరకు... **– గుడిసెలు కాలిపోతున్నై 34**

కాలిపోయిన గుడిసెల స్థానంలో మళ్లీ పేదవారు గుడిసెలు మాత్రమే వేసుకుంటారు కానీ కొత్త ఇల్లు నిర్మించుకోలేదు కారణం డబ్బు లేకపోవడం, డబ్బు సహాయం ఎవరు అందించకపోవడం, అప్పు తీసుకునే స్తోమత లేకుండా ఉండడం ఇలా అనేక కారణాలు పేదవాడిని మరింతగా పేదవాడిని చేస్తూ

ఉన్నాయి. అయితే ప్రతి సంవత్సరం కాలిపోవడం కోసమే అన్నట్టుగా కొత్త గుడిసెలు పుడుతూనే ఉంటాయంటాడు కవి. ఈ నిరంతర ప్రక్రియ ఒక విషయ వలయంగా చెప్తూ ఈ వలయం నుండి బయటికి రావాలంటే ప్రజల్లో చైతన్యం రావాల్సిందే అంటాడు. ఎప్పుడైతే ప్రజల్లో చైతన్యం వస్తుందో ప్రభుత్వం తీరును, వ్యవస్థ దౌర్జన్యాన్ని ఎదుర్కొన్నప్పుడు, ఈ గుడిసెలు బంగ్లా అయినప్పుడు గుడిసెల స్థానంలో పక్కా ఇల్లు వస్తాయి. అలా జరిగినప్పుడే పేదరికం కనిపించకుండా పోతుందంటూ సందేశాన్ని ఇస్తాడు.

బాల్యం మధుర జ్ఞాపకం, బాల్యం మరిచిపోలేనిది అంతేకాదు చిన్ననాటి అలవాట్లు పెద్దయ్యాక జీవితానికి పునాదులుగా మారుతాయి .అందుకే చిన్నప్పటినుండి పిల్లల్లో నైతిక విలువలు పెంచినట్లయితే భావి భారత పౌరులు అవుతారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ప్రేమానుబంధాలు, విలువలు, గౌరవం ఉండేవి. ఎప్పుడైతే వ్యష్టి కుటుంబాలు వచ్చాయో మనిషి డబ్బువైపు పరిగెడుతున్నాడు. అలా డబ్బువైపు పరిగెడుతున్న సమయంలో పిల్లల్ని కుటుంబాన్ని పట్టించుకునే తీరిక అతనికి ఉండడం లేదు. మరీ ముందుకు వెళ్ళినట్లయితే ఆధునిక ప్రపంచంలో భార్య భర్తలు ఇద్దరు ఉద్యోగాలు, డబ్బు అంటూ పరిగెత్తుతున్న క్రమంలో పిల్లలను పట్టించుకోవడం లేదు. అలా పట్టించుకునే వారు లేకపోవడంతో పిల్లలు ఏ మార్గము లేకుండా దుర్మార్గానికి అలవాటు పడుతున్నారు అంటాడు కవి. ఈ ఆవేదనను తన కవితలో చూపిస్తూ

మరి తల్లిదండ్రులు లేరా అంటే
ఉన్నా లేనట్టే
వాళ్ళ ఇరవై నాలుగు గంటలు
వృత్తి ఉద్యోగ సేవకే చాలు
ఇక ఏం చేస్తారు ఈ పసివాళ్ళు
ఎక్కడికి పోతున్నారు పాపం...
పుస్తకాలను ముద్దు మురిపాలన చించేసి
గతం తెలియక భవిష్యత్తు కనిపించక
వర్తమానం పొమ్మని పొగ పెడుతుండగా
పాపం ఏం చేస్తారు...
మంచి చెడ్డ తెలియని అమాయకులు
లక్షణమైన శిక్షణకు నోచుకోని అనిరుద్ధులు

– ఎక్కడికి పోతున్నారు, 39

ఇలా సాగిన కవితలో తల్లిదండ్రుల బాధ్యతా రహిత చర్యల వల్ల పిల్లలు పాడవుతున్నారని ఆవేదన చెందుతాడు. ప్రేమ సరిగా దొరకకపోయేసరికి పిల్లలు చెడిపోవడమే కాదు శూన్యం లోకి వెళ్ళిపోతున్నారు, విలువలు మర్చిపోతున్నారు. చక్కని శిక్షణ ఉంటేనే యోధులు అవుతారు అలాంటి శిక్షణ లేక దిక్కుతోచని స్థితిలోకి పోతున్నారని ఆవేదన తెలియజేశారు. ఈ కవిత నేటి సమాజంలోని తల్లిదండ్రుల తీరును పిల్లల వ్యవస్థను చూపిస్తుంది. అంతేకాదు ప్రశ్నించినట్టుగా కూడా అనిపిస్తుంది.

ఎప్పుడైతే తల్లిదండ్రులు తమ బాధ్యతలో భాగంగా పిల్లలు ప్రేమిస్తూ చూసుకుంటారో అప్పుడు భావి భారత పౌరులు తయారవుతారు, దేశం ఉన్నతికి తోడ్పడుతారు. అలా కాకుండా డబ్బు వెనుక పరిగెడుతూ పిల్లలను చూసుకోకపోయినట్లయితే దేశ పరిస్థితి మారిపోతుంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీష్ వాళ్ళు ఇక్కడివారిని బానిసలుగా చేశారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల్ని నిజాం బానిసత్వంలో మగ్గేలాగా చేశాడు. తర్వాత కాలంలో డబ్బున్న వాడు పేదవారిని బానిసరిగా చూశారు. దొరలు, దొరస్వామిలు, దేశ్‌ముఖ్‌లు... పాలేగార్లను బానిసలుగా చేశారు. కాలం మారుతున్న కొద్ది ఈ బానిస వ్యవస్థ రూపుమార్చుకుంది గాని పూర్తిగా నిర్వీర్యం కాలేదు. ఏదో రూపంలో బానిసత్వం సమాజంలో కనిపిస్తూనే ఉంటుంది. ఈ కాలంలో ప్రభుత్వం ప్రజల్ని బానిసలుగా మార్చేసింది, అది ఏ రకంగానైనా కావచ్చు.

ఉదాహరణకు చెప్పుకున్నట్లయితే ఒకప్పుడు ఓటు వేయడానికి ప్రజలు ఎక్కువ మొత్తంలో రాకపోయినప్పటికీ వేసే ప్రజలన్న నిక్కచ్చిగా వేసేవారు. ఈ రోజుల్లో మాత్రం ఓటు నోటుకు అమ్ముడుపోయింది. అలా అమ్ముడు పోయేలాగా చేసింది కూడారాజకీయ వ్యవస్థనే. ఇలా ఓటుకు నోటు వేయాలని ప్రజల్ని బానిసలను చేసుకోవాలని పట్టుబట్టిన రాజకీయ వ్యవస్థ నిజంగానే నెగ్గింది. ఈ క్రమంలో ప్రజలు ఓడిపోయారు. ఈ రాజకీయ వ్యవస్థ తీరు, బానిసల జాబితా కవితలో కనులకు కట్టినట్టు చూపించారు కవి.

ప్రభూ మా పేర్లను
ఓటర్ల జాబితా నుంచి తొలగించి
బానిసల జాబితాలో చేర్పించండి
చచ్చి మీ కడుపున పుడతాం ... – బానిసల జాబితా, 43

అనడంలో ప్రభుత్వ వ్యవస్థ వల్ల బానిసలుగా మారిపోయిన ప్రజల బాధ ఇందులో కనిపిస్తుంది. దేశంలో ఒక పౌరునిగా బ్రతకడానికంటే బానిసలుగా బ్రతకడమే నయమని బాధను తెలియజేస్తాడు. అంతేకాదు ఈ కవితలో బానిసల రూపుమారిందని వ్యంగ్యంగా చెప్పడం జరిగింది. ఒకప్పుడు రాజుల కాలంలో నిజమైన బానిసలు ఉండేవారు, ఇప్పుడు ఓటర్లు బానిసలుగా మారారంటూ వ్యంగ్యంగా చిత్రీకరిస్తాడు. ఎలక్షన్ వచ్చిందంటే ఈ జెండా, అజెండా అంటే రకరకాల జెండా గల నాయకులు వచ్చి ఓటు వేయమని ఇబ్బందులను పెడతారు. అదేవిధంగా

ఈ దేశంలో పేదలకు ఓటు ఉండడం
పక్కల పాముండటమే
ఈ ఓట్ల చలగాట్లతో మమ్మల్ని చంపకండి
దయచేసి జాబితా మార్చేయండి ... – బానిసల జాబితా, 44

కవితలో పేదవాడి కష్టాలను, బానిస బతుకుల నుండి విముక్తిని కోరడం కనిపిస్తుంది. ఓటు ఉండడం కూడా మహా పాపమై పోయింది. ఓటు వేయాలంటే అమ్ముడు పోవాల్సిందే, బలవంతంగానైనా అమ్ముడు పోయేలా చేస్తారు. సమాజంలోని దుర్మార్గం తీరుని చూపించాడు.

ముగింపు:

బోయి భీమన్న రాసిన గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటిలో ఒక్కొక్క కవిత దేశంలోని ప్రతీ వ్యవస్థను చూపించింది. సామాజిక ,ఆర్థిక దోపిడితో పాటు ప్రజాదోపిడిని, సేవ దోపిడిని చూపించింది. భారతదేశం ఇతర దేశాలతో పోల్చుకున్నప్పుడు పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుంది ,అంతేకాదు ఆధునికత విషయంలో కూడా ముందుకు దూసుకెళ్తుంది. అయినప్పటికీ ప్రజా పరిపాలన విషయంలో మాత్రం సరైన నిర్ణయాన్ని తీసుకోలేక పోతుంది. మన దేశం ప్రజాస్వామ్య దేశమే అయినప్పటికీ ప్రజాస్వామ్య చిత్రణ కనిపించడం లేకుండా పోయింది.కవులు సామాజిక లోపాలను చూపించారు, కాని భీమన్న ప్రత్యేకత ఏమిటంటే ప్రతీ వివక్షతను ప్రశ్నించడంతోపాటు, విమర్శించడం, సందేశాన్ని అందించడం. అందుకే ఈ కవితా సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందడమే కాకుండా సాహితీ లోకంలో ప్రత్యేకముద్రను వేసింది.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. గుడిసెలు కాలిపోతున్నై, బోయి భీమన్న, ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్, ద్వితీయ ముద్రణ 1977.
2. తెలుగు సాహితీ కిన్నెర,ఆచార్య ఎన్.గోపి,కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్,2016.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న 'పిల్లీ శతకం' – ఒక సామాజిక విమర్శనాత్మక అధ్యయనం

– పోలపల్లి అశోక్
తెలుగు విభాగం
చరవాణి: 9550834622

పరిచయం:

తెలుగు సాహిత్య ప్రక్రియలలో శతకానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. సాధారణంగా భక్తి, నీతి, లేదా వైరాగ్య ప్రధానంగా సాగే ఈ ప్రక్రియకు భీమన్న గారు 'పిల్లీ'ని కేంద్రంగా చేసుకొని రచించిన పిల్లీ శతకము ఒక అద్భుతమైన సామాజిక వ్యంగ్య రచనగా నిలిచింది. కవిగా, సామాజిక సంస్కర్తగా, బహుముఖ ప్రజ్ఞ కనబరిచిన భీమన్న, కేవలం పిల్లీ మీద పద్యాలు రాయకుండా, పిల్లీని ఒక సామాజిక దర్పణంగా వాడుకున్నారు. ఈ శతకం ద్వారా ఆయన మనిషి నైజాన్ని, సమాజంలోని ద్వంద్వ వైఖరులను, డొల్లతనాన్ని, అణచివేతను తీవ్రంగా ప్రశ్నించారు. ఈ రచన అన్యాపదేశం, వక్రోక్తి మరియు ధ్వని ప్రధానంగా సాగుతూ, సమకాలీన సమాజంపై చురకలు వేసింది.

విషయ విశ్లేషణ:

"పిల్లీ శతకం" అనేది పిల్లీ జీవితాన్ని వివరించే కవిత్వం కాదు, పిల్లీని ఒక సామాజిక ప్రతీక లేదా వ్యంగ్యాస్త్రంగా ఉపయోగించి మనిషిలోని మరియు సమాజంలోని లోపాలను ఎత్తిచూపడం దీని ముఖ్య ఉద్దేశం. మనిషి స్వార్థం, కపటం, ద్వంద్వ ప్రమాణాలు మరియు అంతర్గత మాలిన్యాన్ని దాచుకునే తీరుపై ఈ శతకం విమర్శనాత్మక దృష్టిని కేంద్రీకరిస్తుంది. డా. బోయి భీమన్న గారు 'పిల్లీ శతకం' ద్వారా ప్రధానంగా ఐదు ముఖ్య సామాజిక అంశాలపై తమ విమర్శనాస్త్రాన్ని సంధించారు.

1. అంటరానితనంపై ఆత్మఘోష

పిల్లీకి ఇంట్లో దక్కే స్వేచ్ఛ, గౌరవం కూడా తోటి మనిషికి (దళితుడికి) దక్కకపోవడాన్ని కవి అత్యంత తీక్షణంగా ప్రశ్నించారు. ధనవంతులు లేదా అగ్రవర్ణాల వారు తమ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి "బూర్జువా న్యాయం" (సొంత చట్టాలు) సృష్టించుకుంటారని, పేదవాడు (పిల్లీ) చిన్న తప్పు చేస్తే దాన్ని పెద్దది చేసి చూపిస్తారని సామాజిక అన్యాయాన్ని ఎండగట్టారు.

"మార్జాల కబళ మనుచున్
బూర్జువ న్యాయమ్ము నొకటి పుట్టించి, నినున్
వర్ణింత్రు! తోడి జీవుల
దర్జా కనలేరు నరులు త్రాష్టలు, పిల్లీ!"

ఈ పద్యాలలో భీమన్న గారు పిల్లీని అడ్డం పెట్టుకుని, సమాజంలో అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని, వారి పట్ల జరుగుతున్న చిన్నచూపును నిలదీశారు. అలాగే కుక్క యజమాని వేసే బిచ్చం కోసం చూస్తుంది కానీ పిల్లీకి ఆత్మగౌరవం (మానము) ఎక్కువ. దానధర్మాలు కుక్కకు సరిపోతాయి కానీ, పిల్లీలాంటి ఆత్మగౌరవం ఉన్నవారికి కాదని, గౌరవంగా బతకడమే ముఖ్యమని దళిత/బహుజన ఆత్మగౌరవ పతాకంగా ఈ పద్యాన్ని నిలిపారు.

"దానము, ధర్మము కుక్కకె
మానము గల నీకు కాదు; మర్యాదగ నీ
ప్రాణములు నిల్పుకొందువు!
మానముగల వారి కెల్ల మాన్యవు! పిల్లీ!"

నీ ఇంట్లో తిరిగే పిల్లీ... దానికి 'మైల' అంటదు. కానీ, నీ కోసం చెమటోడ్చి పనిచేసే మనిషిని (దళితుడిని) మాత్రం పక్కలో కూడా నిలబడనివ్వవు. అంటూ కవి సమాజంలోని ద్వంద్వ వైఖరిని ఎండగట్టి, తరాల తరబడి అణచివేతకు గురైన వర్గాల ఆత్మఘోషను పిల్లీ సాక్షిగా వినిపించారు. జంతువుకు బ్రహ్మరథం పట్టి, మనిషిని దూరంగా నెట్టే సంస్కృతిని భీమన్న ప్రశ్నించారు.

2. కపట భక్తి మరియు వేషధారణ

పిల్లీ ప్రవర్తనను సమాజంలోని వేషధారులకు, దొంగ భక్తులకు కవి అన్వయించారు. చేపల గంపకు పిల్లీని కాపలా పెడితే అది తినేస్తుంది కదా అని మనుషులు పిల్లీని అపనమ్మకంతో చూస్తారు. కానీ, దేవుడి గుడిలో ఉండే నిక్షేపాలను (నగలు, డబ్బు) మనుషులే (అధికారులు లేదా పూజారులు) దొంగిలిస్తున్నారు కదా? మరి ఎవరు చెడ్డవారు? అని కవి ప్రశ్నిస్తారు.

"చేపల గంపకు పిల్లీని
కాపుంచిన యట్టు లనుచు కడు బల్కుచు, దా
సాపడుదురు దేవుని ని
క్షేపములను కూడ నరులు చెనటులు! పిల్లీ!"

బయట ప్రపంచానికి సన్యాసులుగా (త్యాగులుగా) కనిపించే వారు కూడా, ఉన్నత పదవులు (అమృత లక్ష్మీ పదవి) పొందాలంటే "మార్జాల న్యాయం" (పిల్లీలా నిశబ్దంగా నక్కి ఉండి, సమయం రాగానే కొట్టే పద్ధతి) పాటించక తప్పదని వ్యంగ్యంగా చెప్పారు.

"ఏ న్యాయమైన మార్జా
ల న్యాయము మించ, దమృత లక్ష్మీ పదవిన్
సన్యాసులైన నీ పద
విన్యాసము లేక పడయ వీలా? పిల్లీ!"

పిల్లీ పొయ్యి మీద పాలకుండను కింద పడేసి, శబ్దం రాగానే పారిపోతుంది. దీన్ని కవి చమత్కారంగా "నిష్కామ యోగం" (ఫలితాన్ని ఆశించకుండా కర్మ చేయడం) అని ఎద్దేవా చేశారు. మనుషులు కూడా తమ తప్పులను ఇలాగే గొప్ప పేర్లతో కప్పిపుచ్చుకుంటారని దీని అంతరార్థం.

"పొయి మీది పాల కుండను
పొయిలోనే బోర్లదోసి పోదువు, కించి
త్తయినన్ అలికిడి తగిలిన!
భయమా? నిష్కామయోగ పథ మది! పిల్లీ!"

ఈ పద్యాల ద్వారా భీమన్న గారు మెడలో రుద్రాక్షలు, నోట్లో వేదాలు ఉన్నంత మాత్రాన మనిషి గొప్పవాడు కాదని, ప్రవర్తనలో నిజాయితీ లేకపోతే వాడు పిల్లీ కంటే ప్రమాదకరమని తేల్చిచెప్పారు. సమాజంలో పైకి ధర్మం గురించి, నీతి గురించి మాట్లాడి, లోపల స్వార్థం, డబ్బు, అధికారం కోసం ఆలోచించే మనుషుల కపటబుద్ధిని భీమన్న గారు బట్టబయలు చేశారు.

3. మానవ స్వార్థం, ద్వంద్వ ప్రమాణాలు

బోయి భీమన్న గారు "పిల్లీ శతకం"లో మనిషికి ఉన్న ద్వంద్వ ప్రమాణాలను మరియు స్వార్థాన్ని పిల్లీ సాక్షిగా అత్యంత నిశితంగా ప్రశ్నించారు. తను చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తే తప్పు అనే మనిషి నైజాన్ని ఎండగట్టి, పొట్ట కూటి కోసం మనుషులు ఆత్మీయులకు ద్రోహం చేస్తారని, తల్లిదండ్రులను కూడా మోసం చేస్తారని, ఇదే లోక నీతిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

"హితులకు ద్రోహము చేతురు,
పితరులనే మోసగింత్రు, పేడయు తింద్రున్
చితుకైన కలిసి వచ్చిన!
బ్రతు కొక్కటె లోకనీతి! భద్రమె, పిల్లీ!

మనిషి తన అవసరాలకు అనుగుణంగా 'నీతి'ని ఎలా మార్చుకుంటాడో పిల్లీ ద్వారా కవి స్పష్టం చేశారు. పిల్లీ ఎలుకను చంపి పంటను రక్షిస్తే రైతు సంతోషించి, అది మంచి 'నీతి' అంటాడు. కానీ అదే పిల్లీ ఆకలి వేసి పాలు అడిగితే కొడతాడు. ఒకడు ఉంటే ఇంకొకడు వాడిని నాశనం చేస్తాడు. మనిషి బతుకే ఒక యుద్ధం. "ఒకడు మరొకడిని కొట్టుకు తినడమే" లోక నీతి అని స్వార్థం పరాకాష్టను వివరించారు.

"ఒక డున్న ఒండు చేయు, మ
రొక డున్న మరొండుచేయు; ఒండు మరొండున్
ఒకటే, కొట్టుక తినడము!
ఒకడికి మరియొకడి కదియె యుద్ధము! పిల్లీ!"

మనుషులు తమకు ఉపయోగపడే పనులను మాత్రమే 'నీతి'గా పరిగణిస్తారనే ద్వంద్వ వైఖరిని, మానవ స్వార్థాన్ని కవి తీవ్రంగా విమర్శించారు.

4. రాజకీయ నాయకులపై వ్యంగ్యం

పిల్లీకి యజమానితో పనిలేదని, ఎక్కడ పాలు దొరికితే అక్కడికి చేరుతుందని చెప్పడం ద్వారా కవి రాజకీయ నాయకుల అవకాశవాద స్వభావాన్ని ఎత్తి చూపారు. పిల్లీని (అంటే పిల్లీ లక్షణాలైన అవకాశవాదం, కార్యసాధకత్వాన్ని) నమ్ముకుంటే ఢిల్లీ దాకా వెళ్ళి చక్రం తిప్పవచ్చని, పదవులు పొందవచ్చని కవి రాజకీయ నాయకులపై విసిరిన ప్రసిద్ధ పద్యం ఇది.

"పిల్లీని చంకను బెట్టుక
వెళ్ళుట యను పిచ్చినుడులు, విశ్వాసములున్
చెల్ల వికి; నిన్నుగైకొని
ఢిల్లీ వరకేగ వచ్చు, తెలియవె? పిల్లీ!"

రాజకీయ నాయకులు తమ పదవిని కాపాడుకోవడం కోసం, తమ వెంటే ఉండే అనుచరులను కూడా ఎలా తొక్కివేస్తారో (బలి ఇస్తారో) ఈ పద్యంలో చాలా ఘాటుగా చెప్పారు.

"తన పదవుల కోసము తన
అనుచరులను త్రొక్కియుంచి, అజ గళ దీర్ఘ
స్తనములు చూపుచు పోయెడి
మనుజుడే పో నీతిశాలి! మహిలో, పిల్లీ!"

పిల్లీ ఎలుకను దొంగతనంగా పట్టుకుంటే తప్పు అంటున్నారు కానీ, దొరలు (నాయకులు) ప్రజలను దొంగ బజార్లలో నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు.

"దొంగ పలె దూకి ఎలుకను
భంగించెడి పనికి లజ్జ పడనేలా? నీ
ముంగిటనె తోడి నరులనె
దొంగబజార్లందు తింద్రు దొరలే! పిల్లీ!"

నాయకులు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే (పిల్లీ బజారుకు వెళ్తే), కింద ఉండే కార్యకర్తలు లేదా అరాచక శక్తులు (ఎలుకలు) వ్యవస్థను ఎలా నాశనం చేస్తాయో చెప్పారు.

"పిల్లీ బజారుకు పోయిన
ఇల్లు తీసి పంద్రివేయు నెలుకలు; మరి మా
ముల్లోచను డెటు పోయెనొ!
కల్లోలము చేతు రవని కపటులు! పిల్లీ!"

ఈ పద్యాల ద్వారా బోయి భీమన్న గారు అప్పటి రాజకీయ నాయకుల స్వార్థాన్ని, వారి పదవీ లాలసను పిల్లీ సాక్షిగా ఎండగట్టారు. పదవి ఉన్నంత కాలం ప్రజల చుట్టూ తిరుగుతూ, స్వలాభం కోసం పార్టీలు మారే లేదా ప్రజా ప్రయోజనం కంటే స్వలాభానికే ప్రధాన్యత ఇచ్చే నాయకులను పిల్లీతో పోల్చి వ్యంగ్యాస్త్రం సంధించారు.

కుక్కకు ఉన్న విశ్వాసం కూడా పిల్లీకి ఉండదని, అలాగే స్వార్థపరులైన నాయకులకు ప్రజాసేవ కంటే స్వలాభమే ముఖ్యం అని కవి హెచ్చరించారు.

5. మనిషి–మృగ తత్వం మరియు శుభ్రత

మనిషి అహంకారాన్ని, అంతర్గత మాలిన్యాన్ని విమర్శిస్తూ పిల్లీ యొక్క సహజత్వాన్ని మెచ్చుకున్నారు.మనిషి తనను తాను జంతువులతో (సింహం, పులి) పోల్చుకోవడానికి ఇష్టపడతాడు తప్ప, దైవత్వానికి దగ్గరవ్వడానికి ప్రయత్నించడు అని కవి ఎంతో నిశితంగా విమర్శించారు.

"పురుషవ్యాఘ్రుం డనుచున్,
పురుష సింహు డనుచు, పురుష పుంగవు డనుచున్
నరుడు మృగము కాదలచును!
నరు డందుకే శివుడు కాడు, నమ్ముము! పిల్లీ!"

మనుషులు తమను తాము "పురుష సింహుడు," "పురుష వ్యాఘ్రుడు" అని పొగడుకోవడం అంటే దైవత్వాన్ని కాకుండా మృగత్వాన్ని కోరుకోవడం అవుతుందని కవి ఎద్దేవా చేశారు.

"ఆకటికి మించి చంపుట
కద బాంధవులు మనుజులును, పులులును? ఈ
మూకలకె మామవా? కా
మాకులతల కెల్ల చందమామవె! పిల్లీ!"

ఆకలి తీరిన తర్వాత కూడా చంపడం పులి లక్షణం. మనిషి కూడా అవసరానికి మించి ఇతరులను పీడిస్తాడు, చంపుతాడు. అందుకే మనుషులు, పులులు బంధువులా? అని కవి వ్యంగ్యంగా అడుగుతున్నారు.

ముగింపు

బోయి భీమన్న గారి "పిల్లీ శతకం" కేవలం హాస్యం కోసం లేదా జంతువు గురించి రాసిన పద్యాల సంకలనం కాదు. ఇది ఒక సామాజిక మందుగుండు సామగ్రి.

"శీలమన పిల్లీశీలమె
శీలము అదె సహజసిద్ధ జీవితమేపుడున్
శీలమన సెక్సె అనుకొని
కూలిరి పెక్కండ్రు ఘనులు కుందున, పిల్లీ!"

"శీలమన పిల్లీ శీలమె శీలము" అంటూ పిల్లీకున్న సహజత్వం, నిష్కపటత్వం, స్వేచ్ఛ మనిషికి లేవని కవి ఆవేదన చెందారు. మనిషి తనలోని స్వార్థాన్ని, క్రూరత్వాన్ని, కపటాన్ని మరియు మూఢత్వాన్ని వదిలిపెట్టాలని, ముఖ్యంగా అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను విడనాడాలని పిల్లీ సాక్షిగా ఈ శతకం ప్రబోధిస్తుంది.

ఆధార గ్రంథాలు

1. పిల్లీ శతకము – డా. బోయి భీమన్న
2. దళిత సాహిత్య చరిత్ర – ఎస్.వి. సత్యనారాయణ
3. తెలుగు శతక సాహిత్య వికాసము – డా. కె. గోపాలకృష్ణారావు
4. తెలుగు అకాడమీ ప్రచురణలు

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న గుడిసెలు కాలిపోతున్నై కవితాతత్వ విచారణ

– సోమనాథ్
తెలుగు ఉపాధ్యాయులు
సెల్ నెం: 9177787509

ఉపోద్ఘాతం

భీమన్న గారు భిన్న దృక్పథాల కూడలి. దళిత శంఖారావాన్ని పూరించిన భీమన్న ఈ దేశ దీనులందరూ దళితులే అన్నారు. మనలో మానవత్వం ఉన్నప్పుడే మనం మనుషులం అవుతామన్నారు. మానవత్వమే దివ్యత్వమన్నారు. అదే సత్య ధర్మ స్వరూపం అని తెలియపరిచారు. కర్షకుల, శ్రామికుల, కార్మికుల పక్షాన నిలబడి వారి జీవన స్థితిగతులను అర్థం చేసుకొని **దేశ సంపదను సృష్టిస్తూ జాతి జాతినే పోషిస్తున్న కూలీలు తలదాచుకుంటున్న పేట ఇంత ఇరుకుదా, ఇది నరకం కంటే మురికిది కదా, ఈ చీకటి ఆకటి పొగ గుడిసెల్లోనా ఈ జాతి జీవన దాతలు, ఈ నిస్వార్థ శ్రమజీవులు నివసిస్తున్నది, ఛీ అసహ్యం వీటిని తగలబెట్టి పారేస్తానని** తన **దీపసభ** కావ్యంలో అంటాడు.

కీలకమైన పదాలు

దళిత జీవనం, వర్ణాశ్రమ ధర్మాలు, దళితుల జీవన రేఖలు, సామాజిక చైతన్యం, దోపిడి వర్గాలు, హిందూ వ్యవస్థ.

పరిశోధన ప్రారంభం

గుడిసెలు కాలిపోతున్నై ఒక వచన కవితా సంపుటి. దీనికి 1975లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఇది దళిత జీవన ప్రతిబింబంగా వెలువడిన కవితా సంపుటి. ఈ కవితా

సంపుటిలో 57 కవితలు ఉన్నాయి. ఈ కవితలన్నింటికీ నేపథ్యం తన జీవితంలో జరిగిన ఒక సంఘటనగా చెప్పుకుంటారు.

బోయి భీమన్న తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర సంస్కృత కళాశాలలో చదివే రోజుల్లో ఒకరోజు వారి కళాశాల దగ్గరలో ఉండే హరిజనవాడ నిప్పంటుకుంది గుడిసెలన్నీ కాలిపోతున్నై. ఆ సమయంలో తన మిత్రుడైన తిరుమల రామచంద్ర సహా విద్యార్థులంతా కలిసి పరిగెత్తుకుంటూ పోయి అక్కడ ఉన్న నీటితో కొన్ని గంటలు శ్రమపడి ఆ మంటల్ని ఆర్పి వేశారు. బహుశా ఈ సంఘటన వల్లే భీమన్న ఈ కవితా సంపుటికి గుడిసెలు కాలిపోతున్నై అని పేరు పెట్టినట్లు అనిపిస్తుంది.

గుడిసెలు కాలిపోతున్నై అన్న భావంలో గుడిసెలు అంటే పూరిగుడిసెలే కాదు గుడిసెల్లో ఉంటున్న మనుషుల అజ్ఞానం, అమాయకత్వం, వాళ్ళ పిరికితనం మురికితనం కూడా కాలిపోతున్నాయని భావించారు. గుడిసెలు కాలిపోతున్నై రచనకు ప్రాచీన భారతదేశ వర్ణాశ్రమ ధర్మాలే కారణమని చెప్పవచ్చు. గుడిసెల్లోని అజ్ఞానం ఈ వర్ణాశ్రమ పుణ్యమే అన్నది సత్యదూరం కాదు.

గుడిసెలు కాలిపోతున్నై
ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయి ఉంటాయి
గుడిసెలు ఎవరికి ఉంటాయి? అంటూనే

వర్ణాశ్రమ వ్యవస్థలోని ధర్మాన్ని, ఆ ధర్మ రహస్యాన్ని కూడా చెప్తూ...

అదే మన ధర్మం లోని రహస్యం
ధర్మసంస్థాపనార్థం
ఈ గుడిసెలు
మళ్లీమళ్లీ అవతరిస్తుంటాయి
పోతుంటాయి
పుట్టుకొస్తుంటాయి
ఈ విషవలయం సాగడం
ఎంతవరకు
రహస్యం గుడిసెల వాళ్లకు తెలిసే వరకు

తన గుడిసెలు కాలిపోతున్నై కవితా ఖండికలో గుడిసెల్లో జీవించే అనాగరికులు, నిరక్షరాస్యులు ఎప్పుడైతే చైతన్యవంతులై సమాజంలో ఉన్నతంగా రాణిస్తారో అప్పుడే ఈ గుడిసెలకు మోక్షం వస్తుందంటారు భీమన్న. భారతీయ సమాజంలో హెచ్చుతగ్గులు సరిచేసి సమాజ వికాసానికి దోహదం చేయాలన్నదే గుడిసెలు కాలిపోతున్నై అనే కవితలో భీమన్న ప్రవచించిన సత్యం.

బలం కలవాడు పులి
తెలివి కలవాడు నక్క

ఈ ఇరువర్గాలకు ఆహారంగా
బ్రతుకుతున్న మూర్ఖులు గొర్రెలు
కర్మ సూత్రం పై విశ్వాసం
చచ్చిన అవతారాల పట్ల భక్తి
పులికి పాద సేవ – నక్కకు దాసోహం
గొర్రెలకివా మోక్షమార్గాలు

అంటూ కులం, మతం,ప్రాంతం ఏదైనా కానీ పరిమిత పరిచేది ప్రగతికి మార్గం కాదంటాడు భీమన్న. అలాగే పాతికేళ్ళ పెంపు అనే కవితలో స్వరాజ్యం వచ్చిన తర్వాత సమాజంలో అన్ని పెరిగాయని చెబుతూ..

జీతాలు పెరిగాయి
మేడలు పెరిగాయి
ధరలు పెరిగాయి
మురికివాడలు పెరిగాయి
తిండి గింజలు పెరిగాయి
లంచాలు పెరిగాయి
తినేటోళ్లు పెరిగారు
భక్తి భజనలు పెరిగాయి
కులమత కులతత్వాలు పెరిగాయి
కుమ్ములాటలు పెరిగాయి
లంచాలు పెరిగాయి
చీకటి మంచాలు పెరిగాయి
ఇలా ఎన్నని చెప్పను
ఈ పాతికేళ్లు ప్రజారాజ్యంలో అన్ని పెరిగాయి
ఒక్క నీతి నిజాయితీ తప్పా

అంటారు. భీమన్న దళిత భావన ఒక జాతి వేదన. అది బాధల్లో నుంచి వేదనలో నుంచి తిరుగుబాటు తత్వాన్ని బోధించింది. అనుభవంలో నుంచి పుట్టింది కాబట్టి వాస్తవిక విలువలను సంతరించుకుంది.

బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం వంటి మతాల తత్వాన్ని జ్యోతిరావు పూలే, కబీరు, అంబేద్కర్ వంటి వ్యక్తుల భావజాలన్నీ సంపూర్ణంగా అర్థం చేసుకున్నది దళితవాదం. ఊహలకు వృధా అనుభూతులకు అతీతంగా వాస్తవిక ధోరణితో జీవించింది. దళితుల జీవన రేఖలను చిత్రిస్తూ ఎంతోమంది దళిత కవులు దళిత స్పృహ కలిగిన కవులు తీసుకొచ్చిన కవిత్వమే దళిత కవిత్వం. తెలుగు సాహిత్య చరిత్రలో ఒక వర్గ పోరాటంగా చెప్పబడుతున్న ఈ దళిత కవిత్వం దుర్భర జీవితం

గడుపుతున్న దళితుల యొక్క ఆక్రందనలు, ఆవేదనలను తెలియపరుస్తూ వారి అభివృద్ధి చైతన్యానికి పునాదులు వేసింది.

దళితుల చైతన్యానికి పాటుపడిన బోయి భీమన్న కవిత్వం దళితుల పాలిట వేగుచుక్కగా వారి జీవితాల్లో వెలుగులద్దింది. కులాన్ని కులం పేరుతో జరుగుతున్న అస్పృశ్యత, అంటరానితనం, వెట్టి చాకిరి వంటి సామాజిక రుగ్మతలను వ్యతిరేకించి సమాజంలో కుల నిర్మూలన జరగాలని అందుకు దళితులు చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. పురాణేతిహాసాలు సాంప్రదాయ సాహిత్యం పేరుతో కులాధిపత్య సాహిత్యమే ఉత్తమ సాహిత్యంగా కొనసాగుతున్న తరుణంలో దానిని నిరసించి దళిత సమస్యను చిత్రిస్తూ వారి అభ్యున్నతి కోసం పాటుపడ్డారు భీమన్న.

ఎంతకాలం గొర్రెగా ఉంటావే జనతా
సింహమై తిరగబడి రాక్షస వధ చెయ్యి
నతులతో, నినాదాలతో ఊరేగుతున్న
ఈ వేషగాళ్ళు వట్టి మహిషాసురులే కాదు
మేకతోలు కప్పుకున్న వాతాపులు కూడా

అంటూ సింహాలై తిరగబడండని జనతకు ఉద్బోధించారు. ఇది పడిపోతున్నా అడ్డుగోడలు అనే ఏకాంకికలో వ్యక్తం చేశాడు..

సాంఘిక సమానత్వాన్ని ఆకాంక్షిస్తూ దళితుడు వివేకవంతుడై తెలివిని ప్రదర్శిస్తే ఎవరికీ తీసిపోడని చెప్తూ తిరుగుబాటు వైపు నడిపించారు. భీమన్న జాత్యాహంకార ధోరణిని నిరసిస్తూ దళితుల యొక్క జీవన స్థితిగతులను ప్రపంచానికి చాటి చెప్పారు.

ఈయన కవిత్వంలో దళితులు ఏ విధమైన వంచనలకు గురౌతున్నారో తెలియజేస్తూ దోపిడి వర్గాలను బహిర్గతపరిచారు. హిందూ వ్యవస్థలో దళితుల యొక్క స్థితిగతులను తన కలంలోకి నింపుకొని దళితుల సమస్యలనే నేపథ్యంగా వారి జీవన సరళిని తెలియజేస్తూ కవిత్వం రాశారు. పంచమాధికారం భీమన్న గారి ధ్యేయం. ఆ ధ్యేయ సాధనకు తన జీవితమే అంకితం చేసిన కలియుగ మహర్షి. ఆత్మగౌరవ ప్రతీక బోయి భీమన్న.

భీమన్న గారు తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి జీవించారు. కవి అయినా వ్యక్తి అయినా ఆత్మగౌరవంతో బతకడం అవసరం. కవులకు, రచయితలకు నిబద్ధతతో కూడిన జీవన సరళి, జీవన విధానం ఉండాలంటారు. ఎన్నో విషయాల్ని తమ రచనల ద్వారా చెప్పే కవులకి కనీస సామాజిక బాధ్యత అవసరమన్నాడు భీమన్న. భీమన్న గారు తాను ఆచరించినవే చెప్పారు, చెప్పినవన్నీ ఆచరించారు. ఆత్మగౌరవం గురించి ఒక చోట ఇలా అంటారు

నాకు తిండి దొరక్కపోతే
నేను పస్తులుండను
ఉపవాసాలు చేస్తాను
నాకు పేదరికం లేదు

నాకు బట్టలు దొరక్కపోతే
నేను చింకి పాత బట్టలు కట్టను
దిగంబరోద్యమం చేస్తాను.
నాకు పేదరికం లేదు

అన్న భీమన్న మాటలు ఆత్మగౌరవం ప్రతీకకు నిదర్శనం.

అట్లాగే ఒకచోట భీమన్న గారు ఇలా అంటారు.

ప్రతిరోజు సుప్రభాతం పాడితే కానీ
దేవుడికే మెలుకువ రాని ఈ దేశంలో
ఎంతటి ప్రసిద్ధ సత్యం కానీ – ఎవరో
అనుక్షణం జ్ఞాపకం చేస్తూనే ఉండాలి మనిషికి

అంటూ తనదైన శైలిలో ఆధునిక భావంతో, భావ విప్లవ దృష్టితో రాసి అశేష ప్రజానికాన్ని మెప్పించారు భీమన్న గారు. అట్లాగే

బానిసతనమును –బాపుమురా
భారత భూమికి – భాగ్యము తేరా!
సకల దేశముల – సర్వ మానవుల
సామ్యము సాధింపుమురా!
ఒకడు తినుచు – మరియొకడు – పస్తులుండి
యుండుట – ధర్మము కాదురా!
కూడు గుడ్డ కొంపయు సమానముగా కూర్పుమురా లోకమున.
ప్రభువు – సేవకుడు లేని సంఘమును పదిలముగా నిర్మింపుమురా
సౌఖ్యము – సంతోషము మానవులకు సమకూర్చుమురా! వీరా

అనే భీమన్న మాటల్లో విశ్వామానవ శ్రేయోభిలాషి దర్శనమిస్తాడు. ఈ భూమిపై పుట్టిన ప్రతి వాడికి సమాన హక్కులు ఉండాలని సమానమైన సుఖాలు కలగాలని ఆశించారు భీమన్న.

ప్రక్రియ ఏదైనా దాన్ని సమాజానికి అన్వయించి సమాజంలో మార్పును సాధించినప్పుడే సార్థకత. మనిషి శారీరకంగా ఆధునికంగా ఎదిగితే మానవత్వం నిండిట్లు కాదు మనసా, వాచా, కర్మణా, వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలి. భీమన్న గారి సాహిత్యం అంతా సమాజపరమైనది. అందులో మానవీయత, జాతీయత అంశాలు మెండుగా కనిపిస్తాయి. వీరు సమాజంలో జరుగుతున్న ప్రతి సంఘటనకు స్పందించారు. ప్రతి సంఘర్షణకు చలించారు. వీరి రచనల నిండా సామాజిక చైతన్యమే నిండి ఉంటుంది.

సమాజంలో ఉండవలసిన చైతన్యం సామాజిక చైతన్యం. "నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట మనుగడ సాగిస్తున్న ప్రజల సామూహిక చైతన్యమే సామాజిక చైతన్యం" అన్న నిర్వచనం ప్రకారం సమాజచైతన్యానికి వ్యక్తి కేంద్ర బిందువు కనుక వ్యక్తిలో చైతన్య స్ఫూర్తిని నింపవలసిన బాధ్యత రచయితలదే అంటారు భీమన్న. ఇతివృత్తం ఏదైనా సమకాలీన విషయాన్ని ఆయా సందర్భానుసారంగా రచనలలో నింపి పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేటట్లు చేస్తూ తద్వారా మార్పుని ఆశించడమే భీమన్న గారి లక్ష్యం.

సాహిత్యం కొందరికి సామాజిక అంశాలతో ఉద్భవిస్తుంది, మరికొందరికి జీవిత సన్నివేశాలనుంచే ఉద్భవిస్తుంది. బోయి భీమన్న తన జీవితంలో చూసిన సంఘటనలను సమాజంలోని విభిన్న అంశాల్ని దృష్టిలో పెట్టుకొని సాహిత్య క్షేత్రంలో అద్భుతాలు సృష్టించారు.

నా సుఖాలూ సంతోషాలూ
సమస్తమూ సరస్వతీ ప్రీత్యర్థం
నా కష్టాలూ నష్టాలూ దురదృష్టాలూ
అన్నీ శివార్పణం

అంటారు భీమన్న. భీమన్న సామాజిక స్పృహతో తన కవిత్వాన్ని సామాజిక శ్రేయస్సును కోరుతూ సమాజానికి అందించిన కవి.

ముగింపు

కవిత్వం 10 కాలాలపాటు నిలవాలంటే ఆ కవికి విస్తృత అధ్యయనంతో పాటు లోకాన్ని కూడా బాగా చదివే గుణం ఉండాలి. లోకం తీరును సరైన దిశగా అర్థం చేసుకున్న కవి చైతన్యం ఉత్తమ ఫలితాలను అందిస్తూనే ఉంటుంది. కవిత్వం మనుషుల మధ్య అంతరాల్ని తొలగించాలంటారు భీమన్న.

ఆధార గ్రంథ సూచిక :

1. గుడిసెలు కాలిపోతున్నై – బోయి భీమన్న
2. దళిత సాహిత్య చరిత్ర – వెలమల సిమ్మన్న
3. పంచమ స్వరం – బోయి భీమన్న

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్న జీవితం - సాహిత్యం

- దేపవత్ శిల్ప
ఎం.ఎ., తెలుగు
ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఉపోద్ఘాతం

"వ్యక్తుల వికాసమే జాతి. జాతుల వికాసమే వసుధ.వసుధైక సామ్రాజ్యమే మానవలోక సంపూర్ణఫలం" అన్నది భీమన్న తాత్విక చింతన. అందుకే మన జాతికోసం విశ్వజనీయమైన ఒక మతాన్ని, ఒక వ్యవస్థను, నిర్దిష్టమైన సిద్ధాంతాలను నిర్మించాల్సిన అవసరం ఉందంటారు భీమన్న.

భిన్నమైన భీమన్న జీవిత చరిత్ర ఒక సామాన్యకవి చరిత్ర కాదు. వీరు పురాణేతిహాసాల సమగ్ర అవగాహనతో గాంధీ అంబేద్కర్ తాత్విక భావాల సమ్మేళనంతో రచనలు చేశారు. వీరు ఒడిదుడుకులతో నిండిన నిండైన బతుకు పుస్తకం. అమానుష సంఘటనలకు చలించిపోతూ మానవత్వం కోసం అక్షరాలతో అన్వేషణ సాగించిన మహాద్రష్ట బోయి భీమన్న. మానవుడే అన్నిటికి మూలం అని మనసుని జయిస్తే విజయం వరిస్తుందన్నది భీమన్న మతం. భీమన్న వ్యక్తిత్వ వికాస నిర్మాణ శిల్పి. సామాజిక చైతన్య స్ఫూర్తి. మానవ పరివర్తన దార్శనికతతో కూడిన వీరి దృక్పథం ఆదర్శప్రాయం. పాలేరు నుండి పద్మశ్రీ వరకు ఎదిగి నిలువెత్తు దర్పణంగా నిలిచిన వారి రచనలు సమకాలీన సామాజిక పరిస్థితులకు ప్రతిబింబాలుగా ఆవిష్కృతమయ్యాయి.

కీలకమైన పదాలు

కుల నిర్మూలన, పంచముల ఐక్యత, జాతీయ సోషలిజం, బడుగు బలహీనవర్గాలు, నైతికత, వైజ్ఞానికత, కళాత్మకత.

పరిశోధన ప్రారంభం

చదువుల సారమెరిగి సంస్కృతిని పునఃసృష్టించిన మార్గదర్శి భీమన్న. జీవితపు వాస్తవ లోతుల్ని తరచి చూసి స్వీయానుభావాలతో మనిషి అంతర్వేదనలను మధించి, అక్షర బద్దం చేస్తూ, వ్యక్తి పరిణామ క్రమం చిన్నదని, వ్యవస్థ దీర్ఘకాలిక మైనదని అంటారు. అందుకే భిన్నత్వంలో ఏకత్వంగా కులమతాలకతీతంగా మానవతావాదాన్ని ఆశించారు. మానవజాతి బలాన్ని బలహీనతల్ని విశదీకరించారు.

పరిశోధనాత్మక దృష్టి, సునిశిత దృక్కోణం, సామాజిక అంతరంగం, కొత్త ప్రతిపాదనలు కొత్త సిద్ధాంతాలు వినూత్నమైన ఆలోచనల విధానం భీమన్నగారి రచనలల్లో కనిపిస్తుంది. వీరి రచనలు భవిష్యత్ తరాలకు ముఖ్యంగా సాహిత్య చరిత్రలో వర్ధమాన కవులకు, రచయితలకు ఒక దిక్సూచిలా నిలబడతాయి. వీరి రచనలు నిన్నటి తరానికి నేటి తరానికి వారధిగా కూడా చూడొచ్చు.

భీమన్న ప్రతిమాట, ప్రతి ఆలోచన బడుగు బలహీనవర్గాల కోసం చేశారు. కుల నిర్మూలన, పంచముల ఐక్యత, జాతీయ సోషలిజం, పట్టణీకరణ, పంచముల అధికారం అనే ఐదు సూత్రాలు వీరి సాహిత్య భూమికగా కొనసాగాయని చెప్పవచ్చు. అందుకే సగటు మానవుని జీవిత సమస్యలు కవితా వస్తువులు కావాలని భీమన్న ఆశించారు.

సమాజంలో మార్పుకై ముఖ్యంగా సామాన్యుల జీవితాల్లో వెలుగులకై తన రచనా ప్రస్థానాన్ని ప్రారంభించి పద్యం, గేయం, గద్యం, నాటకం, నాటిక, వ్యాసం, కవిత, వచనం వంటి పలు సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేశారు. గుడిసెలు కాలిపోతున్నై, భీమన్న ఉగాదులు, మోక్షం నా జన్మ హక్కు, భీమన్న కావ్య కుసుమాలు, కూలీ శతకం, దీపసభ, మొదలైన రచనలు చేశారు.

ఏకపద్యోపాఖ్యానం, జన్మాంతరవైరం, ధర్మంకోసం పోరాటం, అంబేద్కరిజం, అంబేద్కర మతం, జానపదుని జాబులు మొదలైన వచన రచనలు. పాలేరు, కూలి రాజు, అఘాయ, ప్రగతి, రాగవాసిష్టం, వేద వ్యాసుడు, ధర్మవ్యాధుడు, బాలయోగి వంటి నాటకాలు. పైరు పాట, మానవుని మరొక మజిలీ లాంటి గేయ నాటికలు.

వీరు రాసిన 'పిల్లీ శతకం' తో కలిపి వాటిలో నైతికత, వైజ్ఞానికత,కళాత్మకత అనే త్రిగుణాత్మక విషయ ఆధారితమైన తాత్వికతతో పాటు విశాలదృక్పథం, సామాజిక అవగాహన, సమాజ బాధ్యత నిండినటువంటి రచనలు 70కి పైగా వారి కలంనుండి జాలువారినవి. ఈ రచనల ద్వారా ప్రజలు వైజ్ఞానికంగా ఎదగాలని మంచి విషయాలనే పదేపదే ఉద్బోధించాలని నిరంతరం కృషి చేసిన సాహితీ దురంధరుడు.

మొదట్లో ఒక ఉపాధ్యాయుడిగా తరువాత జర్నలిస్టుగా జనవాణి, జయభేరి, ప్రజామిత్ర, నవజీవన్, ఆంధ్రప్రభ పత్రికల్లో తన జీవితాన్ని ప్రారంభించి తరువాత తన రచనా పటిమతో నిరంతర సృజనశీలమైన సాహిత్య ప్రక్రియా వైవిధ్యంతో కూడిన రచనలతో, 1975 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు భారత ప్రభుత్వం చేత 1973 లో పద్మశ్రీ అవార్డు, 2001లో పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు.

భద్రంగా బ్రతకాలంటే బలంగా బతకాలి అంటారు భీమన్న.

సింహాలూ నక్కలూ రాజ్యమేలే లోకంలో
మీరు క్షేమంగా బ్రతకదలుస్తున్నారా?
అయితే గొర్రెల్లారా! బర్రెల్లారా!
పంచతంత్రం చదువుకోండి

అంటూ సామాన్యులపట్ల సానుభూతిని తెలియజేస్తూ ప్రజాస్వామ్యం పట్ల నిర్దిష్టమైన అవగాహన కలిగించారు.

సహజంగా భీమన్న భావకుడు చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితుల వల్ల ఆయనకు సంస్కరణ దృష్టి, హేతువాద దృక్పథము అలవడ్డాయి. దేశంలో ఏర్పడిన సామాజిక ఆర్థిక రాజకీయ సంక్షోభాల నుండే ఆయన తన కవితా వస్తువులను స్వీకరించారు. సమాజంలో ఏ కాలంలోనైనా మోసం, అన్యాయం జరుగుతూనే ఉన్నాయి. ఒకరు ఇంకొకరి కుట్రలకు బలవుతూనే ఉన్నారు. అందుకే భీమన్న తన అక్షరాల చేత సమాజాన్ని చైతన్యం చేయాలని చూశారు.

గ్రామదేవతల నుండి బాబాల దాకా
చిత్తం పూజల మీద ప్రజల మీద కాదు
టీచర్ల నుంచి ప్రొఫెసర్ల దాకా
దృష్టి జీతం మీద చేత మీద కాదు

అంటూ ఒక దేశ అభివృద్ధికి పాలకులు, విద్యను బోధించే ఉపాధ్యాయులు ముఖ్యమంటారు భీమన్న.

భీమన్న సాహిత్యం సర్వకాలీన ప్రయోజనాన్ని కలిగించే దివ్యామృతం. 84 లక్షల జీవరాశుల్లో మానవ జన్మ ఉత్తమమైనది. మానవుడే తప్పుడు మార్గంలో పయనిస్తే సమాజానికి చీకటి గతి పడుతుందంటారు భీమన్న. సృష్టిలో ఉన్న మానవుడు శివుడంతటివాడు సర్వశక్తి సంపన్నుడు. మహాత్ముడిలా ప్రపంచాన్ని జయించాలని తన వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకోవాలని భీమన్న ఆశించాడు.

సృష్టిలోన మానవుడే శివుడంతటివాడు, శక్తిలోన మానవుడే సర్వేశ్వరుడు అన్న విశ్వాసం భీమన్న గారిది. మరోచోట

నీ మనసే నీ దైవం
నీ ప్రజ్ఞనే ప్రగతి
నీవే నీ జాతి నిర్మాతవు
నీవే నీ సుఖశాంతుల కర్తవు

మానవుడే అన్నింటికీ మూలమని విధిని కర్మను నమ్మవద్దంటారు. వీరు ప్రజాకవిగా సహజకవిగా అభ్యుదయకవిగా తన రచనలలో దర్శనమిస్తారు. సమాజంలోని అసమానతలపై

గళమెత్తిన వారి సాహిత్యంలో సమాజంలోని అన్ని కోణాలను ఆవిష్కరించారు. కొందరు ఆయన సాహిత్యాన్ని దళిత సాహిత్యం అని ఆయన దళిత కవిగా పేర్కొన్నారు కానీ ఆయన జాతీయ కవి, అందుకు ఎన్నో ఉదాహరణలు మనకు దర్శనమిస్తాయి.

ముగింపు

కవిగా సమాజ ఔనత్యాన్ని కలలు కన్న మహోన్నతుడే కాదు, మానవ వికాసంతోనే తనను తాను వికసింప చేసుకున్న మానవతా మూర్తి, కాబట్టే రాష్ట్ర ప్రభుత్వాలు, సాహిత్య సంస్థలు, విశ్వవిద్యాలయాలు అనేక అవార్డులు, డాక్టరేట్ పట్టాలను ప్రధానం చేసి ఆయనను గౌరవించుకున్నాయి. ఇలా ఇంటా బయట తన జీవితకాలంలో అనేక సత్కారాలు, పురస్కారాలు అందుకున్న వీరు శాసనమండలి సభ్యులుగా కూడా వారి సేవలు అందించారు.

ఐనా జీవించడం కోసం ఏ వృత్తిలో ఉన్నా సాహిత్యం ఊపిరిగా, కవిత్వం ఆత్మగా జీవనాన్ని సాగించిన కారణజన్ముడు బోయి భీమన్న.

ఆధార గ్రంథ సూచిక :

1. మూర్తి.బి.బి.యస్,1992, దళిత కథామంజరి. రాజమండ్రి : త్రివేణి ప్రింటర్స్ ప్రచురణలు
2. నరసింహాచార్య యన్.యల్. (వ్యాఖ్యాత), 2000, మనుస్మృతి, (తెలుగు తాత్పర్యం సహితం) హైదరాబాదు: గాయత్రీ ప్రచురణలు.
3. తెలుగులో కవిత్వోద్యమాలు– తెలుగు సాహిత్య అకాడమీ.
4. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 3, వచన కవితలు భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2010
5. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 4, నాటకాలు, భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2008

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక - 1(6); మార్చి, 2026

బోయి భీమన్నగారి సాంఘిక నాటకాలు - సామాజిక దృక్పథం మరియు మానవతవాదం

- గనుముల తిరుమల రాజు
పరిశోధక విద్యార్థి
సెల్ నెం: 8142729037

వ్యాస సంగ్రహం :

"ప్రతిభను తలెత్త నివ్వరు పండితులు
పాండిత్యాని తలెత్తనివ్వారు పామరులు"

"నా కవితా లక్ష్యం
చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు
వాళ్ళను తిట్టినా కొట్టినా సరే అక్కడ నుండి లేవడం
అరుణోదయం కేసి తరమడం"

"ఈనాడు సాహిత్యమంటే కులం, మతం, వర్గం, ముఠా అని తన మనసులోని మాటలను ధైర్యంగా కలం, గళం ద్వారా ఈ ప్రపంచానికి తెలియజేశాడు."

తెలుగు నాటక చరిత్రలో ప్రజల జీవితాలను, వారి బాధలను, ఆశలను రంగస్థలంపై ప్రతిబింబించిన నాటకకర్తలలో బోయి భీమన్న గారు ప్రముఖులు. ఆయన నాటకాలు సమాజంలోని అణచివేత, కులవ్యవస్థ, పేదరికం, శ్రమ దోపిడీ, రైతు సమస్యలు, మహిళా వివక్ష వంటి అనేక సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తాయి. వినోదంతో పాటు ఆలోచనను కలిగించే రంగస్థల నాటకాలను రచించి, సామాన్య ప్రజల జీవితాలను కేంద్రంగా పెట్టడం ఆయన ప్రత్యేకత. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం మాత్రమే కాకుండా, మార్పుకు మార్గదర్శకంగా కూడా వ్యవహరిస్తుంది.

ముఖ్యంగా నాటక సాహిత్యం ప్రజలతో ప్రత్యక్షంగా సంభాషించే కళారూపం కావడం వల్ల దాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆధునిక కాలంలో తెలుగు నాటకం రాజసిక వినోదం నుండి సామాజిక చైతన్య దిశగా ప్రయాణించింది. ఈ మార్పులో బోయి భీమన్న గారి పాత్ర అత్యంత కీలకమైనది. ఆయన నాటకాలు కేవలం కథలు కావుఅవి సమాజాన్ని ప్రశ్నించే పత్రాలు. పేద ప్రజల జీవన వాస్తవాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, భూస్వామ్య దోపిడీ వంటి అంశాలు ఆయన నాటకాలలో ప్రధానంగా దర్శనమిస్తాయి. తెలుగు నాటక సాహిత్యంలో సాంఘిక చైతన్యానికి బలమైన పునాది వేసిన నాటకకర్తలలో బోయి భీమన్న గారు ముఖ్యులు.

ఈ పరిశోధన వ్యాసం బోయి భీమన్న గారి సాంఘిక నాటకాలలో వ్యక్తమయ్యే సామాజిక దృక్పథాన్ని విశ్లేషిస్తూ, ఆయన నాటకాల ఇతివృత్తాలు, పాత్రలు, సంభాషణలు, సందేశం మరియు సమకాలీన సమాజంతో వాటి అనుబంధాన్ని లోతుగా పరిశీలిస్తుంది.

కీ వర్డ్స్: బోయి భీమన్న, సాంఘిక నాటకాలు, సామాజిక దృక్పథం, భూసామ్య దోపిడీ, రైతు సమస్యలు, కులనిర్మూలన, శ్రామిక దోపిడీ, మానవత వాదం.

బోయి భీమన్నాగారి సాంఘిక నాటకాలు – సామాజిక దృక్పథం మరియు మానవతావాదం

పాలేరు నాటకం (1940):

పాత్రలు

వెంకన్న	– వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తి
వనబాల	– అగ్రకులానికి చెందిన వనిత
పుల్లయ్య	– వెంకన్న తండ్రి
కుభేరయ్య	– భూస్వామి
ఉపకారి మాస్టర్	– వెంకన్నకు చదువు నేర్పించిన గురువు

"ఆకటి బాధకు అల్లడెదవా
బానిసవై బ్రతికెదవా
ఈ విశాల విశ్వంలో మరియొక
త్రోవటయే కనబడదా
పగలగొట్టు నీ భికా పాత్రను
తెగ ద్రెంపుము నీ శృంఖలము
అభ్యుదయములో ఆశాగతిలో
అడుగిడి సాగుము వీర" .....!

"నగ్న సత్యం వేదాంతం
అలంకృత సత్యం కవిత్వం" –

ఈ కవితలన్నీ "పాలేరు" నాటకం ద్వారా భీమన్న ఈ ప్రపంచానికి తెలియజేసాడు. ఈ కవితల ద్వారా తన సాహిత్య హృదయం ఎలాంటిదో తెలుస్తుంది.

పేదల శ్రమను దోపిడి చేసేవారి దౌర్జన్యాలు, నిరు పేదల నికృష్టజీవితాలు ఈ నాటకంలో కనిపిస్తాయి. అమాయక జీవితం గడిపే రైతు ఇందులోకథానాయకుడు. సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించుకుంటారు. పాలేరుగా పనిచేయాల్సిన వాడు, అగ్రకులంగా గౌరవ మర్యాదల్ని పొందుతున్న అమ్మాయిని పెండ్లి చేసుకోవాలంటే, ఎన్ని బాధలకు గురికావాల్సివస్తుందో, అన్నింటినీ అగ్రకుల, భూస్వామి కుభేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు. చివరికి "ఉపకారి" మాస్టారు సహాయంతో చదువుకుని వెంకటేశ్వరరావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతోద్యోగం సాధిస్తాడు. ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురాగతాలను చట్టబద్ధంగా అడ్డుకుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనీ, ప్రోత్సాహించేవాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని రచయిత ఈ నాటకం ద్వారా ప్రేరేపించారు.

సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళు కాదనీ, మంచివాళ్ళూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం. ఈ పాలేరు నాటకంలో వనబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుంటుంబం నుండే వచ్చినా, సంకుచిత మూర్ఖ కులతత్వవాదులు లేని వాళ్ళూ ఉంటారనే మరో పార్శ్వాన్ని కూడా చూపారు. వెంకన్న తండ్రి పుల్లయ్య తన తండ్రి బాటలోనే తానూ పయనించి, తన కొడుకునీ పాలేరుతనానికి పంపుతాడు. అలాంటి సేవ చేయడానికే తాము జన్మించామనే భ్రమను కల్పించి, కొన్ని తరాలుగా కర్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు వంచించిన తీరుతెన్నుల్ని ఈ నాటకం ద్వారా తెలియజేసాడు.

కూలీరాజు (కష్ట జీవి, ధన్య జీవి) (1947) :

"పచ్చని పొలముల పచ్చి బాలెంత
మా బంగారు తెలుగు తల్లి".....!

అని ప్రేమ దృష్టితో వీక్షించడం సమకాలీన పాత్రను ప్రేమరసంతో నింపడం విశ్వసాహిత్యమవుతుంది. వాస్తవాన్ని అందంగా తీర్చిదిద్దే కళ.

"మనకు స్వాతంత్ర్యం వచ్చింది గాని
ఇంకా స్వరాజ్యం రాలేదు
దాన్ని మనం సాధించవలసి ఉంది".....!

ముఖ్యంగా ఈ నాటకంలో గాఢమైన ఆవేశాన్ని చక్కని భావాన్ని భీమన్నతన పద్యాల ద్వారా పాటల ద్వారా సాహిత్య లోకానికి అందించాడు.

ఈ నాటకాన్ని 1947 లో ప్రచురించి ఈ కళాలోకానికి అందించాడు.బోయి భీమన్న ఇందులోని ఇతివృత్తం వ్యవసాయ కూలీల పోరాటం. ఇందులో కథనాయిక పరంజ్యోతి ఈమె ఒక దళిత స్త్రీ. వ్యవసాయ కూలీగా పనిచేస్తుంటుంది. భీమన్న ఈ నాటకంలోసామ్యవాద సిద్ధాంతం

ప్రాతిపదికగా సమమాజాన్ని నిర్మించడం. ఈ తాత్వికచింతనతో భీమన్న తన రచనలో గ్రామీణ వాతావరణాన్ని సజీవ పాత్రల్ని సహజమైనట్టి సంఘటనల్ని సాధారణమైనట్టి సంభాషణల్ని అక్కడక్కడ పద్యాల్ని, పాటవిన్యాసాలు చేయించాడు. మార్క్సిజంను ఆవకించి కూలిలంతా ఏకం కావాలని కూలీలు రాజ్యంని పరిపాలించే స్థాయికి ఎదగాలన్నీ రచయిత ఇందులో ఎన్నికల్నీ ప్రతిపాదించాడు. ఈ నాటకంలో పరంజ్యోతి కాంగ్రెస్ ద్వారా ఎన్నికలలో గెలుస్తుంది. భారతదేశానికీ అధ్యక్షురాలు అవుతుంది. చివరగా రౌడి భంకర రావు పశ్చాత్తాపపడి ఆత్మహత్య చేసుకుంటాడు. పరంజ్యోతి ప్రేమ్ కుమార్ అనే అగ్రకులస్థుని వివాహం చేసుకుంటుంది.

పైరు నాటకం (1959) :

బోయి భీమన్నగారు రసస్ఫూర్తితో సాంఘిక చైతన్యం కోరుతూ రచించిన నాటకమే "పైరుపాట".

"రసేవైవసర్వం జీవతి కావ్యం
నహి రస శూన్యం కావ్యం కించిదస్తి
రస ఏవ వస్తుతః ఆత్మా".....

అని రసాన్ని గూర్చి ప్రాచీన కాలంలో అభినవ గుప్తుడు అన్న మాటను భీమన్న అంగీకరించినట్టు తెలుస్తుంది.ఈ ఛాయ భీమన్న "పైరుపాట" గేయరూపకంలో కనిపిస్తుంది. ఇందులోని గేయ కవిత్వం ఒక మూడ్ (Mood) ని కల్పించగలదు. ఈ రూపకంలోని ముఖ్యమైన సమస్య సాంఘికమైనదే అయినా ఆ Emotional Crisis అనవచ్చు.

గడ్డి పువ్వుగానైనా
కలువ పువ్వుగానైనా
నీ యడుగుల దరినైనా
నీ యెడ బాటుననైనా.....!

ఇలా ప్రకృతి పరంగా రచన చేస్తూ సాంఘిక సమస్యను తెలియజేశాడు.ఈ అభిప్రాయం "పైరుపాట రూపకంలో మనంచూడగలం.

శ్రీవత్స : "మేడలు మిద్దెలు వున్నా
మెత్తని పానుపులున్నా
హృదయం లేకున్నపుడు
వృధయే బ్రతుకంత"

స్నేహ: "సుకుమారపు కుసుమాలను
సూదులకర్పిసాదా
అడుగులపై పడు పూలను
పద ద్రొక్కుకు పోతాదా".

శీల: **"ఎక్కడ పుట్టిన నేమి**
ఎక్కడ పెరిగిన నేమి
కోరిన గుణమున్నవుడు
కోసుకొమ్ము పుష్పమును".....!

అని అమాయకులైన వారిని పూలతో పోల్చడం, పూలను సూదులతో గుచ్చడం, అమాయకులను బాధించడం లాంటివి సాంఘిక సమస్యలే గదా. పేదవాని ఇంట్లో పుట్టినా, కాని కులంలో పుట్టినా తనకు నచ్చిన గుణంవారిలో ఉంటే వారిని ఆదరించండి, గౌరవించండి, అనే భావం మనకు "పైరుపాట" రూపకం ద్వారా తెలుస్తుంది. ఇదీ ఒక సామాజికమైన భావనయే. అలా భీమన్న వ్యావహారికంలో తమ సాంఘీక, సామాజిక భావాలను ఈ నాటకం ద్వారా తెలియజేశాడు.

పడిపోతున్న గోడలు (1958) :

భీమన్న గారు ఈ నాటకాన్ని 1958లో ప్రచురించాడు. ఇందులోని వస్తువు వ్యంగాత్మకత. ఇందులో ఒక దళిత బాలిక తనతోటి బ్రాహ్మణ విద్యార్థి ఇంటికి స్నేహ పూర్వకంగా వెళుతుంది. అక్కడ బాలిక పొందిన అనుభూతిని వ్యంగ్యంగాను మరియు హాస్యంగాను చిత్రీకరించాడు. కులం పట్టింపు అర్థరహితం అని, మూడనమ్మకం అని అనాగరికం అని ఇది తొలగిపోవాలని ప్రభోదం చేస్తుంది. భీమన్న గారు ఈ నాటకం చివరలో మతాచారం ముఖ్యం కాదు నైతిక జీవనమే ముఖ్యమని తెలియజేస్తూ ఇందులో కూడా వర్ణాంతర వివాహాన్ని జరిపిస్తాడు.

ప్రగతి (1979) :

ఈ నాటకాన్ని భీమన్న గారు 1979లో ప్రచురించారు. ఇందులో రస భరితమైన పాత్ర చిత్రణను ప్రవేశ పెట్టాడు. ఈ నాటకంలోని నాయిక పేరు ప్రగతి. మొదటిసారిగా ప్రగతిని ఫోటోలతో వశపరుచుకోడానికి ప్రచార్ అనేవ్యాపారి ఎత్తులు వేస్తాడు. ఈమెను వలలో వేసుకోవడానికి లంకేశం అనే పెద్ద మనిషి ప్రయత్నం చేస్తాడు. కృష్ణార్పణం అను పారిశ్రామికవేత్త కూడా అబ్బులు, సుబ్బులు అనే వ్యక్తుల ద్వారా ప్రగతిని మాయచేసి బంధిస్తారు. అదే విధంగా శ్రిధాం మరియు దొరబాబు అనే వాళ్లు కూడా బలవంతం చేస్తారు. ఎంతమంది ప్రయత్నించిన ఆమె అందరిని ప్రతిఘటిస్తుంది. ఎన్నో శ్రమలుపడి తన శీలాన్నిమరియు తనను తానూ రక్షించుకుంటుంది.

అసూయ (1954) :

భీమన్నగారు ఈ నాటకాన్ని 1954 లో ప్రచురించబడినది. ఇందులో కథా నాయకుడు 'రాజా', ఇతను విద్యార్థి కాంగ్రెస్ నాయకుడు ఇతని చుట్టు 5 పాత్రలు నడుస్తాయి. ఇందులో ముఖ్యమైన పాత్రలు రాజా (కథా నాయకుడు), రాత్రి (కథానాయిక, విశ్వం చెల్లెలు), విశ్వం (రాజా మిత్రుడు) చంభాస్మరావు (ధనికుడు), దినం (ధనికుని మిత్రుడు), రేరాణి (భూతాల కూతురు), భూతాలు, తంత్రాలు (పల్లెటూరి పెద్దలు), ఇంకా ఇందులోప్రజలు, పోలీసులు కూడా ఉంటారు. విశ్వం చెల్లెలు 'రాత్రి' రాజాను ప్రేమిస్తుంది. భూతాలకూతురు 'రేరాణి'కి జ్వరం వచ్చినపుడు 'రాత్రి' ఇలా అంటుంది. 'అబ్బ ఎంత జ్వరం ఉంది. । ఇక్కడే హస్పిటల్లో వుంచేద్దాం. ఈమెను కూడా అన్నా నీవు । తీసుకెళ్ళి

అడ్మిట్ చేయించు' అని విశ్వంతో చెబుతుంది. విశ్వం రేరాణిని తీసుకవెళతాడు అక్కడ 'రాత్రి' రాజా వంక తదేక దృష్టితో చూచి ముద్దు పెడుతుంది. ఇలా చివరలోబోయి భీమన్న తన రసాద్వైత ప్రేమను ఈ ప్రతీకాత్మక పాత్రల ద్వారా తెలియజేశాడు.

మానవుని మరొక మాజిలీ (1963) :

కథానాయకురాలు 'స్వయప్రభాదేవి' ఈ నాటకంలో ప్రధాన పాత్ర. బోయి భీమన్న కల్పన కథ ఈ నాటకంలో స్వయం ప్రభాదేవి వివిధ సందర్భాలలో వివిధ రూపాలలో ప్రత్యక్ష మవడం పాత్ర ప్రత్యేకత.ఈమె వలన జన్మించిన నాలుగు వారు భూలక్ష్మి, క్షేత్రయ్య దంపతులు, వీరి కూతురు సస్య. ఈమెను మేధానిధి వివాహమాడుతాడు. ఇతని తల్లిదండ్రులు భోగయ్య, ఆశావతి. సూరన్న, చంద్రన్న అనువారు కార్మికులు. వీరితో కలసి భూలక్ష్మి క్షేత్రయ్యలు వ్యవసాయంచేస్తుంటారు. కష్ట కాలం లో క్షేత్రయ్య స్వయం ప్రభను ప్రార్థించగా ఆమె 'అన్నపూర్ణ'గా ప్రత్యక్ష మవుతుంది.సూరన్న, చంద్రన్నలు మేధానిధిపై పోరుకు సిద్ధపడ్డప్పుడు ' శ్యామల'గా ప్రత్యక్షమవుతుంది. ఒకసారి బోగయ్య దర్బారులో 'శశికళ గా నాట్యం చేస్తుంది. ఇలా స్వయం ప్రభ పాత్ర వివిధరూపాలలో కనిపించడం ఈ నాటకంలోని ప్రత్యేకత. నాటకం చివరలో 'ధనలక్ష్మి రూపంలో ప్రత్యక్షమౌతుంది. కథానాయకు రాలు స్వయం ప్రభ.'ధనరాజు' అనేవాడు సస్య'ను ఎత్తుకు పోతాడు. మేధానిధి అతనిని ఓడించి సస్యను తిరిగి పొందుతాడు.చివరిలో క్షేత్ర ఋషిగా మారిపోతాడు. సస్య మేధానిధి, స్యయం ప్రభ ఆశీర్వాదంతో సుఖ జీవనం గడుపుతారు. ఇలా కథ సుఖాంత మవుతుంది.

ముగింపు :

బోయి భీమన్నగారి సాంఘిక నాటకాలు తెలుగు నాటక సాహిత్యంలో సామాజిక చైతన్యం, మానవతావాదం, సమానత్వ భావనలకు బలమైన పునాదిని వేశాయి. ఆయన రచనలు కేవలం వినోదాన్ని అందించే కళారూపాలు మాత్రమే కాకుండా, సమాజంలోని అణచివేత నిర్మాణాలను ప్రశ్నించే ధైర్యవంతమైన సామాజిక పత్రాలుగా నిలుస్తాయి. కులవ్యవస్థ, భూస్వామ్య దోపిడీ, శ్రమిక శోషణ, రైతు సమస్యలు, మహిళా వివక్ష వంటి సమస్యలను నాటకీయంగా ప్రతిబింబిస్తూ, ప్రజలను ఆలోచనకు, చర్యకు ప్రేరేపించే లక్ష్యంతో ఆయన నాటకాలు రూపొందాయి.

'పాలేరు'లో విద్య ద్వారా విముక్తి, 'కూలీరాజు'లో కూలీల ఐక్యత, 'పైరుపాట'లో రసానుభూతితో కూడిన సామాజిక భావన, 'పడిపోతున్న గోడలు'లో కులవివక్షపై వ్యంగ్య నిరసన, 'ప్రగతి'లో మహిళా స్వాతంత్ర్య భావన, 'అసూయ'లో ప్రేమ–సమాజ సంబంధాల ప్రతీకాత్మక విశ్లేషణ, 'మానవుని మరొక మాజిలీ'లో మానవ జీవన తాత్త్వికత–ఇలా ప్రతి నాటకం తనదైన సామాజిక దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది.

భీమన్నగారు సమాజంలో ఉన్న చెడును ఎండగట్టడమే కాక, అందులోని మంచిని కూడా చూపుతూ ఆశావాదాన్ని పెంపొందించారు. ఆయన నాటకాల పాత్రలు గ్రామీణ జీవితానికి దగ్గరగా ఉండి, సహజ సంభాషణలు, పద్యాలు, పాటల ద్వారా ప్రజల హృదయాలను తాకుతాయి. సాహిత్యం మార్పుకు సాధనమవ్వాలి అన్న ఆయన విశ్వాసం, నాటక సాహిత్యాన్ని ప్రజాస్వామ్య చైతన్యానికి ఆయుధంగా మలిచింది.

అంతిమంగా, బోయి భీమన్నగారి సాంఘిక నాటకాలు తెలుగు సాహిత్యంలో సామాజిక న్యాయం, మానవ గౌరవం, సమానత్వ విలువలను ప్రతిష్టించే శాశ్వత కృషిగా నిలుస్తాయి. సమకాలీన సమాజానికే కాక భవిష్యత్ తరాలకు కూడా మార్గదర్శకంగా ఉండే ఈ నాటకాలు, తెలుగు నాటక చరిత్రలో ఆయనను ప్రజల నాటకకర్తగా చిరస్థాయిగా నిలిపాయి.

ఆధార గ్రథాలు

1. రామకోటి శాస్త్రి, కేతవరపు. నాటక విశ్లేషణ, పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, 1993.
2. గంగప్ప, యస్. తెలుగు నాటకం. వైష్ణవి ప్రింటర్స్, 1985.
3. శ్రీరామ అప్పారావు, పోణంగి, తెలుగు నాటక వికాసం, శివాజి ప్రెస్, 1968.
4. రాధాకృష్ణ మూర్తి, మిక్కిలినేని.. ఆంధ్రనాటక రంగచరిత్ర, నాగార్జున ఎంటర్ ప్రైజెష్, 1969.
5. రమణ, వి. వి. జి. యస్. ప్రసాద రెడ్డి. నాటక విజ్ఞాన సర్వస్వం. వేణు గ్రాఫిక్స్
6. రమణ, వి. వి. తెలుగు సాంఘిక నాటకం–పరిణామ వికాసం, నవయుగ బుక్ హౌస్, 1995.
7. డా. బాలరాజు, తక్కళ్ళ. బోయి భీమన్న రూపకాలు తాత్విక చింతన (1996) చైతన్య స్రవంతి, వరంగల్ 1996.
8. పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం, పద్మ భూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం. విద్యానగర్ హైదరాబాదు 2008.
6. భీమన్న బోయి. పాలేరు. దేశి కవిత మండలి, విజయవాడ 1940.
7. భీమన్న బోయి. కూలీరాజు (కష్ట జీవి, ధన్య జీవి), సర్వోదయ ప్రచురణ, మద్రాసు 1948.
8. భీమన్న బోయి. పైరు పాట. సర్వోదయ ప్రచురణ, మద్రాసు 1948.
9. భీమన్న బోయి. పడిపోతున్న గోడలు. బోయి భీమన్న సాహితీ నిధి, హైదరాబాదు 1958.
10. భీమన్న బోయి. ప్రగతి. భీమన్నసాహితీ నిధి, హైదరాబాదు 1979.
11. భీమన్న బోయి. అసూయ. సర్వోదయ ప్రచురణ, మద్రాసు 1948.
12. భీమన్న బోయి. మానవుని మరొక మాజిలీ.సుఖేలా నిఖేతనం, హైదరాబాదు 1959.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

రాగవాసిష్టం– ప్రణయ రాగ చిత్రణ

– కాపర్తిస్వరాజ్యం
పరిశోధక విద్యార్థి
6281679473

అరుంధతి నక్షత్రం" పరమ పవిత్రమైనది. ఈ అరుంధతి కథ పురాణాల్లో అనేకవిధాలుగా చెప్పబడింది. నేటికీ హిందూ సంప్రదాయం ప్రకారం కొత్తగా పెళ్లైన జంటకు ఆకాశంలోని అరుంధతిని చూపే ఆచారాన్ని బట్టి, అరుంధతికి మన సంస్కృతి, సంప్రదాయంలో ఎంత గొప్ప చోటుందో చెప్పవచ్చు. సప్తర్షి మండలంలో వశిష్టుడి (భార్య) పక్కన నక్షత్రం వలె వెలుగుతూ ఉంటుందని పెద్దల నమ్మకం. పెళ్లైన తర్వాత అరుంధతి భర్తతో సమానమైన జ్ఞానం, పాతివ్రత్య మహిమను పొందింది. 12 సంవత్సరాలు వర్షాలు పడకపోవడంతో హిమాలయాల్లో కఠోర తపస్సు చేసి శివుని వరాన్ని పొంది, మునులకు ఆహారం అందించి వర్షాలు పడేలా చేసిన పతివ్రత.

పంచ మహాపతివ్రతల్లో ఒకరైన అరుంధతి కథ శివ, భాగవత పురాణాలు, రామచరిత మానస్ ఉత్తరకాండలో కనిపిస్తుంది. అరుంధతి జీవితం గురించి 1994లో జగద్గురు రాంభద్రాచార్య రచించిన 'అరుంధతి' అనే హిందీ పురాణ కవితలో చెప్పబడింది. ఇలా పౌరాణిక కథ అయిన అరుంధతిని బోయి భీమన్న కొత్తగా చూపించాడు. 1990లో చిత్రకూటంలో గురుదేవ్ హిందీ మహాకావ్యం గా అరుంధతి గురించి రచించాడు.

రాగవాసిష్టం సార్థక్యం:

కావ్యం, కథ, సినిమా దేనికైనా పేరు చాలా అవసరం. పేరును బట్టి వస్తువును అంచనా వేయవచ్చనడం అవిశయోక్తి కాదు. రామాయణమనగానే రాముని కథని తెలిసిపోతుంది. అలాగే ఎన్నో కథలు పేరుతోనే నిలిచిపోయేవి ఉండడం విశేషం. బోయి భీమన్న పౌరాణిక గాథ నుండి తీసుకున్న అరుంధతి కథను" రాగివాసిష్టం" అనే నాటకంగా తీర్చిదిద్దాడు. రాగం అంటే అనుబంధం ,ప్రేమ, అనురాగం వంటి అర్థాలుండగా వశిష్టుని ప్రేమానురాలు తెలిపే ఈ నాటకానికి సందర్భానుగతంగా

పేరు పెట్టడం జరిగిందని చెప్పవచ్చు. ఈ నాటకమంతా అరుంధతి, వశిష్టుల రాగబంధం ఉండడం విశేషం. ఈ రాగ బంధం సాధారణమైనది కాదు, ప్రేమతో ముడిపడినది. ఈ ఇద్దరి రాగ బంధాన్ని మరింత గాఢంగా తీర్చిదిద్దిన నాటకానికి వశిష్ఠుడు, అరుంధతి... కాకుండా "రాగవాసిష్టం "అనడం కవి ముందుచూపుకు నిదర్శనమే కాదు పేరు సార్థక్యతను నిలుపుకుంది.

ఈ నాటకంలో మొదట లోనే సంధ్య చేత పాట పాడిస్తాడు కవి .నాటకంలో రాగంతో కూడిన పాటలు ఉండడం కూడా ఒక ప్రత్యేకత.

అరుంధతి అరుంధతియే:

ప్రపంచానికే వెలుగునిచ్చే సూర్యుడు ఆదిత్యుడు.చీకటిగా ఉన్న ప్రపంచం సూర్యుని రాకతో వెలుగు పొందుతుంది. ఈ అరుంధతి లోకానికి వెలుగునిస్తుంది. ఇలా వెలుగునిచ్చే అరుంధతిని దళిత జాతి గౌరవ సూచకంగా చెప్పాడు కవి. సమాజంలో ఐదు వర్ణాలున్నాయి. పురాణాలు ,వేదాలు విష్ణుశరీరం నుండి నాలుగు వర్ణాలే పుట్టాయని మాత్రమే చెప్పగాసమాజం ఐదవ కులస్తుని పుట్టించి అంటరాని వానిగా చేసింది.అంటరాని వారందరికీ వెలుగునిచ్చిన దేవత అరుంధతి. ఆ అరుంధతి మునుల, దేవతలకు ఆకలి తీర్చి వెలుగునిస్తే, ఈ అరుంధతి అంటరాని కులానికి ఆదిదేవతయింది. ఈ నాటకం చదివిన తర్వాత అరుంధతి నిజంగా అరుంధతియే అనిపిస్తుందనడం అతిశయోక్తి కాదు.

బోయ భీమన్నఅరుంధతి చిత్రణ:

ప్రాచీన కాలపు అరుంధతికి, భీమన్న చిత్రించిన అరుంధతికి తేడా ఉంది. కవి పౌరాణిక కథను పౌరాణిక –సాంఘిక నాటకంగా తీర్చిదిద్దాడు.కవి సమాజంలోని అసమానతలు తొలగించడానికి చేసిన ప్రయత్నమే ఈ నాటకమని చెప్పవచ్చు. ప్రేమకు కులం, మతం, వర్గం, వర్ణనలతో సంబంధం లేదు, అందరిదీ ఒకే జాతి అది మానవజాతనే భావన కలిగించేలా ఉంటుందీ నాటకం. ఈ నాటకంలో అరుంధతి మామూలు స్త్రీ కాదు మహోత్తర ప్రేమమయమూర్తి, తేజో మూర్తి.

అరుంధతి దేవినే "అరంజ్యోతి" అంటారు. అంటే ఎప్పటికీ ఆరిపోని వెలుగని అర్థం. భీమన్న చిత్రించిన అరుంధతి ఎప్పటికీ మరణం లేని శాశ్వత కీర్తి కలది.నాటకంలో శివుడు వరం కోరుకొమ్మన్నప్పుడు తనభర్త పాదదూళిని తీసుకొని 'నేను పతిభక్తి గలదాన్నయితే అన్నపూర్ణమ్మకు నా మీద దయ ఉంటే కొండరాళ్లన్నీ, పిండి వంటలుగా మారాలని ,చెట్లని ఫలించాలని, చెరువులన్నీ మంచినీళ్లలో నిండాలి' అని కోరుకుందంటే ఆమె పాతివ్రత్యం,భక్తి ముందుతరాలకు ఆదర్శమే.

తనను అవమానించిన అగ్రవర్ణాలు, మునులు ఆకలితో అలమటించారు. కారణం పతివ్రత, తేజో సంపన్నురాలైన అరుంధతిని కులం తక్కువ దానివని అవమానించడమే. అరుంధతి తనను అవమానించిన వారి ఆకలి తీరాలనే పరమశివుని వేడుకుంటుంది. ఇలాంటి వ్యక్తిత్వం చాలా మందికి ఉండదు, కాని అరుంధతి అందరి మంచిని కోరుకునే గొప్ప మనసు కలది. ఈ సమాజంలో ఇప్పటికీ అరుంధతి కులస్తులు అక్కడక్కడ అవమాన పడుతుండడం కనిపిస్తుంది.

వశిష్ఠుడు వస్తాడో రాడోనని, తన ప్రేమ తనకు దొరకదేమోనని, మరొకరిని పెళ్లి చేసుకోలేననే మానసిక సంఘర్షన గల స్థితిలో అరుంధతి తనను తాను కూల్చుకుంటుంది. స్త్రీ ప్రేమ కోసం ప్రాణం వదిలేయగలదని అరుంధతి నిరూపించింది. దళితులకే కాదు, స్త్రీ జాతి మొత్తానికి ఈమె వెలుగునిచ్చే దేవతయింది.నాటకంలో కవి అరుంధతిని చిత్రించిన తీరు 'నా భూతో న భవిష్యత్తు' అన్నట్లుంటుంది. వశిష్టుడి కోసం కఠోర తపస్సు చేస్తుండగా ఆ తపోగ్నిలో శరీరం కాలుతుంటే, ఆకాశంలో దివ్యజ్యోతి కనిపిస్తుంది వశిష్టునికి.ఇక్కడ ఆమె శాశ్వత స్థానం ఆకాశం, వెలుగునిచ్చే దేవత, ఆమె చనిపోక ముందే ఆమె కీర్తి ఆకాశంలో వెలుగుచుక్కలా కనిపిస్తుంది. అందుకే నేటికీ కొత్తజంట ఆ వెలుగు దర్శించుకుంటే వారి దాంపత్యం విడిపోదని నమ్ముతాం.

పంచమ వర్ణం పుట్టుక:

ఈ నాటకం ముందు మాటలో అరుంధతి, అనసూయలే కాదు కపిల మహర్షి కూడా మాతంగుడే అని చెప్పబడింది. రచయిత వర్ణవ్యవస్థను విమర్శిస్తూ రాసిన నాటకమిదని చెప్పవచ్చు. పూర్వకాలం నుండి స్త్రీ, పురుషులు ఒక వర్ణం మరో వర్ణంతో సంబంధం కలిగి ఉండేవారు. ఉదాహరణకి బ్రహ్మణ స్త్రీ,శూద్ర, పురుషుడికి కొడుకు పుడితే చండాలుడని మనస్మృతి చెప్పగా, శూద్ర పురుషుడు వైశ్య స్త్రీ కి పుట్టేది అయోగుడు, క్షత్రియ స్త్రీకి పుట్టిన క్షతలే సంకరులు, అవరులు, పంచమ వర్ణాలు అంటారు.

నేటి సమాజంలో కులమనే అడ్డుగోడలు కట్టి మనుష్యులను పురుగుల కంటే హీనంగా చూస్తున్నారు. ఇలాంటి వారందరికీ కనువిప్పు కలిగించేది ఈ నాటకం అనడం అతిశయోక్తి కాదు. ఎందుకంటే కులంతో సంబంధం లేకుండా పెళ్లి జరిగిన ప్రతి జంట మొదటిగా చూసేది అరుంధతి నక్షత్రాన్నే. ఈ అరుంధతి దేవి నేడు కుల వివక్షకు గురవుతుందన్న సమాజానికి ఆదిదేవతను అవడం విశేషం. ఆకాశంలోని మాతంగిని దేవతగా చూసే ఈ సమాజం ఆమె వారసులను మాత్రం దూరంగా ఉంచుతుంది. ఈ వ్యవస్థ తీరుకు వారి మనస్తత్వంలోని లోపమే. భీమన్న ఈ నాటకంలో అరుంధతి పుట్టుక గొప్పతనంతో పాటు వశిష్టుడిపై ప్రేమను తెలుపాడు. ప్రాచీనుడికి, వశిష్టునికి జరిగిన సంభాషణ ద్వారా కులం కంటే గుణం గొప్పదని తెలియజేశాడు. శివుని సాక్షాత్కారం, మాటలు ప్రాచీనుడికి కనువిప్పు కలిగిస్తాయి.అందుకేముందుగా వసిష్టుడు, అరుధతిల ప్రేమను కులమనే పేరుతో అడ్డుకున్నా తర్వాత మాతంగైన అరుంధతితో వశిష్టుని పెళ్లి జరగడానికి ఒప్పుకుంటాడు.ఇలాంటి అనేక విషయాలు తెలిపి, ప్రాచీన కాలంలోనే లేని కుల వ్యవస్థ నేడు ఎందుకంటే ప్రశ్నించడం కనిపిస్తుంది ఈ నాటకంలో.

రాగవాసిష్టం వైశిష్టం:

"జన్మనా జాయతే శుద్రః
కర్మణా జాయతే ద్విజః
వేద పాఠంతు విప్రాణాం
బ్రహ్మజ్ఞానే బ్రాహ్మణః" బిసూక్తి ముక్తావలి

మనిషి పుట్టుకతోశూద్రుడు తన కర్మలతో ద్విజత్వమును పొందుతాడు. వేద పఠనం చేసిన వారు బ్రాహ్మణులయ్యారు. ఈ భావనే సమాజంలో స్థిరపడిందని భీమన్న అభిప్రాయమని చెప్పవచ్చు. రాగవాసిష్టంలో ఆర్య, అనార్య జాతుల మధ్య తేడా లేదని చెప్పడానికి ఆంతర్యం శ్లోకానికి సంబంధించిన భావనే. ద్విజులంతా ఆర్యులైనప్పుడు కేవలం అరుంధతి జాతి అనార్యులు కావడం సరైనది కాదంటాడు. అందుకే శూద్రుల నుండి వచ్చిన ద్విజులు ఆర్యులైనప్పుడు శూద్రులూ ఆర్యులే అంటాడు. ఆర్యులు, ఆర్యులను కలుపుకోకపోవడాన్ని ప్రశ్నించినట్లు ఉంటుంది ఈ నాటకం చదివితే.

ఈ నాటకంలో ఆర్యజాతి సిద్ధాంత భావనలు చాలావరకు కనిపించడం విశేషం. మానవులంటూ ఒకే జాతి తమ అవసరాలను బట్టి కులాలను నిర్మించుకున్నారే కాని మనుషుల్లో భేదాలు లేవడం నిజం.ఈ సత్యాన్ని భీమన్న రాగ వాశిష్టం నాటకంలో చెప్తూనే, విశ్వజనీనమైన మానవుని లక్షణాలను గుర్తు చేశాడని చెప్పవచ్చు. సమాజంలో జీవించడానికి కనీస అవసరాలు తీరితే చాలు, ఈ వర్ణ వ్యవస్థలో తేడా అవసరం లేదని కవి ఆంతర్య భావన. ఈ నాటకంలో కులగిరకి, శివోహానికి మధ్య జరిగిన సంభాషణ నేటి సమాజంలోని మనుషుల ప్రవర్తనను చూపుతుంది. పాతకాలం నుండి నాలుగు వర్ణాలే, ఐదో వర్ణం ఏ పురాణంలో లేకపోయినా ఉన్నత కులాలు,అధికారులు అంటారని వారనే ఐదవ కులాన్ని సృష్టించారు. అందుకే

'చతుర్వర్ణం మయాహీనం'

అంటూ చెప్పడం నాలుగు వర్ణాల్లో ప్రజలు సంకరజాతులని తెలుస్తుంది. మనిషి కులమనే భావనను కలిగి ఉండి, అంటరాని వారంటే నీచులు, హీనులుగా చూస్తున్నంత కాలం వారు ముందుకు పోలేరు. కులమనే పిచ్చి భావన పులికంటే భయంకరమైన భయం కలది. అందుకే బయటకు కనిపించే పులికంటే, కనిపించని కులభావనే భయంకరమైనది. మనిషి చావడానికి అయినా సిద్ధపడతాడు కానీ అంటరాని వానిగా చిత్రించిన మనిషితో కలిసే జీవించడానికి గాని ముట్టుకోడానికి గాని ఇష్టపడడుఈ విషయాన్ని శివోహం చేత చెప్పించాడు భీమన్న. ఈ భావన పోయినప్పుడే మనుషుల్లో మానవత్వం, మాధవత్వం పుడుతుందనే అంతరార్థం వ్యక్తం చేశాడు.అదే విధంగా ప్రేమకు కులంతో సంబంధం లేదని మనుష్యులందరూ ఒక్కటేనని వశిష్ఠుడు చేత చెప్పించడం జరిగింది.

దివ్యబాల అరుంధతీదేవి, అమృత
హృదయ నస్పృశ్యయనగా నోరెట్లు వచ్చె?
నరుని వలిబెట్టి హింసించు నరుడు నరుడే?
మానవాభ్యుదయము కిది మంచిదగునె? **– రాగవాసిష్టం, 82**

అరుంధతి ఎక్కడుంటే అక్కడ వసంతాలు పూస్తాయి. అలాంటి అరుంధతి దేవిని కులం పేరుతో అవమానించిన ప్రాచీనుడిని కోపగిస్తునే, మనిషిని మాటలతో బాధపెట్టే వాడు మనిషేనా అంటాడు. సమాజ అభ్యుదయానికి కులమనే అడ్డుగోడలు ఆటంకాలనడం సమాజ అభ్యున్నతి కాంక్ష కనిపిస్తుంది.'పవిత్రమైన బ్రహ్మ వంశంలో పుట్టి మాలకుడు కలిపేస్తున్నావ్' అన్న కులగిరి మాటలకు, ప్రాచీనుడి వెటకారానికి వశిష్టుడు'బ్రాహ్మణ, చండాలత్వాలను నిర్ణయించడానికి కులం కొలతబద్ధ

కాదు, పుట్టుక, స్థలాన్ని బట్టి విలువ కట్టలేం' అంటూ చేసిన బోధ నేటి తరానికి కనువిప్పు వంటిదే. ప్రాచీనుడు ఆ మాదిగ పిల్లను వదలవా అన్న మాటకు కూడ బ్రాహ్మణ బేధమెలా చెప్తావు, ప్రేమకివన్నీ ఉండవంటూనే మధువులోవిషం కలిపిచ్చినట్టు నా ప్రేమను కామమనడం సరికాదంటూ హితబోధ చెస్తాడు ప్రాచీనుడికి. భీమన్న నేటి సమాజానికి ఏం కావాలో ఈ నాటకంలో చూపించాడు. అరుంధతి,వశిష్టలను పార్వతి పరమేశ్వరులుగా పోల్చి, ప్రణయ దేవతలుగా దర్శిస్తాడు. ఆనంద పరవశంలో ఉన్న అరుంధతి ,వశిష్టలు ప్రతి ఒక్కరి కనులకు శివపార్వతులుగా కనిపించడం ప్రేమకు దైవత్వం ఉందనే నిజాన్ని చాటి చెప్పడమే. ఈ నాటకంలో ప్రతి అంకంలో వీరి మధ్య అనురాగం అణువణువునా కనిపిస్తుంది.

అనురాగానికి కులం అవసరం లేదని శివుని సాక్షాత్కారంతో చెప్పించాడు భీమన్న. ఈ నాటకం ముగింపు సమాజానికి కనువిప్పు కలిగించేలా ఉంటుందనడం అతిశయోక్తి కాదు. బ్రాహ్మణ వంశంలో పుట్టిన వశిష్టున్ని, మాతంగి కన్య అరుంధతిని పాత్రలుగా తీసుకొని సమ సమాజపు నిర్మాణానికి పునాది వేశాడు ఈ నాటకంలో భీమన్న.

రాగవాసిష్టంతో ప్రణయరాగాల నాటకమే కాదు, సమాజానికి కొత్త రాగం వినిపించాడు. ఈ రాగాలాపన నలుమూలల వినిపించాలని, కులం అనే అడ్డుగోడ తీగ తెగాలని కోరుకున్నాడు. అందరూ ఒక్కటేననే భావన ఏర్పడి ప్రజల్లో కొత్తరాగం వినిపించాలనే ఆశను తెలియజేశాడు భీమన్న. నాలుగు వర్ణాలు, నాలుగు దిక్కులు అంతేకాని అంటరానితనమనే ఐదవవర్ణం అరుంధతికి అంటగట్టి సమాజంలో అంటరానివారనే కొత్త కులం ఏర్పరిచి., సంఘానికి దూరంగా ఉంచడం మన జాతి చరిత్రకే మచ్చ వంటిదనే అంతరార్థం ఈ నాటకం ద్వారా తెలిపాడు.

ముగింపు:

అందరిలో ఉండేది ఒకే రక్తమైనా వేరువేరు కులాలు ఏర్పడి మనిషిని, మనిషే నీచంగా చూస్తే స్థితి వచ్చింది. కారణమేదైనా అవమానాలు మిగిలిపోయాయి. ఈ స్థితిని చూపిస్తూనే ఈ పరిస్థితి మారాలనే భావనతో భీమన్న రాగవాసిష్టం రచించాడని చెప్పవచ్చు. అరుంధతి దేవి పవిత్రత, తేజస్సు పార్వతి దేవితో సమానమైనదిగా చిత్రించి, ప్రేమకు కులంతో పనిలేదని తెలిపాడు. ఈ నాటకంలో ప్రతిపాత్ర చేత జరిపిన సంభాషణ పాటకునికి కనువిప్పుకలిగిస్తుంది. ముట్టుకుంటేనే మైలపడ్డామని నదిలో దూకే వ్యవస్థనుండి, మూడుముళ్ల బంధాన్ని వేసి మాతంగిలుమనలాంటి మనుషులేననే సత్యం తెలిపాడు. నాటకంలో వశిష్ఠుడు కొత్త సమాజానికి నాంది పలికిన వాడిగా కనిపిస్తాడు.

ఆధునిక కాలంలో వర్ణ వ్యవస్థను తెలిపే సాహిత్యం ఎక్కువగానే వచ్చింది కాని భీమన్న ఈ నాటకాన్ని పౌరాణిక వస్తువును తీసుకొని రచించడం వల్ల పాటకుని హృదయాన్ని తాకిందనడం అతిశయోక్తి కాదు. ప్రాచీనుడిలో వచ్చిన మార్పు సమాజంలో రావాలనే తపన భీమన్నది. అందుకే ఈ నాటకానికే రాగవాసిష్టమనే పేరు పెట్టాడు. ప్రతి సమాజంలో ఈ నాటకం చైతన్యంతో పాటు సామాజిక స్పృహను కలిగిస్తుంది. హైమవతీ గారు 'నిండా చాదస్తం' గల సనాతన పండితులు సైతం భీమన్న సిద్ధాంతాలు కాదనలేరని చెప్పడాన్ని బట్టి ఈ నాటకం ప్రాధాన్యత తెలుస్తుంది.

ఆధార గ్రంధాలు:

1. భీమన్న బోయి, రాగవాశిష్టం, సుఖీలానికేతన్ ప్రచురణలు, Hyd, 1959
2. వేద వ్యాస, ప్రాచీనభగవద్గీత (పరిష్కృతమైన మూలము), యోగ మిత్రమండలి ప్రచురణ, Hyd, first addition 2000
3. హైమవతీ, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న, సుఖేలానికేతన్ ప్రచురణలు, Hyd second edition 1982
4. మూర్తి బి.బి.ఎస్. దళితకథామండలి, త్రివేణిప్రింటర్స్, రాజమండ్రి, 1992.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

సాహిత్యం మరియు సమాజం: బోయి భీమన్న గారి కృషి

– డాక్టర్ జి. కిరణ్ కుమార్ రెడ్డి, ఆంగ్ల ఆచార్యులు,
అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలు, ఆంధ్రప్రదేశ్

– డాక్టర్ చి. పాల్ కృపాకర్, బోధనా సహాయకులు,
ఆంగ్ల విభాగం, డాక్టర్ అబ్దుల్ హక్ విశ్వవిద్యాలయం, కర్నూలు, ఆంధ్రప్రదేశ్,

సమాజాన్ని తీర్చిదిద్దడంలో సాహిత్యం ఒక అగ్రగామి పాత్రను పోషిస్తుంది. చుట్టూ ఉన్న సమాజాన్ని, దాని సమస్యలను ప్రతిబింబించే సాహిత్యమే అత్యుత్తమమైనదిగా పరిగణించబడుతుంది. సామాజిక సమస్యల నుండి తప్పించుకునే కళలు, ఎడారి గాలిలో తమ పరిమళాన్ని వృధా చేస్తూ, ఎవరి కంటా పడకుండా వాడిపోయే పువ్వుల వంటివి.

సాహిత్యం అనేది ప్రపంచానికి ఒక కిటికీ వంటిది. ఇది ప్రజలను, వారి జీవనశైలిని, ఆచార వ్యవహారాలను మాత్రమే కాకుండా.. వివిధ వ్యక్తులతో వారి సంబంధాలు, విభిన్న పరిస్థితుల్లో వారి ప్రవర్తన మరియు సంపద, మతం, సామాజిక నిబంధనల పట్ల వారి వైఖరిని కూడా ప్రతిబింబిస్తుంది.

బోయి భీమన్న: జీవితం మరియు ప్రస్థానం

బోయి భీమన్న గారు సెప్టెంబర్ 19, 1911న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురులో పుల్లయ్య, నాగమ్మ దంపతులకు జన్మించారు. తన వృత్తి జీవితం ప్రారంభంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన, తదనంతరం జనవాణి, జయభేరి, ప్రజామిత్ర, నవజీవన్ మరియు ఆంధ్రప్రభ వంటి పత్రికలలో పనిచేశారు.

సామాజిక విప్లవం మరియు రచనలు

బోయి భీమన్న గారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన "అనిహిలేషన్ ఆఫ్ కాస్ట్" (Annihilation of Caste) గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. ఆయన అంబేద్కర్ తత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. తన నాటకాలలో సామాజిక అసమానతలు మరియు దళితులపై జరుగుతున్న అణచివేతను ప్రధాన ఇతివృత్తాలుగా స్వీకరించారు.

ఆయన ప్రముఖ రచనలలో కొన్ని:

పాలేరు
కూలీ రాజు
అసూయ
ప్రగతి
పడిపోతున్న గోడలు
రాగ వాసిష్ఠం
ధర్మవ్యాధుడు
బాలయోగి
చిత్ర కళాదర్శనం

'పాలేరు' నాటక కథ కథానాయకుడు వెంకన్న చుట్టూ తిరుగుతుంది. ఒక భూస్వామి వద్ద పాలేరుగా పనిచేస్తూ అతను ఎన్నో కష్టాలను అనుభవిస్తాడు. ఆ తర్వాత వాటన్నింటినీ అధిగమించి కష్టపడి చదువుకుంటాడు. నాటకం ముగింపులో అతను ఉన్నత ఉద్యోగం సాధించి, అన్యాయాన్ని అడ్డుకుంటాడు. ఈ నాటకం ఎంతోమందికి స్ఫూర్తినిచ్చింది.

ఆయన రాసిన 'రాగ వాసిష్ఠం' ఒక ప్రత్యేకమైన రచన. ఇందులో అరుంధతి, వశిష్ఠుడు, ప్రాచీనుడు, సంధ్య వంటి పాత్రలు ప్రాచుర్యం పొందాయి. భీమన్న గారు ఒక సమసమాజాన్ని (Egalitarian Society) కలలుగన్నారు.

సామాజిక విశ్లేషణ

భారతదేశంలో ఉన్న అగ్రవర్ణ మరియు నిమ్న వర్ణాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఈ వ్యాసంలో నేను ఎత్తిచూపాలనుకుంటున్నాను. ఇది గ్రామీణ భారతావనిలో ఒక ప్రధాన సమస్యగా మారింది. భారతదేశంలో రకరకాల సంప్రదాయాలు, కులాలు, మతాలు ఉన్నాయి. మన పూర్వ పాలకులు అన్య దేశాల నుండి వచ్చిన వివిధ జాతులను అనుమతించారు. భారతీయులు "భిన్నత్వంలో ఏకత్వం" అని భావించినప్పటికీ, అమలు విషయానికి వచ్చేసరికి అది విఫలమవుతోంది.

గిరీష్ కర్నాడ్ తన "త్రీ ప్లేస్" (1994) పీఠికలో ఇలా పేర్కొన్నారు:

"మా తరానికి, వంద ఏళ్ల పట్టణ నాటక రంగం అంటిపెట్టుకోవడానికి లేదా ప్రారంభించడానికి ఏమీ మిగిల్చలేదనిపించింది. మళ్ళీ ఎక్కడ మొదలుపెట్టాలి? బహుశా మన

ప్రేక్షకులను మళ్ళీ చూడటం ద్వారా, నాటకం నుండి ప్రేక్షకులు ఎలాంటి అనుభూతిని ఆశిస్తున్నారో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ద్వారా కావచ్చు."

ఆక్స్‌ఫర్డ్ అడ్వాన్స్‌డ్ లెర్నర్స్ డిక్షనరీ (8వ ముద్రణ) ప్రకారం "దళిత్" అనే పదానికి అర్థం: "సాంప్రదాయ కుల వ్యవస్థలో అత్యంత తక్కువగా పరిగణించబడే మరియు అతి తక్కువ ప్రయోజనాలు కలిగిన కుల సభ్యుడు: సామాజిక మరియు ఆర్థిక హక్కుల కోసం పోరాడేవారు." 'దళిత' అనే పదం 1930ల నుండి వాడుకలో ఉంది.

దళిత నిర్వచనం మరియు నేపథ్యం

"దళిత అంటే ఈ దేశపు సామాజిక మరియు ఆర్థిక సంప్రదాయాల వల్ల దోపిడీకి గురైన, దుర్వినియోగం చేయబడిన అణగారిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, పేద రైతులు, మహిళలు మరియు పురుషులు అని అర్థం."

'దళిత' అనే పదం మరాఠీ భాష నుండి ఉద్భవించింది. దీనికి 'ముక్కలైన' లేదా 'చిన్నాభిన్నమైన' అని అర్థం. దళిత చరిత్రలలో ఈ పదాన్ని అట్టడుగు వర్గాలకు, ముస్లింలకు మరియు క్రైస్తవులకు కూడా అన్వయిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమం 1906లో ప్రారంభమైంది. విస్మరించబడిన సమాజాలను మేల్కొల్పడానికి భాగ్యరెడ్డి వర్మ ఈ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారు.

సాహిత్య దిగ్గజాలు: బోయి భీమన్న మరియు గిరీష్ కర్నాడ్

దళిత ఆవేదన గుర్రం జాషువా, బోయి భీమన్న, కుసుమ ధర్మన్న, కత్తి పద్మారావు వంటి వారి రచనలలో ప్రతిబింబించింది. భీమన్న గారి 'పాలేరు', 'కూలీ రాజు', 'గుడిసెలు కాలిపోతున్నై' వంటి రచనలు దళిత సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి.

నాటకం అనేది ప్రజల జీవితాలను మార్చే ఒక శక్తివంతమైన మాధ్యమం. ఆధునిక తెలుగు, కన్నడ నాటక రంగ ఆకాశంలో పద్మభూషణ్ బోయి భీమన్న మరియు జ్ఞానపీఠ్ గ్రహీత గిరీష్ కర్నాడ్ సూర్యచంద్రుల వంటివారు. వీరి నాటకాలను శైలిని బట్టి సంప్రదాయ, చారిత్రక మరియు సామాజిక నాటకాలుగా విభజించవచ్చు.

తెలుగులో భీమన్న రచనలు: పాలేరు, కూలీ రాజు, పైరు పాట, పడిపోతున్న అడ్డుగోడలు, మానవుని మరో మజిలీ, స్నేహ సుందరి మొదలైనవి.

కన్నడలో గిరీష్ కర్నాడ్ రచనలు: యయాతి, తుగ్లక్, హయవదన, తలేదండ, బలి, నాగమండల, బింబ, అగ్నివర్ష మొదలైనవి.

నాటకాలలో దళిత దృక్పథం

వీరిద్దరి నాటకాలలో సామాజిక అంశాలు స్వేచ్ఛగా చిత్రించబడ్డాయి. దళిత దృక్పథం ప్రతి పంక్తిలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. 'పాలేరు' నాటకంలో, అగ్రవర్ణాలు దళితులను పాఠశాల విద్యకు దూరం చేస్తూ, తమ పొలాల్లో చాకిరీకి పరిమితం చేసే అకృత్యాలను భీమన్న గారు చక్కగా చిత్రించారు.

గిరీష్ కర్నాడ్ తన 'తలేదండ' నాటకంలో తక్కువ కులానికి చెందిన 'బిజ్జలుని' పాత్రను సృష్టించారు. 12వ శతాబ్దంలో ఉన్న కుల విభజనను ప్రదర్శించడం ద్వారా కర్నాడ్ మానవ సమాజంలో సమానత్వాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు.

'రాగ వాసిష్ఠం' అనేది ఒక సామాజిక ఫాంటసీ నాటకం. ఇందులో ప్రేమికుల మధ్య జరిగే దళితుల అణచివేతను భీమన్న హైలైట్ చేశారు. కుల వివక్షను నిర్మూలించడానికి దేవుడే భూమిపైకి రావాలని ఆయన ముగింపులో పేర్కొన్నారు. శివుడి పాత్ర ద్వారా అగ్రవర్ణాలలో మార్పు తీసుకురావాలని, దళితుల అభివృద్ధి జరగాలని ఆయన సందేశాన్ని ఇచ్చారు.

కర్నాడ్ తన 'అగ్నివర్ష' నాటకంలో కూడా సామాజిక ఫాంటసీ టెక్నిక్‌ను ఉపయోగించారు. పురాణ ఇతివృత్తాన్ని వ్యంగ్యంగా స్వీకరించి, పరావసు, అర్వావసు వంటి బ్రాహ్మణ పాత్రల ద్వారా అగ్రవర్ణాల అణచివేతను ఎండగట్టారు. 'నితిలి' అనే గిరిజన యువతి పాత్ర ద్వారా దళిత అంశాన్ని ప్రతిపాదించారు. అగ్రవర్ణాల వారు ఆమెను ప్రేమించినప్పటికీ, చివరికి నితిలి ప్రేమికుడు అర్వావసు పలికే "మనం అగ్రవర్ణాల వారిని నమ్మకూడదు" అనే మాట నిమ్న కులాలపై జరుగుతున్న దాడులను సూచిస్తుంది. ముగింపు

భారతదేశం ప్రాచీన కాలం నుండి కుల వ్యవస్థకు నిలయంగా మారింది. హిందూ సంప్రదాయాలు, పురాణాలు, సాహిత్యం మరియు కళలు ఈ సిద్ధాంతాన్ని భారతీయుల మనస్సులలో బలంగా నాటాయి. ఇది అడవి మంటలా వ్యాపించి అంటరానితనానికి దారితీసింది. భీమన్న గారి నాటకాలు ఈ సామాజిక జాడ్యాన్ని ఎత్తిచూపి, సమాజంలో మార్పు తెచ్చేందుకు కృషి చేశాయి. తెలుగు నాటక రంగానికి ఆయన చేసిన కృషి అపారమైనది మరియు ఆయన 'సర్వోదయ సోషలిజం' వ్యాప్తి చెందాలని ఆకాంక్షించారు.

గిరీష్ కర్నాడ్ కూడా తన నాటకాలలో ఇదే అంశాన్ని నొక్కి చెప్పారు. ఆయన రాసిన 'తలేదండ' నాటకం, 1980ల నాటి మందిర్–మండల్ ఉద్యమాలకు సమాంతరంగా, 12వ శతాబ్దపు కర్ణాటకలో జరిగిన కుల వ్యతిరేక ఉద్యమ హింసాత్మక చరిత్రను వివరిస్తుంది. ఇది హిందూ మతంలోని కుల సరిహద్దుల మధ్య ఘర్షణలనే కాకుండా, హిందూ మతానికి మరియు బౌద్ధ, జైన వంటి సంస్కరణ మతాలకు మధ్య ఉన్న వైరుధ్యాలను కూడా ఎత్తిచూపుతుంది

తలేదండ: కుల వ్యవస్థపై గిరీష్ కర్నాడ్ విశ్లేషణ

'తలేదండ' నాటకంలో కర్నాడ్ కాలాతీతమైన మరియు అత్యంత సున్నితమైన అంశాన్ని స్పృశించారు. అదే భారతీయ కుల వ్యవస్థలోని వికృత రూపం. ఒకప్పుడు ఆదర్శవంతమైనదిగా కొనియాడబడిన ఈ వ్యవస్థలోని లోపాలను ఆయన ఎత్తిచూపారు. ఇది ఒక చారిత్రక సంఘటన ఆధారంగా రాసిన నాటకమే అయినప్పటికీ, కర్నాడ్ ఉపయోగించిన ప్రతీకవాదం (Symbolism), వ్యంగ్యం (Irony) మరియు హాస్యం దీనిని ఒక ఆధునిక నాటకముగా తీర్చిదిద్దాయి. ఈ ఆధునిక పద్ధతుల వల్లే నాటకంలోని చిన్న పాత్రలు కూడా నేటి భారతదేశ సామాజిక–రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తాయి.

ఈ నాటకం సంప్రదాయ ఛాందసవాదులకు మరియు సెక్యులర్ (లౌకిక) సిద్ధాంతంతో కూడిన సమాజాన్ని నిర్మించాలనుకునే బసవన్న వంటి ప్రగతిశీల ఆలోచనాపరులకు మధ్య జరిగే పోరాటం. రాజు బిజ్జలుడు తాను మంగలి కులం నుండి వచ్చినవాడిననే విషయాన్ని నిరంతరం గుర్తుంచుకుంటాడు. బిజ్జలుడి పాత్ర ద్వారా కర్నాడ్ భారతీయ కుల వ్యవస్థపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బసవన్న అహింసా సిద్ధాంతాన్ని నమ్ముతారు, తన అనుచరులు జైనుల పట్ల ప్రవర్తించే తీరును ఆయన వ్యతిరేకిస్తారు.

పాత్రల చిత్రణ మరియు సామాజిక దృక్పథం

కర్నాడ్ 'నితిలి' పాత్ర ద్వారా క్రమశిక్షణ, త్యాగంతో కూడిన జీవితానికి మరియు భావోద్వేగాలతో కూడిన సహజ జీవితానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూపారు. ఈ నాటకంలో బ్రాహ్మణవాదాన్ని కఠినత్వంతోను, శూద్ర సంస్కృతిని ప్రేమ, కరుణ మరియు ఆశతోను ముడిపెట్టారు (అయితే ఈ పోలిక మరీ సరళంగా ఏకపక్షంగా ఉండదు). కుల సరిహద్దులు మనుషులను ఎలా అణచివేస్తాయో చూపడానికి నితిలి పాత్రను ప్రవేశపెట్టారు. ఇది మంచికి, చెడుకు మధ్య జరిగే సంఘర్షణను నాటకీయంగా ప్రదర్శిస్తుంది. ఈర్ష్య, మత విద్వేషం మరియు కుల వ్యవస్థతో విడిపోయిన ప్రపంచాన్ని కాదని, ప్రేమ తనదైన కొత్త ప్రపంచాన్ని వెతుక్కోవడం అనే అంశం నేటి కాలానికి ఎంతో అవసరం.

బిజ్జలుడి పాత్ర ద్వారా కర్నాడ్ దళిత దృక్పథాన్ని ఇలా చాటారు:

"జాతి అనేది మనిషిపై చర్మం వంటిది. దాన్ని వలిచి పారేసినా, కొత్త చర్మాన్ని చూసి కూడా అందరూ పాత జాతినే గుర్తు తెచ్చుకుంటారు. వీడు మాల, వీడు క్షత్రియ, వీడు గొల్లవాడు అని అంటారు."

ఈ విధంగా భీమన్న మరియు కర్నాడ్ తమ నాటకాల ద్వారా దళిత దృక్పథ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లారు.

భీమన్న మరియు కర్నాడ్: ఒక పోలిక

కర్నాడ్ 'తలేదండ'లో ప్రధానంగా దళిత సమస్యలను చిత్రించగా, భీమన్న తన దాదాపు అన్ని నాటకాల్లో దళిత సమస్యలను ప్రతిబింబించారు. కర్నాడ్ జగదేవ, మల్లి బొమ్మ, బసవన్న, బిజ్జలుడు, హరళయ్య, మధువరస వంటి పాత్రల ద్వారా దళిత సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. వీరందరి మధ్య ఒక స్నేహపూర్వక సంబంధం ఉంటుంది.

అదేవిధంగా, భీమన్న తన 'పాలేరు' నాటకంలోని వెంకన్న, ఉపకారి, రామం, రామదేవి, ఉమాదేవి, పరమ్ జ్యోతి, మధు వంటి పాత్రల ద్వారా కేవలం దళిత అంశాలనే కాకుండా, మత కులాల మధ్య ఎటువంటి వివక్ష ఉండకూడదని చాటిచెప్పారు. వీరిద్దరూ ఒక సమసమాజం (Egalitarian Society) కోసం కృషి చేశారు. పాఠకులలో సామాజిక రుగ్మతలు మరియు అకృత్యాల పట్ల అవగాహన కల్పించి, సామాజిక విప్లవాన్ని తీసుకురావడానికి ఇద్దరు రచయితలు కుల వ్యవస్థను, అంటరానివారి జీవితాలను తమ రచనల్లో చిత్రించారు.

మానవతావాదం మరియు ముగింపు

కర్నాడ్ స్వయంగా ఇలా పేర్కొన్నారు: "నేను ఈ నాటకం రాస్తున్నప్పుడు 'మండల్' మరియు 'మందిర్' ఉద్యమాలు, వాటి వల్ల కలిగిన అశాంతి నా మనసులో ఉన్నాయి."

కర్నాడ్ కాల్పనిక కళకు 'మానవతావాదం' కేంద్రబిందువు. ఆయన మానవతా దృష్టి తూర్పు మరియు పశ్చిమ దేశాల ప్రభావంతో ఏర్పడింది. కరుణ అనేది ఆయన దృష్టిలో ప్రధాన ప్రేరణ. మానవత్వం మీద, దాని గొప్పతనం మీద నమ్మకంతో మనుషులను ప్రేమించడమే నిజమైన మానవతావాదం. మనిషి స్వతహాగా పరిపూర్ణుడు. అతనిలోని లోపాలకు పర్యావరణం లేదా ఇతర సామాజిక కారణాలే కారణం. మానవ సృజనాత్మకత ఎప్పుడూ ఉన్నతమైన జీవన ప్రమాణాల వైపే సాగుతుంది. మతం కంటే మానవత్వమే మిన్న. మనిషి ఆలోచనా విధానం మారితే, మెరుగైన సమాజాన్ని మరియు ఉజ్వల భవిష్యత్తును నిర్మించవచ్చు.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్నగారి పైరు పాట – ఒక పరిశీలన

– డా. గండవరపు విద్యాధరి
తెలుగు అధ్యాపకురాలు

ఉపోద్ఘాతం:

ఆధునిక తెలుగు సాహిత్యంలో బోయి భీమన్న గారి సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. భీమన్న గారు సాహితీ లోకానికే కాక యావత్ భారతదేశానికి పద్మశ్రీ భీమన్నగా ఉత్తమ కవిగా సుపరిచితులు. తెలుగు జాతిలో నీటి మేధావి వర్గంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం గలవారు భీమన్న గారు. ఉత్తమ కవి, రచయిత, రూపకకర్తగా పేరున్న పండితులు వీరు. వీరు రచించిన అనేక రూపకాలలో "పైరు పాట" అనేది సామాజిక నేపథ్యంతో కూడినదిగా ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. భీమన్న గారి రచనల్లో గ్రామీణ జీవనం అప్పటి వ్యక్తుల అక్కడి అనుభవాలు, జ్ఞాపకాలు, భీమన్న రచనలన్నింటిలోనూ చోటు చేసుకున్నాయి. వీరికి "పైరుపాట" రూపకం ఇందుకు చక్కని ఉదాహరణ. ప్రకృతిలోని సహజ సౌందర్యమంతా అలంకరించిన కోనసీమలో ప్రకృతి పురుషుల్లాంటి తల్లిదండ్రుల సన్నిధిలో బాల్యం గడిపాడు భీమన్న. తన బాల్యంలో పొందిన అనుభూతులు, సంఘటనలు వీరి రూపకాలన్నింటిలోనూ కనిపిస్తాయి.

ఉదాహరణకు ఒకచోట భీమన్న ఇలా అంటాడు.

"నగ్న సత్యం వేదాంతం
అలంకృత సత్యం కవిత్వం"

అని కవిత్వం యొక్క గొప్పతనాన్ని గురించి భీమన్న తెలియజేశారు.

బోయి భీమన్న గారి రచనల్లో ప్రేమ, ఆరాధన, పరమతాత్వికచింతన వీరి రూపకాల్లో అంతర్వాహినిగా ప్రవహిస్తున్నాయి.

బోయి భీమన్న సహజ కవి. సహజంగా తాత్వికచింతన కలవారు. ఈ పైరుపాట (1959) లో రచించబడింది. ఇంతే కాకుండా పాలేరు (1940), కూలిరాజు (1947, అసూయ (1954) ఇలా మొదలైన 11 రూపకాలు ఉన్నాయి. అందులో "పైరు పాట" ఒకటి

పైరుపాట – సామాజికత :

బోయి భీమన్న గారి "పైరుపాట" ఒక దృశ్య కావ్యం. దృశ్యమానమైన నాటకాలను రూపకాలని అంటారు. "పైరు పాట" అనేది ఒక సామాజిక రూపకం. మానవుడు సంఘజీవి. అతని వ్యక్తిత్వ వికాసం పై సమాజ ప్రభావం ఉంటుంది. భీమన్న గారు జాతీయోద్యమ కాలంలో గ్రామీణుల జీవితాన్ని ప్రతిబింబిస్తూ, గ్రామప్రజల రాజకీయ, నైతిక, సాంఘిక, చైతన్యాన్ని పురికొల్పడానికి పాలేరు, కూలిరాజు, పైరుపాట మొదలైన రూపకాలను రచించాడు. ఈ "పైరుపాట" ప్రేమ, సామాజిక నేపథ్యంతో కూడిన ఇతివృత్తం కలిగి ఉంటుంది. నవరసభరితంగా, సాంఘిక చైతన్యం కోరుతూ రచించబడిన రూపకం "పైరుపాట". ఇందులో గేయ కవిత్వం ఒక అనుభూతిని కలిగిస్తుంది. ఈ రూపకంలోని ముఖ్యమైన అంశం సాంఘికమైనదే అయినా, ఇది ఒక మనోభావాత్మకమైనదిగా చెప్పవచ్చు. ఇందులో ప్రకృతి వర్ణనలు, ప్రణయ వర్ణన, సామాజికత, గ్రామీణ వ్యవసాయ జీవన చిత్రణ, మొదలైన అంశాలతో కూడిన ఇతివృత్తం ప్రధానంగా ఉంటుంది. స్నేహ,శ్రీవత్స, శీల అనే ప్రధాన పాత్రలతో కథాకథనంతో ఈ రూపకం చక్కని సంభాషణాత్మకంగా కొనసాగుతుంది.

పైరుపాట – ఇతివృత్తం :

పైరు పాటకు రంగస్థలం భీమన్న గారికి బాల్యం నుండి సుపరిచితాలైన గోదావరి తీరంలోని పచ్చని పంటపొలాలు. ఈ రూపకంలో కథానాయిక "స్నేహ" (కథానాయిక) ఒక మాల పిల్ల. పేదరికంలో పెరిగి పెద్దయిన యువతి ఆమె. పైరుచేల గట్లల్లో పచ్చగడ్డి కోసుకునేందుకు ప్రతి సాయంత్రం పొలాల్లోకి వస్తుంటుంది. ఒక కామందు ఇంట్లో పాలేరుతనానికి కుదురుతుంది. యజమాని ఇంటి పనులు చేయడం, పశువులను మేత కోసం ప్రతిరోజు పంట పొలాల్లో గడ్డి కోసుకొని తిరిగి ఇంటికి వెళ్లడం, పండు తల్లి అందాలను చూసి ఆనందించడం ఇది ఆమె దినచర్య. "శీల" ఆమె స్నేహితురాలు. ఆమె కూడా ఒక కామందు ఇంట్లో పనికి కుదిరినదే. శ్రీవత్స (కథానాయకుడు) అనే అగ్రకుల విద్యావంతుడు ఆ పొలాల్లోనే షికారుకు వచ్చి స్నేహం చూసి ఆమెతో స్నేహం చేస్తాడు. స్నేహ, శ్రీవత్స ఇద్దరి మనస్సులు ఆకర్షణకు లోనై వీరిరువురి స్నేహం ప్రణయంగా మారడాన్ని భీమన్న గారు చాలా సున్నితంగా ముగ్ధ మనోహరంగా చిత్రించారు. శీల తన స్నేహితురాలిని ఆమె ప్రేమను గూర్చి విని ఆమెను హెచ్చరిస్తూ ఉంటుంది. కారణం ఒక అగ్రకులం అబ్బాయిని ఆమె ప్రేమించడంవలన సమస్యలు వస్తాయని తన స్నేహితురాలి భావన. శీల చక్కని లౌక్యం తెలిసిన అమ్మాయి.అప్పుడు "స్నేహ" తాను గతి తప్పుతున్నానేమో అని భయపడుతుంది. ఎంత అభ్యుదయవాది అయినా శ్రీవత్స అగ్రకులస్థుడు. గొప్పవాళ్ళ బిడ్డ అయిన శ్రీవత్స తనను పెళ్లి చేసుకుంటాడో లేదో అని స్నేహ కలవరపడుతుంది. అందని దానికోసం తాను ఎగబడుతున్నానేమో అని వెనకాడుతుంది. తన మనస్సును కట్టడి చేసుకునే ప్రయత్నంలో అతనికి కనబడడం మానేస్తుంది. ఈ విషయం తెలిసిన స్నేహ స్నేహితురాలైన "శీల" అయోమయంలో పడుతుంది. శ్రీవత్సకు ఆందోళన

కలుగుతుంది. శీలను అడిగి శ్రీవత్స స్నేహం గూర్చి విషయం తెలుసుకొని, ఆమె అనుమానాలను, అభ్యంతరాలను తొలగించి, స్నేహను శ్రీవత్స వివాహం చేసుకుంటాడు.

ఇది ఈ రూపకంలోని ప్రధాన ఇతివృత్తం. అభ్యుదయ భావాలు గల శ్రీవత్ససను గొప్పగా చిత్రించాడు కవి భీమన్న. ఇది ఒక సామాజికమైన ప్రణయకావ్యం అంటే అతిశయోక్తి కాదేమో.

పైరుపాట –ప్రకృతి వర్ణన:

భావ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు, ఆకులో ఆకునై, పువ్వులో పువ్వునై "అన్న వారి ప్రభావం వీరిపై ఉందనవచ్చు. అందుకే భీమన్న గారు ఈ విధంగా ప్రకృతిని అందంగా వర్ణించారు. ఈ రూపకంలో ఎంతో అందంగా రమనీయంగా ప్రకృతిని వర్ణించారు భీమన్న కవి. కోనసీమ పల్లె వాతావరణం ఈ పైరుపాట పునాది అయింది. భీమన్న గారి దృష్టిలో ఈ పైరుపాట బ్రతుకులోని కమ్మదనానికి సంకేతం. వీరి ప్రకృతి వర్ణనలకు చక్కని ఉదాహరణలను పరిశీలిద్దాం.

"గడ్డి పువ్వు గానైనా
కలువ పువ్వు గానైనా
నీ యడుగుల దరినైనా
నీ యెడబాటుననైనా"

భీమన్నఈ విధంగా ప్రకృతి పరంగా సాంఘిక సమస్యను తెలియజేయడం విశేషం.

పైరుచేలు పచ్చిక బీళ్ళు, అచ్చటి గడ్డిపిల్లల ఆటలు, కుర్రవాళ్ళ షికారు మొదలైనవి ఈ ప్రకృతి వర్ణనకు ప్రధాన వస్తువులు. ఎందుకు ఈ చక్కని ఉదాహరణ నిదర్శనం.

"మంచుబొట్టో, మధు బిందువో,
మనుగడకంతే చాలని
కమ్మగ జీవించే యీ
గడ్డిపువ్వు కడకంటికీ
పాలకడలి చూపి– తు
ఫాను రేపినావేలా?"

అని భీమన్న అన్నప్పుడు తాను సృష్టించిన పాత్ర "స్నేహ" యొక్క హీనస్థితి మరియు పేదతనం తెలుస్తుంది. పేదవారిలో ఉన్న గొప్పదనం ఎంతటిదో, గడ్డి పువ్వును ప్రతీకగా చేసి రచించిన పైరు పాట వస్తు వైవిధ్యం తెలియజేస్తుంది.

పైరు పాట సన్నివేశ చిత్రణ :

ఇది పైరు పాట. పైరుచేలు, పచ్చిక బీళ్ళు, అచ్చటి గడ్డి పిల్లలూ, కుర్రవాళ్ళ షికార్లు మొదలైనవి ఈ రూపకానికి మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఈ పైరుపాట అనే రూపకం ప్రధానంగా నృత్య ప్రదర్శనకు అనుకూలంగా ఉంటుంది. ఇందులో ఏడు రంగాలు ఉన్నాయి. అంకాలకు బదులుగా

రంగాలుగా ఈ రూపకం విభజించబడింది. ఈ పైరుపాటను గూర్చి బోయ భీమన్న గారు ఇలా అన్నారు, " దీన్ని నృత్య సంగీత రూపకంగా ప్రదర్శించవచ్చు. రంగాలు కాల గమనాన్ని సూచించేవి మాత్రమే. మొదటి ఆరు రంగాలకూ దృశ్యం ఒక్కటే. ఏడవ రంగంలో మార్పు కుటీరం మాత్రమే. ఇది ఒక చిన్న రంగం ఒక చిన్న అమ్మాయి తో ఏ పెండ్లి సందర్భంలోనైనా ఈ రంగం ప్రదర్శించవచ్చు అని అనడం విశేషం. పుష్యమాస ఋతువర్ణన ఇందులో ఉంది. స్నేహ, శ్రీవత్సల ప్రణయ సన్నివేశం, అత్యద్భుతంగా కవి భీమన్న చిత్రించడం విశేషం.

పైరుపాట –సంభాషణలు:

భీమన్న తత్వాన్ని గ్రహించడానికి వారి రూపకంలోని సంభాషణలు తోడ్పడతాయి. ఈ పైరు పాట రూపంలో సంభాషణలు ఇందుకు చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు.

శ్రీవత్స స్నేహాల మధ్య సంభాషణ ఎంతో రసవత్తరంగా సాగుతుంది.

శ్రీవత్స: "మేడలు మిద్దెలు వున్నా
మెత్తని పానుపులున్నా
హృదయం లేకున్నప్పుడు
వృథయే బ్రతుకంత"

స్నేహ: "సుకుమారపు కుసుమాలను
సూదుల కరిపిస్తాడా
అడుగులపై పడు పూలను
పడద్రొక్కుకు పోతాడా"

శీల: "ఎక్కడ పుట్టిననేమి
ఎక్కడ పెరిగిననేమి
కోరిన గుణమున్నపుడు
కోసుకొమ్ము పుష్పమును"

ఇంకా ఈ రూపకంలో అక్కడక్కడ వర్ణనలు, సూక్తులు కనిపిస్తాయి. పై సంభాషణను బట్టి సామాజిక దృక్పథం,ప్రధానంగా అంతస్తులను బట్టి సంభాషణ కొనసాగుతుంది.

అమాయకులైన వారిని పూలతో పోల్చడం, పూలకు సూదులు గుచ్చడం, అమాయకులను బాధించడం లాంటివి సాంఘిక సమస్యలే కదా. పేదవాని ఇంట్లో పుట్టినా, కానీ కులంలో పుట్టినా తనకు నచ్చిన గుణం వారిలో ఉంటే వారిని ఆదరించండి, గౌరవించండి అనే భావం మనకు ఈ "పైరుపాట"రూపకం ద్వారా తెలుస్తుంది. ఇది ఒక సామాజికమైన భావన. అలా భీమన్న శిష్ట వ్యవహారికంలో తమ సాంఘిక సామాజిక భావాలను తన సంభాషణలలో తెలపడం విశేషం.

పైరు పాట – శైలి :

భీమన్న గారి "పైరుపాట" లో శైలి ప్రధానంగా ఆలోచనాత్మకంగా ఒక ప్రేరణ కలిగించేదిగా ఉంది. మానవ హృదయంలో ప్రధాన భాగం ప్రేమ. భీమన్న సరళమైన శైలిలో తన రచనలు చేశారు. ప్రేమించలేని హృదయాలు తేమలేని లత కొమ్మలు. ఈ ఛాయలు "పైరుపాట" రూపకంలో కనిపించవు.

ఉదాహరణ: చక్కని హరితములై వికసించి శోభ గొలుపుతున్నాయి. ఈ ఉదాహరణ అందుకు నిదర్శనం.

"గడ్డి పిల్ల" : పేరూ ఊరూ లేని
పేదపిల్లనైయుండి
అందని ఆనందాలకు
అర్రులు చాతువెందుకో

శ్రీవత్స : మేడలు మిద్దేలు వున్నా
మెత్తని పానుపులున్నా
హృదయం లేకున్నప్పుడు
వృధయేగద బ్రతుకంతా!

ఇలా కులాంతరమైన సమాజాన్ని, జానపద పవిత్ర ప్రేమ జీవనాన్ని సుందరంగా చక్కని శైలిలో రచించాడు. సహజ సిద్ధమైన భావం, తేటతెల్లమైన తెలుగు పదాలతో ఈ శైలి రమనీయంగా ఉంది.

పైరు పాట పాత్ర చిత్రణ :

బోయి భీమన్న గారు రచించిన పైరు పాట చిత్రణను పరిశీలిద్దాం. ఈ రూపకంలో ప్రధాన పాత్రలు స్నేహ (కథానాయిక), శీల (స్నేహకు స్నేహితురాలు), శ్రీవత్స (కథానాయకుడు). ఈ రూపకంలో స్త్రీతత్వ దృష్టితో పరిశీలించి స్త్రీని మాతృమూర్తిగా, ఒక సోదరిగా, భార్యగా ఆమెను దర్శించి, ఆమెకు గల పూర్వపు గౌరవ మర్యాదలను పునరుద్ధరించిన మహాకవి బోయి భీమన్న. వీరు ఆమె బాహ్య సౌందర్యానికి కాక అంత: సౌందర్యానికి ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. అందుకు నిదర్శనమే స్నేహ, శీల పాత్రల చిత్రీకరణ.

శ్రీవత్స :

పైరు పాట రూపకంలోని శ్రీవత్స పేరు చూడగానే ఇతడు విద్యాధికుడు, భాగ్యవంతుడు, అని తెలుస్తుంది. ఇతడు అభ్యుదయ భావాలు గల పాత్రగా కవి చిత్రీకరించాడు.

స్నేహ:

ఈమె మాలపిల్ల. కూలి రైతు. అమాయకత్వం ఈమె సొగసు అయితే, పేదరికం ఈమె అందం. ఈమెను సహజ సుందరంగా చిత్రించినాడు భీమన్న. ఈమె ప్రేమ హృదయం నేటికీ సమాజ వ్యక్తులైన కొందరిలో కనిపిస్తుంది. ఈమె శ్రీవత్సను ప్రేమిస్తుంది. ఈమెను గురించి కవి,

"స్నేహ" యని పిలిచి మనసు
స్నిగ్ధం చేసేశావు.
పడగొట్టిన గుండె తేనె
వర్షంతో తడిపావు.",

పై సంభాషణ తోనే "స్నేహ" పాత్ర గుణం ఏమిటో తెలుస్తుంది. ఆమె మంచితనం, సహోదయతను గూర్చి భీమన్న అద్భుతంగా చిత్రించారు.

శీల :

పైరు పాటలు మరొక చక్కని పాత్ర "శీల". ఈమె స్నేహకు స్నేహితురాలు. ఈమె మితభాషి. పలికిన ప్రతి మాటను ఆచితూచి పలుకుతుంది. ఈమె ఈ రూపకంలో ఉపనాయిక అనవచ్చు. ఈమె స్నేహను ఎంతో ఆత్మీయంగా ప్రేమిస్తుంది. స్నేహ లాగా కూలి పిల్ల. అయినా లౌక్యం తెలిసినట్టిది. కనుకనే స్నేహకు, శ్రీవత్స తో ఉన్న ఆమె ప్రేమ విషయంలో హితవు చెపుతుంది. శీల పాత్రను భీమన్న కోమలమైన చిత్తవృత్తి గల పాత్రగా చిత్రించాడు.

శ్రీవత్స:

ఇది గంభీరమైన నాయక పాత్ర. ఇతడు అగ్రకుల విద్యావంతుడు మరియు విశాలమైన ఆదర్శ భావాలు కలవాడు.ఇంకా ప్రకృతి సౌందర్యా

రాధకుడు. పొలాల్లోకి షికారుకని వచ్చి స్నేహను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఈ పాత్రచిత్రణ గావించాడు భీమన్న. ఈ విధంగా ఈ రూపక ఇతివృత్తానికి తగిన పాత్రలను ఎంపిక చేసి అద్భుతంగా చిత్రించారు భీమన్న.

పైరు పాట –రస పోషణ :

పైరుపాటలో భీమన్న గారు శృంగార హాస్య కరుణ రసాలను చక్కగా ఆవిష్కరించారు. పోషించారు.

ఈ రూపకంలో శృంగార రసాన్ని అతి సున్నితంగా సుకుమారంగా కవి భీమన్న పోషించారు. అందుకు ఒక ఉదాహరణ,

"ఎదర తమంటేనే నా
యెద ఎంతో పొంగుతాది
ఎక్కువ నాకెందుకూ?

ఇతరము నాకెందుకూ?
ఎందుకు రమ్మన్నాడో
పెందలకాడే!
పచ్చని పువ్వుల గుత్తుల
పట్టు చీర కట్టుకొని
ఆవచేను నన్ను చూచి
అపహాస్యం చేస్తున్నది."

బోయి భీమన్న గారు మరో పాటలో కరుణ రసాత్మకంగా రచించిన అంశం ఒకటి ఆస్వాదిద్దాం. పైరు పాట రసభరితం. కరుణ రసాత్మక వర్ణన ఇది.

"పంపరమ్మ దీవించి
పచ్చని లత కూనలారా!
పైరుగాలి పందిట్లో
పవళించిన పైరులారా!"
"ఎన్ని రాత్రులీ యెశీటరి
తిన్నె పైని కూర్చుండి
నా మది మడతలను విప్పి
మీ ముందర పరచితివో"

ఈ పై కవితల యందు శృంగార, కరుణ రసాలు అందంగా, అత్యద్భుతంగా వర్ణించి, తన రస హృదయాన్ని కవి భీమన్న గారు చాటుకున్నారు.

పైరు పాట– భావ చిత్రీకరణ :

భీమన్న "పైరుపాట" రూపకంలో కథానాయకుడు "శ్రీవత్స" కు ముళ్ళు గుచ్చుకున్న సందర్భంలో కారిన నెత్తురు బొట్టును గూర్చి,

"గొబ్బిముల్లు కాబోలు
గుచ్చుకున్న దా వ్రేలికి
గూకుతున్న పొద్దల్లె
పాకిందదే నెత్రుబొట్టు"

అని అంటాడు. భావ సౌందర్యానికి ఆలవాలమైన "పైరుపాట" లో కథానాయకుడైన "శ్రీవత్స"కు కాలి వేలికి ముల్లు గుచ్చుకున్న విషయాన్ని ఎంతో హృద్యంగా, భావ చిత్రాన్ని ఆవిష్కరించాడు భీమన్న కవి.

పైరుపాట– పారమార్థికత, తాత్వికచింతన :

కలతలతో, కక్షలతో కష్టాలపాలైన లోకాలన్నీ ప్రేమతో ఏకమై సుఖించాలని కోరుతూ "పైరుపాట"రూపంలో భీమన్న ఇలా అన్నాడు

"పని ఏదైన గాని
పరమేశుని రూపకం గద
పరమేశుని రూపంలో
తరతమమ్ము లేముంటై"

ఈ పరమార్థం ఎప్పటికైనా మానవులకు ప్రాప్తం"కావాలన్నది భీమన్న అభిమతం. భగవంతుని దృష్టిలో అంతా సమానమే. ఎక్కువ తక్కువ తేడాలు ఉండవు అన్న భావం ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ముగింపు :

బోయ భీమన్న గారి రచనల్లో సామాజిక చైతన్యం ప్రేమ, ప్రకృతి వర్ణనలతో కూడి నవరసభరితంగా రచనలు ఉంటాయి. " పైరుపాట అనే ఈ రూపకంలో భీమన్న సామాజిక న్యాయం గురించి, అసమానతలను తొలగించాలని ఒక రైతు కూలీ పిల్ల స్నేహకు, ధనికుడు అగ్ర కులస్తుడు అయిన శ్రీవత్సకు వివాహం జరిపించే కథను అద్భుతంగా వర్ణించారు. భీమన్న గారు ఒక అభ్యుదయ భావకవిగా తెలుగు సాహితీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారు. వీరు రచించిన రచనలు, రూపకాలు తెలుగు సాహిత్యంలో మకుటాయమానంగా నిలిచి ఉంటాయి.

కీలక పదాలు: సామాజికత, అభ్యుదయం, రూపకం.

ఉపయుక్త గ్రంధాలు:

1. పైరు పాట – రూపకం డాక్టర్ బోయి భీమన్న గారు
2. బోయి భీమన్న రూపకాలు – తాత్విక చింతన (పీహెచ్ డి. సిద్ధాంత గ్రంథం). డా. తక్కళ్ళ బాలరాజు

   డాక్టర్ బోయి భీమన్న వికీపీడియా సమాచారం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

"శక్తియే శాంతి" – బోయి భీమన్న 'విశ్వశాంతి'లో ప్రతిపాదించిన జీవన తత్త్వం

– డా. యడవల్లి సైదులు,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
7032188578.

పరిచయం:

బోయి భీమన్న తెలుగు సాహిత్య చరిత్రలో సామాజిక చైతన్య కవిగా నిలిచిన మహోన్నత రచయిత. మారుమూల పల్లెలో దళిత పాలేరు కుటుంబంలో జన్మించిజీవితాంతం కులవ్యవస్థ, అంటరానితనం, సామాజిక అన్యాయాలపై కలం పట్టారు. సుమారు 70కు పైగా గ్రంథాలను రచించి పద్య, గేయ, వచన, నాటక రంగాల్లో విశిష్ట కృషి చేశారు. ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. అంబేద్కర్ ఆలోచనలకు ప్రభావితుడై, 'కులనిర్మూలన' వంటి రచనలను తెలుగులోకి అనువదించడం ద్వారా సామాజిక మార్పు దిశగా సాహిత్యాన్ని ఆయుధంగా మలిచారు. "జయ జయ జయ అంబేడ్కర!" వంటి గీతాలతో దళితుల్లో ఆత్మగౌరవ జ్యోతి రగిలించారు.

కీలక పదాలు: శాంతి, అశాంతి, శక్తి, ధైర్యం, ఆత్మగౌరవం, యుద్ధం, బలహీనత, నిర్మాణాత్మక శక్తి, ధర్మం, సామాజిక బాధ్యత, అంతర్గత స్థిరత్వం, కార్యోన్ముఖ జీవనం..

వ్యాసం ఉద్దేశం:

భీమన్న "విశ్వశాంతి" కవిత ఆధారంగా రాసిన ఈ వ్యాసశీ ఉద్దేశంమానవజాతికి నిజమైన శాంతి, శక్తి, ధైర్యం, ఆత్మగౌరవం, మరియు కార్యోన్ముఖ జీవన విధానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం. వ్యాసంలోశాంతి కేవలం మాటల నినాదం మాత్రమే కాకుండావ్యక్తిలోని బలశీ, ఆత్మవిశ్వాసం, సమాజ సేవ ద్వారా సాధించవలసిన జీవన స్థితి అని స్పష్టంగా వివరిస్తారు. దీనితో

పాటు వ్యాసంఅశాంతిని నిర్మాణాత్మక శక్తిగా మార్చివ్యక్తిగత మరియు సామాజిక బాధ్యతలను సమన్వయంగా ఉంచి జీవించాలిఅనే భీమన్న సందేశాన్ని మానవులకు అందించడం లక్ష్యం. ఈ వ్యాసం ద్వారా పాఠకులు జీవితంలో శాంతి సాధన, ధైర్యం, న్యాయం, మరియు సమాజోపకార చైతన్యాన్ని గ్రహించగలుగుతారు.

కవిత్వ దృక్పథం:

భీమన్న సాహిత్యంలో ప్రధానంగా కనిపించేది మానవత్వం, జాతీయత, సమానత్వం. కులం భారతీయ సమాజ నిర్మాణంలో గాఢంగా పాతుకుపోయిన వ్యవస్థ అని గుర్తించిదాని నిర్మూలనకై ఆయన రచనలు పాటుపడ్డాయి. 'పాలేరు', 'రాగవాసిష్ఠం', 'కూలిరాజు' వంటి నాటకాల ద్వారా కులాంతర వివాహాల ప్రాముఖ్యతను చర్చించి, కులవ్యవస్థకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యాన్ని పెంపొందించారు. కేవలం దళితుల బాధను మాత్రమే కాదు, సమాజంలో ఉన్న మంచి--చెడులను సమన్వయంగా చిత్రించారు. హింసకు వ్యతిరేకి అయిన ఆయనప్రజాస్వామ్య పద్ధతుల్లోనే హక్కుల సాధన సాధ్యమని నమ్మారు.

సామాజిక-సాహిత్యప్రాధాన్యం:

భీమన్న రచనలు అంబేద్కర్ భావజాలానికి సాహిత్య ప్రతిరూపం అని చెప్పవచ్చు. వర్గం కంటే కులవ్యవస్థ భారతదేశంలో ప్రధాన సమస్య అని స్పష్టం చేసిముందుగా అంటరానితన నిర్మూలన అవసరమని ప్రకటించారు. దళితులలో ఆత్మగౌరవం, ఐక్యత, విద్యా చైతన్యం పెంపొందించడమే ఆయన రచనల అంతర్లీన లక్ష్యం. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ ఆలోచనను సమర్థిస్తూకులమత భేదాలకతీతంగా మానవత్వమే పరమ ధర్మమని ప్రతిపాదించారు. ఈ విధంగా బోయి భీమన్న సాహిత్యం సామాజిక మార్పుకు దిక్సూచి అయితెలుగు సాహిత్యాన్ని సమగ్ర దృక్పథంతో సుసంపన్నం చేసింది.

బోయి భీమన్న – "విశ్వశాంతి" కవితా వస్తువు పరిచయం

"విశ్వశాంతి" కవితలో కవి శాంతి అనే భావనను సాంప్రదాయిక నినాదంగా కాకుండా విమర్శనాత్మక దృష్టితో ఆవిష్కరించాడు. వేదకాలం నుంచీ వినిపిస్తున్న "శాంతి" మంత్రోచ్చారణలు వాస్తవ జీవితంలో అన్యాయాలు, యుద్ధాలు, దోపిడీలు ఆగకుండా కొనసాగుతున్నాయనే విరోధాభాసాన్ని ఆయన ఎత్తిచూపాడు. యుద్ధానికి ముందూ శాంతి, యుద్ధం తరవాతా శాంతి ఉంటే యుద్ధం ఎందుకు వస్తుంది? అనే ప్రశ్న ద్వారా కవి శాంతి నినాదాల లోపలి అసత్యాన్ని బహిర్గతం చేస్తాడు. బలహీనుల శాంతి వాదం వాస్తవానికి అశక్తతకు ప్రతీక మాత్రమేనని, శక్తి లేనప్పుడు శాంతి నిలవదని వివిధ రూపకాల ద్వారా వివరిస్తాడు.

ఈ కవితా వస్తువు ప్రధానంగా "శక్తియే శాంతి" అనే తత్వంపై ఆధారపడింది. అశక్తుడు ధర్మప్రచారం చేయలేడనిలోకాన్ని సంస్కరించేది లోకోత్తర శక్తేనని కవి స్పష్టం చేస్తాడు. శాంతి పుచ్చుకునేది కాదుఇవ్వగలిగిన స్థాయికి ఎదగాల్సిందేనని ఆయన సందేశం. అంతర్గత బలం, ఆత్మగౌరవం, కార్యోన్ముఖ జీవనంలు నిజమైన శాంతికి పునాదులు అని కవి ప్రతిపాదిస్తాడు. అందువల్ల

ఈ కవితలో శాంతి అనేది శక్తి, చైతన్యం, బాధ్యతల సమన్వయంతో సాధించాల్సిన జీవన ధర్మంగా ప్రతిఫలిస్తుంది.

శాంతి – యుద్ధం మధ్య అంతరం

భీమన్న దృష్టిలో శాంతి మరియు యుద్ధం పరస్పర విరోధ భావనలు. అంతేకాదు అవి ఒకే చక్రంలో తిరిగే జీవిత స్థితులు. "యుద్ధానికి ముందున్నదీ శాంతే, యుద్ధం తర్వాతదీ శాంతే" అని చెప్పిశాంతి అనే పదం ఒక స్థిరమైన స్థితి కాదని ఆయన సూచిస్తాడు. యుద్ధం శాంతి వైఫల్యానికి సంకేతమా? లేక బలహీన శాంతి ముసుగులో దాగి ఉన్న అశాంతి విస్ఫోటమా? అనే ప్రశ్నను కవి ముందుకు తెస్తాడు. శాంతి నినాదాలు మాత్రమే ఉన్నాసమాజంలో అన్యాయం, అసమానతలు కొనసాగితేఅవి చివరకు యుద్ధరూపంలో బయటపడతాయని ఆయన భావన.

భీమన్న అభిప్రాయంలో శాంతి అనేది బలహీనుల ఆశ్రయం కాదు.అది బలవంతుల సాధన. "నీ బలం ఒక్కటే నీ శాంతి" అన్న వాక్యం ద్వారా శాంతియుద్ధాల మధ్య అంతరాన్ని స్పష్టంగా నిర్వచిస్తాడు. బలం లేనప్పుడు శాంతి కాపాడుకోలేం. అప్పుడు యుద్ధం అనివార్యమవుతుంది. అంటేయుద్ధం అనేది శక్తి లేమి వల్ల కలిగే పరిణామం. బలహీనుడు శాంతిని కోరి అంజలి ఘటిస్తే, బలవంతుడు దాడి చేస్తాడని కవి హెచ్చరిస్తాడు. కాబట్టి శాంతిని నిలబెట్టేది శక్తి. ఆ శక్తి అనేది లేకపోతే శాంతి యుద్ధానికి దారి తీస్తుంది.

అంతేకాదుభీమన్న విశ్లేషణలో శాంతియుద్ధాల మధ్య అసలు అంతరం బాహ్య పరిస్థితుల్లో కాదుమనసులో ఉంటుంది. "శాంతి ఉండవలసింది లోపల" అన్న భావన ద్వారా అంతర్గత స్థిరత్వం, ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడు మాత్రమే బాహ్య యుద్ధాలు నివారించగలమని సూచిస్తాడు. అశాంతే జీవిత ధర్మమని చెప్పినాఅది నిర్మాణాత్మక శక్తిగా మారాలి గానీ విధ్వంసక యుద్ధంగా మారకూడదు. ఈ విధంగా భీమన్న దృష్టిలో శాంతియుద్ధాల మధ్య అంతరం శక్తి, న్యాయం, ఆత్మగౌరవం ఆధారంగా నిర్ణయించబడే జీవన సత్యం అని అర్థం చేసుకోవచ్చు.

భీమన్న దృష్టిలో అశాంతి – శాంతి భేదం

అశాంతిశాంతి మధ్య భేదాన్ని కవి ప్రతీకాత్మకంగా, వ్యంగ్యంగా కూడా వివరించాడు. "శాంతి, శాంతి, శాంతి అంటూ అరవడం అశాంతిని ఎలుగెత్తి పిలవడమే!" అనే పాదంలో శాంతి నినాదాల వెనుక దాగి ఉన్న అసత్యాన్ని బయటపెడతాడు. అంటేశాంతి అనే మాటను పదే పదే ఉచ్చరించడం వల్ల శాంతి రాదు. న్యాయం లేకపోతే అది అశాంతికే దారి తీస్తుంది. అలాగే "కర్ర లేనప్పుడు గొరైనా కరుస్తది!" అనే ఉపమానంతో బలహీనత వల్లే అశాంతి పెరుగుతుందని చూపించాడు. బలహీనుడు శాంతిని కోరుకుంటాడు.కానీ అతని బలహీనతే అతడిని మరింత ప్రమాదానికి గురిచేస్తుంది. అందువల్ల శాంతి అనేది రక్షణ లేని స్థితి కాదనిఅది రక్షణ సామర్థ్యంతో కూడిన స్థితి అని కవి భావించాడు. ఇంకా "శాంతి ప్రకృతి సిద్ధం కాదు, అశాంతే జీవిత ధర్మం!"అనే వాక్యంలో కవి తన తాత్విక దృష్టిని స్పష్టంగా వ్యక్తపరుస్తాడు. జీవితం అనేది చలనం, పోరాటం, సాధనల సమాహారం.కాబట్టి అశాంతి సహజం. అయితే ఆ అశాంతిని విధ్వంసకంగా కాక, నిర్మాణాత్మక శక్తిగా

మలచాలి. "శాంతి ఉండవలసింది లోపల, బైట కాదు!" అని చెప్పిఅంతర్గత ధైర్యం, ఆత్మవిశ్వాసం కలిగినవారికే నిజమైన శాంతి సాధ్యమని సూచించాడు. ఈ విధంగా భీమన్న దృష్టిలో అశాంతి అనేది మార్పుకు మూలం. శక్తిగా మారిన అశాంతే స్థిరమైన శాంతికి పునాది.

విశ్వశాంతి కవితలో భీమన్న నినాద శాంతిపై విమర్శ చేస్తూ నీ బలం ఒక్కటే నీ శాంతి" శక్తి తత్వ ప్రతిపాదన అని అంతర్గత శాంతి యే కార్యోన్ముఖ జీవన ధర్మం అనే అభిప్రాయాన్ని వ్యక్త పరిచాడు.ఆ క్రమంలో ఆయన భావాలను కవిత ఆధారంగా ఇలా విశ్లేషించవచ్చు.

నినాద శాంతిపై కవి విమర్శ– "శాంతి, శాంతి, శాంతి" అనే పదం వేదకాలం నుంచీ వినిపిస్తున్నా, అది నిజాయితీ లేని నినాదమని భీమన్న ఘాటుగా వ్యాఖ్యానిస్తాడు. యుద్ధానికి ముందు శాంతి, యుద్ధం తర్వాత కూడా శాంతి ఉంటే, యుద్ధాలు ఎందుకు వస్తున్నాయి? అనే ప్రశ్నతో ఆయన సాంప్రదాయ శాంతి భావనను ప్రశ్నిస్తాడు. ఎలుకల శాంతి దరఖాస్తును పిల్లి మన్నించదన్న ఉపమానంతో బలహీనుల శాంతి వాదం ఎంత వాస్తవానికి దూరమో చూపిస్తాడు. శాంతి అనేది భిక్షగా దొరికేది కాదనిఅది బలహీనతకు ముసుగే తప్ప నిజమైన విలువ కాదని కవి స్పష్టం చేస్తాడు.

"నీ బలం ఒక్కటే నీ శాంతి" – శక్తి తత్వ ప్రతిపాదన – భీమన్న దృష్టిలో శాంతి అనేది శక్తి ఫలితం. అస్త్రధారుడైన అర్జునుడే పాంచాలీ ప్రణయ హస్తాన్ని పొందగలడని చెప్పడం ద్వారా, శక్తి ఉన్నవారికే గౌరవం దక్కుతుందని సూచిస్తాడు. "అశక్తుడు ఆర్థులకిచ్చే దేం వుండదు" అనే వాక్యం ఆయన తత్వాన్ని బలంగా వ్యక్తపరుస్తుంది. లోకాన్ని సంస్కరించేది బలహీనత కాదు అదిలోకోత్తర శక్తి. ఆగ్రహించలేని వాడు అనుగ్రహించలేడని చెప్పడం ద్వారాశక్తి మరియు కార్యసాధననైతికత మధ్య ఉన్న అంతర్గత సంబంధాన్ని ఆయన ప్రతిపాదిస్తాడు.

అంతర్గత శాంతి – కార్యోన్ముఖ జీవన ధర్మం – భీమన్న శాంతిని బాహ్య నినాదంగా కాకుండా అంతర్గత స్థితిగా నిర్వచిస్తాడు. "శాంతి ఉండవలసింది లోపల, బైట కాదు" అనే పంక్తి ఆయన ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రకృతి సిద్ధంగా శాంతి లభించదనిఅశాంతే జీవిత ధర్మమని చెప్పిమనిషి తనలోని శక్తిని జాగృతం చేసుకొని ప్రకృతిని అధిగమించాలని పిలుపునిస్తాడు. చెడిన పుటల్ని చించి పారవేస్తూ పోతే చివరకు పుస్తకమే మిగలదని చెప్పిస్వవినాశక ధోరణిని విమర్శిస్తాడు. సమాజ సంస్కరణకు ముందు వ్యక్తి లోపలి బలాన్ని పెంపొందించుకోవాలనే సందేశం ఈ కవితలో అంతర్లీనంగా ప్రతిధ్వనిస్తుంది.

ఈ విధంగా "విశ్వశాంతి" కవితలో భీమన్న శాంతిని శక్తితో సమానంగా చూసి ఆత్మగౌరవం, కార్యనిరత జీవనం, సామాజిక బాధ్యతల సమన్వయమే నిజమైన శాంతి అని ప్రతిపాదిస్తాడు.

బోయి భీమన్న దృష్టిలో నిజమైన శాంతి

భీమన్న దృష్టిలోనిజమైన శాంతి అనేది నినాదాలలో ఉండేది కాదునిస్సహాయంగా మౌనం పాటించడంలోనూ కాదు. అన్యాయాన్ని సహిస్తూ "శాంతి" అని చెప్పడం కవికి అసత్యం. "నీ బలం ఒక్కటే నీ శాంతి" అనే భావం ద్వారా ఆయన స్పష్టం చేసినది ఏమిటంటే శక్తి, ఆత్మగౌరవం, ధైర్యం ఉన్న చోటే శాంతి నిలుస్తుంది. బలహీనతతో వచ్చిన మౌనం తాత్కాలికం. అది ఎప్పుడైనా యుద్ధంగా

మారుతుంది.కవి చెప్పే నిజమైన శాంతి అనేదిఅంతర్గత స్థిరత్వం. "శాంతి ఉండవలసింది లోపల, బైట కాదు" అనే భావనలో వ్యక్తి తనలోని భయాన్ని జయించి, ధైర్యంగా నిలబడినప్పుడు వచ్చే నిశ్చలతను సూచిస్తాడు. అది ఇతరుల కరుణపై ఆధారపడదు.స్వశక్తిపై ఆధారపడుతుంది. అందువల్ల నిజమైన శాంతి అనేది పుచ్చుకునేది కాదు సాధించేది.

అంతిమంగా భీమన్న భావనలో నిజమైన శాంతి అంటేన్యాయం నిలిచిన స్థితి. అన్యాయం, అసమానతలు కొనసాగుతూనే ఉంటే శాంతి అసంభవం. కాబట్టి శాంతి అనేది పోరాటానికి విరుద్ధం కాదు. అది న్యాయపూర్వక పోరాటం ద్వారా సాధించబడే సమతుల్య స్థితి. అశాంతిని శక్తిగా మలచిసమాజాన్ని సరిదిద్దే స్థితికే ఆయన నిజమైన శాంతి అని అర్థం ఇచ్చాడు.

బోయి భీమన్న కవిత్వ శైలి – వ్యక్తీకరణ సౌందర్యం

భీమన్న కవిత్వ శైలి స్పష్టత, నేరుగా పలికే ధైర్యం, భావగాంభీర్యం అనే లక్షణాలతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఆయన మాటల్లో అలంకారాలు అడ్డుపడవు. ఆలోచన ముందుంటుంది. సామాజిక సమస్యలను కవిత్వ వస్తువుగా తీసుకునిఅవి ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో చెప్పడం ఆయన శైలిలో ప్రధాన లక్షణం. పదప్రయోగంలో సరళత ఉన్నప్పటికీభావవ్యాప్తి లోతైనది. వాక్య నిర్మాణంలో ఉత్సాహం, ప్రశ్నల రూపంలో ఆలోచన రేకెత్తించే తీరు ఆయన కవిత్వానికి ప్రాణం.వ్యక్తీకరణలో భీమన్న ప్రతీకలు, ఉపమానాలు, వ్యంగ్యోక్తులను సమర్థంగా వినియోగిస్తాడు. ఉదాహరణకు "కర్ర లేనప్పుడు గొరైనా కరుస్తది" వంటి పాదాల్లో సామాన్య జీవిత దృశ్యాలను తీసుకుని గంభీరమైన తాత్విక భావాన్ని ప్రతిపాదిస్తాడు. ఆధ్యాత్మిక, పౌరాణిక ప్రతీకలను సమకాలీన సామాజిక సమస్యలతో అనుసంధానించడం ఆయన ప్రత్యేకత. అర్జునుడు, పాశుపతాస్త్రం వంటి సూచనల ద్వారా శక్తిధర్మాల సంబంధాన్ని ప్రతిబింబిస్తాడు. ఈ విధంగా ఆయన శైలి భావప్రధానం, ఉదాత్తత, చైతన్య ప్రేరణల సమన్వయం.

భీమన్న కవిత్వ సౌందర్యం ఆలోచనలోని స్పష్టతలో, భావంలో ఉన్న ఆవేశంలోసామాజిక బాధ్యతలో ఉంది. ఆయన పదాల్లో ఆత్మగౌరవ స్వరం వినిపిస్తుంది. నినాదాల కంటే కార్యసిద్ధి ముఖ్యం అనే సందేశాన్ని కవిత్వ రూపంలో ప్రజల ముందుంచడం ఆయన ప్రత్యేకత. అందువల్ల భీమన్న కవిత్వ శైలి చైతన్యవంతమైనది, ప్రబోధాత్మకమైనది, సమాజ మార్పును లక్ష్యంగా చేసుకున్న సాహిత్య సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

"విశ్వశాంతి" ద్వారా మానవాళికి సందేశం

భీమన్న "విశ్వశాంతి" కవితలో మానవాళికి ప్రధానంగా తెలిపే సందేశం ఏమిటంటేనిజమైన శాంతి బలహీనతలో కాదుబలంలో, ఆత్మగౌరవంలో, కార్యోన్ముఖ జీవనంలోనే ఉంటుంది. "నీ బలం ఒక్కటే నీ శాంతి!" అని పాడుతూ, శాంతి కోసం నిస్సహాయత చూపడం, మాటల నినాదాలు చేయడం ప్రతికూలమని సూచిస్తాడు. శాంతిని సాధించినిలబెట్టుకోవడం అవసరం. వ్యక్తి తనలోని ధైర్యం, శక్తి, న్యాయబోధతోనే శాంతి సాధించగలడని ఆయన స్పష్టం చేస్తాడు.

మరొక ప్రధాన సందేశంఅంతర్గత శాంతి మరియు సమాజ బాధ్యత. "శాంతి ఉండవలసింది లోపల, బైట కాదు!" అనే పంక్తిలో వ్యక్తిగత స్థిరత్వం, ఆత్మవిశ్వాసం ఉన్న చోటే బాహ్య యుద్ధాలు నివారించబడతాయని సూచించాడు. జీవితం అశాంతితో నిండి ఉన్నాఆ అశాంతిని నిర్మాణాత్మక శక్తిగా మలచిసమాజాన్ని సరిదిద్దే పనికి ఉపయోగించాలని పిలుపునిస్తుంది. కాబట్టి "విశ్వశాంతి" కవిత మానవాళికి శక్తి, ధైర్యం, నిజాయతీతో జీవితాన్ని జీవించాల్సిన, లోపలి శాంతిని సాధించాల్సిన మార్గదర్శనశీను తెలుపుతుంది.

భీమన్న కవితలో మానవాళికి మరో ప్రధాన సందేశంకార్యోన్ముఖ జీవన విధానం."ఇదం బ్రాహ్మ్యం, ఇదం క్షాత్రం గా కచ్చ బిగించి ముందుకు పద!" అనే పాదంలో ఆయన వ్యక్తిగత కర్మ, సామాజిక బాధ్యతల సమన్వయాన్ని ఉద్దేశ్యంగా చూపించారు. అంటేశాంతి నిలబడాలంటే మనం కేవలం శాంతిని కోరడం కాకుండాధర్మపరమైన, సమాజోపకరిష్టమైన చర్యలను చేయాలి. శాంతి ఒక స్థిరమైన ఆంతరిక లక్ష్యం కాబట్టి, దానికి సాధన, ధైర్యం, చైతన్యం తప్పనిసరి. ఇంకాకవిఅశాంతిని సృజనాత్మక శక్తిగా మార్చే అవసరంను కూడా సూచించాడు. "శాంతి ప్రకృతి సిద్ధం కాదు, అశాంతే జీవిత ధర్మం!" అనే పంక్తి ద్వారా, జీవితంలో సమస్యలు, అశాంతి అనివార్యం అయినప్పటికీవాటిని తక్కువగా అడ్డుకుంటూ జీవితాన్ని స్ఫూర్తితో, చైతన్యంతో ఎదుర్కోవాలని సూచిస్తాడు. మనలోని ఆత్మబలాన్ని ఉపయోగించిలోపలి శాంతిని సాధించటం ద్వారా మాత్రమే మానవజాతికి సత్యమైన సమతుల్యత, స్థిరత్వం సాధ్యమని భీమన్న మానవతా సందేశంగా చెప్పాడు.

ముగింపు

భీమన్న "విశ్వశాంతి" కవిత ద్వారా మనకు నేర్పిన ప్రధాన జీవన తత్వం ఏమిటంటేశాంతి సాధనకు బలమే మూలం. కేవలం మాటల నినాదాలు, నిస్సహాయత శాంతి ఇవ్వవు. నిజమైన శాంతి మనలోని ధైర్యం, ఆత్మగౌరవం, సామర్థ్యం ద్వారా మాత్రమే నిలుస్తుంది. అదే విధంగాభీమన్న శాంతిని కేవలం వ్యక్తిగత లక్ష్యం కాదనిసమాజ సేవ, ధర్మప్రకారం, నిర్భయంగా, చైతన్యంతో జీవించడం ద్వారా సమాజానికి, పేద ప్రజలకు కూడా శాంతి సాధ్యమవుతుందిఅని సూచిస్తాడు. అశాంతిని సృజనాత్మక శక్తిగా మార్చిజీవనోద్దేశంతో కలిపి జీవించటమే నిజమైన శాంతి అని ఆయనలోతైన సందేశం. అందుచేత "శక్తియే శాంతి" అనే భీమన్న తత్వం ప్రతి మనిషి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

ఆధార గ్రంథాలు

1. బోయి భీమన్న – బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి–4, డా. ఆవుల మంజులత
2. బోయి భీమన్న – రాధతోఎగ్జిబిషనుకు, సుఖేలా ప్రచురణ, హైద రాబాదు
3. బోయి భీమన్న – అంబేడ్కర మతం, 1993
4. బోయి భీమన్న – గుడిసెలు కాలిపోతున్నాయి, సుఖేలా ప్రచురణ, 1973.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న 'పంచమస్వరం' – దళిత చైతన్యం

– డా. మేడికొండ ప్రసాదరావు
అధ్యాపకులు
తెలుగు శాఖ

వ్యాస సంగ్రహం

బోయి భీమన్న రచించిన 'పంచమ స్వరం' దళితుల జీవిత అనుభవాలు, వారి వేదనలు, ఆశలు, ఆత్మగౌరవ ఆకాంక్షలను సాహిత్య స్వరంగా మలిచిన మహత్తర కృతి. సంప్రదాయ సాహిత్యంలో నిర్లక్ష్యానికి గురైన దళిత స్వరానికి ఇది ఒక స్పష్టమైన, ధైర్యమైన ప్రతినిధిత్వం. సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న కులవ్యవస్థ, అణచివేత, వివక్షలపై భీమన్న గారి కవిత్వం తీవ్ర నిరసనగా నిలుస్తుంది.

'పంచమ స్వరం'లో దళితుడి మౌనాన్ని చెరిపి, అతని అంతరంగ వేదనను సామూహిక చైతన్యంగా మారుస్తారు కవి. దళితుడిని కేవలం బాధితుడిగా కాకుండా, మార్పు సాధించగల శక్తిగా చిత్రించడం ఈ రచన ప్రత్యేకత. విద్య, సమానత్వం, మానవ హక్కులు, స్వాభిమానం వంటి విలువలు ఈ కృతిలో ప్రధానంగా ప్రతిధ్వనిస్తాయి. భాష సరళమైనదైనా భావ తీవ్రత గాఢంగా ఉండటం వల్ల పాఠకుని హృదయాన్ని తాకుతుంది.

"పద్మభూషణ్ బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం" – బి. నమశ్శివాయ; "బోయి భీమన్న సాహిత్యం – సాంస్కృతిక పునర్విచేచనం" – ఈ బాలకాశయ్య; వంటి పరిశోధనలు ఇంతకు పూర్వం జరిగాయి. బోయి భీమన్న 'పంచమస్వరం' వర్ణనాత్మక, విశ్లేషణాత్మక పద్ధతి ద్వారా ఈ వ్యాసం పరిశీలిస్తుంది.

ఈ కృతి ద్వారా బోయి భీమన్న దళిత సాహిత్యానికి కొత్త దిశను చూపారు. 'పంచమ స్వరం' కేవలం ఒక కవితా సంకలనం మాత్రమే కాకుండా, దళిత విముక్తి ఉద్యమానికి ప్రేరణనిచ్చే చైతన్య పత్రికగా నిలుస్తుంది. అందువల్ల ఇది తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యానికి ప్రతీకగా భావించదగిన రచన.

మౌళికపదాలు

బోయి భీమన్న, పంచమస్వరం, దళిత చైతన్యం, సామాజిక న్యాయం, రాజకీయ అవగాహన, సంఘటిత పోరాటం, దళిత సాహిత్యం

ఉపోద్ఘాతం

ఇటు పద్య సాహిత్యంలోనూ అటు వచన కవిత్వంలోనూ సవ్యసాచిగా చక్రం తిప్పిన అనన్య సామాన్యమైన కవి బోయి భీమన్న. వీరు పదుల సంఖ్యలో పుస్తకాలను వెలువరించి తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు. వీరి చేతి నుంచి జాలువారిన అనేక రచనల్లో పంచమస్వరం ఒకటి. 'పంచమం' అనే మాటకు కోకిల, ఇంపైనది అనే అర్థాలున్నాయి. కవి పంచమస్వరం పేరు పెట్టడంలో తన ఉద్దేశాన్ని తెలుపుతూ, తను పంచముడిని కాబట్టి తన స్వరం తాను చెప్పాలనుకున్న విషయం ఇందులో రాశానన్నారు. అట్లాగే కోకిల స్వరం లాగా అందరికి ఇష్టపూర్వకంగా ఉంటుందనే అంతరార్థం కూడా ఇందులో ఉంది. పంచమస్వరం కావ్యం అంతా ఏకకాలంలో రాసింది కాదు. అనేక కాలాలలో వారు రాసిన పద్యాలను ఏర్చి కూర్చి 2000 సంవత్సరంలో పంచమ స్వరంగా వెలువరించారు.

ఈ నాడు మనం పంచమ శబ్దానికంటే 'దళిత' శబ్దాన్ని ఎక్కువగా వాడుతున్నాం. కాని బోయి భీమన్న పంచమ శబ్దం వైపుకే మొగ్గినట్లుగా ఈ పుస్తకం ద్వారా తెలుస్తుంది. కొంతమంది హరిజన మాట వద్దన్నారు. కొంత మంది దళిత అనే మాట వద్దన్నారు. కొంత మంది ఆది ఆంధ్రులం అన్నారు. కొంత మంది దాన్నీవద్దన్నారు. ఇలా దళితుల్ని ఎలా పిలుచుకోవాలో, తమను తాము ఎలా గౌరవించుకోవాలో చేసే వెతుకులాటలో కొంతమంది మాత్రమే ఈ పంచమ శబ్దానికి మొగ్గు చూపారు వారిలో భీమన్న ఒకరు. కాని తరువాత కాలంలో ఎక్కువమంది మేధావులు ఒప్పుకున్న పేరు దళితులు. ఈ విషయాన్ని గురించి బోయి భీమన్న మాట్లాడుతు ఈ ప్రపంచమే పంచమ శబ్దంతో నిండి ఉంది. మనిషికి ప్రాణాలు పంచ ప్రాణాలంటాం, పంచ భూతాలు కలిస్తే ప్రపంచం అయ్యింది. అందువల్ల 'పంచమ' శబ్దం గురించి తక్కువగా భావించ వద్దంటూ, పంచసంఖ్య పై ఎందుకీ పంచనామా అన్నారు. 'ఈ భరతమాత పంచమ స్వరగీత' అనే ప్రయోగం చేశారు. ఎందుకంటే ఆది మహర్షులంతా పంచములోంచి వచ్చినవాళ్ళే. భగవద్గీత చెప్పిన శ్రీకృష్ణుడు, వ్యాసవాల్మీకాదులు, పరాశర మహర్షిలాంటి వారంతా భారతజాతికి జ్ఞానభిక్ష పెట్టిన వాళ్ళే. వారు చూపిన మార్గంలోనే భారత జాతి నడుస్తుంది. కాబట్టి భరతమాతను పంచమ స్వరగీతగా ఆయన చాటిచెప్పారు. పంచములం అని చెప్పుకోటానికి మొహమాట పడాల్సిన అవసరం లేదని కింది పద్యం ద్వారా తెలిపారు.

పంచ భూతాలు కలిసి ప్రపంచమాయె,
పంచ ప్రాణాలు కలిసి జీవించు వ్యక్తి !
పంచ సంఖ్యపై ఎందుకీ పంచనామా?
పంచమ స్వర గీత మా భరతమాత **(పంచమ స్వరం, పుట.310)**

దళితుల్ని దూరం పెట్టి వారికి విద్యనందకుండా చేసి తద్వారా తమ గొప్పతనాన్ని చాటుకోవడానికి ఎంతో మంది ప్రయత్నించారు. దాని ఫలితంగా కొన్ని తరాలపాటు పంచములు అని

పిలవబడేవాళ్ళు చదువుకు తిండికి దూరమయ్యారు. ఎప్పుడైతే జ్ఞానానికి దూరమయ్యారో అక్కడ నుంచి పతనం తప్ప పురోగతి ఉండదు. దీనంతటికి మొదట్లో మూలాలు పడినట్లుగా భీమన్న చెప్పారు. ద్రోణుడు బొటనవేలు ఖండించి ఏకలవ్యున్ని విద్యకు దూరం చేస్తే, అసలు పంచముడు ఉండకూడదని మనువు శాశించి దళిత జాతినంతా దూరం పెట్టే గొప్ప కుట్రను చేశాడు. పంచములు ఈ విషయాల్ని తెలుసుకొని చైతన్య వంతులు కావాలని భీమన్న ఆశించారు. ఈనాడు కొన్ని స్వార్థపూరిత శక్తులు దళితుల్ని దూరం పెట్టి తమ పబ్బాన్ని గడుపుకోవాలని చూస్తున్నాయన్నారు.

పంచమాంగుళి ఖండించి, భరత బలము
కూల ద్రోసెను ఒక పొట్టకూటి గురువు;
పంచమమె నాస్తి అని బొంకి, భరత జాతి
కథనె ఖండించె శాసనకర్త మనువు! **(పంచమ స్వరం, పుట. 315)**

ప్రతిభగల ఏకలవ్యుడిని తన గురుకులంలో చేర్చుకుని, తన మిగతా శిష్యులతోపాటు విద్యను నేర్పించి ఉన్నట్లయితే మహాభారతంలో ఏకలవ్యుడు ఒక గొప్ప వీరుడుగా కనిపించేవాడు. అయితే వీరత్వానికి, ప్రతిభకు కాకుండా పుట్టుకకు ప్రాధాన్యతనిచ్చిన అప్పటి వ్యక్తులు దళితుల్ని తీవ్రమైన అన్యాయాలకు గురిచేయడం అక్కడనుంచే కనబడుతుంది. ఏకలవ్యుడు తనకు తానుగా విద్య నేర్చుకున్నప్పటికీ, బొటన వేలు గురుదక్షణగా అడిగి ద్రోణుడు జాతికి తీవ్రమైన ద్రోహాన్ని చేశాడు. ఈ విషయాన్ని భీమన్న ఆక్షేపించాడు.

తరతరాలుగా ఎన్నో బాధలనుభవిస్తూ, సమాజానికి దూరమైన దళితులే ఒకనాటికి రాజ్యాన్ని పరిపాలించే రాజులవుతారు అని భీమన్న అభిలషించారు. అయితే ఇది జరగటానికి కేవలం ఆశిస్తూ కూర్చుంటే సరిపోదుగదా! ప్రజల్లో చైతన్యం రావాలి, ఆ చైతన్యంలోంచి కసి పుట్టాలి, కసిలోంచి ఉద్యమ స్ఫూర్తి రగలాలి అప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. అందుకే కేవలం కోకిలపాటలాగా కాకుండా సింహాలకు బోధిసత్వునిలాగా చెప్తున్నానని భీమన్న అభిప్రాయపడ్డారు. దళిత సోదర్లందరూ తమను తాము కించపరుచుకోవద్దని, బానిసత్వాన్ని, అంటరానితనాన్ని సహించి మిన్నకుండిపోవద్దని, ఉద్యమం ద్వారా మీలో ఉన్న శక్తిని తెలుసుకోండి అప్పుడే సుప్రభాతాలు కలుగుతాయని కవి ఆశిస్తున్నాడు.

తినడానికి, ఉండటానికి సరైన సౌకర్యాలు లేక అలమటించి పోతున్న పంచములు రాజ్యాధికారంగా నడవడానికి సరైన మార్గాన్ని ఎంచుకోవల్సిందిగా ఈ పంచమస్వరం గ్రంథంలో సూచించారు. ఇదే అంశాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ ఏనాడో మనకు చెప్పారు. ఇలానే ఉంటే బానిస సంకెళ్ళు విడిపోవు. ఇలానే ఉండే అంటరానితనం సమసిపోదు. ఇలానే ఉంటే వెట్టి చాకిరి నశించిపోదు. అందరూ చదువుకోవాలి, విజ్ఞానవంతులు కావాలి. పోరాట యోధులు కావాలి. ఎవరైతే ఏ వర్గాలవారైతే తమ స్వార్థం కోసం పంచముల్ని అణచివేతకు గురిచేస్తున్నారో, వారి స్వార్థం కోసం అధఃపాతాళానికి పంచముల్ని తొక్కేస్తున్నారో వాళ్ళని గుర్తించి వారికి సలాంలు చేయటం కాకుండా పోరాటం చేయాలి, ఆ పోరాటం ద్వారా నిజమైన స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను పంచములు సాధించుకోవాలని తెలిపారు.

మాలలు రాజు లౌదురు సు
మా అని కోకిల వోలె కాదు, సిం
హాలకు బోధిసత్వుని క్రి
యన్ గళమెత్తితి; మాల గూడులన్
మూలుగు చున్న మించు మల
మోదుగు లారా! వినుండు, లెండు, ! మి
త్రాలయ సుప్రభాతముల
స్వాగతముల్ గొని విక్రమింపుడీ !

(పంచమ స్వరం, పుట. 335)

ఆనాటి కాలం నుంచి ఇంతకు ముందు వరకు అస్పృశ్యులుగా భావించి ఊరికి దూరంగా పెట్టి, అనేక అవమానాలకు గురిచేసి దొరలు సమాజాన్ని పరిపాలించారు. రానురాను చదువు వల్ల, విజ్ఞానం వల్ల ప్రజల్లో కొంత మార్పు వచ్చింది. ఇప్పుడు అందరూ దొరలే బానిసలెవరూ లేరు. ఉండకూడదు కూడా. ఇప్పటి వరకూ పాలించిన దొరలు చేసిన లాభం ఒనగూర్చిన ప్రయోజనం ఎలా ఉందో మనం అనుభవించాం. ఇకపై అలా ఉండకుండా ఉండాలంటే, పంచములంతా ఉన్నత స్థితికి వెళ్ళాలంటే, వారు రాజ్యాధికారం సాధించుకోవాలి. అలా కాకుండా ఎప్పటికి దొరల పరిపాలనే సాగుతుంటే అగ్రవర్ణాల ఆదిపత్య భావజాలాల పరిపాలన నడుస్తూ ఉంటే భారత జాతి ముందుకు వెళ్ళదు. మళ్ళా మధ్య యుగాలనాటి చీకటి పరిపాలనలోకి వెళ్ళిపోతుంది. కనుక ఎప్పటికప్పుడు తెలివి తెచ్చుకోవాలి. చైతన్యాన్ని పుంజుకోవాలి, ఆ చైతన్యం రాజకీయ చైతన్యం అయి ఉండాలి. ఇంతకాలం అధికార రథాన్ని వాళ్ళు నడిపారు. దాని ఫలితాల్ని వాళ్ళే అనుభవించారు. ఆ సమయం మారింది దళితుల ఓట్లు లేకపోతే వాళ్ళు కూడా విజయం సాధించలేని పరిస్థితి మొదలైంది. కనుక పంచములమీద ప్రేమ చూపిస్తున్నట్లు నటించి వాళ్ళ పబ్బం గడుపుకోవడానికి చూస్తున్నారు. ఇది జరగకుండా ఉండాలంటే నిమ్నజాతుల వాళ్ళు రాజకీయ చైతన్యాన్ని పొంది. పరిపాలనా రంగంలోకి రావాలి. తమ తాత ముత్తాతలు అనుభవించిన కష్టాన్ని తమ తరువాతి తరం వారు అనుభవించకుండా నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందరూ చేపట్టేలాగా ప్రవర్తించాలని బలమైన గొంతుకతో నొక్కి చెప్పారు.

ఇంత వరకును వీరి నస్పృశ్యులనుచు
దూరమున నుంచి పాలించి దొరలు ; నేడు
బడుగు వర్గాలు కళ్లెము పట్టకున్న
భరతజాతి చరిత్ర ఆఖ రయి పోవు ! **(పంచమ స్వరం, పుట. 339)**

మనిషి ఏం సాధించాలనుకున్నా దానికి ప్రధానంగా ఆత్మవిశ్వాసం తోడవ్వాల్సిందే. ఆత్మ విశ్వాసం లేనివాడు చతికిలపడిపోవడం తప్ప విజయం సాధించలేడు. అందుకే నిన్ను నువ్వు తక్కువగా అంచనా వేసుకోవడం చాలా తప్పు అంటారు పెద్దలు. ఈ విషయాన్ని భీమన్న ఉద్రేకమయిన స్వరంతో తెలియజేశారు. నేను సామాన్యుడ్ని కాదు, అంటరాని వాడ్ని కాదు, విక్రమ కుమారుడ్ని. లలితా సరస్వతుల చేత పరమాన్నం గోరుముద్దలుగా తిన్నవాడ్ని అంటారు. ఇక్కడ లలితా సరస్వతుల చేత

పరమాన్నం తినడం అంటే బాగా చదువుకోవడం, తద్వారా ఉత్తమ జ్ఞానాన్ని ఆర్జించడం సరస్వతి దేవి కటాక్షం. శరీరధారుడ్యం పొందడం లలితాదేవి అనుగ్రహం. ఈ రెండు సంపూర్ణంగా సాధించిన నేను దేన్నయినా పొందగలను, సాధించగలను అని భీమన్న ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. ఈనాడు పంచములందరికి ఇది ప్రతిజ్ఞలాంటిది.

మాలను నేను, విక్రమ కు
మారుడ నేను, స్వతంత్ర విప్లవ
జ్వాలను నేను, కాంతియు ద
వాగ్నియు నేను పరాక్రమించినన్;
శ్రీ లలితా సరస్వతులు
చే పరమాన్నపు గోరుముద్దలన్
గ్రోలిన వాడ, నా కులము
గోత్రము నీవె కదమ్మ, హైందవీ ! (పంచమ స్వరం, పుట. 349)

స్వార్థపూరిత రాజకీయ శక్తులమూలాన సంఘటితంగా ఉండాల్సిన పంచమలు తమలో తాము కలహించుకోవడం విచారించాల్సిన విషయం. ఎందుకంటే రిజర్వేషన్లు, అందులో వర్గీకరణలు, ఏకీకరణలు వంటి వాటి మూలాన దళితుల్లో ప్రధాన శాఖలైన మాల, మాదిగల మధ్య అపారమైన అంతరం ఏర్పడింది. ఇద్దరూ కలిసి ఉమ్మడి శత్రువును ఎదుర్కోవల్సింది పోయి, తమలో తాము కలహించుకొని శత్రువుకు లాభాన్ని చేకూర్చుతున్నారు. ఎంతో మంది ఈ విషయంలో సయోధ్య చేయ్యాలని చూసినా వారికి నిరాశే మిగిలింది. వీరిద్దరు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని భీమన్న కోరుకున్నాడు.

మాల లోనె కలదు మాదిగ అను మాట,
అన్న లోనె కలదు తమ్ము డెపుడు ;
గతము లోన కూడ కవు లిట్లె వ్రాసిరి
మాల అని అక్షమాల నేని (పంచమ స్వరం, పుట. 350)

ఈ నాడు ఎక్కడ చూసినా కులమతాలుగా విడిపోయి మతాల పేర్లతో, దేవుళ్ళ పేర్లతో కొట్టుకుంటున్న వారు స్వర్గానికి పోలేరు. ఎందుకంటే భేదభావాలున్నవారు స్వర్గానికి ప్రవేశించలేరు. మన మతం లేదా మన కులం మాత్రమే గొప్పది ఇతర కులాలు, మతాలు నీచమైనవి అనే భావన ఉన్నంత కాలం వ్యక్తికి విశ్వజనీనత ఏర్పడదు. విశ్వజనీనత లేనివాడు మోక్షానికి అర్హుడు కాదు. అలాగే మైల అనే పదం కూడా విచిత్రమైన మాట. ఒక చోట మైలపడిందనే వస్తువు ఇంకొకచోట ఉంటే మైల పడలేదని జనాలు చెప్తుంటారు. ఉదాహరణకి బస్సుల్లోను, రైళ్ళలోను, విమానాలలోనూ మైల కనబడదు కాని, ఊర్లో, హరిజనవాడల్లో, దళితసోదర్ల ఇళ్ళలో మైల ఉందని, వాళ్ళు అంటరాని వాళ్ళని పక్కకు నెట్టేస్తుంటారు. ఇది విచిత్రమైన మనస్తత్వ ప్రవృత్తి. దీనికి చెంప పెట్టుగా పంచమస్వరంలో హెచ్చు స్వరంతో పద్యాన్ని అందించారు.

కులములుగా చీలి, కొట్లాడు కొనుచు చచ్చి,
స్వర్గమున కెట్లు పోదురు చవట లార?
రైలు పెట్టెలలో లేని మైల మిమ్ము
నులిమి చంపునె మాల పేటలను దాగి ? **(పంచమ స్వరం, పుట. 355)**

పంచమ స్వరం గ్రంథంలోని పద్యాలను పరిశీలిస్తే ఎక్కువ వాటిల్లో దళితుల సంఘటిత పోరాటాన్ని భీమన్న పదే పదే గుర్తు చేసాడు. ఎస్సీ జాబితాను పరిశీలిస్తే ఎస్సీ కులాలు 60 దాకా ఉన్నాయి. ఇవన్నీ అంటరానివిగానే భావించ బడుతున్నాయి. ఒక్కో కులం ఒక్కో ఉపకులం ఎవరికి వారుగా పోరాడితే లాభం పెద్దగా ఉండదు. అందరూ ఒక్కో అగ్నితో సమానం ఈ అగ్నులన్నీ కలిసి ఏకీకృతమైతే పెద్ద జ్వాల ఏర్పడుతుంది. దాంతో సమాజంలో ఉన్న దురాచారాల్ని దహించివేయవచ్చు. చిన్నదిగా ఉన్న జ్వాలను ఆర్పివేయడం సులభం. అదే భీకరమైన దావాగ్నిని ఆర్పివేయడం చాలా కష్టం. కనుక విప్లవమైన ఉద్యమమైన వ్యక్తుల, సంస్థల సంఘటితతోనే జరుగుతుంది. ఇదే విషయాన్ని గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్ గార్లు కూడా ప్రభోదించారని భీమన్న తెలిపారు.

మాల మాదిగ రెల్లి సంబంధ కులము
లేబదికి పైన సర్కారు జాబితాలొ;
అన్నియు అవర్ణ కీల లే హైందవాగ్ని;
కీల లన్నియు కలిసిన జ్వాల పంచ
మమ్ము; అది లేక అభ్యుదయమ్ము కలదె?
గాంధి అంబేద్కరుల చెల్మి కాదె కల్మి? **(పంచమ స్వరం, పుట.423)**

లోకమంతా ఒక్కటవ్వాలి విశ్వమానవ సౌభ్రాతృత్వం వెల్లి విరియాలి అంటూ మనం చిన్నప్పటి నుంచీ చదువుకుంటూ ఉంటాం. లోకమంతా ఒక్కటిగా మారినప్పుడే విశ్వమానవుడు రూపొందుతాడు. అందుకే జాషువ తనను 'విశ్వనరుడి'గా ప్రకటించుకున్నారు. అలాంటి విశ్వమానవులతోనే ఉన్నతమైన వ్యవస్థ విశ్వం రూపొందుతుందని భీమన్న దళిత కులాల ప్రజలందరికి గొప్ప సందేశాన్ని అందిస్తున్నాడు.

కేవలం పంచమస్వరంలో దళితుల సంవేదనలే కాక, భారతీయ ఎన్నికల పద్ధతి, అధ్యక్ష తరహా పరిపాలన, పట్టణీకరణ, ప్రజలు ఓటు వేసే విధానం, పార్టీలు, సోషలిజం, నిర్భంద మిలటరీ శిక్షణ, సాంస్కృతిక పునరుజ్జీవనం ఇలాంటి అనేక విషయాలను గురించి కూడా పద్యాలు రాశారు. ప్రతి పద్యంలో రమణీయ భావాన్ని పొందుపరిచారు. నిజంగా ఇది కోకిల కంఠంలోంచి వినిపించే మధురమైన కమ్మని స్వరమే. ఇలాంటి రచనలు ఎల్లకాలం ప్రాసంగీకత కలిగి ఉంటాయి. ఇలాంటి రచనలు విద్యార్థులకు చైతన్యాన్ని కలిగిస్తాయి. బోయి భీమన్న లాంటి గొప్ప సాంఘిక తత్త్వవేత్తలు సాహిత్యం ద్వారా చేసిన ప్రయోగాలతో తెలుగు నేల ఎప్పటికి సస్యశ్యామలం కావాలని కోరుకుంటున్నాను.

ఆధార గ్రంథాలు

1. పంచమ స్వరం – బోయి భీమన్న
2. తెలుగు సాహిత్య సమీక్ష – డా. జి. నాగయ్య

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న రచనలు – భిన్న దృక్పథాలు

– డా. సంగుల సునీల్ కుమార్
అతిథి ఉపన్యాసకులు
తెలుగు అధ్యయన శాఖ

వ్యాస సంగ్రహం

బోయి భీమన్న ఆధునిక తెలుగు సాహిత్యంలో అనన్యసాధారణ స్థానం పొందిన కవి, రచయిత. పద్యసాహిత్యం, వచనకవిత్వం, నాటకాలు, కథలు, వ్యాసాలు వంటి అనేక ప్రక్రియల్లో ఆయన సృజనాత్మక కృషి విస్తరించింది. ఈ వ్యాసం బోయి భీమన్న రచనలను భిన్న దృక్పథాలను విశ్లేషించడం ప్రధాన ఉద్దేశం.

బోయి భీమన్న రచనలపైన అనేక కోణాల్లో పరిశోధనలు వెలుగుచూశాయి. అవి – "పాలేరు నుంచి పద్మశ్రీ వరకు" – హైమావతీ భీమన్న; "బోయి భీమన్న రూపకాలు – తాత్త్విక చింతన" – డా. తక్కళ్ల బాలరాజు; "పద్మభూషణ్ బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం"– బి. నమశ్శివాయ వంటి పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. "బోయి భీమన్న సాహిత్యం – సమాలోచన" – ఆచార్య విస్తాలి శంకరరావు, మద్రాసు విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు; "మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ బోయి భీమన్న జీవితం – సాహిత్యం" అనే అంశంపైన రాజమహేంద్రవరం వై జంక్షన్ ఆనం కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ సదస్సు ఈ వ్యాసానికి ఆధారాలుగా స్వీకరించడం జరిగింది.

సామాజిక చైతన్యం, మానవతావాదం, ప్రజాసమస్యలు, గ్రామీణ జీవనం, శ్రమజీవుల జీవనవేదన వంటి అంశాలు ఆయన రచనల్లో ఎలా ప్రతిఫలించాయో పరిశీలించబడింది. మార్క్సిస్టు భావజాలం, ప్రజాస్వామ్య దృక్పథం, సాంస్కృతిక వాస్తవికత వంటి సిద్ధాంతాలు ఆయన సాహిత్యంపై చూపిన ప్రభావాన్ని ఈ అధ్యయనం విశ్లేషిస్తుంది. విశ్లేషణాత్మక, తులనాత్మక పరిశోధన పద్ధతుల ద్వారా భీమన్న రచనల సాహిత్య విలువను నిర్ధారించడమే ఈ పరిశోధన లక్ష్యం. ఈ అధ్యయనం

ద్వారా బోయి భీమన్నను కేవలం కవిగా మాత్రమే కాక, సమాజ పరివర్తనకు దోహదపడిన సాహిత్యకారుడిగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది.

కీ వర్డ్స్ : బోయి భీమన్న, కుల వివక్ష, అంటరానితనం, చాతుర్వర్ణ వ్యవస్థ, దళిత చైతన్యం

ఉపోద్ఘాతం

20వ శతాబ్దాన్ని ఆసాంతం ఆక్రమించిన సాహితీ విరాణ్మూర్తి బోయి భీమన్న వీరు రాసిన అనేక పుస్తకాల ద్వారా తెలుగు జాతికి ఎనలేని సేవ చేశారు. కేవలం ఒక ప్రక్రియకి పరిమితం కాకుండా తెలుగులో సమకాలీన ప్రక్రియలన్నింటిలోనూ రచనలు చేసి, తన అభిప్రాయాలని నిక్కచ్చిగా, నిష్కర్షగా తెలియజేసిన ప్రతిభావంతుడు. పద్యాలు, నాటకాలు, వచన కవితలు, వచన గ్రంథాలు లేఖా సాహిత్యం ఇలాంటి అనేక ప్రక్రియల ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు భీమన్న గారు.

భీమన్న కలం పట్టింది మొదలుకొని కడదాకా రాస్తూనే ఉన్నారు. రాయడం అంటే కేవలం కాలక్షేపంగా రాసింది కాదు. దళిత జాతి సముద్ధరణ కోసం కంకణం కట్టుకుని చేసిన పని అది. దాదాపు 60 గ్రంథాలు రచించిన భీమన్న ఎక్కడ తొణకలేదు బెణక లేదు. నిండుకుండలాంటి ఆయన హృదయాన్ని ప్రతి అక్షరంలోనూ మనకు అందించారు. భీమన్న పూర్తిగా సనాతనుడు కాదు అట్లని పూర్తిగా ఆధునికుడూ కాదు.

కులం కుళ్ళును కడగడానికి, దాని సహేతుకతను ప్రశ్నించడానికి, దాని వల్ల ఏర్పడుతున్న సమస్యల మూలాలను విప్పిచెప్పడానికి కలం పట్టిన యోధులలో బోయి భీమన్న ముందువరుసలో నిలుచుంటారు. సమాజం చూపిన చిన్నచూపులోంచి తట్టుకొని నిలబడటమే కాక, తరువాతి తరాలవారికి మార్గదర్శకుడుగా ఎదిగిన గొప్ప వ్యక్తి భీమన్న. ముఖం చూసి కాక కులం చూసి మాట్లాడే సంఘంలో తన కలం ద్వారా చైతన్య కిరణాలను ప్రసరింపజేసిన స్ఫూర్తి ప్రదాత. ఆయన ఒక్క రోజులో తయారైన వాడు కాదు. అనేక ఆటుపోట్లలోంచి తనను తాను మెరుగు పెట్టుకున్న చైతన్యశీలి.

కుల వివక్షత నుంచి జాతిని ఉద్ధరించాలనే తలంపుతో వారు రాసిన గ్రంథాలన్నింటినీ పరిశీలిస్తే బోయి భీమన్న ఒక వ్యక్తిగా కాక బహుజన తత్వవేత్తగా మనకు కనిపిస్తాడు. ఈ వ్యాసంలో ఇతరుల దృక్పథానికి, భీమన్న దృక్పథానికి మధ్య ఉండే వైరుధ్యాలను వారు మాత్రమే ఎంచుకున్న దారులను స్థూలంగా పరిశీలిస్తాను.

దళితులు అంటరానివాళ్ళుగా చిత్రించబడి సమాజానికి దూరంగా నెట్టివేయడానికి ప్రధాన కారణం హిందూమతంలోని కుల వ్యవస్థ. ఇది అందరూ ఒప్పుకున్న సత్యమే. ఇతర దళిత కవులు మేధావులు అందరూ హిందూమతంలోని ఈ లోపాన్ని పూర్తిగా వ్యతిరేకించి దానికి ప్రధానమైన కారణాలని విశ్లేషించారు. ఏ మతం వల్లయితే తాము వెలివేయబడ్డమో, ఏ మతం కారణంగా అవమానాల్ని ఎదుర్కొన్నామో ఆ మతాన్ని త్యజించి సర్వ సమానత్వాన్ని ప్రబోధించే మతాల వైపుకు దళిత సోదరులు అనివార్యంగా మొగ్గుచూపారు. కొందరు బౌద్ధ మతాన్ని అనుసరిస్తే, కొందరు క్రైస్తవాన్ని అనుగమించారు. ఎక్కువమంది దళితులు హిందూ మతాన్ని అందులోని లోపాలను ద్వేషిస్తూ

మనం చెప్పుకున్న పై రెండు మతాలలోకి వెళ్లిపోతే, భీమన్న మాత్రం హిందూ మతాన్ని సమర్థించి అందులో ఉన్న లోపాల్ని మాత్రం కడిగి పారేశాడు.

ఎక్కువమంది బాబాసాహెబ్ అంబేద్కర్ గారు చూపిన మార్గంలో బౌద్ధం ప్రత్యామ్నాయ మతంగా భావించారు. అంబేద్కర్కు వీర భక్తుడు గాను, అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి దీక్ష తీసుకున్న వ్యక్తిగానూ కనిపించే బోయి భీమన్న మాత్రం హిందూ మతాన్ని వదిలి బౌద్ధమతానికి వెళ్లడాన్ని వ్యతిరేకించాడు. బౌద్ధమతం పూర్తిగా హిందూ మతానికి ప్రత్యామ్నాయం కాదని చెప్పుకొచ్చాడు. హిందూ మతంలో ఉన్న లోపాలన్నింటిని ఒక్కొక్కటిగా ఏరి పారేసుకుంటూ, సర్వసమానత్వం వైపు ప్రజలందరూ సౌభ్రాతృత్వంగా జీవించే వైపు వెళ్లడానికి ఆయన ప్రణాళికలు రచించారు. దేవుడు లేడు పరమాత్మ ఉన్నాడు అనే నినాదంతో భీమన్న అనేక గ్రంధాలను వ్రాశారు. ఈ విషయంలో దేవుడు లేకపోవడం ఏంటి? అంటే ఎవరికి వారు తమ దేవుడు గొప్ప తమ దేవుడు గొప్ప అని గిరి గీసుకొని బతుకుతున్న సమాజంలోంచి బయటకు రావాలనేది వారి ఉద్దేశం. మనం పూజించే విగ్రహాల్లోనూ, బొమ్మల్లోనూ దేవుడు లేడు. దేవుడు సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి అని చెప్పడమే ఈ పరమాత్మ శబ్దానికి ఉన్న అసలు అంతరార్థం.

ప్రపంచ సాహిత్యాన్నంతటిని మధించి, అణగారిన వర్గాల కోసం ఎన్నో గ్రంథాలు రాసి వారిలో చైతన్యాన్ని తెచ్చిన అంబేద్కర్ తాను హిందువుగా పుట్టినా, హిందువుగా మాత్రం చనిపోనని అందుకు ప్రత్యామ్నాయంగా బౌద్ధమతాన్ని స్వీకరించడం మనకు తెలిసిన విషయమే. అయితే బౌద్ధమతం పూర్తిగా లోపరహితం కాదని భీమన్న అంబేద్కర్ నిర్ణయాన్ని ఆక్షేపించాడు. బౌద్ధ మతంలో కూడా హిందూమతంలో లాగా అనేక లోపాలు ఉన్నాయని తెలియజేశాడు.

"ఆత్మ లేదన్నాడు బుద్ధుడు. పునర్జన్మ వున్నదన్నాడు. అందుకు ఆయన చేసిన తర్కం, చూపిన పోలికలు తృప్తికరంగా లేవు. హిందూమత బోధలకంటే, తన బోధలే ఎక్కువ విశిష్టమైనవిగా చూపడం కోసం ఆయన మరీ తొందర పడ్డాడనిపిస్తుంది. ఆధ్యాత్మిక గురువుగా, మానవజీవిత మార్గదర్శిగా ఆయన విఫలుడైంది అందుకే కావచ్చు." (అంబేద్కరిజం, పుట.211)

మిగిలిన దళిత తత్వవేత్తలు అంతా అంబేద్కర్ గారి మార్గాన్ని అనుసరిస్తూ హిందుత్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడితే, భీమన్న మాత్రం దానికి ప్రత్యామ్నాయంగా హిందూమతంలోని శివారాధనను బలపరిచాడు. కారణం శివుడు ఆటవిక జాతి వాడని, ఆయన ధరించే ఆభరణాలు కట్టుకునే వస్త్రాలు ఇవన్నీ ఆటవిక జాతుల వాళ్లకు చెందినవని, ఆది కాలం నుంచి ఉన్న ఆటవిక దేవుడు శివుడేనని భీమన్న బలంగా నమ్మాడు. అంతేకాదు దళిత కులాల వాళ్ళంతా మూలవాసులని, మొదటినుంచి అడవుల్లో నివసించిన వాళ్ళని చెప్పారు. ఆటవిక జాతులకు దేవుడుగా శివుడ్ని అనుసరించాలని భీమన్న ఉద్దేశం.

మరొక విషయమేమిటంటే శివారాధనలో విగ్రహారాధన కాస్త తక్కువగా ఉంటుంది. ఒక రూపం లేకుండా లింగ రూపంగా శివుడ్ని పూజిస్తాం కాబట్టి పూర్తిగా విగ్రహారాధన అని చెప్పడానికి వీలులేదు. అంతేకాక శివుడు ఆది జాంబవంతుని రూపం అని సృష్టికి ముందు ఏర్పడిన వాడు సృష్టి

చివరిదాకా ఉంటూ, అందరికంటే శక్తివంతుడు ప్రళయ కాలంలోనూ నశించని వాడుగా శివుడ్ని భీమన్న కీర్తించాడు. ఇతర దళిత కవులకంటే వైరుధ్యంగా ఈ విషయంలో ఆలోచించాడు, పద్యాలు వ్రాశాడు భీమన్న.

చిందు వేయు చునున్నాడు శివుడు, అతడే
ఆది జాంబవుడ, డవనికి ఆది నరుడు;
ఎప్పుడే రీతి నారిపోయినను గాని
మిగిలియుండు నొకే దీప దివ్వె వోలె!
(చాటువులు – స్వగతాలు, పుట.698)

కేవలం బ్రాహ్మణ వర్గాల వల్ల మాత్రమే హిందూమతం అనేక ఇబ్బందులు పడిందని వీరు గుర్తించారు. తమను తాము ఉన్నతులుగా ప్రచారం చేసుకోవడం ద్వారా మిగిలిన వాళ్ళను అంటరాని వాళ్ళుగా చిత్రీకరించారని వీరి ప్రధాన ఆరోపణ. బ్రాహ్మణులు కేవలం ప్రజల్ని ఎమోషనల్‌గా ఉపయోగించుకుంటూ, వారిని ఎదగనీయకుండా చేశారు. ఈ విషయాన్ని అంబేద్కర్, పూలే మొదలుకొని నిన్న మొన్నటి దళిత వేత్తలంతా నిర్ద్వంద్వంగా అంగీకరించారు. బ్రాహ్మణులు పాటించే విభూతి ధారణ, యజ్ఞోపవీతం మొదలైన వేషాలను కూడా వ్యతిరేకించారు. కాని భీమన్న తన చాటువుల్లో బొట్టు పెట్టుకోవడం గురించి చెప్పారు. శివుడికి మూడో కన్నుంటుంది. అలాగే ప్రతి మనిషి కూడా తాను శివ స్వరూపుడిని అనే స్పృహ కలిగి ఉండటం కోసం భారతీయులంతా బొట్టు పెట్టుకుంటారు. ఆ బొట్టు పెట్టుకోవడం మూఢాచారం కాదు ఉత్తమ సంప్రదాయం అని ప్రతిపాదించారు. మిగిలిన మేధావులతో పోలిస్తే భీమన్నలోని మరో వైరుధ్యాంశమిది.

నెన్నుదుట బొట్టు మూడవ కన్ను గాన
బొట్టు పెట్టుడు, జ్ఞాన సంబుద్ధి గొనుడు;
బొట్టు మాత్రమె కాదది, భోగిని శి
రోమణి రాజయోగ సూర్యోదయమ్ము!
(చాటువులు – స్వగతాలు, పుట.698)

సాహిత్యం యొక్క పరమ ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తే ఎక్కువమంది చెప్పేది సామాజిక అభివృద్ధి. లోకానికి మేలు చేకూర్చేదే సాహిత్యమని ఎక్కువ మంది అంగీకరించారు. కొంత మంది మాత్రం కళ కళకోసమే ఉన్నది, అది వ్యక్తిగత అనుభూతులను వ్యక్తీకరించడానికి మాత్రమే ఉన్నదని తెలియజేసారు. వీరిలో భీమన్న రెండో వర్గానికి చెందిన వారు. పరిశీలించి చూస్తే భీమన్న రచించిన గ్రంథాలన్నీ సామాజిక ప్రయోజనాన్ని ఆశించేవే. సమాజ అభ్యున్నతికోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కాని ఆయన కళ కళకోసమే అన్నది తన సిద్ధాంతంగాను కళా సృష్టి ఆనందం కోసం మాత్రమే ఉండాలని తెలియజేశాడు. ఇది వైరుధ్యమైన అంశం.

స్వీయ ఆనందంలోంచి వచ్చినది ప్రపంచానికి మొత్తం ఆపాదించబడి తద్వారా ప్రయోజనకారిగా తయారవుతున్నదనే వినూత్న వాదనను కూడా తీసుకొచ్చారు. అంటే సూక్ష్మంగా

ఆలోచిస్తే కళ ఏ కళైనా సరే వ్యక్తిగత ఆనందంలోంచి మొదలై సామాజిక ప్రయోజనానికి దారితీస్తుందనే పరిణామ సూత్రాన్ని వీరు ప్రతిపాదించారు. ఈ విషయంలో చాలా మంది సాహితీ వేత్తలతో విభిన్నత పాటించారని చెప్పక తప్పదు.

"కళ కళ కోసమే అనేది నా సిద్ధాంతం. కళా సృష్టి ఆనందం కోసం. మార్కెట్టు సరుకుగా కల్పించబడేది కళ కాదు. కవి, గాయకుడు, చిత్ర శిల్పి, నర్తకుడు వంటి కళా జీవులు రూపావేశులై తమ ఆనందం కోసమే ఆయా కళలను సృష్టిస్తారు. ఆరాధిస్తారు. ఒక సర్వజ్ఞుడైన, సమగ్ర వ్యక్తి మంతుడైన వ్యక్తి స్వీయానందం కోసం సృష్టించుకొన్న దేదైనా సరే ప్రపంచం మొత్తానికి ప్రయోజనకారి అవుతుంది. తక్కిన మానవులందరికీ శ్రేయోదాయకం అవుతుంది." (భీమన్న శంఖారావం, పుట.511)

కొందరు కవులు ఎంచుకున్న వస్తువు, ఉపయోగించిన భాష వేగంగా, బలంగా ఎంచుకుంటారు. పయోధర ప్రచండ ఘోషంలాగా కవితను నడిపిస్తూ పాఠకుల గుండెల్లో అభ్యుదయ విప్లవభావాలను పూయిస్తారు. మరికొందరు కోకిల గానంలాగా చల్లని పిల్లగాలిలాగా మనసుకు హాయి గొల్పిస్తూ, అనుభూతి దొంతర్లోకి ప్రయాణం సాగింపచేస్తారు. ఎవరిదారి వారిదే. ప్రతి కవి ఏదో ఒక మార్గానికి కట్టుబడిపోతాడు. శ్రీశ్రీ లాంటి వాళ్ళు, కృష్ణశాస్త్రి లాంటి వాళ్ళు ఈ రెండు మార్గాలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. మొదట్లో బలమైన పోరాట పటిమ కలిగిన కవితలను రాసినవారు ఇక తరువాత తరువాత అదే కోవలో ముందుకు సాగిపోతారు. బోయి భీమన్న మాత్రం ఒక్కోసారి కఠినాతి కఠినమైన పదాలను ఉపయోగిస్తాడు, ఒక్కోసారి నవనీత సమములైన భావాలను సృష్టిస్తాడు. నిజానికి దళిత కవిగా దళితుల్ని సామాజికంగా ఉద్ధరించాలనే తపన ఉన్న కవి పోరాట మార్గాన్ని అభ్యుదయ మార్గాన్ని వేగవంతమైన శైలిగలిగిన కవితా మార్గాన్ని ఎంచుకుంటారు. సమాజంలో దళిత వాదాన్ని తలకెత్తుకున్న మహాకవులు మద్దూరు నగేష్ బాబు దగ్గరినుంచి ఇటీవల పరమపదించిన ఎండ్లూరి సుధాకర్ వరకు వారి కవితల నిండా చైతన్యం ఉత్తేజం ఉద్వేగం మనకు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. కాని భీమన్నను ఒక్కొక్కసారి చూస్తే భావకవితా ఛాయలు, ఒక్కోసారి అభ్యుదయ మార్గపు ఛాయలు కలగాపులగంగా కనిపిస్తాయి. అందుకు ఉదాహరణగా కింది రెండు కవితలను పరిశీలిస్తే భీమన్న శైలిలో వైరుధ్యాన్ని మనం గమనించవచ్చు.

అమ్మో, దున్నలు ! దున్నలు!
మంచితనాన్ని తొక్కేస్తున్నై
ప్రతిభను ప్రాసిక్యూట్ చేసేస్తున్నై
ప్రజల దైనందిన కాయకష్టాన్ని
సారాతో నంజుకు తినేస్తున్నై
గొర్రెలను మచ్చిక చేసుకొని
కసాయిలకు అమ్మేస్తున్నై
తామే భోక్తలుగా కూర్చొని
తాజా విందులు ఆరగిస్తున్నై! **(గుడిసెలు కాలిపోతున్నై, పుట.78)**

నన్నిచ్చి నిన్ను కొనుక్కున్నాను నేను !
మనిద్దరం ఒకళ్ల కొకళ్లం బానిసలం!
సంపూర్ణ దాస్యమే సంపూర్ణ విమోచనం! **(త్రిపదలు, పుట. 9)**

అంటరానితనాన్ని నిర్మూలించే క్రమంలో దళితుల్ని ఏమని పిలవాలని అనేకమంది చర్చలు చేసి, కొన్ని పదాల్ని సూచించారు. కొందరు నిమ్నజాతులన్నారు, కొందరు నిరుద్దులన్నారు, కొందరు ఆది జాతులన్నారు, కొందరు మూలవాసులన్నారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో పేరు సృష్టించారు. మహాత్మా గాంధీ హరిజన అనే పదాన్ని సూచించారు. తరువాత రాను రాను చర్చల్లో తేలిన విషయం ఏమంటే అన్నింటిలోకి దళిత పదమే అందరికీ ఆమోదయోగ్యంగా పరిగణించబడింది. ముఖ్యంగా తెలుగునాట దళిత ఉద్యమంలో ఆది ఆంధ్రులం, మూలవాసులం వంటి పదాలు అనేకం కనిపిస్తున్నా, దళిత శబ్దం అందరిలోకి చొచ్చుకు వెళ్ళగలిగింది. కానీ బోయి భీమన్న మాత్రం వీటన్నింటికంటే పంచములుగా పిలిపించుకోవడానికే ఇష్టపడ్డాడు. మిగిలిన వాటిల్లో లేని బలం పంచమంలో ఉందని హిందూ వ్యవస్థలో పంచమం అనేది కూడా ఒక భాగమని ఆయన విశ్వసించారు. దాని గురించి అనేక గ్రంథాలలోను, వాటికి రాసిన పీఠికలలోను ఆయన నిర్మొహమాటంగా వెల్లడించారు.

ఐదవ వాడిగా ఉండడం అంటే అఖరి వాడిగా మనల్ని మనం అంగీకరించినట్టే కదా! కానీ భీమన్న ఈ విషయానికి అధిక ప్రాధాన్యత నిచ్చాడు. చాతుర్వర్ణ వ్యవస్థ కాకుండా మొదటి నుంచి భారతదేశంలో ఐదు వర్ణాల వ్యవస్థ ఉందని అవన్నీ సమ ప్రాధాన్యం కలిగినవేనని వారి వాదన. దళిత శబ్దం అణచబడిన అనే అర్థంలో అణచబడినవారు, అణగదొక్కేవారు వారిమధ్య సాగుతున్న అణచివేత వైఖరి ఇవన్నీ కూడా ప్రతిబింబిస్తాయి. అందుకే ఎక్కువ మంది దళిత శబ్దానికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది మిగిలిన దళిత తాత్వికులకు భీమన్నకు ఉన్న వైరుధ్యం.

పంచ భూతాలు, వర్ణాలు, ప్రాణములును
పంచ తంత్రాలు, ఖండాలు, వార్ధులిట్లు
పంచమము లెన్నో కలవు ప్రాపంచకమున !
పంచ జను డేను, నాది ప్రపంచ విభుత!
పంచకమేలు ; ద్రౌణ ప్రతి
పాదన లన్నియు నక్క జిత్తులే;
చెంచు విపంచి మీటి నర
సింహ రవోద్ధతి గొంతు విప్పుమా ! **(పంచమ స్వరం, పుట.316)**

ఏది ఏమైనప్పటికీ 20వ శతాబ్దంలో తెలుగునాట గొప్ప కవులలో బోయి భీమన్న ముందువరుసలో నిలబడతాడు. తను పడిన కష్టాల్లోంచి, తను పొందిన అవమానాల్లోంచి అనుక్షణం పదునెక్కి తన సాహితీ సేవ ద్వారా తన జాతి వారందరినీ చైతన్యం చేయాలనే మహత్తరమైన ఆశయంతో కలం పట్టిన యోధుడు భీమన్న. అయితే మిగిలిన ప్రవాహంతో కలిసి నడవకుండా తనదైన కొత్త మార్గాన్ని వేయడానికి, తనదైన ముద్రను చరిత్ర పై నిలపడానికి ఎంతగానో

ప్రయత్నించాడని చెప్పక తప్పదు. ఆ కోణంలోదే ఈ వ్యాసంలో మనం చర్చించుకున్న విభిన్న అంశాలు.

ఆధార గ్రంథాలు :

1. అంబేద్కరిజం – బోయి భీమన్న
2. గుడిసెలు కాలిపోతున్నై – బోయి భీమన్న
3. చాటువులు – స్వగతాలు – బోయి భీమన్న
4. భీమన్న శంఖారావం – బోయి భీమన్న
5. త్రిపదలు – బోయి భీమన్న
6. తెలుగు సాహిత్య చరిత్ర – డా. ద్వా.నా.శాస్త్రి
7. దళిత సాహిత్య చరిత్ర – వెలమల సిమ్మన్న
8. పంచమ స్వరం – బోయి భీమన్న

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

గుడిసెలు కాలిపోతున్నాయి కవిత్వం – సామాజిక దృక్పథం

– డా. బత్తుల రవీందర్ గౌడ్
అసిస్టెంట్ ప్రొఫెసర్ (పి)

డాక్టర్ బోయి భీమన్న రచించిన "గుడిసెలు కాలిపోతున్నాయి" కవిత సమాజంలో అణచివేతకు లోనవుతున్న పేదలను, బహుజనులను మేల్కొలిపిన దళిత సామాజిక దృక్పథం గలకవి.

పద్మభూషణ్ బోయి భీమన్న దాదాపు 70 పుస్తకాలు రాశారు. పద్యం, గేయం, నాటకం, వచనం ఇలా అనేక ప్రక్రియలలో రచనలు చేశారు. ఆయన రచించిన అనేక రచనలు సామాజిక మార్పుకి దోహదం చేశాయి. భీమన్న రాసిన 'పాలేరు' నాటకం లాంటి అనేక రచనలు ప్రజల జీవితాన్ని ముఖ్యంగా దళితుల జీవితాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. భీమన్న 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటి సమాజానికి స్ఫూర్తిని దళితులకు చైతన్యాన్ని ఇచ్చింది. అటువంటి స్ఫూర్తివంతమైన కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఆ కవితల ద్వారా భీమన్న సమాజానికి అందించిన సామాజిక స్ఫూర్తిని విశ్లేషణ చేయడం ఈ పరిశోధనా వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం. 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటిలో సామాజిక మార్పుకి దారులేసిన కవితలు కొన్నిటిని ఎంపిక చేసి ఈ పరిశోధనా వ్యాసంలో పరిశీలించడం జరిగింది. చివరగా ముగింపులో గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటిలో కవి దృక్పథాన్ని, కవితా శిల్పం, భాష, కవి ఆకాంక్ష గురించి విశ్లేషించడం జరిగింది.

ముఖ్యమైన పదాలు (key words): పద్మభూషణ్ బోయి భీమన్న, గుడిసెలు కాలిపోతున్నై, దళిత కవిత్వం, సామాజిక దృక్పథం.

బోయి భీమన్నది ఒక విలక్షణమైన రచన శైలి, అతడు బహుముఖీన రచయిత. పద్య కవిత్వం, గేయ కవిత్వం, వచన కవిత్వం, వచన గ్రంథాలు, నాటకాలు, ఇంకా ఇంగ్లీషు రచనలు చేశారు. దాదాపు డెబ్భై పుస్తకాలు రాశారు. అంబేద్కర్ మీద విస్తృమైన సాహిత్యం రాశారు. "పాటలలో

అంబేద్కర్ పేరుతో – 118 పాటలు రాశారు. "అంబేద్కర్ సుప్రభాతం" రాశారు. పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలు రాశారు. బోయి భీమన్న దళితజాతికి దిశానిర్దేశం చేసిన మహా రచయిత. ఎందరో దళితుల జీవితాలను తన రచనల ద్వారా ప్రభావితం చేశారు. ఆయన రాసిన "పాలేరు" అనే నాటకం గొప్ప సామాజిక మార్పుకి దారి తీసింది. ఆ నాటకం చూసి ఎందరో దళిత విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని, ఉన్నత పదవులు పొందారు. జీవితాలను మార్చుకున్నారు. ఆయన రచనల గొప్పదనం అది.

బోయి భీమన్న దేశంలోని ప్రముఖ అవార్డులను అందుకున్న కవి. ఇతను పద్మశ్రీ, పద్మభూషణ్, కళాప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, గౌరవ డాక్టరేట్లువంటి ఎన్నో అవార్డులు పొందారు. ఇతని రచనల మీద ఎన్నో పరిశోధనలు జరిగాయి.ఆ రచనల్లో 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటి అట్టడుగు సమాజానికి చైతన్యస్ఫూర్తినిచ్చింది. పేదలకు దిశానిర్దేశం, దళితులకు మార్గనిర్దేశనం చేసింది. ఈ కవితా సంఫుటిలోని సామాజికమైనమార్పును కాంక్షించడం, సంఘటించే శక్తి, మతోన్మాద నిరసన, ధర్మప్రబోధం వంటి సామాజికాంశాలను విశ్లేషించడం ఈ పరిశోధనావ్యాసం ప్రధానోద్దేశం.

1. భీమన్న కవిత్వం – సామాజిక దృక్పథం

కవితలలో సామాజికమైన మార్పు కాంక్షించే కవితలు, బోయి భీమన్న ఈ కవితలు అతని సామాజిక దృక్పథానికి, అతని సహృదయతకు నిదర్శనం.

హక్కుల ప్రకటన : నాకు రావలసిన బాకీ!

దళితులు ఈ భరతావనికి చేసిన సేవలకును గాను ఈ దేశం దళితులకు అప్పుబడ్డదని జాషువా చెప్పినట్లు దళిత జాతికి రావలసిన బాకీ ఇంకా మిగిలే ఉందని చెప్తున్నారు భీమన్న.

"ఓ, అహంకార కులాగ్రేసరా!/నా హక్కులేవో నా కిలా పారేయ్?!/హే, పీడిత పిరికి జనమా!

ఇవిగో మీ హక్కులు/అధికారంతో అనుభవించండిక!" (బోయి భీమన్న సమగ్రసాహిత్యం సంపుటి 3– వచన కవితలు, భాగం –2 : పుట. 91)

దళితులకి రావలసిన బాకీ ఏంటో చెప్తున్నారు! దళితులు ఒక నిజాయితీతో, దోషరహితంగా, కష్టాన్ని నమ్ముకొని ఉన్నవాళ్లని చెప్తున్నారు ఈ కవితలో. ఆత్మస్థైర్యంతో దళిత సమాజపు గుండెల్లో పేరుకొని ఉన్న ఎన్నో ఏళ్ల వేదనని ప్రకటించారు. దళితుల గురించి 'నేను దోషరహితుడ్ని కాదు' అంటున్నారు. దళిత సమాజం ఎప్పుడూ తనకు తాను ఒక గిరిగీసుకొని ఉంటుంది. నీతి, న్యాయం, ధర్మం వూపిరిగా బతకాలనుకుంటుందనే పరిస్థితిని ప్రకటించారు. అలాంటి ఒక స్వభావం ఉండడం వల్లే వీళ్ళు ఇంకా పేదలుగా, అంటరానివారుగా, అణగిన వర్గాలుగా ఉన్నారు. వాళ్లొక్కసారి కళ్లు తెరిచినపుడు ప్రశ్నించినపుడు – తమకు రావలసినబాకీలన్ని తమకు వచ్చేస్తాయని చెప్తున్నారు. తమ స్థితిని గుర్తించి, ప్రశ్నిస్తే ఏం జరుగుతుందో చెబుతున్నారు. ఒకసారి గొంతెత్తితే, నినదిస్తే, ధిక్కారం కలగలిసి ప్రశ్నిస్తే నీకు రావాల్సింది నీకు ఇస్తారు. ఆ కుర్చీలో వాళ్లు కూర్చొని ఉన్నారు నువ్వు ప్రశ్నిస్తే

లేచి నీదినీకిచ్చి అక్కడ్నుంచి వెళ్లిపోతారు అంటున్నారు. ఇక్కడ కవి ముక్కుసూటిగా చెప్పిన సరళ వాక్యం కవిత్వం అయింది. ఒక మానసిక సంఘర్షణలను దాటి దళిత సమాజం కేంద్రంగా కవి చేసిన హక్కుల ప్రకటన ఈ కవిత.

సంఘటిత శక్తి – చీమల పుట్టలు:

కవిత చదవగానే కవి ఏం చెప్పదలుచుకున్నారో సులభంగా అర్థమవుతుంది పాఠకులకి. బలహీనమైన ప్రాణులు వాటిలో–అవి చిన్న చిన్నవాటి కోసం కొట్టుకుంటా ఉంటాయి. అవన్నీ చీమలే అయినా కానీ వాటి మధ్య ఒక సయోధ్య ఉండదని చెప్తున్నారు.

చీమ కొంచెం సైజు మారితే, అదొక జాతి, కొంచెం రంగు మారితే, అది మరొక జాతి! దేశ కాలాలను బట్టి పాత్రల గుణవర్తనలు మారుతూ ఉంటై అని ఎరగని చీమలు! తక్కిన అన్ని జాతుల మీదా తన జాతే గొప్ప దనుకొనే మనస్తత్వాలు! అవి చీమలే అయినప్పటికీ రకరకాలుగా ఉన్నట్లు ' మనుష్యులు కూడా అంతే! రంగు, ఎత్తు, రూపం – వీటిని బట్టి వాళ్లల్లో వాళ్లు మేం గొప్ప అంటే మేం గొప్ప అని, మాది గొప్ప జాతి అంటే – మాది గొప్ప జాతి అని కొట్టుకుంటూ ఉంటారు. ఒకే జాతి అయినా సరే అనేక జాతులుగా విడిపోయి ఉంటారు అని చెప్తున్నారు. అందరూ మనుష్య జాతే అన్న సత్యం గుర్తించరు. అలా విడిపోయి ఉండటం వల్ల ఏం ప్రయొజనం లేదని ఆర్థం చేసుకోలేక పోతారు.

'తెలివి తక్కువ చీమలు/గింజల కోసం గింజుకుచస్తుంటై/
అవి పెట్టిన పుట్టలు/ పాముల కెరవవుతుంటై!'

చీమలు చిన్న విషయాలను పట్టుకొని కొట్టుకు చస్తా ఉంటే, చీమలు కష్టపడి సంపాదించిందంతా పాములు ఆక్రమిస్తాయి. ఈ సమాజ నిర్మాణంలో భాగమైన వాళ్లు తన్నుకుంటూ ఉంటే పాము లాంటి ఆధిపత్య వర్గాలు – వాటిని అనుభవిస్తూ ఉంటాయి అని చెబుతున్నారు. ఇదంతా ప్రతీకాత్మకం. చీమల్లాగే మనుషులు కూడా స్పృహలో లేకుండా పోయారంటున్నారు. సుమతీ శతక ప్రస్తావన తెచ్చారు. చీమల కున్న జ్ఞానాన్ని మనుషులు అందుకోలేక పోయారని కవి ఆవేదన వ్యక్తం చేస్తారు. ఐకమత్యాన్ని సాధించుకోలేక పోయారన్న విషయాన్ని ఒక ప్రతీకగా చెప్పారు. కవిత మొత్తం అన్యాపదేశంగా సాగుతుంది. పైకి ఒక అర్థాన్ని చూపిస్తూ – లోపల మరొక అర్థాన్ని కలిగి ఉంటాయి కొన్ని కవితలు! – ఈ కవిత అలాంటి అన్యాపదేశ కవిత. ఆంగ్ల సాహిత్యంలో ఈ టెక్నిక్‌ను "అలిగొరి" (allegory) అంటారు.

బోయి భీమన్న తన కవితలో మతం ఒక పిచ్చి అన్నారు :

భీమన్న మతం ఒక పిచ్చి అన్నారు. ఏ మతమైనా సరే అది మనుషుల్ని మాయ చేస్తుందని, నియంత్రిస్తుందని అర్థం చేసుకొని మత పిచ్చిని ఒదులుకోవాలని చెబుతూ రాసిన కవిత 'మతం ఒక పిచ్చి'. ఇది వ్యంగ్య స్వరంతో మొదలవుతుంది.

"శివాయనమః/నారాయణాయనమః/శక్యైనమః
బుద్ధాయ నమః/అల్లాయ నమః/యెహోవాయనమః

కారల్ మార్క్సవేనమః/మహాత్మా గాంధినే నమః
డాక్టర్ అంబేద్కరాయ నమః
లైట్ కోసం నమః/ఎవరు స్వామీ తమరు
నేనా, నేను/నేను విశ్వమత సమన్వయ వాదిని!"
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం –2 : పుట 43)

సమాజంలో మతం అనే మత్తు అందరిలోనూ బలంగా వ్యాపించి ఉంది. ముఖ్యంగా కొందరు ఏ విషయాన్నైనా ఒక దైవ క్రియ లాగా లేదా ఒక మత ప్రక్రియ లాగా చూస్తారని చెప్తున్నారు భీమన్న. కొందరు ప్రతి దానికి ఒక తంతుని ఆపాదిస్తారు. దైవత్వాన్ని ఆపాదిస్తారు. ఒక దైవ కార్యక్రమంగా మార్చేస్తారు అని చెప్తున్నారు. చివరికి అలా మార్చిన వాళ్లు తమని తాము విశ్వమత సమన్వయ వాదులంఅని చెబుతారని అంటున్నారు. మనుషులు ఎవర్నైనా ఎక్కువ ఇష్టపడితే ఆ మనుషుల్ని తెచ్చి దేవుళ్ల లిస్టులోకి చేరుస్తారు. అందుకే 'బుద్ధాయనమ:/ అల్లాయనమ:/యోహోవాయనమహ:' అని దేవుళ్ల సరసన చేరుస్తారనీ – అందుకే గాంధీ, అంబేద్కర్?, మార్క్స్?ని కూడా ఆ జాబితాలో చేర్చారని కవి బాధ పడుతున్నారు. సామాజిక మార్పు కోసం ఎవరైనా ప్రయత్నం చేస్తే వారి శ్రమనీ, సిద్ధాంతాన్ని గుర్తించరు, కానీ ఆ వ్యక్తిని గుర్తించి భగవంతుని మార్చేస్తారు – అంటే వాళ్ళు చెప్పిన సిద్ధాంతం పక్కకు నెట్టేసి, ఆ వ్యక్తులను మాత్రం పూజచేసి, జ్ఞానాన్ని సమాధి చేస్తారని చెప్పారు . అలా ప్రతి దాన్నీ మతంలో నుంచి చూసే విధానాన్ని ఎద్దేవా చేస్తున్నారు భీమన్న.

'ఓరీ, మూర్ఖుడా, మతం విషంరా, విషం!
నల్లమందన్నా డెవడో, అది అబద్ధం!
మతం విషం, ఆత్మనే చంపుతున్న విషం!
నానా విషాలు కలిపిన కషాయం/ అమృతం అవుతుందా, బాబూ
నీ నానా మత సమన్వయ ప్రయత్నమూ అంతే!/
అది విషం, దాన్ని సాంతం నిర్మూలించి పారెయ్!/
మానవ భావన నుంచి/మతాన్ని తొలగించ గలిగితే చాలు
విశ్వమానవ శ్రేయస్సు/సర్వమానవసమతోషస్సు/
సద్యస్సముద్భూతమవుతుంది,/ ప్రతి ప్రాణీ సంపత్సమృద్ధమవుతుంది!
మబ్బు విడిచిన సూర్యుడిలా/మానవాత్మజాజ్వలమానమవుతుంది!
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం–2 : పుట 44)

అలాంటి మతం గురించి కవి ఏమంటారంటే మతం మత్తు మందో, నల్ల మందో కాదు, మతం విషం అని చెప్తున్నారు! మతం అనే దాని నుండి బయటికొచ్చి, మానవ భావనని అందుకున్నప్పుడే విశ్వ మానవ శ్రేయస్సు జరుగుతుందని చెప్పారు. దేశంలో ఉన్న ఎక్కడి మనిషైనా ఒక శాంతి, సమానత్వంతో బతకడం అనేది, మతం ఈ సమాజం నుండి తొలగిపోయి నపుడే జరుగుతుంది అని చెప్పారు. అది ఏ మతమైనా కావచ్చు! మతం ఒక పిచ్చి అన్నారు! సమాజం ఆ పిచ్చి నుండి బయట పడటం అవసరమని చెప్పిన కవిత.

2. ధర్మ బోధ విశ్లేషణ :

బోయి భీమన్న భావజాలానికి, అంతరంగానికి ప్రతీక ఈ కవిత. ఆ ప్రతీక గురించి ఈ పుస్తకం ముందు మాటలో వివరణ ఇచ్చారు. కవి బోయి భీమన్న. "గుడిసెలు కాలిపోతున్నై అంటే 'అవి కాలిపోతే మాకేం' అనుకుంటే దెబ్బ తిన్నట్టే! ఇప్పుడు కాలిపోతున్నట్టివి వట్టి గుడిసెలేకాదు! ఆ గుడిసెల్లోని గొర్రెల అజ్ఞానము, అబలత్వమూ, చీకటి, మురికి కూడా కాలిపోతున్నై" అంటారు!.

ఎండాకాలంలో ఊర్లల్లో పూరి గుడిసెలు కాలిపోతుంటాయ్? అయితే ఇదొక ప్రతీకగా చెప్పానన్నారు కవి. గుడిసెలు పేదల జీవనానికి ప్రతీకలు. ఆ గుడిసెల్లో ఉండేటటువంటి పేదల జీవితంలో ఉన్న అనేక అంశాలు వాళ్ల జీవితాన్ని నిర్ణయిస్తాయి. వాళ్ల స్థితిని నిర్ణయిస్తాయి. అవిప్పుడు కాలిపోతున్నాయి అని చెబుతున్నారు కవి భీమన్న.

గుడిసెలు కులవ్యవస్థకు కూడా ప్రతీకలు! కుల అణచివేతలో మగ్గుతున్న దళితుల చుట్టూ అజ్ఞానం పేరుకొని ఉందని, ఆ అజ్ఞానం తగలబడి పోవాలని కవి భీమన్న ఆకాంక్ష! ఈ గుడిసెలు, ఈ గుడిసెల్లో నివసించేవారు, ఈ అజ్ఞానంలో మగ్గుతున్న వారు మాలమాదిగలే అని స్పష్టంగా చెబుతున్నారు. – ఏమంటారంటే–

'ఒకసారి కాలిపోయిన గుడిసెలు / మరి మళ్ళీ కాలిపోవడానికి / ఎక్కడి నుంచి వస్తుంటై?'
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం –2 : పుట 33)

ఒకసారి అజ్ఞానం తగలబడి పోయింది అనుకుంటే, కొంత స్పృహ లోకి వచ్చేశారు అనుకుంటే, మళ్ళీ అజ్ఞానం వచ్చి వాళ్లల్లో చేరుతుంది అని అర్థం. ఒక్కసారి కొంత తెలివి స్పృహ అర్థం తెచ్చుకొని ఉన్నప్పుడు మళ్ళీ అజ్ఞానం వాళ్లని కమ్మేస్తుందని చెప్తున్నారు. ఆ అజ్ఞానం మతం, విశ్వాసాలు, దేవుడు, ఆచార సంప్రదాయాలు, పేదరికం, బానిసత్వం, భయం, ఆకలి నుంచి వస్తుంది. వాటిని ఏమంటున్నారంటే – ఇవన్నీ ఎప్పుడైనా వదిలించుకోవాలన్నా మళ్ళీ వచ్చేస్తున్నాయి అంటున్నారు.

"అదే మన ధర్మంలోని రహస్యం/ధర్మ సంస్థాపనార్థం
ఈ గుడిసెలు/మళ్ళీ మళ్ళీఅవతరిస్తుంటై! "
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం –2 : పుట 34)

ఒకరు మేడలో ఉండటం ధర్మం! ఒకరు గుడిసెలో ఉండటం ధర్మం. "ధర్మం" అనే దాంట్లో ఉన్న రహస్యం అదే అని చెప్తున్నారు. ధర్మం పేరుతో ప్రజలను నమ్మించి ఆ విషవలయంలో ఉంచుతారని, దానిని నమ్మేటట్లు చేస్తారని చెబుతున్నారు. ధర్మాన్ని పేదలు, దళితులు నమ్మితే వారు గుడిసెలో ఉండటమె ధర్మసమ్మతమని నమ్మక తప్పదు. ఈ రహస్యం గుడిసె ప్రజలు అందరూ తెల్సుకుంటే తప్ప విముక్తి లేదు. ఆ రహస్యం తెలిస్తేనే ఆ విషవలయం నుండి బయటికొస్తారు అని చెప్పాడు. మనస్సులో ఉన్న ఈ అజ్ఞానం తగలబడి పోతేనే రహస్యం అర్థం అవుతుంది. పేదల, బహుజనుల దృక్పథం నుంచి రాసిన బలమైన సైద్ధాంతిక కవిత ఇది. ఒక మానసిక, సామాజిక విముక్తి కోసం అట్టడుగు వర్గాలకు భీమన్న చేసిన 'ధర్మబోధ' ఈ కవిత.

3. బోయి భీమన్న కవిత్వం– ఆధునికతకు కనువిప్పు:

ఆధునికత అనే మాట కాలాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటుంది. భీమన్న ఈ కవిత రాసిన కాలానికి ఉన్న ఆధునికత గురించిన కవిత ఇది. నిజానికి ఇది 50 ఏళ్ల క్రితం రాసినా, ఇప్పటికీ అర్థవంతంగా అనిపిస్తుంది. మనం ఇప్పుడు కూడా ఈ సమాజానికి అన్వయించుకోవచ్చు. భావజాలపరంగా, నిర్మాణ పరంగా కూడా ఆధునిక కవిత ఇది. ఏ వివరణ అవసరం లేని వ్యంగ్య కవిత. మేం ఆధునికులం, మేం చాలా మారిపోయాం, మాకు చాలా తెల్సుఅని చెప్పే సమాజం గురించి రాసిన కవిత.

"ముందుకు పదండంటూ వెనక నుంచి తరుముతాం / ముందుకు పోయేవాళ్ళను ద్రోహులంటూ చంపుతాం / ఇందిరతో కలిసి సోషలిజం ప్రకటిస్తాం / హిరణ్యాక్షుడు ఒడిలో దూరి దాక్కుంటాం!/ మేం ఆధునికులం! ఎక్కడికయ్యా ఆ పరుగంటే, ఏమో ఎరగం! / వేగాన్ని సృష్టించాం/ మేం ఆధునికులం! కాకుల్ని కొడుతుంటాం, గెద్దలకివేస్తుంటాం / మా కోడిపిల్లలు తన్నుకుపోబడుతుంటే ఏడుస్తుంటాం / గతం నుంచి నేర్చుకోం, భవిష్యత్తు ఆలోచించం/ కళ్ళు మూసుక దూకుతాం, కంచెల్లో పడతాం / మేం ఆధునికులం! ప్రచార సాధనాల్ని గుప్పిట్లో పెట్టుకొంటాం/ మా డబ్బా మేమే కొట్టుకొంటాం / వీణలు గీణలువేట్నీ వినిపించనివ్వం / మేమే దేవతలం, మీరే మా కవ్వం / మేం ఆధునికులం!" (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం–సంపుటి 3–వచన కవితలు భాగం –2 : పుట 178)

ఆధునికత పేరుతో జీవిస్తున్న అబద్ధపు జీవన విధానాన్ని వ్యంగ్యంతో, చురకలలాంటి వాక్యాలతో ఎద్దేవా చేశారు కవి. సమాజం పట్ల బాధ్యత లేకపోవడం, విలువలు లేకపోవడం, పరులకు నీతులు చెప్పడం, అపసవ్య జీవితాన్ని ప్రేమించటం, అబద్ధపు నిజాయితీని నిజం అని భ్రమ చెందడం వంటి అనేక ఆధునిక పోకడలను వ్యంగ్యంతో చెప్పారు.

ఎంతో సరళమైన వ్యంగ్యాస్త్రాలతో, నిత్య జీవితంలో మానవ ప్రవర్తనతో ముడి పడిన అనేక విషయాలను దేవుడు, దయ్యం, శీలం, దానం, వేగం, అన్నం, ప్రేమ, హృదయం, స్నేహం, కులం, మతం, గతం, భవిష్యత్తు ఇలా చాలా విషయాల పట్ల మానవ స్వభావాన్ని అందులొనిద్వైదీ భావాన్ని ఎంతో వ్యంగ్యగా విమర్శ చేశారు. ఇది ప్రతి ఒక్కరి ఆత్మ పరిశీలనకు పనికి వచ్చే స్వరం నించి రాశారు. ఎక్కడా తూలనడకుండా, తప్పును ఎత్తి చూపినట్టుగా కాకుండా ఎంతో కవితాత్మకంగా సాగుతుంది కవిత.

4. రాజకీయ వ్యంగ్యాస్త్రం – బానిసల బలాదూర్

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలందరికీ ఓటుహక్కు ఉన్నప్పటికీ కూడా వాళ్లు వేసే ఓటుని శాసించే ఒక ఆధిపత్య వ్యవస్థ పట్ల నిరసన ఈ కవిత! తిరస్కారం, వ్యంగ్యం కలగలిపిన స్వరంలో ఆధునిక ఎన్నికల వ్యవస్థలో కరడు గట్టుకొని ఉన్న ఫ్యూడల్ పెత్తనాన్ని ఆధిపత్యాన్ని నిరసించే కవిత ఇది.

"ప్రభూ మా పేర్లను/వోటర్ల జాబితా నుంచి తొలగించి/ బానిసల జాబితాలో చేర్పించండి!/ చచ్చి, మీ కడపున పుడతాం! బానిసల జాబితా అనేది ఇప్పుడు లేదంటారా?/ పూర్వం రాజుల పాలనలో

ఉండేదే!/ ఇప్పుడిది ప్రజల పాలన అంటారా?/ బానిసల జాబితా స్థానంలో/ వోటర్ల జాబితా వచ్చిందంటారా? అదేమిటయ్యా, అలా ఏడుస్తారు?/ వోటంటేఏమిటనుకొంటున్నారు!" (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం –2 : పుట 48)

ఇది ఒక సంభాషణాత్మక శైలిలో రాసిన కవిత ఇది. ఓటుహక్కు ఉన్నా, దానిని వినియోగించుకోలేని వాతావరణంలో మన సమాజం ఉండటాన్ని, ఆధిపత్య వర్గాలు వోటర్లని భయభ్రాంతులకు గురి చేసే పరిస్థితిని చెప్తున్నారు కవి.

"ఒక ప్రక్క రకరకాల జెండాల వాళ్ళు
మరో ప్రక్క మా పూరిఖామందుల వాళ్ళు
ఈ వోటు అమ్మోరు కోసం/మా ప్రాణాలు తోడేస్తున్నారు
బానిసల కుండే సుఖ శాంతులు సైతం
మా పేద వోటర్లకు లేవు, మహాప్రభో!"
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం –2 : పుట 49)

ఓటుంది పేరుకే గానీ, ఆ ఓటుని అడ్డంపెట్టి హింసని కొనసాగిస్తుంటారు. పేదవాళ్ళకి ఓటు హక్కు అధికారాన్ని ఇచ్చిందో లేదో తెలియదు గాని, వారి జీవితంలో శాంతి లేకుండా చేసింది అంటున్నారు. అందుకే దీన్ని ' ఓటర్ల జాబితా కాదు, బానిసల జాబితా' అంటున్నారు. ఈనాటికి కూడా కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎవరికి ఓటువేయాలో ఊరి పెద్దో, కామందో నిర్ణయించే పరిస్థితి పట్ల ప్రశ్నలు లేవనెత్తారు. భయపెట్టో, బెదిరించో, డబ్బులిచ్చో ఓటుని లాగేసుకుంటారు పెద్దలు. అటువంటి పరిస్థితిలో ప్రజలు, ప్రభుత్వ వ్యవస్థలు ఓటు హక్కుని కాపాడుకోలేక విఫలం అవుతుండటాన్నిచూసి బాధ వ్యక్తం చేస్తున్నారు కవి.

నిజానికి "ఓటు ప్రజాస్వామ్యంలో గొప్ప ఆయుధం అనిచెప్తారు గానీ, పేదలు, వెనుకబడిన వారు, బలహీన వర్గాల వాళ్లకి అదొక శని అయిపోయింది అని చెప్తున్నారు కవి. అందుకని ఈ కవితని ఎలా ముగిస్తారంటే –

"ఈ దేశంలో పేదలకు వోటుండడం/పక్కలో పాముండటమే!
ఈ వోట్లచెలగాట్లతోమమ్ముల్ని చంపకండి!
దయచేసి, జాబితా మార్చెయ్యండి!"
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం – సంపుటి 3– వచన కవితలు భాగం –2 : పుట 49)

కవి వ్యక్తీకరించిన ఈ బాధలో ప్రజలు తమ ఓటు తాము వినియోగించుకోలేక పోతున్నారనే ఒక స్పృహ, ఆవేదన కనిపిస్తుంది. ఈ కవిత ప్రస్తుత రాజకీయ వ్యవస్థ మీద ఎక్కుపెట్టిన వ్యంగ్యాస్త్రం.

2.7. వ్యంగ్యాస్త్రాలు – టుమ్రీలు:

బోయి భీమన్న చేసిన సాహిత్య ప్రయోగాల్లో టుమ్రీలు కూడా ఉన్నాయి. 'గుడిసెలు కాలిపోతున్నై' కవితా సంపుటిలో 'టుమ్రీలు' పేరుతో 69 కవితలున్నాయి. టుమ్రీలు అంటే చిన్న

కవితలు. నాలుగు వాక్యాల్లో తక్కువ మాటల్లో పేల్చిన వ్యంగ్యాస్త్రాలు ఈ టుమ్రీలు. కవి బోయి భీమన్న ఈ కవిత్వంలో చాలాచోట్ల పులి, నక్క, గొర్రెలు వంటి ప్రతీకలు (సింబల్స్?) వాడారు.

బలం కలవాడు, తెలివి కలవాడు ఒక పక్క, ఈ ఇరు వర్గాలకు ఆహారంగా, బ్రతుకుతున్న బలహీనులు, పేదలు మరొక పక్క. పులి, నక్క అనేవి ఆధిపత్య వర్గాలు. గొర్రెలు సామాన్య ప్రజలు. పులి, నక్కల అధికారానికి, జిత్తులమారి తనానికి బలహీనులు, సామాన్యులు బలవుతారని చెప్పారు భీమన్న.

"నాలుగు వర్ణా లన్నది హిందూయిజం
రెండు వర్గాలన్నది కమ్యూనిజం
ఈ వర్ణ విభజనా, వర్గ విభజనా చేసింది
పులీ నక్కా యిజం! "
(బోయి భీమన్న సమగ్రసాహిత్యం, సంపుటి 3 – వచన కవితలు, భాగం –2 : పుట 206)

వర్ణ సిద్ధాంతాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు చెప్పింది పులులు నక్కలే! ఒక సిద్ధాంతం మనుషులను నాలుగు విభాగాలు చేస్తే మరొక సిద్ధాంతం రెండు భాగాలుగా విభజన చేసిందని చెబుతున్నారు. మొత్తానికి సమాజం మీద ఆధిపత్యం కోసం పాకులాడే పులి నక్క సిద్ధాంతం వల్లే ఇలాంటి విభజనలు అని చెబుతున్నారు.

"కర్మ సూత్రం పై విశ్వాసం
చచ్చిన అవతారాల పట్ల భక్తి,
పులికి పాదసేవ, నక్కకు దాసోహం
గొర్రెల కివే మోక్ష మార్గాలు!"
(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం సంపుటి 3 – వచన కవితలు భాగం –2 : పుట 206)

గొర్రెలెప్పుడూ కూడా ఈ కర్మ సిద్ధాంతం పట్ల విశ్వాసం ప్రకటించాలి. చచ్చిన అవతారాల పట్ల భక్తి ప్రదర్శించాలి. ఇవన్నీ చేయడంతో పాటు పాలక వర్గాలకు నిరంతరం సేవ చేయాలి. వాళ్ల చుట్టు ఉన్నవాళ్లకి దాసోహం అనాల. అప్పుడు మాత్రమే సామాన్యులకు మోక్షం అంటున్నారు కవి.

ముగింపు:

కవిత ఏదైనా సరే కవి ఒక స్పృహతో, చైతన్యంతో కనిపిస్తారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు కొందరి జీవితాలని ఎట్లా నియంత్రిస్తాయి. ఎట్లా వాళ్లను అణచివేస్తాయని ఆలోచిస్తారు కవి, సూటిగా తన కవితలలో సమాజాన్ని ప్రశ్నిస్తారు. 'దేవుడు, భక్తి, మతం – వీటి చూట్టూ అల్లుకున్న మూఢత్వాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. భీమన్న హిందూ మతాన్ని హిందూ ఆచారాలను విశ్వసిస్తూనే – హిందూ ధర్మంలోని కులవివక్షను, కుల వ్యవస్థలోని దుర్మార్గాన్ని స్పష్టంగా తిరస్కరించటం ఈ కవిత్వంలో చూడొచ్చు.చాలా కవితల్లో పురాణ ప్రతీకలు కనిపిస్తాయి.

పద్మభూషణ్ బోయి భీమన్న కవిగా, రచయితగా, నాటక కర్తగా భీమన్న ప్రజల పక్షం, దళిత సమాజపక్షం. హేతువాద దృష్టి. హిందూ ధర్మ విశ్వాసిగా కనిపించినా! అధర్మాన్ని సహించలేనని చెప్పడం స్పష్టంగా కనిపిస్తుంది. భీమన్న కవిత్వం స్పష్టమైన రాజకీయ దృక్పథంతో పీడిత సమాజానికి, దళిత సమాజానికి మార్గనిర్దేశనం చేయటం కనిపిస్తుంది. భీమన్న భాష సరళమైంది. సాధారణ ప్రజల భాష, ప్రజలు వాడే సామెతలు, ప్రజల రోజు వారీ జీవితంలో కనిపించే పల్లెతనం కనిపిస్తుంది. కవితా శిల్పం కూడా సంక్లిష్టత లేని శిల్పం. కొన్ని సార్లు ప్రశ్నలు, జవాబులు, కొన్ని సార్లు సంభాషణ, నాటకీయత, వ్యంగ్యం వీరి కవిత్వ నిర్మాణంలో కనిపిస్తుంది. బోయి భీమన్న సామాజిక మార్పు కోసం, సమాజ చైతన్యం కోసం సాహిత్య సృజన చేసిన కవి. ఆధునిక దళిత కవిత్వానికి దారులు వేసిన గొప్ప కావ్యాలలో 'గుడిసెలు కాలిపోతున్నై' కావ్యం ఒకటి. స్పష్టంగా కులవివక్షను, కులవివక్షతో ఉన్న రాజకీయ సామాజిక వ్యవస్థను నిలదీసి ప్రశ్నించిన కవిత్వం.

ఉపయుక్తగ్రంథ సూచి:

1. జాషువ గుర్రం, గబ్బిలం కావ్యం. జాషువా సర్వలభ్యరచనల సంకలనం, మనసు ఫౌండేషన్, బెంగుళూరు.
2. బద్దెన, సుమతీశతకం. ఉచిత గురుకుల విద్యా ఫౌండేషన్: 2014. www.telugub-hakti.com
3. భీమన్న, బోయి. బోయి భీమన్న సమగ్రసాహిత్యం, సంపుటి 3, వచన కవితలు భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2010
4. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, సంపుటి 4, నాటకాలు, భాగం –2. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాద్: 2008
5. మంజులత, ఆవుల. (సం.) బోయి భీమన్న రచనలు – దళిత దృక్పథం. పద్మభూషణ్ డా. బోయి భీమన్న సాహిత్య పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్: 2008

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

డాక్టర్ బోయి భీమన్న కవిత్వం సామాజిక దృక్పథం

– వెంకటేశ్వర్లు
తెలుగు అధ్యాపకులు

వ్యాస సంగ్రహం

బోయి భీమన్న (1914–2000) తెలుగు ఆధునిక సాహిత్యంలో ప్రముఖ ప్రజాకవి. అణగారిన వర్గాలకు చెందిన జీవన అనుభవాలే ఆయన కవిత్వానికి మూలం. కవిగా బోయి భీమన్న నేపథ్యం. సామాజిక వాస్తవికత ప్రతిబింబం కులవ్యవస్థపై విమర్శ పేదరికం మరియు శ్రమజీవుల జీవితం.పేదరికం, కులవ్యవస్థ, శ్రమజీవుల దుఃఖం, మానవ గౌరవం వంటి అంశాలను తన రచనల్లో ధైర్యంగా ప్రతిపాదించిన కవిగా భీమన్న గుర్తింపు పొందారు. సరళమైన ప్రజాభాషలో, నేరుగా హృదయాన్ని తాకే శైలిలో ఆయన కవిత్వం సాగుతుంది. సాహిత్యాన్ని సమాజ మార్పుకు ఒక ఆయుధంగా భావించిన భీమన్న, ప్రజాస్వామ్య భావనలు మరియు మానవతావాదాన్ని తన రచనల ద్వారా ప్రచారం చేశారు.

పరిచయం

తెలుగు ఆధునిక సాహిత్యంలో ప్రజాకవిత్వానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందించిన కవి బోయి భీమన్న. ఆయన కవిత్వం సమాజ జీవనానికి అద్దం పడుతుంది. పేదలు, దళితులు, కూలీలు, రైతులు వంటి అణగారిన వర్గాల జీవనవేదనను తన అనుభవాల ఆధారంగా వ్యక్తపరిచిన కవిగా భీమన్నకు విశిష్ట స్థానం ఉంది. ఆయన కవిత్వం కేవలం సాహిత్య రసానికే కాకుండా సామాజిక చైతన్యానికి, ఉద్యమాత్మక ఆలోచనలకు దోహదపడింది. సమాజంలో నెలకొన్న అసమానతలను ప్రశ్నించడం, మానవ గౌరవాన్ని ప్రతిష్ఠించడం ఆయన కవిత్వపు ప్రధాన లక్ష్యాలు.

కవిగా బోయి భీమన్న నేపథ్యం

బోయి భీమన్న స్వయంగా అణగారిన సామాజిక వర్గానికి చెందినవాడు కావడం వల్ల ఆయన అనుభవాలు నిజమైన జీవన వాస్తవికతతో నిండి ఉన్నాయి. చిన్ననాటి నుంచే ఎదుర్కొన్న పేదరికం, అవమానాలు, కష్టాలు ఆయన కవిత్వానికి మూలాధారంగా నిలిచాయి. పుస్తకాల ద్వారా మాత్రమే కాకుండా జీవితం ద్వారా నేర్చుకున్న అనుభవాలే ఆయన రచనలకు బలం చేకూర్చాయి. అందుకే ఆయన కవిత్వం చదివితే అది కల్పితంగా కాకుండా నిజ జీవిత స్వరంలా అనిపిస్తుంది.

సామాజిక వాస్తవికత ప్రతిబింబం

భీమన్న కవిత్వంలో సామాజిక వాస్తవికత స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ జీవితం, కూలీల కష్టం, రైతుల కన్నీళ్లు, ఆకలితో అలమటించే కుటుంబాలు ఆయన కవితల్లో ప్రధానంగా దర్శనమిస్తాయి. సమాజంలోని అట్టడుగు వర్గాల జీవనాన్ని ఎలాంటి అలంకారాలు లేకుండా, నేరుగా పాఠకుల ముందుంచడం ఆయన ప్రత్యేకత. ఈ వాస్తవిక దృక్పథమే ఆయనను ప్రజాకవిగా నిలిపింది.

పేదరికంతో ఇల్లు నిర్మించుకోలేక గుడిసెలలో జీవించే వారి సంఖ్య మన దేశంలో ఎక్కువగానే ఉంది అలాంటప్పుడు గుడిసెలు వేసవికాలంలో అగ్ని ప్రమాదాలకు గురి కావడం చూస్తూ ఉంటాం అలాంటి హృదయ విదారక సంఘటనలు బోయి భీమన్న గారి హృదయాన్ని కలచి వేసి గుడిసెలు కాలిపోతున్నై అనే కవితా ఖండిక రూపుదిద్దుకుంది ఆ కవితా ప్రాబల్యంతోనే ప్రజల్లోనూ ఇటు పాలకుల లోనూ కదలిక మొదలయి దాని పర్యవసానంగానే ప్రభుత్వాలు అనేక రకాల పథకాలతో(ఇందిరమ్మ ఇల్లు రాజీవ్ గృహకల్ప డబుల్బెడ్ రూమ్) పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వడం కొనసాగుతుందని చెప్పవచ్చు ఇలాంటి అనేక సామాజిక సాంఘిక సంబంధిత కవిత్వాలను వ్రాసి అటు ప్రజల్లోను ఇటు పాలకులను చైతన్యాన్ని పరిచాడు.

కులవ్యవస్థపై విమర్శ

భారతీయ సమాజంలో లోతుగా పాతుకుపోయిన కులవ్యవస్థను భీమన్న తీవ్రంగా వ్యతిరేకించారు. కులం పేరుతో మనిషిని తక్కువగా చూడడం, హక్కులను హరించడం వంటి అన్యాయాలను ఆయన కవిత్వం నిర్భయంగా ప్రశ్నిస్తుంది. కులం మనిషి విలువను నిర్ణయించదని, శ్రమే నిజమైన గొప్పతనమని ఆయన కవిత్వం ప్రకటిస్తుంది. ఈ విమర్శాత్మక దృక్పథం ద్వారా ఆయన సామాజిక మార్పుకు పిలుపునిచ్చారు.

పేదరికం మరియు శ్రమజీవుల జీవితం

పేదరికం భీమన్న కవిత్వంలో ఒక ప్రధాన అంశం. ఆకలి ఎలా మనిషిని అవమానాలకు గురిచేస్తుందో, శ్రమజీవుల శక్తిని సమాజం ఎలా నిర్లక్ష్యం చేస్తుందో ఆయన హృదయ విదారకంగా చిత్రించారు. కూలీ జీవితం, రైతు కష్టం, మహిళల శ్రమ వంటి అంశాలు ఆయన కవిత్వంలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. శ్రమకు గౌరవం కలగాలని ఆయన గాఢంగా కోరుకున్నారు.

మానవతావాద దృక్పథం

భీమన్న కవిత్వానికి కేంద్రబిందువు మానవత. కులం, మతం, వర్గం వంటి విభజనలను దాటి ప్రతి మనిషిని ఒకే కోణంలో చూడాలన్న భావన ఆయన రచనల్లో వ్యక్తమవుతుంది. ఆకలితో బాధపడే

మనిషి ముందు అన్ని సిద్ధాంతాలూ అర్థంలేనివని ఆయన భావన. మానవ గౌరవం, మానవ హక్కులు ఆయన కవిత్వంలో ముఖ్యమైన విలువలుగా నిలుస్తాయి.

స్త్రీ దృక్పథం

భీమన్న కవిత్వంలో స్త్రీ జీవితంపై కూడా సున్నితమైన దృష్టి కనిపిస్తుంది. పేద కుటుంబాలలో స్త్రీ ఎదుర్కొనే శ్రమ, బాధ్యతలు, అన్యాయాలను ఆయన గుర్తించారు. స్త్రీని కేవలం కుటుంబానికి పరిమితం చేయకుండా, ఆమెను సమాజంలో ఒక సంపూర్ణ వ్యక్తిగా చూడాలన్న భావన ఆయన రచనల్లో కనిపిస్తుంది.

ప్రజాస్వామ్య మరియు ఉద్యమ భావనలు

భీమన్న కవిత్వం ప్రజాస్వామ్య భావనలతో నిండి ఉంది. అధికార దుర్వినియోగం, దోపిడీ వ్యవస్థలు, రాజకీయ అణచివేతలను ఆయన కవిత్వం తీవ్రంగా విమర్శిస్తుంది. ప్రజలే దేశానికి ఆధారం అన్న భావన ఆయన రచనలలో స్పష్టంగా వ్యక్తమవుతుంది. ఈ దృక్పథం వల్ల ఆయన కవిత్వం ఒక సామాజిక ఉద్యమ స్వరంగా మారింది.

భాషా శైలి మరియు ప్రజాకవిత్వం

బోయి భీమన్న భాష చాలా సరళమైనది. సామాన్య ప్రజలు సులభంగా అర్థం చేసుకునే మాటలతో ఆయన కవిత్వం సాగుతుంది. గ్రామీణ పదాలు, లోకభాష ఆయన రచనలకు సహజత్వాన్ని ఇచ్చాయి. అలంకారాలకంటే భావానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఆయన కవిత్వం ప్రజల గుండెల్లో స్థానం సంపాదించింది.

సాహిత్యానికి చేసిన సేవ

భీమన్న కవిత్వం తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహను బలంగా నాటింది. ఆయన రచనలు తరువాతి తరాల కవులకు ప్రేరణగా నిలిచాయి. దళిత సాహిత్యం, ప్రజాసాహిత్యం ఎదగడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం.

ముగింపు

మొత్తంగా బోయి భీమన్న కవిత్వం ఒక సమాజ దర్పణం. అది అణగారిన వర్గాల వేదనకు స్వరం, సమానత్వానికి పిలుపు, మానవ గౌరవానికి ప్రతీక. ఆయన కవిత్వం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమని నమ్మకం కలుగుతుంది. అందుకే బోయి భీమన్న కవిత్వం తెలుగు సాహిత్యంలో శాశ్వత విలువను సంపాదించింది.

ఆధార గ్రంథాలు

1) బోయి భీమన్న కవితా సంపుటాలు
2) తెలుగు దళిత సాహిత్య చరిత్ర
3) దళిత చైతన్యం సామాజిక అధ్యయనం
4) గుడిసెలు కాలిపోతున్నై
5) కన్నాభిరాన్ కంచ ఐలయ్య – దళిత చైతన్యము –సిద్ధాంతం –సాహిత్యం.

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

డాక్టర్ బోయి భీమన్న సాహిత్యం – దళిత చైతన్యం

– డి. రాములు
తెలుగు అధ్యాపకులు
సెల్: 9391276057

పరిచయం

బోయి భీమన్న కవిత్వం ప్రశ్నించే స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఆయన సాహిత్యం దళితులకు ఒక స్వరం, ఒక వరం, ఒక దిశ, ఒక సంఘర్షణ చైతన్యాన్ని అందించింది. కుల వ్యవస్థ మానవత్వానికి విరుద్ధమైనదని ఆయన భావించాడు. స్వేచ్ఛ, సమానత్వం, స్వాభిమానము, ఆత్మగౌరవం వంటి భావనలు ఆయన కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తాయి.

భీమన్న కవిత్వంలో ఆవేదనతో పాటు ఆశ కూడా కనిపిస్తుంది. ఈ ఆశ దళిత చైతన్యానికి ప్రేరణగా నిలుస్తుంది. దళిత సాహిత్యం అనేది అణగారిన వర్గాల అనుభవాలను, ఆవేదనలను, పోరాటాలను వ్యక్తీకరించే సాహిత్య ప్రవాహం. ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్యానికి బలమైన పునాది వేసిన వారిలో డాక్టర్ బోయి భీమన్న ప్రముఖుడు.

భీమన్న కవి మాత్రమే కాకుండా సామాజికవేత్తగా, మానవతావాదిగా కూడా గుర్తింపు పొందారు. ఆయన సాహిత్యంలో దళితుల జీవన విధానం ఆలోచనాత్మకంగా, సృజనాత్మకంగా ప్రతిఫలిస్తుంది. ఆయన రచనలు కేవలం భావవ్యక్తీకరణకే పరిమితం కాకుండా దళిత సమాజంలో చైతన్యాన్ని రగిలించిన ఒక సామాజిక ఉద్యమ స్వరంగా నిలిచాయి.

ముఖ్య పదాలు (Key Words)

దళిత సాహిత్యం, దళిత చైతన్యం, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, ప్రతిఘటన.

దళితులకు విద్య, సమానత్వం, మానవత్వం వంటి విలువలు ఆయన సాహిత్యంలో కేంద్ర బిందువులుగా నిలుస్తాయి.

లక్ష్యాలు (Objectives)

ఈ పరిశోధన యొక్క ప్రధాన లక్ష్యాలు:

1. బోయి భీమన్న సాహిత్యంలో ఉన్న దళిత చైతన్య భావనను విశ్లేషించడం.
2. ఆయన రచనలు ప్రతిబింబించిన కులవ్యవస్థ వాస్తవాలను అధ్యయనం చేయడం.
3. దళిత సమాజంపై చూపిన సామాజిక ప్రభావాన్ని పరిశీలించడం.
4. సమకాలీన దళిత సాహిత్యంపై భీమన్న ప్రభావాన్ని గుర్తించడం.

దళిత చైతన్య స్వరూపం

బోయి భీమన్న రచనలలో దళిత చైతన్యం ప్రధానంగా మూడు రూపాల్లో దర్శనమిస్తుంది.

1. కుల వ్యవస్థను, బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ అణచివేతపై నిరసన వ్యక్తీకరణ.
2. దళితుల ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలిపి ఆత్మగౌరవాన్ని బోధించడం.
3. సమ సమాజ నిర్మాణానికి పిలుపునిస్తూ సామాజిక మార్పును ఆకాంక్షించడం.

ఆయన కవితలు, గేయాలు దళితుల నోటి మాటలుగా, వారి గుండె స్వరాలుగా నిలిచాయి.

బోయి భీమన్న జీవన నేపథ్యం – దళిత చైతన్యానికి ఆధారం

డాక్టర్ బోయి భీమన్న స్వయంగా అణగారిన వర్గాల జీవితాన్ని దగ్గరగా అనుభవించిన వ్యక్తి. ఆ అనుభవాలే ఆయన సాహిత్యానికి ప్రాణం పోశాయి. కుల వ్యవస్థ వల్ల కలిగే అవమానాలు, ఆర్థిక దోపిడీ, సామాజిక బహిష్కరణ వంటి అంశాలు ఆయన రచనల్లో సహజంగా ప్రతిఫలించాయి.

నిచ్చెన మెట్లలాంటి కుల వ్యవస్థలో ఎదురైన అవమానాలు, వ్యక్తిగత అనుభవాలు ఆయన దళిత చైతన్యానికి మూలాధారంగా నిలిచాయి.

మానవతావాదం – సమానత్వ భావన

బోయి భీమన్న సాహిత్యంలో దళిత చైతన్యం మానవతావాదంతో మిళితమై ఉంటుంది. ఆయన దృష్టిలో సమస్య కేవలం దళితులకే పరిమితం కాదు; అది సమాజం మొత్తం ఎదుర్కొంటున్న సమస్య.

"మనిషి ముందు మనిషే" అనే భావన ఆయన రచనల సారాంశం. కులం, మతం, వర్గం అనే గోడలను కూల్చాలని ఆయన పిలుపునిచ్చారు.

భీమన్న రచనలు తరువాతి తరం దళిత రచయితలకు దిశానిర్దేశం చేశాయి. ఆత్మకథాత్మక ధోరణి, నిజాన్ని నిర్భయంగా చెప్పే స్వరం, సామాజిక బాధ్యతలతో కూడిన సాహిత్య దృక్పథం వంటి లక్షణాలు సమకాలీన దళిత సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తాయి.

భీమన్న కవిత్వంలో సామాజిక నిరసన

బోయి భీమన్న కవిత్వంలో "సౌందర్యం కన్నా సత్యమే" ప్రధానంగా కనిపిస్తుంది. ఆయన కవిత్వంలో అనేక ప్రశ్నలు సమాజాన్ని ఆలోచింపజేస్తాయి.

1. "మా రక్తం ఈ నేలపై పండింది, మాకు నేలపై హక్కు లేదే?"
2. "మనిషిని కులం పేరుతో కొలిచే సమాజం మానవత్వాన్ని కొలిచే అర్హత కోల్పోయింది."
3. "సాహిత్యం అలంకారం కాదు – అది గాయాల మీద రాసిన సత్యం."
4. "నిచ్చెన మెట్లలంటి కులవ్యవస్థ నీడలో పెరిగింది కాదు నా కవిత; అణచివేత అగ్నిలో కాల్చబడి పుట్టింది."
5. "నిరసన ఆయుధం కాదు – అది నా జీవన విధానం."
6. "దళిత చైతన్యం ఒక ఉద్యమం కాదు; అది నిద్రలేచిన ఆత్మ."
7. "సాహిత్యంలో మౌనం ప్రమాదకరం; ప్రశ్నించే తత్వమే విముక్తి మార్గం."
8. "నా కవిత్వంలో కన్నీళ్లు కనిపిస్తే అవి సామూహిక వేదన."

ఈ భావాలు దళిత చైతన్యాన్ని మేల్కొలిపే శక్తిగా పనిచేశాయి.

వర్తమాన కోణంలో బోయి భీమన్న సాహిత్యం

బోయి భీమన్న సాహిత్యం గతానికి చెందినది మాత్రమే కాదు; అది ఇప్పటికీ "శ్వాసిస్తున్న సామాజిక పత్రం"గా కనిపిస్తుంది. ఆయన రచనల్లో కనిపించే కులవివక్ష, అవమానం, నిరాకరణ వంటి సమస్యలు నేటికీ విభిన్న రూపాల్లో కొనసాగుతున్నాయి.

గతంలో కులం పేరుతో నిషేధాలు ఉండేవి. నేడు అవకాశాల అసమానత, డిజిటల్ వివక్ష, సంస్థాగత అణచివేత వంటి రూపాల్లో అదే సమస్యలు కొనసాగుతున్నాయి. అందువల్ల నేటికీ భీమన్న సాహిత్యం ప్రతిఘటన భాషగా నిలుస్తుంది.

విద్య – విముక్తి సాధనం

భీమన్న విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా చూడలేదు. మనిషిని మనిషిగా నిలబెట్టే ఆత్మగౌరవ ఆయుధంగా చూశాడు.

ప్రస్తుత కాలంలో విద్య ఉన్నా ఉపాధి లేకపోవడం, డిగ్రీలు ఉన్నా గౌరవం లేకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.

"సాహిత్యం బాధితుడి పక్షాన నిలబడకపోతే అది సాహిత్యం కాదు" అనే భావనను ఆయన స్పష్టంగా వ్యక్తం చేశాడు.

వర్తమాన కోణంలో బోయి భీమన్న సాహిత్యం అంటే

గత కాలపు గాయాల జ్ఞాపకం మాత్రమే కాదు;
నేటి అన్యాయాలపై హెచ్చరిక,
రేపటి విముక్తికి దారి చూపే టార్చ్‌లైట్.

ముగింపు

డాక్టర్ బోయి భీమన్న సాహిత్యం దళిత చైతన్యానికి బలమైన మేధోపునాది. ఆయన రచనలు కేవలం నిరసనకు పరిమితం కాకుండా సమానత్వం, కుల వివక్ష నిర్మూలన, సమ సమాజ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలిచాయి.

దళితుల ఆవేదనను, ఆశలను, పోరాటాన్ని సమగ్రంగా వ్యక్తీకరించిన సాహిత్యంగా ఆయన రచనలు తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత స్థానం సంపాదించుకున్నాయి.

భీమన్న సాహిత్యం దళిత సమాజానికి దారి చూపే ఒక దీపం లాంటిది. అది ఒక కాలాన్ని మాత్రమే కాదు, తరతరాల చైతన్యాన్ని ప్రభావితం చేసిన ఉద్యమ స్వరం.

ఆధార గ్రంథాలు

1. బోయి భీమన్న కవితా సంపుటాలు
2. తెలుగు దళిత సాహిత్య చరిత్ర
3. దళిత చైతన్యం – సామాజిక అధ్యయనం
4. కంచ ఐలయ్య – దళిత చైతన్యం: సిద్ధాంతం – సాహిత్యం

ISSN: 3048-5908 సాహిత్యతరంగిణి Impact Factor: 6.673(SJIF)
అంతర్జాతీయ సాహిత్యపత్రిక, Indexed in Google Scholar,
Volume-3 | ప్రత్యేకసంచిక – 1(6); మార్చి, 2026

బోయి భీమన్న పిల్లీ శతకం: సామాజిక స్పృహ

– గూడపాటి అనిల్
పరిశోధక విద్యార్థి,
ఫోన్: 8374183991.

వ్యాససంగ్రహం:

సమాజ చైతన్యాన్ని ఆకాంక్షిస్తూ వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన జాతీయ కవి డా. బోయి భీమన్నగారు. కవిత్వం, నాటకం, శతకం మొదలైన ప్రక్రియల్లో యాభైకు పైగా రచనలు చేసి తెలుగు సాహితీలోకంలో చెరగనిముద్ర వేసుకున్నారు. వీరు రాసిన గుడిసెలు కాలిపోతున్నాయ్ రచనకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు కూడా లభించింది. సమాజంలో ఉన్న అస్పృశ్యత, కుల, మత రాజకీయాల పట్ల నిరసన భీమన్న రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కుల, మత భేదాల కంటే మానవత్వమే ముఖ్యమైనదని చాటి చెప్తూ తన రచనల ద్వారా భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆశించిన ఉదాత్త మనీషి డా. బోయి భీమన్న. వీరి రచనల్లో ఎక్కువగా అంబేద్కర్ భావజాలాలు కనిపిస్తుంటాయి. తన రచనల్లో జంతువులను ప్రతీకలుగా తీసుకోవడం భీమన్న గారి ప్రత్యేకత. గుడిసెలు కాలిపోతున్నాయ్ రచనలో చీమలను శ్రామికులకు, పాములను దోపిడీదారులకు ప్రతీకలుగా గ్రహించి వర్ణించడం మనం గమనించవచ్చు. ఇదే తరహాలో పిల్లిని కేంద్రంగా చేసుకుని సమాజ రుగ్మతలను తన కలం ద్వారా ఎండగడుతూ బోయి భీమన్నగారు రచించిన విలక్షణ రచన పిల్లీ శతకం. వైవిద్యభరితమైన ఈ పిల్లీ శతకంలోని పద్యాల ద్వారా రచయిత పాఠకులకు కలిగించిన సామాజిక స్పృహను, చైతన్యాన్ని సంగ్రహంగా తెలియజేయడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

కీలక పదాలు: బోయి భీమన్న, పిల్లీ శతకం, సామాజిక స్పృహ, నీతి, వ్యంగ్యం, విమర్శ, అవగాహన.

ఉపోద్ఘాతం:

తెలుగు సాహితీ ప్రక్రియల్లో శతకం ఒక విలక్షణమైన ప్రక్రియ. 12వ శతాబ్దంలో మొదలైన ఈ శతక ప్రక్రియ పండితులనే కాక పామరులను సైతం ఆకర్షించడంతో నాటినుండి నేటి వరకు విరాజిల్లుతూనే ఉంది. ప్రారంభంలో భక్తిని ప్రాతిపదికగా చేసుకుని వెలువడినా క్రమేపి ఆధునిక కాలంలో శతకంవిభిన్న రూపాలను సంతరించుకుంది. నీతి, అదిక్షేప, వైరాగ్య, శృంగార, వ్యంగ్య రూపాల్లో అనేక శతకాలు వచ్చాయి. అలా నీతిని, వ్యంగ్యాన్ని కేంద్రంగా చేసుకుని బోయి భీమన్నగారుమొత్తం 126 కంద పద్యాలుగా రచించిన శతకమే ఈ పిల్లీ శతకము. సమాజంలోని ప్రజలు ఎదుర్కుంటున్న అనేక సమస్యలను ఇతివృత్తాలుగా గ్రహించి బోయి భీమన్నగారు చక్కటి శిల్ప నైపుణ్యంతో ఈ శతకాన్ని రచించారు. దీనిలోని పద్యాలన్నీ రచయిత పిల్లితో సంభాషిస్తున్నట్లే కనిపిస్తాయి. ఈ శతకంలో రచయిత సమాజంలోని లోపాలను ఎత్తిచూపుతూ హాస్య పూరితంగా విమర్శించడం ప్రధానంగా కనిపిస్తుంది. ఈ రకమైన విమర్శ వ్యంగ్య శతకాల్లో ప్రధానంగా కనిపిస్తుంది. సామాజిక సమస్యల పట్ల వ్యంగ్యాత్మకంగా పాఠకులను ఆలోచింప చేస్తూ, మానవ మస్తిష్కాల్లో గూడుకట్టుకుపోయిన దురాశ, ధనాకాంక్ష, పదవీవ్యామోహం, శ్రమ దోపిడి, కుల, మత పట్టింపులు మొదలైన సాంఘిక లోపాలను ఎత్తిచూపుతూ సామాజిక విమర్శ చేయడం ఈ శతకంలో ప్రధాన విషయం.

పిల్లీ శతకం – రచయిత ఆశయం:

సమాజంలో అడుగడుగునా దర్శనమిస్తున్నమనుషుల అమానుష పోకడను, ధనవ్యామోహాన్ని, అధికార దాహాన్ని, కులాధికారాన్ని, వర్గ భేదాలు, ఆర్థిక అసమానతలను ఎత్తిచూపి పాఠకులలో సామాజిక చైతన్యాన్ని,సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పిల్లీ శతకంద్వారా కలిగించాలనేదే బోయి భీమన్నగారి ఆశయం. "శీలాన్ని, అసలు మానవత్వాన్నే పోగొట్టుకొనికేవలం బ్రతకడానికి చీకటి పెంట కుప్పల్లో తుట్ట పురుగుల కంటె కూడ హీనంగా గిజగిజ తన్నుకొంటున్న నేటి ధనకుక్షులు కనీసం ఈ పిల్లీ శతకాన్నైనా చదివి బాగుపడతారేమో చూడాలి!" (బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, పిల్లీ శతకం పీఠిక; పుట: 504) అని ఆకాంక్షించారు.

"శతకముల కొలది నీతులు
శత విధముల కలవు, వాని జను లెరుగుదురున్;
మెతుకులు ముఖ్యము జీవికి;
బ్రతుకుటయే ముఖ్య నీతి పథమౌ! పిల్లీ!" **(పిల్లీ శతకము: 18)**

అనేక రకాలైన శతకాల్లో ఉన్న నీతిని జనులు తెలుసుకుని ఉన్నారు. ఒక జీవి జీవించడానికి ఆహారం ఎంత ముఖ్యమో, ఆ విధంగానే మనిషి ఉత్తముడిగా బ్రతకడానికి నీతి అంతే ముఖ్యము. కనుక జనులు నీతివంతులుగా సత్ప్రవర్తనతో నడుచుకోవాలనే విషయాన్ని పై పద్యం ద్వారా తెలియజేశారు.

విశ్వనరుడు గుర్రం జాషువాగారు గబ్బిలాన్ని ఎంపిక చేసుకున్నట్లే ఈ శతక రచయిత డా. బోయి భీమన్నగారు పిల్లిని తన సాహితీ వస్తువుగా ఎంచుకున్నారు. రచయిత ఈ సాహితీ పిల్లిని గూర్చి"పిల్లి మిత్రువో, శత్రువో,కాని ఈ సాహితీ పిల్లి మాత్రం నిత్య శుభంకర సుహృన్మణి. సర్వమానవ సమతా సుందర జీవితానికి మార్గం చూపుతున్న దైవజ్ఞ"(బోయి భీమన్న సమగ్ర సాహిత్యం, పుట: 505) అని పేర్కొన్నారు. తన రచన చదివి ఏ ఒక్కరైనా మారకపోతారా అనేది భీమన్నగారి ఆశయం.

పిల్లీ శతకం–సామాజిక స్పృహ:

"సాహిత్యం యొక్క సముచిత కర్తవ్యం, సామాజిక చైతన్య స్వరూపాన్ని ఎప్పటికప్పుడు స్వచ్ఛందంగా ప్రతిబింబిస్తూ ఉండటమే." (ఆర్. ఎస్. సుదర్శనం; "తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం" – ఆంధ్రపత్రిక (సౌమ్య సంవత్సరాది సంచిక – 1969–70, పుట:130). దీనిని బట్టి సామాజిక చైతన్యం లేదా సామాజిక స్పృహ అనేది తెలుగు శతకాల్లో కూడా ప్రస్ఫుటంగా కనిపించే అవకాశం ఉంది.

బోయి భీమన్నగారు రచించిన ఈ పిల్లీ శతకంలోని ప్రతి పద్యమూ దాదాపుగా పాఠకుడిలో ఎంతో కొంత సామాజిక చైతన్యాన్ని కలిగించకమానదు. సమాజపు పోకడను, మన కళ్ళముందే మనకు తెలియకుండా జరిగే అన్యాయాలను, ప్రజాప్రతినిధుల ప్రవర్తననుతన పద్యాల ద్వారా తెలియజేస్తూ సామాజిక స్పృహను కలిగించడం కనిపిస్తుంది.

"పని లేని మంగలికి బల్
పని చెప్పిన మేటి వీవు; పని లేకున్నన్
మనుగడయే లేదు జగతికి!
పని దొంగకు లేదు ఇహము పరమును; పిల్లీ!" **(పిల్లీ శతకము: 9)**

తెలుగులో "పనిలేని మంగలి పిల్లి తల గొరిగాడు" అనే సామెత వాడుకలో ఉంది. దాన్ని దృష్టిలో పెట్టుకునే భీమన్నగారు పై పద్యంలోపిల్లిని పనిలేని మంగలికి పని కల్పించిన గొప్పదానివి నీవు అంటూ హాస్యాన్ని కల్పిస్తూనే, అసలు పని లేకపోతే మానవ మనుగడేలేదు అనే నైతిక సత్యాన్ని తెలియజేస్తూ, పనిని తప్పించుకు తిరిగే సోమరులలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేశారు.మనిషి సోమరితనాన్ని వదిలిన రోజే అసలైన మనుగడను సాధిస్తాడు అనే సత్యాన్ని ఇక్కడ మనం గ్రహించాలి.

"ఒద్దిక నుండుట, వేసిన
ముద్దను మాత్రమ్మె తినుట, మురియుట – ఇవియే
పెద్దల దయ సాధించెడి
విద్దెలు! ఇవి వద్దు నీకు, వినవే! పిల్లీ!" **(పిల్లీ శతకము: 47)**

పై పద్యంలో బోయి భీమన్నగారి కవిత్వంలో వ్యంగ్య ధోరణి కనిపిస్తుంది. అంతేకాక నేటి సమాజంలోని రాజకీయ ధోరణికి ఈ పద్యం అద్దంపడుతుంది. సంఘంలో పెద్దలుగా చలామణి అవుతున్న రాయకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు మొదలైన వారి ద్వారా లబ్ధిని ఆశించేవారు వారు

మాత్రమే వారికి అడుగడుడు నమస్కారాలు పెడుతూ, అతి వినయం ప్రదర్శిస్తూ, వారి ద్వారా వచ్చే చిన్నా చితుకూ లాభాలను ఆస్వాదిస్తూ మురిసిపోతుంటారు. పెద్దల దయ సాధించే అటువంటి పనులు నీకు వద్దు! అంటూ పిల్లికి చెప్తున్నట్టు కనిపిస్తున్నా ఇది పాఠకులకు వ్యంగ్యాత్మకంగా భీమన్నగారు కలిగిస్తున్న సామాజిక స్పృహయే. దీనిని బట్టి ఎలాంటి స్వప్రయోజనాల కోసమూ మనిషి తన అసలైన అస్తిత్వాన్ని కోల్పోగూడదు అనే స్పృహ మనకు కలుగుతుంది. భీమన్నగారి ఆశయం కూడా ఇదే.

"ఎలుక పయి పిల్లి, పిల్లిపై
ఎలుకను ఎక్కించు చెపుడు ఈ మనుజులు మీ
కులవైర మార నివ్వరు!
కల హాశను లమ్మ నరులు! కనవే, పిల్లీ!" **(పిల్లీ శతకము: 49)**

సమాజంలో పాతుకుపోయిన వైషమ్యాల్లో కులసంఘర్షణ ఒకటి. ఇది నేటికీ ఎక్కడో ఒకచోట మనకు దర్శనమిస్తూ ఉంటుంది. రెండు కులాల మధ్య పోరు తారాస్థాయికి చేరి ప్రాణాలు తీసుకునేవరకు వెళ్ళడం కూడా మనంచూస్తూ ఉంటాం. ఒకపక్క ఇద్దరు మనుషులు లేక రెండు వర్గాలు కలహించుకుంటుంటే మరోపక్క అది చూసి ఆనందించేవారుకూడా ఉంటారు. ఎలుక పై పిల్లికి, పిల్లిపై ఎలుకకు ఎక్కించి చెప్పినట్లు, ఇరువర్గాల మధ్య చిచ్చుపెట్టే మనుషులు కూడా లోకంలో ఉంటారు. కుల వైరాన్ని ఆగనివ్వని వీరే అసలైన కలహాశనులు. అటువంటి వారితోతస్మాత్ జాగ్రత్తగా ఉండాలనే విషయాన్ని పై పద్యం ద్వారా రచయిత చెప్పకనే చెబుతున్నారు.

"ఏదో ఒక స్వార్థము లే
కే దొరలును చెలిమిచేయ రెవ్వరితోనున్;
మీదెరిగి, కాలు గాలిన
మాదిరి తిరుగుటలు మాను మమ్మా! పిల్లీ!" **(పిల్లీ శతకము: 95)**

పై పద్యంలో భీమన్నగారు ఒక నైతిక సత్యాన్ని పొందుపరిచారు. ధనికులైన దొరలు ఎవ్వరూ కూడా ఏదో ఒక స్వార్థం లేకుండా ఎవరితోనూ స్నేహం చేయరు. కానీ ప్రజలే ఆ సత్యాన్ని తెలుసుకోకుండా వారి వెంబడి కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ ఉంటారు. ఇప్పటికైనా ఆ నిజాన్ని గ్రహించి, అందని వాటికోసం పాకులాడడం మాని తెలివితో మసులుకోవాలనే స్పృహను రచయిత పాఠకుల్లో నింపారు.

"ఎలుకయు పిల్లియు నొక్కటై
నిలిచినచో రైతు కొంప నీరై పోదా?
మెలకువ నీ కిటు కెరిగిన
తెలివియె పాలించు జగము! తెలియవె! పిల్లీ!"

(పిల్లీ శతకము: 105)

ఎలుక, పిల్లి రెండూ ఒకటైతే రైతు పంటను ఎలా అయితే నాశనం చేస్తాయో, సమాజంలోని

మనుషులంతా ఏకమైతే దోపిడీదారులను అలానే తిప్పికొట్టి, తెలివితో సమాజాన్ని పాలించవచ్చు అనే కిటుకును గ్రహించాలని పై పద్యం ద్వారా తెలియజేశారు. దీన్నిబట్టి రచయిత సామాజిక ఐక్యమత్యాన్ని ఆకాంక్షిస్తున్నట్టు మనం గ్రహించవచ్చు.

"కడు పెంతయున్న, ఎటు కుం
చెడు పట్టును సోలలోన? నిజశక్తి నెరుం
గడు జీవుడు, ఎటు సుఖపడు?
అడియాసలు దుఃఖ పెట్టు నమ్మా? పిల్లీ!" **(పిల్లీ శతకము: 111)**

పై పద్యంలో దురాశ దుఃఖానికి చేటు అనే విషయం బోధపడుతుంది. సోలలో దానికంటే పరిమాణంలో పెద్దదైన కుంచం ఎలా పట్టదో, అలానే తన బలాబలాలు తెలియకుండా అత్యాశకు పోయిన మనిషి సమస్యల్లో చిక్కుకుని ఇబ్బంది పడతాడు అంటూ స్పష్టమైన అవగాహనను రచయిత కలిగించాడు. దీనిని బట్టి అత్యాశ అనేది మానవుని సంతోషానికి హానికరం అనే సత్యాన్ని పాఠకులు గ్రహించాల్సి ఉంటుంది.

ఇలా డా. బోయి భీమన్నగారు ఈ పిల్లీ శతకంలోని పద్యాల ద్వారా పాఠకుల్లో సామాజిక స్పృహను నింపి, ప్రజా చైతన్యానికి బాటలు వేశారని చెప్పవచ్చు.

పిల్లీ శతకం – వ్యంగ్యాత్మక విమర్శ:

సామాజిక లోపాలను నేరుగా చెప్పడం కంటే సమాజంలోని వేరొక దానితో పోల్చుతు చెప్పదలచుకున్న విషయాన్ని అంతర్లీనంగాచెప్తే అది పాఠకుడి హృదయాన్ని నేరుగా తాకుతుంది. అలా చెప్పడానికి రచయితకు ఉపకరించే సాధనం వ్యంగ్యం. దీనినే ఆలంకారిక పరిభాషలో ధ్వని అంటారు. ఈ ధ్వనియే కావ్యానికి ముఖ్యమని పలువురి ఆలంకారికుల భావన.బోయి భీమన్నగారు కూడా ఈ పిల్లీ శతకంలోని పద్యాలలో వ్యంగ్య పూర్వకంగా చెప్పదలచుకున్న విషయాన్ని విమర్శనాత్మకంగా పాఠకులకు చేరవేశారు.

"హృదయములో విషమున్నను
వదనములో తేనె కార్చ వమ్మా! ప్రజల
భ్యుదయపరురాలి వని నీ
పదములు సేవింత్రు, బాగుపడుదువు! పిల్లీ!" **(పిల్లీ శతకము: 50)**

కొంతమంది మనసులో విషాన్ని నింపుకుని, పైకి మాత్రం తేనె పూసిన కత్తిలా నవ్వులు చిందిస్తూ ఉంటారు. అలాంటి వారినే అమాయకపు ప్రజలు గుడ్డిగా నమ్ముతుంటారు. వారే నిజమైన అభ్యుదయం కోసం పాటుపడేవారని పొగుడుతుంటారు. పై పద్యంలో హృదయ మాలిన్యంతో పైకి మంచివారుగా నటించే వారికే లోకంలో మంచి పేరు ఉందని రచయిత వ్యంగ్యంగా విమర్శించారు. ప్రజలు నిజానిజాలు తెలుసుకుని వ్యవహరించాలనేది ఈ పద్యంలోని ఆంతర్యం.

"తన వారినె మోసముతో
తినివేసెడి మనిషి కన్న, దేవుడు నీ కి
చ్చిన దానికి పరిమితమై
మనుగడ సాగించు నీవె మాన్యవు; పిల్లీ!" **(పిల్లీ శతకము: 67)**

మన–తన భేదం లేకుండా ఇతరులను మోసం చేసే మనిషి కన్నా, భగవంతుడు తనకు ఇచ్చిన దానితో తృప్తిచెంది జీవనం సాగించే పిల్లే ఉత్తమమైనదని రచయిత అభిప్రాయం. మనిషి తన సొంత లాభాల కోసం కన్నవారిని, తోడబుట్టిన వారినీ, ఆఖరికి కడుపున పుట్టినవారిని కూడా మోసం చేయడం, అవసరమైతే హతమార్చడం కూడా నేటి సమాజంలో మనం చూస్తున్నాం. అటువంటి అమానుషులను రచయిత వ్యంగ్యంగా విమర్శించడం పై పద్యంలో మనం గమనించవచ్చు.

ఇలా పిల్లీ శతకంలోని అనేక పద్యాల్లో హాస్యపూరితంగాను, ఆలోచనాత్మకంగాను వ్యంగ్యం కనిపిస్తూ ఉంటుంది. ఏదేమైనా ఈ శతకం ప్రధాన లక్ష్యంప్రజా చైతన్యాన్ని, సామాజిక స్పృహను కలిగించి, నీతిని బోధించడమే.

మూఢనమ్మకాల పై నిరసన:

పిల్లీ శతకంలో రచయిత భీమన్నగారు లోకంలో కూపస్థ మండూకాల్లా మారిపోయిన మూఢనమ్మకాలను తనదైన శైలిలోనిరసించారు. మూఢనమ్మకాలనేవి ప్రజల్ని ఏ విధంగా ప్రలోభపెడతాయో తెలియజేస్తూ ప్రజల్లో సామాజిక స్పృహను కలిగించడం ఈ శతకంలోని పద్యాల్లో చూడవచ్చు.

"పిల్లిని చంకను బెట్టుక
వెళ్ళుట యను పిచ్చినుడులు, విశ్వాసములున్
చెల్ల విక; నిన్ను గైకొని
ఢిల్లీ వరకేగ వచ్చు, తెలియవె? పిల్లీ!" (పిల్లీ శతకము: 124)

మన తెలుగు నేలపై బలంగా నాటుకుపోయిన మూఢనమ్మకాలలో పిల్లి ఎదురు రావడం కూడా ఒకటి.ఏదైనాపనిమీద బయటకు వెళ్ళేటప్పుడు పిల్లి ఎదురురావడాన్ని అపశకునంగా భావిస్తారు. వెళ్ళినపని పూర్తి అవ్వకపోతే 'పిల్లిని చంకలో పెట్టుకెళ్ళారు' వంటి నానుడులు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఇటువంటి మూఢ విశ్వాసాలు మానవుడి మెదడులో మట్టిలా నాటుకుపోయాయని భీమన్నగారు నిరసన వ్యక్తం చేశారు. అంతేకాక ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే అని స్పష్టం చేస్తూ భీమన్నగారు పిల్లీ శతకానికి రాసిన పీఠిక ప్రారంభంలో ఇలా పేర్కొన్నారు.

"నేను ఎన్నడూ ఆశించని యూనివర్సిటీ గౌరవ డాక్టరేటు "కళా ప్రపూర్ణ"ను, నేను కలలో కూడ ఊహించని "పద్మశ్రీ"ని నేను తెచ్చుకొన్నది ఈ పిల్లీ శతకాన్ని చంకబెట్టుకొని వెళ్లే!"అని చమత్కరించారు.

ముగింపు:

పద్మశ్రీ డా. బోయి భీమన్నగారు రచించిన రచనలు అన్నిటిలోనూ సామాజిక చైతన్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అట్లే ఈ పిల్లీ శతకంలో కూడ చిన్న చిన్న కంద పద్యాలలో చెప్పినప్పటికీ వాటిలో ఎన్నో జీవిత సత్యాలతో పాటు, సమాజపు పోకడను అర్థం చేసుకుని, నీతివంతులుగా సత్ప్రవర్తనతో మెలగడానికి కావాల్సిన సామాజిక స్పృహను కలిగించే పద్యాలున్నాయి. ఈ శతకంలోని ప్రతిపద్యాన్ని చదువుతూ సామాజిక కోణంలో విశ్లేషించుకుంటూ పోతే మరెన్నో విషయాలు చెప్పవచ్చు. వ్యాస నిడివిని దృష్టిలో పెట్టుకుని కొన్ని పద్యాలను మాత్రమే ఉదాహరించాను. ఏదేమైనా తెలుగు శతక సాహిత్యంలో బోయి భీమన్నగారు రచించిన పిల్లీ శతకం విలక్షణమైనది, విశిష్టమైనది. ఇందులోని భాష సామాన్య పాఠకుడికి సైతం అర్థమయ్యే రీతిలో సరళ సుందరంగా ఉండటం విశేషం.

సంప్రదింపు గ్రంథాలు/వ్యాసాలు:

1. భీమన్న, బోయి. 1974. పిల్లీ శతకం. నాట్యకళ ప్రెస్, భాగ్యనగరు.
2. సంజీవరావు, కె. 2015. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం (సంపుటి 2). పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
3. సుదర్శనం, ఆర్.ఎస్. 1969–70. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం (వ్యాసం).ఆంధ్రపత్రిక – సౌమ్య సంవత్సరాది సంచిక.